# పునర్జన్మ (రమణ మహర్షి వృత్తాంతాలు)
# ఉన్నట్టా, లేనట్టా?



నీలంరాజు లక్ష్మీ ప్రసాద్

# పునర్జన్మ ఉన్నట్లా, లేనట్లా?

## (మహర్షి రమణ వృత్తాంతలు)

నీలంరాజు లక్ష్మీప్రసాద్

# కృతజ్ఞతలు

ఈ పుస్తకంలోని వ్యాసాలు ఆంధ్రప్రభ డైలీ, ఆంధ్రభూమి డైలీ, నవ్య వీక్లీ (ఆంధ్రజ్యోతి) పత్రికలలో పలు సంవత్సరాల మీద ప్రచురితమైనై. పునర్ ముద్రణకు ఆయా యాజమాన్యాలు అనుమతించినందుకు వారికి కృతజ్ఞతలు.

పుస్తకంలో, వ్యాసాంతంలో అక్కడక్కడ ఉదహరించిన సూక్తులు శ్రీ కమలాకర వేంకట రావుగారు సంకలనం, అనువాదం చేసిన 'శ్రీ రమణ మహర్షి సూక్తులు' పుస్తకం నుండి గ్రహించినవి.

ఈ పుస్తకంలోని 161 పేజీ నుండి 180 పేజీల (నిష్కామకర్మ - శ్రీ రమణ మహర్షి సరళబోధ) వరకున్న వ్యాసాలన్నీ హైదరాబాద్ ఆకాశవాణి వారి సౌజన్యంతో పునర్ముద్రితం. కృతజ్ఞతలు.

మిత్రులు శ్రీ మోచర్ల పార్థసారథి, శ్రీ పిడూరి రాజశేఖర్‌ల సలహా సంప్రదింపుల తోనే ఈ పుస్తకాన్ని రూపొందించగలిగాను. కృతజ్ఞతలు.

*రచయిత*

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | పునర్జన్మ ఉన్నట్టా? లేనట్టా? | 1 |
| 2. | అహానికి చావు పుట్టుకలుంటాయి | 5 |
| 3. | హృదయ సంపన్నులు | 8 |
| 4. | భజన సర్కస్ | 11 |
| 5. | ఆధ్యాత్మికులు : ఆర్గనైజర్లు | 14 |
| 6. | పండితుడూ – జ్ఞానీ | 17 |
| 7. | ఆత్మజ్ఞానం గ్రంథాలలో లభిస్తుందా? | 20 |
| 8. | ఎవరి ధర్మం వారిది... | 23 |
| 9. | ప్రేమతో పెట్టిన కాస్త... | 26 |
| 10. | స్పష్టమైన చూపు | 29 |
| 11. | సింప్లిసిటీ | 32 |
| 12. | గురువులు పలు తెరగులు | 36 |
| 13. | అభేదభావం | 40 |
| 14. | అజాత శత్రుత్వం | 44 |
| 15. | గురువుల బరువు | 47 |
| 16. | సేవాధర్మం | 50 |
| 17. | మన తప్పు మనమే తెలుసుకోవాలి | 54 |
| 18. | మనోలయం : మనోనాశనం | 58 |
| 19. | హృదయంలోనే గురుశిష్యులు | 61 |
| 20. | జ్ఞానులు : జ్ఞానబంధువులు | 64 |
| 21. | మహాత్ముల మహిమలు | 67 |

| | | |
|---|---|---|
| 22. | జాఫ్నా మనిషి | 70 |
| 23. | సిద్ధ పురుషుడు | 73 |
| 24. | భేదభావ  నిర్మూలన | 76 |
| 25. | మేధావుల నిర్లిప్తత | 80 |
| 26. | 'చదువుకున్నవారు' | 84 |
| 27. | శాస్త్ర ప్రయోజనం ! | 88 |
| 28. | ఆత్మసాక్షాత్కారం | 91 |
| 29. | జీవితం ధ్యానమయం | 95 |
| 30. | కర్మ  కౌశలం | 99 |
| 31. | మారిన మనిషి | 102 |
| 32. | ప్రే'మహా'శక్తి | 106 |
| 33. | 'ఆలోచనను జయించినవాడే యోధుడు' | 109 |
| 34. | నిందకు బాధపడనివారు | 114 |
| 35. | రూపరహితం | 117 |
| 36. | శ్రీ రమణులతో పూంజా | 120 |
| 37. | పరిణతి చెందిన గోవులు, మానవులు | 132 |
| 38. | మనసు, శరీరం వేర్వేరా? | 135 |
| 39. | ఆ నయనాల్లోని ప్రశాంతత | 139 |
| 40. | శ్రీరమణుల నకిలీ ఫిర్యాదు | 143 |
| 41. | నీ సంగతి నువ్వు చూచుకో | 144 |
| 42. | మనిషి దేని యెడల మరణించాలి? | 146 |
| 43. | అన్నీ నీవే...అంతా నీవే... | 148 |
| 44. | జంతువులకు గుర్తింపు | 151 |

| | | |
|---|---|---|
| 45. | విశ్వసఖుడు | 153 |
| 46. | ఆత్మవిశ్వాసం : అహంపై విశ్వాసం | 157 |
| 47. | సాక్షాత్కారంలో కళల ప్రాధాన్యమెంత? | 159 |
| 48. | నిష్కామకర్మ | 161 |
| 49. | సరళబోధ | 163 |
| 50. | అద్వైతుల ఆత్మ, భక్తుల యొక్క భగవంతుడు ఒకటే | 165 |
| 51. | కనిపించేదంతా లోపల వున్నది | 168 |
| 52. | ఆత్మవిచారణ : యాంత్రిక సాధన | 170 |
| 53. | శ్రీరమణుల భావోద్వేగం | 172 |
| 54. | మహాశాంతి సన్నిధిలో | 174 |
| 55. | పేరునుదహరించడం, తొలగించడం | 176 |
| 56. | పరమ మిత్రుడు | 178 |
| 57. | శ్రీ రమణుల సరళబోధ | 180 |

# పునర్జన్మ ఉన్నట్టా? లేనట్టా?

'**పు**నర్జన్మ సత్యమేనంటారా?' అని అరుణాచల శ్రీ రమణులవార్ని ఎవరో అడిగారు.

'అజ్ఞానం వున్నంతకాలం పునర్జన్మ వుంటుంది. అసలు నిజానికి, నీవు ఇప్పుడు గానీ ఎప్పుడు గానీ, జన్మించినదే లేదు. ఇకముందు కూడా జన్మించడమనేది వుండదు ఇదే సత్యం'

రమణుడేమి చెప్తున్నాడో, పృచ్ఛకుడు అర్థం చేసుకోవడానికి ప్రయత్నించినట్టే కనిపించదు. 'నీవుంటే నీకు సుఖమందజేయడానికి, దుఃఖం కలిగించడానికి, లోకం వుంటుంది కానీ, 'నీవు' లేకపోతే ఈ లోకమెక్కడుందయ్యా? మాయమైపోతుంది' అని వేదాంతులంటే మనం నవ్వుకుంటాం. 'ఇంత పెద్ద ప్రపంచం, మాయమవడమేమిటి? ఏ ఆటంబాంబులతోనో సర్వనాశనమై లేకుండా పోవచ్చునేమోకానీ, నేను లేకపోగానే ప్రపంచమెట్లా మాయమవుతుందండీ, వేళాకోళం కాకపోతేనూ' అనుకుంటాం.

కానీ కొంతసాధన చేసిన అమెరికన్ వేదాంతి – రచయిత రాల్ఫ్ వాల్డో ఎమర్సన్ అన్న ఈ మాటలను కూడా వినండి: "ఒక్కొక్క మనిషి యొక్క అజ్ఞానాన్ని తొలగించడానికే ఈ ప్రపంచం వుంటున్నది" అంటే అజ్ఞానం తొలగితే, ప్రపంచం ఆ మనిషికి వుండీ లేనట్లే, కానీ ఇతడిలాగే మరొకరు కూడా జ్ఞానులవడానికి ఈ ప్రపంచం వారందరి కొరకై కొనసాగుతూనే వుంటుంది. విశ్వవిద్యాలయంలో నేర్వగలిగినది నేర్చి, పట్టభద్రుడైన వాడికి ఇక ఆ సంస్థతో పని వుండదు. అది వుండేది ఇతర్ల ఉపయోగార్థమే.

'మరణం ద్వారా ప్రపంచాన్ని ఎలాగూ వీడిపోతాను కదా అనుకుంటే, మనిషి అజ్ఞానం వీడకుండానే వెళ్ళిపోవడం జరుగుతుంది. జ్ఞానమార్జించడానికి, తిరిగి ఈ సుఖ దుఃఖాల ప్రపంచాన్ని వెతుక్కుంటూ రాకతప్పదు" అన్నాడు మిత్రశ్రీ.

లోకం సమకూర్చే ఏ వస్తువైనా తాత్కాలికంగా, ఇంద్రియాలకు సుఖమివ్వ గలదే కానీ, శాశ్వత సుఖం, మహాసుఖం ఇవ్వగలిగిలేదు, అని చెప్పడానికి సూఫీలు ముల్లా కథనొకటి ఉదహరిస్తుంటారు.

ముల్లా నసీరుద్దీన్ మార్కెట్‌కు వెళ్ళినప్పుడు, నాలిక ముట్టుకోగానే చురుక్కుమనే కారం కలిగిన పచ్చిమిరప కాయల కుప్పలు చూశాడు. రెండు కుప్పలు కొని ఇంటికి తెచ్చుకున్నాడు. ఒక్కొక్క మిరపకాయ తినడానికి ప్రయత్నించసాగాడు. కాసేపటికి అతడి శిష్యుడు వచ్చి చూచేసరికల్లా, ముల్లా కన్నీరు మున్నీరై వుండి కూడా, వదల కుండా మిరపకాయల్ని ఒకటెంబడొకటి తింటూనే వున్నాడు.

"ముల్లా, వాటిని తింటూనే వుంటావేమి?" అని ఆశ్చర్యంతో అడగ్గా, ముల్లా కుప్పలోనుండి మరో మిరపకాయ అందుకుంటూ, 'తియ్యటి మిరపకాయ వస్తుందేమో నని ఎదురుచూస్తున్నాను' అని సమాధానమిచ్చాడు. ఒక్కొక్కటీ రుచిచూచిగానీ, విడనాడ లేదు!

శ్రీ రమణుల సమక్షంలోని పృచ్ఛకుడు ఆయన మాటలు విని జీర్ణించుకుందామనే ప్రయత్నం లేకపోగా, తాను వేయదలచుకున్న ప్రశ్నలన్నింటినీ దడదడమని వేయ సాగాడు.

"మనిషి చనిపోయిన తర్వాత ఆ మనిషికేమవుతుంది?"

అందుకు రమణుడు సూటిగా "ఈ బ్రతికున్న వేళలో, ఇప్పటి బ్రతుకును గురించే చింతించు. భవిష్యత్తు, దాని సంగతి అది చూచుకుంటుంది. రానున్న కాలం గురించి నువు చింతించాల్సిన పనిలేదు. సృష్టి ప్రారంభం కాకముందు సంగతి, సృష్టి క్రమం గురించి శాస్త్రాల్లో చెప్పారంటే, వాటి ఉద్దేశం నీవు ఈ వర్తమానాన్ని గురించి తెలుసుకోవాలనే చెప్పారు.

మీరు 'జన్మించాము' అనుకుంటున్నారు కాబట్టి 'అలాగే'నంటూ మిమ్మల్ని భగవంతుడు సృష్టించాడంటున్నారు.

కానీ నిద్రించే వేళలో, మీరు భగవంతుణ్ణిగానీ, మరెవరినైనాగానీ చూస్తున్నారా? భగవంతుడే సత్యమైతే, మీ నిద్రా సమయంలో కూడా అతడెందుకు వెలుగొందడం లేదు? నువు ఎప్పుడూ వున్నావు; నిద్ర మైకంలో నువ్వెట్లా వున్నావో, ఇప్పుడూ అలాగే

వున్నావు. నిద్రలో వున్న మనిషీ, ఇప్పుడీ మేల్కొని వున్న మనిషీ, ఒకరే. కానీ ఆ స్థితిలోనూ ఈ స్థితిలోనూ అనుభవాలలో అనుభూతులలో ఈ తేడా ఎందుకు వచ్చింది?

నిద్రించే వేళలో నీ పుట్టుకను గురించి నువు ప్రశ్నించావా? 'మరణించిన తర్వాత నేనెక్కడికి వెళ్తానని' ఆ నిద్రావస్థలో అడిగావా? అప్పుడు అడగని ప్రశ్నలు, ఇప్పుడు ఈ మేల్కొన్న స్థితిలో ఎందుకు అడగాల్సి వచ్చింది?

ఏదైతే పుట్టాననుకుంటున్నదో దాని పుట్టుక, దాని తరణోపాయం, మూల కారణం, అంతిమ ఫలితాలను గురించి దానినే ఆలోచించుకోనీ" అన్నారు రమణులు.

పృచ్ఛకుడు అంతటితో ఆగక మరికొన్ని ప్రశ్నలు వేశాడు. 'అసలు పుట్టడం లేదు, గిట్టడం లేదు' అని ప్రకటించిన మహర్షి రమణులు, 'నేను పుట్టకముందు ఏమి అయి వుంటాను, గిట్టిన తర్వాత ఏమవుతాను' అనే ప్రశ్నలను ఎవరయితే వేస్తున్నారో, వారినే అందుకు సమాధానాలు వెతుక్కోనీ' అంటున్నారు; నీ పాటికి 'నీవు ఎవరో' కనుక్కొనడంలో నిమగ్నమవు, అని సూచిస్తున్నారు. నిద్రావస్థలో సూక్ష్మంగా తప్పితే లేని ఈ 'నేను' మేల్కొన్న వేళలో విజృంభించి, ఈ ప్రశ్నలన్నీ సంధిస్తున్నది అని గ్రహించమంటున్నారు.

మరణించిన తర్వాత ఏమికానున్నది, అనే చింత, పుట్టాడనుకున్నవాడికే. తనకి పుట్టుక వున్నదనుకుంటున్నాడు కాబట్టి. చావూ వుండబోతున్నది. ఆ చావంటే తగని భయమూ వున్నది. ఒకసారి భూమిపై 'జన్మించిన' తర్వాత కొనసాగాలనే కోర్కె బయలు దేరింది. ఎన్నాళ్ళుండాలి? శాశ్వతంగానూ. 'చావు' అనేది ఈ భూమిలో నుండి తనని మాయం చేయబోతున్నది కాబట్టి, మృత్యువు తన శత్రువు అంటాడు.

కానీ మహర్షి చెప్పింది విని, మననం చేద్దాం అనే వినయం బదులు,'ఆ, అది అర్థమయిందిలెండి; ఇహ దీనికి సమాధానం చెప్పండి' అనే ధోరణిలో "మరణానంతరం జీవుడేమవుతాడు?" అనే ప్రశ్న వేశాడు ఆ పెద్దమనిషి. రమణుడు ఎంతో ఓర్పు గలవాడు కాబట్టి విసుక్కోకుండా, "ఇప్పుడు సజీవంగా వున్న జీవుడికి ఇది తగని

ప్రశ్న. మృతజీవుడే ఇలాంటి ప్రశ్న అడగవచ్చు. ప్రస్తుతానికి సశరీరి అయిన జీవుడు, తానెవరో కనుక్కునే సమస్యను పరిష్కరించుకోనీ. అప్పుడు ఇలాంటి సంశయాలు అంతమొందుతాయి."

ఈ ప్రశ్నలు వేయడం, సాధన క్రమంలో నిజంగా ఏర్పడిన సందేహాలకు సమాధానాల కోసం కాదనిపిస్తుంది. కేవలం తన ప్రశ్నల జాబితాను చూచి, 'ఇతడెవరో పెద్ద జ్ఞానండీ' అని అక్కడ కూచున్న వారందరూ అనుకోవాలనే ఉద్దేశంతో వచ్చాడా అనే అనుమానం కలుగుతుంది. మహర్షి చెప్పింది యావత్తూ ఈ చెవిలోకి వెళ్ళి, ఆ చెవి నుండి దూసుకుపోతుండెనేమో మనకు తెలియదు.

గతాన్ని ముట్టుకోకు; గతాన్ని తవ్వకు. కోరికలన్నీ గతంలో నుండి ఉద్భవించేవే. ఏ పాత కోరికా మనసులో తారట్లాడకపోతే కళ్ళు చక్కగా చూడగులుగుతై. గతం జోలికి పోకుండా బ్రతకగలిగితే, నీకు విచారముండదు. ఇప్పటి పరిస్థితిలో, ఈ వర్తమానంలోనే వుండిపో; ఇప్పుడు విచారంలేదు. అటు గతమూ, ఇటు భవిష్యత్తూ రెంటినీ వదిలెయ్; ఉండేది ఆనందమే.

**మహర్షి శిష్యుడు పూంజా**

# అహానికి చావు పుట్టుకలుంటాయి

**పృచ్ఛకుడు :** మనిషిలో జన్మజన్మలకూ కొనసాగే ఆత్మపదార్థమంటూ ఏదీ లేదు అంటారు బౌద్ధులు. ఈ దృష్టి సరియైనదా కాదా? హిందూమతమేమో జన్మ తర్వాత జన్మనెత్తే అహం వున్నదంటుంది. ఈ లెక్కన ఆత్మ అనేది కొనసాగుతున్నట్టా, ఇదే జన్మ తర్వాత జన్మనెత్తుతూ వున్నదా, లేక కేవలం కొన్ని సంస్కారాలు మాత్రం ఒకటిగా కూడి, మళ్లీ మళ్లీ జన్మనెత్తుతుంటాయా?

***రమణుడు :*** అసలు ఆత్మ అనుస్యూతమైనదే. ఏవిధంగానూ చెక్కుచెదరకుండా కొనసాగుతూనే వుంటుంది. మళ్లీ మళ్లీ జన్మలెత్తే అహం, కిందిస్థాయికి చెందినటువంటిది. అంటే ఆలోచనా పరిధికి చెందినదన్న మాట. ఆత్మని వాస్తవం చేసుకున్నప్పుడు, మళ్లీ మళ్లీ జన్మనెత్తే ఈ అహాన్ని దాటడ మవుతుంది.

పునర్జన్మలనేవి వేరొక కొమ్మరెమ్మవల్ల సంభవిస్తున్నాయి కాబట్టి బౌద్ధులు వాటిని తిరస్కరిస్తున్నారు. చిత్ చైతన్యం, జడపదార్థమైన దేహంతో మమేకమైన కారణంగా ఈ అజ్ఞానం సంభవిస్తున్నది.

పృచ్ఛకుడు తన చివరి ప్రశ్న వేగిరంగా వేసేశాడు : 'మనం ఇక్కడ ఆచరించే పుణ్యకర్మల ఫలితంగా స్వర్గానికి వెళతామంటారా?

అందుకు రమణులు, 'ఇప్పుడీ బ్రతుకు ఎంత సత్యమో, అదీ అంతే సత్యం. దానిని వదిలేసి, ఆత్మ విచారణతో మనమెవరో కనుక్కోగలిగితే, స్వర్గాన్ని గురించి ఆలోచించాల్సిన అవసరమేముంటుంది?'

ఒక విషయం నుండి మరొక విషయానికి గెంతుతూ, దేనినీ సాకల్యంగా పరీక్షించక, అనేక ప్రశ్నలను కురిపించిన ఈ పృచ్ఛకుడు తానేమి ప్రయోజనం సాధించాడో కానీ, మహర్షి చేత చెప్పించిన సమాధానాలకు మనము కృతజ్ఞులమై వుండాలి; మనకైనా మహర్షి మాటలు ఉపయోగపడి వుంటే ధన్యులమే.

## వాంఛల విస్ఫోటన

దూరశ్రవణం, దూరదర్శనం వంటి సిద్ధులు మనిషికి ఉపయోగపడేవే కదా అని శ్రీ రమణుల వారిని అడిగాడు ఒక భక్తుడు. "టెలిపతీ అనేది దూరాన జరిగే విషయాలను, సంభాషణలను మనిషి కళ్లముందు ప్రదర్శిస్తుంది. అయితే దూరాన జరిగేవి విన్నామా, లేక సమీపంగా జరిగే వాటిని విన్నామా అనేది మనిషికి తెచ్చే తేడా ఏమీ వుండదు. మౌలికమైన సత్యమేమిటంటే, ఇవి వినీ కనేటువంటివాడు, అనగా ఈ 'నేను' లేకపోయినప్పుడు వినేది లేదు, కనేది లేదు. ఈ వినడం, కనడం మనసు యొక్క విధులు.

అందువల్ల ఈ సిద్ధులు మనసులో మాత్రమే వున్నాయి. అవి ఆత్మకు సహజ మైనవి కాదు. సహజమైనది కాక, విడిగా ఆర్జించినదేదైనప్పటికీ, అది శాశ్వతంగా వుండేది కాదు; దానికై కృషి సల్ప బూనుకోడం వ్యర్థం.

మనిషి శక్తి కొద్దిపాటిదైన ఈ స్థితిలోనే ఇంత దుఃఖితమై వున్నాడు. సిద్ధుల ద్వారా తన శక్తిని పెంచుకోబూనుకున్నా డనుకుందాం; అప్పుడైతే తను ఆనందంగా వుండగలననుకోవచ్చు. పరిమితమైన ఈ శక్తితోనే ఇంత దుఃఖం పెనవేసుకొంటుండగా, అపరిమితమైన శక్తితో ఎంతెంత దుఃఖం అలముకుంటుందో ఆలోచించండి. సిద్ధుల ద్వారా దుఃఖం ఇబ్బడిముబ్బడి కావచ్చు.

పోతే ఈ సిద్ధులు దేనికట? అవి ప్రదర్శించినప్పుడు, ఇతర్లు తనని చూసి మెచ్చుకోవాలనేనా? ఆ మెప్పు రాకపోతే ఆశాభంగం, విచారం తప్పవు కదా; ఇతర్ల మెప్పుపై ఆధారపడాలి. తనకన్నా మరిన్ని సిద్ధులున్నవారు తటస్థపడినా పడవచ్చు.

అప్పుడు ఈర్ష్యపడతాడు, దుఃఖితుడవుతాడు. మరిన్ని సిద్ధులున్నవాడు తారసిల్లితే, అతడు అన్నిటినీ చిటికెలో ధ్వంసం చేయవచ్చు. అతడు అందరికన్నా గొప్ప సిద్ధుడు. అతడ్నే దేవుడనవచ్చు, అతడినే ఆత్మ అని కూడా అనవచ్చు.

ఏది నిజమైన శక్తో ఆలోచించండి. భాగ్యాన్ని పెంచెడిదా లేక శాంతిని నెలకొల్పెడిదా? ఏదైతే శాంతిని సుప్రతిష్ఠితం చేయగలదో అదే అన్నిటికన్నా గొప్ప పరిపూర్ణత్వం" అన్నాడు శ్రీరమణుడు.

భాగ్యం కన్నా మనిషికి శాంతియే అభిలషణీయం అని తేల్చాడు మహర్షి. దీని అర్థం భాగ్యం కోసమై మనుషులు కృషి సల్పరాదనీ, రమణుడు అభివృద్ధిని నిరోధిస్తున్నాడనీ, కాదు. మనిషి, మున్ముందు తనలో తాను శాంతిని నెలకొల్పుకోగలిగి వుండాలి. మానవుడిలో ఈ శాంతి అనే పునాదిరాయి సరిగా పడితే, ఆ తర్వాత తగిన సంపదకై ప్రయత్నించవచ్చు. అలాంటి బాహ్య సంపద అందరికీ కలగాలని కూడా ఆశించవచ్చు.

కానీ నేటి కాలంలో వాంఛలు అనంతంగా పెరుగుతున్నై. 'కోరికలు తీర్చుకో డానికే ఈ జీవితం, అనుభవించరా సోదరా, వెరపేల' అని బోధించే వర్గాలు బలపడు తున్నాయి. అంటే మనిషి కోర్కెల సముదాయం, విస్ఫోటనం చెందుతున్నది. ఈ తరుణంలో ప్రపంచం ఎలా రూపొందుతున్నదో ఒకసారి చూద్దాం.

ప్రపంచంలోని ప్రకృతి సంపదను సంరక్షించడానికి ఏర్పడిన సంస్థకు డైరెక్టర్ జనరల్ జేమ్స్ లీప్, ఆ మధ్య మాట్లాడుతూ, "అమెరికాలో జీవిస్తున్న వారి తీరుగా మిగతా ప్రపంచ వాసులు జీవించనారంభిస్తే, మన కోర్కెలు తీర్చడానికి ఈ భూగ్రహ సహజ సంపదేకాక మరో నాలుగు గ్రహాల సహజ సంపద అవసరం పడుతుంది. కానీ ఈ విషయంలో ఒక్క అమెరికా దేశస్తులనే అనక్కరలేదు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రజ, అమెరికా వాసులకన్నా, కోర్కెలు తీర్చుకోడంలో మరింత ముందడుగు వేసి వున్నారు.

ఫిన్‌లాండ్, కెనడా దేశవాసులు ఈ విషయంలో అమెరికా దేశీయులకన్నా కాస్త కింద వున్నారు. ఆస్ట్రేలియన్లు కూడా, ఈ విషయంలో మరికాస్త కింది స్థాయిలో వున్నప్పటికీ, తమకున్న సాధన సంపత్తికన్నా ఎక్కువే వినియోగిస్తున్నారు. తమకు అందుబాట్లో వున్న వనరులను మహావేగంగా వ్యర్థపరుస్తున్నారు; వ్యర్థపదార్థాలను మానవ వనరులుగా తయారు చేయడానికి ప్రకృతికి ఎంతోకాలం పడుతుంది. కుప్పలు తిప్పలుగా వచ్చిపడే ఈ వ్యర్థపదార్థాలను స్వీకరించడానికి ఈ ఒక్క భూ గ్రహం చాలదు.

# హృదయ సంపన్నులు

లోకంలో అక్కడొకరూ, ఇక్కడొకరూ క్షణాలమీద పూర్తిగా మారిపోతారు. ఇక్కడీ భూమిపై మనకు అదృశ్యమైన శక్తి ఏదో తిరుగుతున్నదనీ, మనమంతా ఆ శక్తిలో భాగమేననే స్ఫురణ అలాంటి వారికే కలుగుతుంది. అప్పుడిక తనని గురించి తానాలోచించుకునే వ్యవధి ఉండదు. తనకున్న కొద్దిపాటి వస్తు సామాగ్రీ, ధనమూ తనకు సరిపోవడమే కాక అంతకన్నా మరింత సంపాదించాలనిగానీ మూటకట్టాలని గానీ అనిపించడం మానేస్తుంది. తోటి మనిషినీ చుట్టూ వున్న సృష్టినీ పీడించి ఏదో పోగేయాలనే కాంక్ష కరిగిపోతుంది. ఎవరైనా, ఏదైనా ఉచితంగా ఇస్తామని వచ్చినా, అంతర్గతంగా తనవంటి భాగ్యవంతుడు లేడనే నిశ్చయానికొచ్చిన ఈ మనిషికి, ఆ బహుమానాలు పొందాలని ఉండదు. ఆత్మానందమే ప్రధానమైన అలాంటి వ్యక్తికి వస్తు సేకరణ, ధనాపేక్ష వంటి వాటి మీద దృష్టి నిలవదు.

తిరువణ్ణామలై రమణునికి భక్తులెవరు ఏది ఇవ్వజూపినా, వాటిని ఆయన త్వరగా వదిలించుకోవడానికి ప్రయత్నించేవాడు. ఆయన స్వభావం ఎరుగని వారు కాస్త బాధ పడేవారు. అయినప్పటికీ ఆయన వాటిని ఏదో విధంగా వదిలించుకుంటూనే వుండేవారు.

ఒకమారు ఒక మధ్య వయస్కుడు చేతి కర్ర ఒక దానిని తెచ్చి, అది రమణుడి సమక్షంలో పెట్టి, ఒంగి నమస్కరించి ఎదురుగా కూర్చున్నాడు. కాసేపయిన తరువాత సవినయంగా లేచి నుంచొని ఆ చేతి కర్ర మంచి గంధపు చెక్కతో చేసినజదనీ దానిని మహర్షి స్వీకరించాలనీ కోరాడు. రమణులు చిరునవ్వుతో నువ్వే ఉంచుకో అన్నాడు. నిజానికి ఆశ్రమంలో రమణుడికి “చెందిన” వస్తువులనే వాటిని కాపాడడం చాలా కష్టంగా ఉండేది. తనదంటూ ఒకటున్నదనే ఆలోచనే లేని రమణులు, ఎలాగూ దేనినీ పట్టించుకునేవారు కాదు. ఉమ్మడి సొత్తులా అది అక్కడ అందరి ఎదురుగా పడి ఉంటే – ఎవరో ఒకరికి ఆ కర్ర తమ సొంతం చేసుకోవాలనిపిస్తుంది. రమణుల వారిని అడిగో, అడక్కుండానో తీసేసుకుంటారు. కర్ర పరాయి వారి చేతుల్లోకి వెళ్ళిందనే విషయాన్ని గమనించిన వ్యక్తి మనసు ఎలాగూ బాధపడుతుంది.

అందువల్లే రమణుడు "నువ్వే ఉంచుకోరాదూ?" అన్నాడు. కానీ అతడు ఆ కర్రను రమణుడు స్వీకరించాలని పట్టుబట్టడం మానలేదు. రమణుడు యుక్తిగా – "ఇది నేనిచ్చిన ప్రసాదంగా ఉంచుకో"మని సలహా ఇచ్చాడు. ఆ వ్యక్తి అంతకన్నా యుక్తిగా – "అయితే మీరు ముందు దానిని స్వీకరించి మీ ఆశీర్వాదాలతో నాకిప్పించండి". రమణుడు ఆ కర్రనందుకుని దాని నొకమారు ఆఘ్రాణించి – "చాలా బాగుందని" అంటూ దానిని ఆ వ్యక్తికి తిరిగి ఇచ్చాడు. "నీ వద్దనే ఉంచు. దీనిని నువ్వు చూసినప్పుడల్లా నేను నీకు గుర్తుకు వస్తుంటాను కదా" అన్నాడు చిరునవ్వుతో.

అవిభక్త భారతదేశంలోని కరాచీ పట్టణానికి చెందిన కాలేజీ ప్రిన్సిపాల్ బూటానీ అనే పెద్ద మనిషి అందమైన నగిషీతో కూడుకున్న దారు పేటికలు, ఒక దానిలో ఒకటి అమర్చే వీలున్న సెట్ ఒక దానిని తెచ్చి – అరుణాచల రమణుడి ముందు పెట్టాడు. రమణుడు వాటి పనితనాన్ని చూసి చాలా ఆనందించాడు. కానీ అవి తన వద్ద ఉండాలనే కోరిక లేనందువల్ల, ఆ మరుక్షణమే – "ప్రిన్సిపాల్ గారూ, మీరు నాకని తెచ్చిన ఈ బహుమానాన్ని మరెవరికైనా నేను ఇచ్చేస్తే మీరేమీ అనుకోరుగదా? అని అడిగాడు. బూటానీ మహాశయుడు కూడా అంతర్గతంగా విరాగే అయినందువల్ల – "అలాగే చేయండి – నాకెట్లాగైనా సంతోషమే" నన్నాడు. రమణుడు వాటిని అక్కడికక్కడే మరో భక్తుడికిచ్చేశాడు.

హృదయంలో అసలైన "భాగ్యం" నెలకొంటే కొరత అనేది ఉండదు. అలాంటి స్థితి సిద్ధించడానికి రమణ మహర్షే అవాల్సిన అవసరం లేదు. చిత్తశుద్ధి వుంటే సామాన్యులైనా ఈ స్థితినందుకోవచ్చు.

ఆనాటి కరాచీ పట్టణంలోనే – ఒకసారి ఒక వ్యాపారి కొడుకు కనిపించకుండా పోయాడు. సింధు రాష్ట్రంలోని భీరియా గ్రామంలో సాధు పరుషుడైన ఒక సామాన్య వర్తకుడు ఉన్నాడనీ, వధూరామ్ అనే ఆ భక్తుణ్ణి ప్రార్థిస్తే – అతడేదో మార్గం చూపిస్తాడని ఎవరో వ్యాపారికి నమ్మకంగా చెప్పారు. దిక్కూ దరీ తోచని స్థితిలో ఆ వ్యాపారి అలాగే ప్రార్థించి నిద్రించిన వేళలో – వధూరామ్ కలలో కనిపించి ఆచూకీ తెలియజేయడం జరిగింది. వ్యాపారికి కలలో కనిపించినప్పటికీ – వధూరామ్‌కు స్వయంగా ఈ

విషయాలేమీ తెలియవు. కానీ తనకు కలలో ఇచ్చిన సూచనల ననుసరించి వ్యాపారి వెళ్ళి వెతకగా అతడి కొడుకు దొరకనే దొరికాడు. కృతజ్ఞతా పూర్వకంగా ఆ వ్యాపారి – వధూరామ్ తన ఇంటికి వచ్చే ఏర్పాటు చేసి అల్పాహార విందు ఇచ్చి – సంతోషం కొద్దీ వధూరామ్‌కు ఒక పొడుగాటి మెత్తని అల్పాకా కోటూ, ఖరీదైన షర్టూ, అందమైన టోపీ బహూకరించాడు. సామాన్యుడైన వధూరామ్ అలాంటి ఆహార్యాన్ని తనంతట తాను కొని ధరించగలిగిన స్థితిపరుడు కాదు.

కానీ వధూరామ్ మానసిక స్థితి అసాధారణమైనది. అతని మనసులో పేదరికం లేదు; అందులో మరేదో అలౌకికమైన "భాగ్యం" నిండి ఉన్నది. "ధోవతీ, పై అంగ వస్త్రం మాత్రమే ధరించే నేను ఈ విలువైన దుస్తులు ఏమి చేసుకుంటానని" నిరాకరించ బోయాడు. కానీ ఆ వ్యాపారి ఇతడి  మాటలు చెవిన పెట్టకపోయేటప్పటికి ఇక అతడి మనసు కష్టపెట్టకూడదని అనుకొని – వాటిని తీసుకున్నాడు వధూరామ్. వ్యాపారి ఇంటి నుండి బయలుదేరి బయటికి వచ్చిన తరువాత వధూరామ్‌కు దోవలో ఒక ఫకీర్ కనిపిస్తే – ఆ బహుమానాలన్నింటినీ – అతనికి బహూకరించేశాడు !

భౌతిక ప్రపంచంలోని భాగ్యం ఎంత సమకూర్చుకున్నా మనసుకు కొరత తీరేది కాదు. సంపన్నులైనా మరింత సంపద కోసం ప్రయత్నిస్తూనే వుంటారు. హృదయ సంపన్నుడే వస్తుజాలానికి అతీతుడవగలడు.

# భజన సర్కస్

**దా**దాపు ఒకే మతస్థులు నివసించే చిన్న గ్రామాల్లో భజన మండలులు ఏర్పడడం, సభ్యులంతా తెల్లవారిజామునే లేచి భజన చేసుకుంటూ వాడవాడలా తిరగడం అనాటి పరిస్థితులకు అనుకూలంగానే ఉండేది. కాస్త శ్రావ్యమైన కంఠంగలవారు తమ గాత్రాన్ని ప్రదర్శించడానికి, సంగీత జ్ఞానమున్న వారు తమ గాన కళాకౌశలం చూపించడానికి, ఆ సామూహిక భజన మంచి అవకాశం కల్పించేది. కొందరి గొంతు ఇంపుగా లేకపోయినప్పటికీ పాడాలనే అభిలాష మాత్రం మెండుగా ఉంటుంది. అలాంటి వారు ఒంటరిగా పాడబూనుకుంటే, వినలేమంటూ చుట్టూ ఉన్నవాళ్ళందరూ చెవులు మూసు కుంటారు. గుంపుతోపాటు కలిసి పాడితే వీరి గొంతు మిగతా గొంతులతో కలిసి పోతుంది. కాబట్టి, ఎవరూ అభ్యంతర పెట్టకుండా వీరి ఇచ్ఛ నెరవేరుతుంది.

తెల్లవారుజామునే లేచి ఇలా భజనకు బయలుదేరడం, ఒక ఇంటి వారిని వేరొక ఇంటివారు వచ్చి పిలవడం, ఇంటాయన ఏదో పవిత్ర కార్యానికి బయలుదేరు తున్నందువల్ల ఇంటిల్లిపాదికీ పుణ్యం దక్కుతుందని ఇల్లాలు భావించడం, అంతా ఉత్సాహభరితంగానే ఉంటుంది. గాత్ర సౌలభ్యమున్న వారొకరు చరణం పాడడం, మిగతా వారంతా దానిని కలిసి పలకడం, నాయకుడు ఆ చరణాన్ని మరికాస్త వేగంగా పలకడం, అంతా ఒక తమాషాగా, ఆటగా, ఆనందంగా ఉంటుంది. ఇక వీరి భజన పాటలు వినేవారి ఆనందానికి కూడా మేర ఉండదు. వారికీ ఏదో ప్రేరణ కలిగినట్లుంటుంది. ఈ కొద్దిపాటి భక్తికే దైవకృప తమపై ఒలుకుతున్నదని, 'అభీష్ట సిద్ధిరస్తు' అని దైవం దీవిస్తున్నాడని అనుకుంటారు.

కానీ నగరాలు, పట్టణాలు పెరుగుతున్నాయి. వాటిల్లో అనేక జాతులవారు మతాలవారు నివసిస్తున్నారు. మత మౌఢ్యాన్ని నిరసించేవారు కూడా అధికమవుతున్నారు. మతానుయాయుల్లోనైనా ఒకరి దేవుడంటే మరొకరికి గిట్టదు. హిందువులు మేళ తాళాలతో వీధులవెంట వెళ్తే ఒక వర్గం వారికి పనికిరాదు. క్రైస్తవులు హార్మోనియం వాయించు

కుంటూ, పెద్దగా సంకీర్తనం చేస్తూ తమ దేవకుమారుణ్ణి స్తుతిస్తూ వెళ్తుంటే కొన్ని వర్గాలకు వెక్కిరింపు. తెల్లవారుజామునే నమాజుకు రండని మసీదుపై నుండి ఒకరు కేకపెడితే మరొక వర్గానికి కంటగింపు. ఈ సామూహిక భజనలు, ప్రార్థనల్లో భక్తి పాలు ఎంత ఉన్నదో ఎవరికీ తెలియదు. కానీ, ఇతర వర్గాలవారు ఇదంతా శబ్ద కాలుష్యంగా భావిస్తుంటారు. సొంత మతస్థుల్లో కూడా కొందరు విద్యావంతులు బయటికి ఏమీ అనకపోయినప్పటికీ, వారికిదంతా అప్రస్తుతంగా కనిపిస్తుంటుంది.

సామూహికంగా చేయదగిన పనులు వేరే ఉన్నాయి. వడ్లు దంచడం, పంటలు కోయడం, రాళ్ళు కొట్టడం ఇలాంటి కార్యాలెన్నో నలుగురూ కలిసి చేయవలసినవే. ఆహారోత్పత్తి, వస్తూత్పత్తికి సంబంధించిన పనులన్నీ సామూహికంగానే చేయవచ్చు. కానీ భగవద్భక్తిని సామూహికంగా చేపడితే ఎక్కువ ప్రయోజనముండదు; ఆటగా తయారవుతుంది.

“నేను ఎవరో కనుక్కో”మని జీవితం పొడుగునా చెవిని ఇల్లు కట్టుకొని ఉపదేశించిన మహా పురుషుడు అరుణాచల రమణుణ్ణి, ధనుర్మాస సమయంలో ఒక భజన కూటమి సందర్శించి, హాలు చుట్టూ భజనచేస్తూ ప్రదక్షిణం చేసి వెళ్ళిపోయారు. వారి కర్తవ్యం అంతటితో తీరిపోయిందని భావించారు. “నేను” మూలస్థానం కనుగొనే ఓర్పు ఎవరికుంటుంది? అదేదో ఆ స్వామే కనుగొని, ఆయన చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న తమని తరింపజేయాలి గాని తాము స్వయంగా ఆ ‘నేను’ను పరిశోధించే తీరిక ఓపిక ఎక్కడనుండి తేవాలి?

అంతకుమునుపు టవునులో ప్లేగు జాడ్యం వ్యాపించి భీభత్సం సృష్టించి తొలగి పోయింది. అది అణగారిన తర్వాత టవునులోని వారు ఒక భజన ఏర్పాటు చేసుకున్నారు. అందులో ప్రముఖులు కొందరు శ్రీరమణుల వారి వద్దకు వస్తూ పోతూ ఉండేవారు. అందుచేత రమణుల వారిని కూడా రమ్మని అడిగారు. ‘నేనెందుకయ్యా’ అన్నప్పటికీ రావలసిందే నన్నారు. చెరువుగట్టున ఒక పెద్ద డేరా వేశారు. శ్రీమతి సూరి నాగమ్మ రాసిన పుస్తకంలోని రమణుని మాటల్లోనే మిగతా కథ వినండి. “భజన అంటే అది సాధారణ భజన అనుకున్నారా? ఆ పెద్ద డేరాలో మధ్యన భజన నిమిత్తం కావలసి

నంత ఖాళీస్థలం ఉంచి సర్కస్ డేరాలో లాగా ప్రేక్షకుల కొరకు చుట్టూ ఎన్నో కుర్చీలు, బల్లలూ తెచ్చివేశారు. టీపార్టీకి తెచ్చినట్లుగా ఎన్నో రకాల మిఠాయిలు తెచ్చి, ఎగ్జిబిషన్‌లో పెట్టినట్లు 'వరుసగా పెట్టారు. పూల మాలలకు లెక్కేలేదు. కలక్టర్లూ తహశీల్‌దార్లూ, పోలీసు సిబ్బంది అంతా వచ్చారు. నాకొక ప్రత్యేక వేదిక అమర్చి ఉంచారు. నేను వెళ్ళగానే అంతా లేచి నమస్కరించి "స్వామీ, ఆ వేదిక మీదికి దయచేయడం"డన్నారు. ఇదేమిరా ఉపద్రవం అనిపించింది. కాని ఏం చేస్తాం? ఇంత గొడవ చేస్తారని తెలియదు. వచ్చాం, ఇక తప్పదని కూచున్నాను. పుష్పమాలలు నాకు వేయాలని చూశారు గాని నేను ఒప్పుకోక, "మీరంతా వేసుకోండయ్యా" అన్నాను. సరే, వాళ్ళే ధరించారు. అంతవరకూ వారు భజన ప్రారంభించనేలేదు. నేను కూచున్న తర్వాత అనుజ్ఞ అడిగి ప్రారంభించారు. ఒక జట్టు భజన ముగిసిన తర్వాత వారు ఫలహారాలు చేసేది. సోడా గీడా తాగుతూ విశ్రాంతి తీసుకునేది. అప్పుడు మరొక జట్టు ఆరంభించేది. తెల్లవారుజాము వరకు ఒకటే తిండి, ఒకటే భజన నేను మాత్రం ఏదీ తాగకుండా, తినకుండా కూర్చున్నాను. తెల్ల వారేసరికి పిట్టపురుగు లేకుండా డేరాలతో సహా అన్ని యెత్తివేశారు. వాళ్ళందరికీ భలే హుషారు."

సర్కస్ డేరా అంతటి పెద్దడేరా వేయడం, చుట్టూ కుర్చీలు అమర్చడం, తిను బండారాలు ఏర్పాటు చేయడం, భజన కాగానే భోజనం, భోజనం కాగానే భజన పెద్ద పెద్ద ఉద్యోగస్తులందరూ హాజరవడం,తెచ్చిన పుష్పమాలలన్నీ తామే ధరించేయడం, భగవాన్ వచ్చి ఆసీనులై అనుజ్ఞ ఇచ్చేవరకూ భజన ఆరంభించకపోవడం ఇదంతా కలిపి చూస్తే శ్రీరమణులు అన్నట్లు అదో సాధారణ భజన సమావేశం కాదు. దైవభక్తి మినహా మిగతా అన్నీ ఉన్నాయి అని చదువరులు గ్రహించే ఉంటారు.

# ఆధ్యాత్మికులు : ఆర్గనైజర్లు

**శం**ఖులో పోస్తే గానీ తీర్థం కాదన్నట్లు, సంస్కృత శ్లోకం ఉటంకిస్తేగానీ కొందరికి గురి కుదరదు కాబట్టి, ముందు శ్లోకం చెప్పి ఆ తర్వాత అర్థం వివరిస్తాను.

శ్లో॥ అసన్మానాత్తపోవృద్ధి ః
సన్మనాత్తవసః క్షయః
అర్చితః ఆపూజితోవిప్రో
దుగ్ధా గౌరివ సీదతి

ఇక మనందరికీ అర్థమయ్యేట్లు చెప్పుకోవాలంటే : "జనులు గౌరవించని ఎడల బ్రహ్మజ్ఞానం వృద్ధి పొందుతుంది. గౌరవించిన పక్షంలో బ్రహ్మజ్ఞానం క్షీణిస్తుంది. కనుక లోకుల ప్రశంసలు పొంది భోజన వస్త్రాలంకార దానాలను పుచ్చుకునే ఆత్మ జ్ఞాని ఒట్టిపోయిన గోవువలె ప్రయోజనం లేనివాడై నశిస్తాడు. జనుల నుంచి అవమానమే తత్త్వజ్ఞాని కోరుకోదగినది". ఇక దీని తాత్పర్యం ఒక్క ముక్కలో చెప్పాలంటే "జీవితాన్ని నిజంగా అర్థం చేసుకోదలచుకున్న వాడు సంఘం నుంచి సన్మాన సత్కారాలు ఆశించ కూడదు."

కాని నేటి కాలంలో, "నేను ఆధ్యాత్మిక సాధకుణ్ణి. సంఘం ఇప్పటి వరకూ నన్ను గుర్తించక పోవడం శోచనీయం. ఇకనైనా త్వరపడి గుర్తించడం శ్రేయస్కరం" అన్నట్లు తిరిగే వారే ఎక్కువగా కనిపిస్తారు. అయితే అది అధ్యాత్మికత అనిపించుకోదు; మిగతా అన్ని వృత్తులలో గుర్తింపును ఆశించినట్లే ఈ రంగంలో కూడా గుర్తింపు కోరుతున్నాడన్న మాట. గుర్తింపు వెనకాలే ధనాశా, కీర్తికాంక్షా, అహంభావమూ తొంగి చూస్తుంటాయి.

ఆధ్యాత్మికులు అజ్ఞాతంగానే బ్రతకాలని, ఎవరికంటా పడరాదని అనడం లేదు. తాము ఉండదలచుకున్న చోట ఉంటూ తమ వద్దకు వచ్చిన వారికి చెప్పగలిగింది ఏదైనా చెప్పవచ్చు. తమని ఎవరైనా ఆహ్వానించి తత్త్వం బోధించమని ప్రార్థిస్తే,

పర్యటించినా తప్పులేదు కాని అవతలి వారు ఆహ్వానించేటట్లుగా పరిస్థితులు కల్పించడం, వెళ్ళినచోట అమితమైన స్వాగత సత్కారాలు ఆశించడం, ఉపన్యాసకులకు, రాజకీయ నాయకులకు వేషగాళ్ళకు చెల్లుతుంది కాని, తత్త్వజ్ఞానికి మాత్రం పనికిరాదు. కాని ఈనాటి "జ్ఞానులు" సమాజంలోని నలుగురితోబాటు వేదికలెక్కి కూచుంటారు. అందరితో బాటు పూలమాలాలంకృతు లవుతుంటారు. సంఘంలో వర్తకులకూ, నాయకులకూ, దాతలకూ దక్కే గౌరవం వీరికీ దక్కుతుంటుంది. అందరితోబాటు వీరు కూడా ఏవో కొన్ని నీతులు వల్లిస్తారు. ఇటువంటి ప్రసంగం శ్రోతకు కర్ణపేయంగా ఉండవచ్చునేమో కాని, అతడిలో మౌలికమైన మార్పు మాత్రం తీసుకురాదు.

మతాన్ని గురించిన ఉపన్యాసం వేరు, తత్వజ్ఞాన బోధవేరు. మతాచరణ వేరు, స్వస్వరూప జ్ఞానం కొరకై లోతులు తవ్వడం వేరు. ఈ తేడా సరిగా తెలియని ఒక పెద్ద మనిషి, నేటి ఆధునిక స్వాములు ఊరేగుతున్న చందంగా అరుణాచల రమణుల వారిని కూడా దేశమంతా తిప్పి ఉపన్యాసాలిప్పిద్దామని ప్రయత్నించాడు. శ్రీమతి సూరి నాగమ్మ గ్రంథంలో ఆ ఉదంతం వివరాలను శ్రీరమణుల భాషలోనే చదవండి. "కొన్నాళ్ళు రాజేశ్వరానందస్వామి ఇక్కడ ఉన్నారు కదూ. అప్పుడు ఇండియాలో ముఖ్యమైన ప్రదేశాలకంతా భగవాన్ దయచేసి ఉపన్యాసాలిచ్చి బోధచేయాలని, అందుకు గాను ట్రెయినులో స్పెషల్ క్లాసు ఏర్పాటు చేస్తానని, ఆ ఊళ్ళో అన్ని రోజులు, ఈ ఊళ్ళో ఇన్ని రోజులు ఆగాలని చెపుతూ, ఏమో ప్లాన్లు వేస్తుండేవారు. పలక్కుండా విని ఊరుకునేవాణ్ణి. సమ్మతమే ననుకున్నారు. చివరకు ఒక రోజు స్పెషల్ క్లాసూ అదీ ఇదీ ఏర్పాటు చేసి వారి సామానంతా మూటకట్టి, "స్వామీ, బయలుదేరుదామా?" అన్నారు. "ఆహా, దానికేమి పోయిరండి" అన్నాను. "భగవానో?" అన్నారు. 'నేనా, ఎందుకు?" అన్నాను. "ఆధ్యాత్మ తత్త్వం ఇండియాలో బోధించాలి స్వామీ" అన్నారు. "సరిసరి, చేసేదేమి? ఉండేదెక్కడ, పోయేదెక్కడికి? నాకెక్కడికి పోయేందుకూ స్థలం లేదే" అన్నాను. వారు నిర్ఘాంతపోయారు."

మరొక చోటికి వెళ్లడం సబబా కాదా అనేది కాదు ఇక్కడ ప్రశ్న. అర్థశతాబ్దం పైగా రమణులు తిరువణ్ణామలైలో గడిపిన కాలంలో, ప్రత్యేకంగా ఉపన్యాసాలంటూ

ఏవీ ఇచ్చిన వారు కాదు. ఎవరైనా ఏదైనా అడిగితే సందర్భానుసారంగా విషయాన్ని వివరించే వారు. సందేహ నివృత్తి చేసేవారు. ఎందరు శ్రద్ధాసక్తులతో ప్రశ్నించారు. ఎందరు వ్యర్థమైన ప్రశ్నలు వేసేవారు అనే మాట అటుంచి, ఎందరు ఆయన బోధను గ్రహించి, ఆచరించి తత్త్వం కనుగొన్నారు అనేదే ముఖ్యమైన ప్రశ్న. ఈ ప్రయత్నానికి పూనుకునే శక్తి చాలక, తాము తరించే మార్గం కనిపించక, ఇతరులను తరింపచేయడానికి మాత్రం స్వామి ఉపన్యాసాలిప్పిస్తామంటారు. ఇలా కేవలం "ఆర్గనైజ్" చేయబూనుకోడం తమ ఆహాన్ని పెంచుకోడానికి ఉపకరిస్తుందేమోకాని, తనను ఏ నాటికీ ఉద్ధరించదు; తనని ఉద్ధరించుకోలేని వాడు మరొకరిని ఉద్ధరించనూలేదు.

## కర్మయోగం

తాను కర్తననుకోకుండా కర్మచేయడమనేదే కర్మయోగం. కర్తృత్వ బుద్ధి లేకపోయినా కర్మలు వాటంతటవే జరిగిపోతాయి. ప్రతివాడూ ఏదో ఒక ప్రయోజనం నిమిత్తం జన్మ ఎత్తుతున్నాడు. తాను కర్తనని అనుకున్నా అనుకోకపోయినా ఆ ప్రయోజనం కొనసాగి తీరుతుంది.

# పండితుడూ - జ్ఞానీ

**ఆ**ధ్యాత్మికోన్నతులు సమకాలికు లైనప్పటికీ పరస్పరం కలవకుండానే ఈ లోకం నుండి దాటిపోవచ్చు. ఇరువురూ హృదయ సామ్రాజ్యాధిపతులైన కారణంచేత, ఒకే రకమైన భావ సమాధిని అనుభవిస్తుండడంచేత ఒకరినొకరు కలసి చర్చించదగింది ఏమీ ఉండదు. ఇద్దరూ పరిపూర్ణులే కాబట్టి ఒకరి ద్వారా మరొకరు కొత్తగా తెలుసుకో దగింది ఏమీ ఉండకపోవచ్చు. తనని తాను విస్మరించి నవనవోన్మేషమైన దానిని చూడడంలోనే నిమగ్నమైన మనిషికి ప్రయత్నపూర్వకంగా ఒక పని చేయాలని కాని, ఒకర్ని కలవాలని కాని ఉండే అవకాశం లేదు. అతడి ఆనందానికి ఎప్పుడూ ఏ కొరతా ఉండదు కాబట్టి అతడు ప్రత్యేకంగా తలపెట్టే కార్యమంటూ ఉండదు. తటస్థ పడ్డవారిని చూడడం, వారడిగిన మాటకు సమాధానం చెప్పడంతోనే సరిపోతుంది.

అలాంటి ఇద్దరు జీవన్ముక్తులు కలవడం తటస్థించకపోయినప్పటికీ, మధ్య కాలంలో ఒకరు దేహం చాలించినప్పటికీ ఆ ఇద్దరి మధ్యా ఉన్న దృష్టిసారూప్యాన్ని గమనించిన వారు, వీరిద్దరూ సమావేశమై ఉంటే ఎలా ఉండేదో అనే ఊహాగానం చేయడం కద్దు. ఆకాశంలో ఇద్దరు సూర్యులు కనిపిస్తే ఎలా ఉంటుందో అలా ఉంటుందోమోనని అనిపించవచ్చు. కానీ ఆకాశంలో సూర్యుడెప్పుడూ ఒక్కడే. నిజమైన ఆధ్యాత్మికోన్నతిని అందుకున్నవారు, ఒకరిలో ఒకరు మిళితమైపోతారు. వారసలు విడివిడి వ్యక్తులైతే గదా వేర్వేరుగా కనిపించడానికి? దేహధారులు కాబట్టి ఇద్దరుగా కనిపిస్తుంటారేగానీ, జీవన్ముక్తులైన కారణం వల్ల, ఇద్దరిలో ఎవరు నోరు విప్పి మాట్లాడినా ఒకటే; సత్యమే ప్రకటితమవుతుంది.

ఇది గ్రహించలేనివారు ఈ పురుషుల్ని ఏవో అనవసర ప్రశ్నలు వేస్తుంటారు. బొంబాయి పట్టణంలోని ఒక సామాన్య గృహంలో సంసారిగా నివసించి కాలం చేసిన మహనీయుడు నిసర్గదత్త మహరాజ్‌ను "రమణ మహర్షిని గురించి మీ అభిప్రాయమేమి టండీ?" అని ఒకరు అడిగారు. "మేమిద్దరమూ ఒకేరకమైన సనాతన స్థితిలో ఉన్న వాళ్ళమే. ఆ విషయం అలా ఉంచండి. మీకైతే మీ పేరూ, మీ శరీరమూ తప్పితే,

మిమ్మల్ని గురించి మరేమీ తెలియదు. రమణ మహర్షి గురించైనా మీ కంతే తెలిసే వీలుంటుంది. ఆయన్ని గురించి మీకంతకన్నా ఏమి తెలుసు కాబట్టి నన్నీ ప్రశ్న అడుగుతున్నారు?" అని సమాధానమిచ్చాడు నిసర్గదత్తుడు. అప్పటికీ ఊరుకోక ఆ పృచ్ఛకుడు, "మీరు మహర్షిని కలిసి ఉంటే ఏమై ఉండేదంటారు?" అని సంభాషణను పొడిగించాడు. "బహుశా ఇద్దరమూ సంతోషపడుండే వాళ్ళమనుకుంటాను. నాలుగైదు మాటలు కూడా మాట్లాడుకొని ఉండవచ్చు" అన్నాడు ఆ అద్వైతి. "ఆయన మిమ్మల్ని జీవన్ముక్తుడుగా గుర్తించి ఉండేవారంటారా?" అని సాగదీశాడు ఆ వ్యక్తి. "తప్పకుండాను. మనిషిని మనిషి గుర్తించగలిగినట్లే, జ్ఞాని అయినవాడు మరో జ్ఞానిని ఇట్టే గుర్తించ గలడు. మీరు స్వయంగా అనుభవించిందే మీరు మెచ్చుకోగలుగుతారు. మీ అనుభవం లోకి రాని గుణాన్ని మీరూ గ్రహించలేరు" అన్నాడు నిసర్గదత్తుడు.

అరుణాచల రమణుణ్ణి కలవాలనుకున్న వారిలో కూడా రకరకాల వారు ఉండే వారు. రమణుడు విరూపాక్ష గుహలో ఉండే కాలంలో, పండితుడైన శివగంగ పీఠాధిపతి ఒకరు తనని కలిసే నిమిత్తం వచ్చారని చెపుతూ రమణులిలా అంటారు. "వారు శిష్యులతో వచ్చి తిరువణ్ణామలై నగర సత్రంలో బసచేసి నన్ను అక్కడకు రమ్మని ఆహ్వానించారు. మనమేమి పండితులమా పోయేందుకు? మనకేమి అర్హత ఉన్నదని, రానన్నాను. వారది విని తామే శిష్యులతో బయలుదేరి పెద్ద పళ్ళెంలో సరిగంచు శాలువ, నూట పదహారు రూపాయలూ పెట్టుకొని నా వద్దకు రావాలని కొండ ఎక్కుతూ ఉంటే, నేను ములైపాలు తీర్థం వద్ద నుండి కమండలం పట్టుకుని విరూపాక్ష గుహకు పోతున్నాను. ఆ మధ్యన ఉన్న వృక్షం వద్ద ఉభయులమూ కలుసుకున్నాము. వారు పళ్ళెం నా ముందుపెట్టి – "ఇది తాము స్వీకరించాలి" అంటే నేను సమ్మతించలేదు. కడకు డబ్బు వారే ఉంచుకొని, "శీతకాలంలో కప్పుకోడానికి ఉపయోగపడుతుంది, శాలువ గ్రహించండని" బలవంతపెట్టారు. తిరస్కారం కూడదని అది మాత్రం తీసుకని సరిగ అంతా చింపి ఉంచి, అంచులు కుట్టి కప్పుకుంటూ వచ్చాను. వారు వెంటనే వెళ్ళారు. అప్పటికే చాలా వృద్ధులు. ఇక్కడికి వచ్చి వెళ్ళిన కొద్దిరోజులకే సిద్ధి పొందారు" అన్నారు.

"వారేమైనా భగవానుని ప్రశ్నించారా?" అన్నాడొక భక్తుడు.

"ప్రశ్నించటానికి ఏమున్నది? వారు మంచి వివేకం కలవారూ, పండితులూను. నన్ను చూసిన వెనుక తమ సమీపస్థులతో "సుఖి అంటే రమణుడే సుఖి. ఈలాంటి సుఖం నాకు వెయ్యి జన్మలకైనా లభించడం దుర్లభం" అని అన్నారట వారు" అంటూ ముగించాడు రమణుడు.

పాండిత్యానికి ఉండే ప్రయోజనాలు పాండిత్యానికున్నాయి. కానీ ఆత్మజ్ఞానం వల్ల లభించే అత్యంత సుఖం, సాఫల్యం వేరు.

## మనస్సు - మెదడు

మనస్సు మెదడులో పుట్టిందనుకుంటారు. కానీ మెదడు ఎక్కడ వున్నది? శరీరంలో వున్నది. శరీరమే మనస్సు చేసిన కల్పన అని నేను అంటున్నాను. శరీరాన్ని అందులోని మెదడును సృష్టిచేసినది మనస్సే. ఆ మెదడు తన స్థానమైనట్లు నిర్ణయిస్తున్నదీ మనస్సే.

# ఆత్మజ్ఞానం గ్రంథాలలో లభిస్తుందా?

నిర్వ్యాపారంగా వుంటంకన్నా పుస్తకం చదువుకోడం మంచిది. సాధుజన సాంగత్యం లభించని చోట సాధు పురుషులు వ్రాసిన గ్రంథాలు పఠించడం కూడా సాధుసాంగత్యంగానే భావించవచ్చు. కానీ పుస్తకాలు చదవడం ద్వారా ఆత్మజ్ఞానం లభిస్తుందనుకోడం వ్యర్థం.

పుట్టిన ప్రతి మనిషీ ఒక పుస్తకమే. ప్రతి మనిషిలోనూ మానవ చరిత్ర యావత్తూ నిక్షిప్తమై ఉన్నదంటారు జిడ్డు కృష్ణమూర్తిగారు. తమ తమ మనసు పుటలను విప్పి చదవడానికి పూనుకుంటే, మనిషి మనసే సమస్తాన్ని విశదీకరిస్తుందంటారు ఆయన. అయితే ఈ మనసును నిశితంగా చూడాలంటే, దాని ప్రతి చలనాన్ని జాగ్రత్తగా గమనించాలంటే, మనకు ఏ అభిప్రాయమూ ఉండకూడదు. అభిప్రాయాలతో చూచే మనసూ, ఒక పక్కకు ఒరిగి ఉండే తప్పుడు త్రాసూ, రెండు ఒకటేనవచ్చు. పక్షపాతంతో నిండిన మనసూ, తూకం తప్పు చూపించే త్రాసూ, ఈ రెంటిలో నుండి న్యాయం కానీ, ధర్మం కానీ ఎలా ఆశించగలం?

అలాగే మనసుకు అన్నిటినీ పలు తెఅగులుగా విభజించే లక్షణముంటే, దాని వీక్షణ సరిగా ఎలా ఉంటుంది? మనిషిని చూడగానే ఇతడు హిందు వంటుంది; ముస్లిం, సిక్కు, క్రిస్టియన్ అని గుర్తిస్తుంది. ఇలా గుర్తించిన మనసుకు ఈ 'మత చీటీల' వెనుక ఉన్న అసలు మనిషి కనిపిస్తాడా అనేది ఒక ప్రశ్న. మనిషి గనక కనిపిస్తే 'మతం చీటీ' ఊడిపోతుంది; మతం చీటీయే ప్రముఖంగా కనిపిస్తే మనిషి మఱుగవుతాడు. తాడు కనిపిస్తే, ఇక సర్పం లేదు, సర్పమే కనిపిస్తుంటే తాడు ప్రస్తావన లేదు. మనసు ఏ రకమైన, భ్రాంతికి లోనైనా 'ఉన్నది' ఉన్నట్లు కనిపించదు.

మనసు, తన పూర్వానుభవంతో చూచినా, కనిపించేవన్నీ ఆ అనుభవాన్ని అనుసరించే ఉంటై, నేను ఓ భాషా ప్రాంతంలో నివసించి, అక్కడి వారివల్ల కొన్ని అనుభవాలు గడించి ఉంటే, ఆ అనుభవాలు నా 'చూపును' ప్రభావితం చేస్తై. ఆ వర్గం

వారందరూ చాలా మంచివారనో, చాలా చెడ్డవారనో అనిపిస్తుంటుంది. ఇక నాకు ఉన్నది ఉన్నట్లు కనిపించే దెలా?

నేను పుట్టి పెరిగిన వాతావరణం, నా పెద్దవాళ్లు నాకు నూరిపోసిన అభిప్రాయాలు, నా పరిసరాల్లో నే సేకరించిన అనుభవం, మానసికంగా నాకు అయిన గాయాలు, ఇతర్ల గురించి నాకుండే దురభిప్రాయాలు, నేనేర్చిన చరిత్ర, ఇవన్నీ కలిసి నాకో దృష్టిని కలిగించినై. వీటన్నిటినీ నేనెప్పుడూ విమర్శగా, విశదంగా చూచిన సందర్భం లేదు. ఇలాంటి అస్తవ్యస్తమైన మనస్సుతో దేనినైనా సరిగా, తిన్నగా చూడగలను అని అనుకోడం, తప్పుడు థర్మామీటరుతో జ్వరాన్ని కొలవడానికి ప్రయత్నించడమే అవుతుంది.

వీటన్నిటినీ వదులుకున్న మనసుతో చూడడం నేర్చుకుంటే, మానవ చరిత్ర యవత్తూ మనలోనే కనిపిస్తుందంటారు శ్రీ జిడ్డు కృష్ణమూర్తి. దీనికి పుస్తకాలు చదవడ మెందుకు అంటారు. ఆయనే కాదు, పుస్తకాల చదువు నిష్ప్రయోజమని అరుణాచల రమణులు కూడా ఎన్నోమార్లు చెప్పారు.

మనిషికి విముక్తి లభించాలంటే గ్రంథ పఠనం వల్ల ఏమైనా ప్రయోజనం ఒనగూరుతుందా, అని ఎవరో రమణుల వారిని అడిగినప్పుడు, "మది నెమ్మది పఱచడమే ముక్తి మార్గమని శాస్త్రాలన్నీ చెప్తున్నై. అందువల్ల ముందు మదిని శాంతింపజేయక తప్పదు. ఈ విషయం గనక సరిగా అర్థమైతే అంతులేని గ్రంథ పఠనం అనవసరం. ఈ మదిని శాంతింపజేయడానికి, తానెవరో తెలుసుకునే ప్రయత్నం మొదలెడితే చాలు.

ఈ 'నేనెవరు' అనే వెతుకులాట గ్రంథాల్లో ఎలా చేస్తావు? మనిషి తనని తాను కనుగొనడానికి తన విజ్ఞాన చక్షువునే వినియోగించాలి. ఈ 'ఆత్మ' పంచకోశాలలోన ఉన్నది. కానీ పుస్తకాలేమో వీటికి వెలుపల ఉన్నాయి. పంచకోశాలను పక్కకునెట్టి ఆత్మ విచారం చేయాల్సి ఉండగా, ఇందుకై పుస్తకాల్లో వెతికితే ఏమి కనిపిస్తుంది? మనిషి నేర్పినదంతా విస్మరిస్తే కానీ అసలు స్వరూపం కనిపించదు" అని సమాధానమిచ్చారు.

"ఆత్మను కనుగొనడానికి మనిషి నేర్చినదంతా విస్మరించాలి" అని రమణుల వారు అన్న మాటని కీలక వాక్యంగా గ్రహించాలి. మనిషికి "తెలిసిన దాని నుండి"

పూర్తిగా విముక్తి సాధిస్తే గానీ, ఏదీ సరిగా కనిపించదు. ఈ మహనీయులు చెప్పిన ఆప్త వాక్యాన్ననుసరించి జీవించి చూడాలి. అలా చేసి జీవితంతో ఏది దర్శిస్తే జన్మ సార్థక మవుతుందో దానినైనా కనుగొనవచ్చు; కాదనుకుంటే గ్రంథ పఠనంతో, పాండిత్యంతో సంతృప్తి నొందవచ్చు.

## సాధన లక్ష్యం

వస్తుతః సాధన లక్ష్యం అజ్ఞాన నివృత్తిగాని, జ్ఞానసముపార్జన కాదు. ఎందుకంటే, జ్ఞానం ఎప్పుడూ ఉన్నదే కానీ క్రొత్తగా సంపాదించవలసింది కాదు. ఒకప్పుడుండి, ఒకప్పుడు లేక కొత్తగా సంపాదించవలసిన దానికి శాశ్వతత్వం లేదు. అట్టి దానిని సంపాదించి ప్రయోజనం లేదు.

# ఎవరి ధర్మం వారిది...

సాటి మనిషిని మానసికంగా గానీ శారీరకంగా గానీ గాయపరచవద్దని జిడ్డు కృష్ణమూర్తిగారు చెప్పడం చూచి, “ఎవరైనా మీ మీదగానీ మీకు ఆత్మీయులైన వారి మీద గానీ అకస్మాత్తుగా దౌర్జన్యం జరపబోతే, మీరైతే ఏంచేస్తారు?” అని సవాలు విసిరిన వారున్నారు. అందుకు ఆయన “అలాంటి సమయాల్లో మనిషి ప్రవర్తన అంత వరకు అతడు జీవించిన తీరుపై ఆధారపడి ఉంటుందండీ” అని ముక్తసరిగా సమాధానం చెప్పి ఊరుకునేవారు.

దౌర్జన్యానికి బెదిరిన ఒక మనిషి పలాయనం చిత్తగించవచ్చు. మరొకరు అవతలి మనిషి దౌర్జన్యం చేయకముందే, తానే అతడిపై దౌర్జన్యానికి పూనుకోవచ్చు. దెబ్బకు దెబ్బ తీయనూ వచ్చు. మరేవిధంగానైనా నిరోధించడానికి పూనుకోవచ్చు. అతడి స్వభావం మరొకటైతే మంచి మాటలతో ఆ దౌర్జన్యపరుణ్ణి నివారించడానికి ప్రయత్నించ వచ్చు. లేదా బాధను సహించవచ్చు. తన పూర్వ జీవితాన్ని ఎలా మలుచుకొని ఉంటే మనిషి అలా స్పందిస్తాడు; ఇలాగే స్పందిస్తాడని ముందుగా చెప్పలేం. మనిషి మొదటి నుంచి శాంతంగా జీవించి ఉంటే, అతడి మనస్సులో దౌర్జన్య ప్రవృత్తి తొలగిపోయి ఉంటే. ఆ సందర్భంలో కూడా శాంతంగానే ప్రవర్తిస్తాడు. మనుషులందరికీ ఒకేరకమైన శాంతి మంత్రోపదేశం చేసినప్పటికీ, వారి వారి పుట్టుక, పెరుగుదల, స్వభావ సంస్కారాలను బట్టి ఆయా పరిస్థితులకు అనుగుణంగా వారు ప్రతిస్పందిస్తారు. వ్యక్తి గతంగా ఇది ఎవరికి వారు ఆలోచించుకోవలసిన విషయం.

అల్లరి మూకల్ని అదుపుచేసే బాధ్యతగల పోలీసు యంత్రాంగాన్ని, శ్రుతిమించిన పరిస్థితి ఉదయించినప్పుడు కూడా శాంతంగా వ్యవహరించాలని ఎవరూ ఆశించరు. అలాంటి వేళల్లో బలప్రయోగం అనివార్యం. అలాగే యుద్ధ కాలంలో సంహార క్రియ తప్పదు. ఈ సామాజిక న్యాయాన్ని ఎవరూ కాదనలేరు.

పుణ్య పురుషుల కథ వేరు. వారి ఆధ్యాత్మ సాధన ఫలితంగా, తోటి మానవుల పట్ల సమస్త జీవరాశి పట్ల, కరుణ జనించిన కారణం వల్లా, తమంతట తాము ఎవరికీ

హాని తలపెట్టరు. పెల్లుబికిన ఆ కరుణా భావంలో, తమపై దౌర్జన్యం జరిపిన వారి మీద కూడా, ప్రతిక్రియ జరపాలని వారికి ఉండదు.

తిరువణ్ణామలై కొండకింద నిర్మించిన శ్రీ రమణాశ్రమ ప్రారంభ కాలంలో ఒకసారి దొంగలు పడ్డారు. లోపలి హాల్లో శ్రీరమణుడితోపాటు మరి నలుగురైదుగురు పడుకొని ఉన్నారు. దొంగలు దక్షిణ దిక్కు నుండి లోపలికి రావడానికి ప్రయత్నిస్తున్నారని గమనించి, హాలు వెలుపలి నుండి మరికొందరి సహాయం తెద్దామని కుంజుస్వామి అనే ఆయన ఉత్తరం దిక్కున ఉన్న తలుపు తెరచి బయటికి వెళ్లాడు. తలుపు తెరవగానే ఆశ్రమంలోని 'జాక్, కరుప్పణ్' అనే రెండు కుక్కలు బయటికి పరుగెత్తాయి. ఆ ద్వారం గుండా బయటికి వచ్చిన కుక్కల్ని అక్కడ కాపువేసిన కొందరు దొంగలు కొట్టారు. ఒక కుక్క అటే పరిగెత్తిపోయింది. రెండవది మాత్రం మళ్ళీ హాల్లోకి పరుగెత్తుకుంటూ తిరిగి వచ్చేసింది.

ఆశ్రమం నుండి తీసుకువెళ్ళదగిన విలువైన వస్తువులు ఏమి లేవని, అయినా లోపలికి రాదలచుకుంటే స్వేచ్ఛగా వచ్చి, కావలిసినవేవో నిరభ్యంతరంగా తీసుకు వెళ్ళమని రమణుడు, బయటి కిటికీ ఊడదీయడానికి ప్రయత్నిస్తున్న దొంగలతో అన్నాడు. తమని పట్టుకోవడానికి ఇదేదో పన్నాగం అయి ఉంటుందనే కారణం వల్లనో, లేక మూర్ఖత్వం వల్లనో, వారి పాటికి వారు ఆ కిటికీని పెరికివేసి అందులో నుండి లోపలికి రావడానికి ప్రయత్నిస్తూనే ఉండిపోయారు. ఈ విధ్వంసం అంతా చూడలేక రామకృష్ణస్వామి అనే శిష్యుడు వారిని ఎదుర్కొంటానని అన్నాడు శ్రీ రమణులతో. రమణుడు అతణ్ని వారిస్తూ "వారి ధర్మం వారిది. మన ధర్మం మనది. మనం ఓర్చు కోవాలి. సహించాలి. వాళ్ళకు అడ్డంపోవద్దు" అన్నాడు.

"అవతలి తలుపు తెరచే ఉంది. లోపలికి వచ్చి కావలసినవేవో తీసుకోమని" అన్నప్పటికీ వినకుండా, ఆ దొంగలు గడ్డితో కప్పిన పై కప్పును తగలపెడతామని బెదిరించారు. "ఆ పని చేయకండి" అని అంటూ శ్రీ రమణులు తనతోటి వారితో బయటికి వెళ్ళి, హాలును దొంగలకు వదిలేస్తానని అన్నాడు. దొంగలు కోరినదిదే కనుక సరేనని అంగీకరించారు. హాలులో ఉన్న కుక్కను 'ముందు హాలు బయటకు తీసుకు

వెళ్ళమని' తన అనుచరుడితో చెప్తూ (అపత్సమయంలో కూడా జీవకారుణ్యమే ! దాని ప్రాణం తన ప్రాణంతో సమానమనిపించింది) మిగతా వారితో తాను ఉత్తరం దిక్కున ఉన్న ద్వారం వద్దకు నడిచి వెళ్ళారు. ఆశ్రమవాసుల్ని భయభ్రాంతుల్ని చేయాలనో, తమ పనికి అడ్డం రాకుండా నిస్సహాయుల్ని చేయాలనే ఉద్దేశంతోనో ఆ దొంగలు ద్వారం వెలుపలికి వస్తున్న వారందరికీ వరుసగా కఱ్ఱతో వడ్డించడం మొదలుపెట్టారు. ఎడం తొడ మీద కఱ్ఱ దెబ్బతిన్న రమణులు "నీకు తృప్తి కలుగకపోతే ఇవతలి ఈ కాలుమీద కూడా కొట్టు నాయనా" అని సూచించాడు. సమయానికి రామకృష్ణస్వామి అడ్డు రావడంవల్ల రమణుల వారికి దెబ్బలు తప్పాయి. అలమార్లు పగులగొట్టినా దొంగలకు విలువైనదేమీ దొరకలేదు. అయినా వెతుకుతూనే ఉన్నారు. గాయాలైన తన అనుచరలను మందురాసుకోండని సలహా ఇచ్చారు రమణులు. "మరి మీ మాటేమిటి?" అన్నాడు రామకృష్ణస్వామి. "నాకు కూడా కొద్దిపాటి పూజ జరిగింది" అన్నారు రమణులు నవ్వుతూ. శ్రీ రమణుల తొడపై తగిలిన దెబ్బ, తత్ఫలితంగా ఏర్పడిన వాపు చూసే సరికి రామకృష్ణస్వామికి చెడ్డ కోపం వచ్చింది. అక్కడ ఉన్న గడ్డపార తీసుకుని, "వాళ్ళు లోపల ఏంచేస్తున్నారో చూసి రానివ్వండి" అంటూ లేచాడు.

అతణ్ణి వారిస్తూ "మనం సాధువులం. మన ధర్మం మనం వదులుకోడానికి వీల్లేదు. నువ్వు తీరా వెళ్లి వాళ్ళని కొడితే వాళ్ళలో ఎవడో ఒకడు చచ్చిపోవచ్చు. అప్పుడు లోకం వారిని నిందించే బదులు, న్యాయంగా మనల్నే నిందిస్తుంది. వాళ్ళు తమ అజ్ఞానాంధకారంలో చేయగూడని పనులు చేయవచ్చుగాక. మన ధర్మమేమిటో మనం గుర్తెరిగి ప్రవర్తించాలి. నీ నోటి పళ్ళు నీ నాలికను కొరుకుతాయనుకో. అందుకని ఆ పళ్ళు ఊడగొడుతావా ఏమిటి?" అన్నాడు ఆ మహాపురుషుడు. కనిపించే ప్రతి మనిషీ తానేననే సత్యం ఆయనకు సాక్షాత్కరించిందనడానికి ఇక సందేహమేమిటి?

# ప్రేమతో పెట్టిన కాస్త...

**ఒ**కసారి శ్రీ రామకృష్ణ పరమహంస జన్మదినోత్సవ వేడుకలు జరుగుతున్న వేళ ఒక పేద అభిమానురాలు తన వద్దనున్న కొన్ని డబ్బులతో నాలుగు రసగుల్లాలు కొనుక్కొని వాటిని రామకృష్ణుడికి ఇవ్వటానికి దక్షిణేశ్వర్ వచ్చింది. నహబత్ గృహంలో నివసిస్తున్న రామకృష్ణుడి సతీమణి శారదా మాత చేతికిచ్చి, వాటిని రామకృష్ణుడి వద్దకు పంపించి తినిపించమని వేడుకున్నది. శారదా మాత సహచరులు, "గురువు గారు భక్తులతో ప్రసంగిస్తూ ఉన్నారు. ఇవి తీసుకొని ఈ సమయంలో ఆవిడ అక్కడికి ఎలా వెళుతుంది? అదీకాక గురువుగారి భోజనం అయిపోయింది. ఇప్పుడిక మళ్ళీ ఏమీ తినరు. తింటే జబ్బు చేస్తుంది కూడాను" అని నిరుత్సాహపరిచారు.

ఆ పేదరాలు చాలా నిరాశకు గురయింది. తాను తెచ్చిన పదార్థం తన స్వామి ఆరగిస్తే సంతోషిద్దామనుకున్న మనిషికి విచారమే మిగిలింది. ఈ ఘట్టాన్ని తన రచన ద్వారా మనకు తెలియజేస్తూ, ఆవిడ ఇలా అనుకొని ఉంటుందనే ఊహచేస్తాడు రామకృష్ణ శిష్యుడైన శ్రీ రామచంద్రదత్త. "మహానుభావా, నువ్వు దీనులపాలిటి దైవానివి. ప్రస్తుతం ధనవంతులైన నీ భక్తులు ఎంతో వ్యయంతో విందు నీకేర్పాటు చేశారు. నీవు అందులో మునిగి ఉన్నావు. ఇకనేనా, ఒక సామాన్యురాలిని. ఎలాగో నాలుగు కానులు (ఆనాటి రూపాయిలో పదహారవ వంతు) మిగిల్చి ఈ రసగుల్లాలు కొనుక్కు వచ్చాను. వీళ్ళేమో ఇవి నీకందించే వీలులేదంటున్నారు. నేనేం చేయాలో నాకు తోచడం లేదు. నీవు దీన జనోద్ధారకుడివి కాదేమోనని నాకనిపిస్తున్నది." చదువురాని ఓ బీద వనిత ఇంత వివరంగా ఇంత హేతుబద్ధంగా ఆలోచించి ఉండకపోవచ్చు. కానీ ఆవిడలో నైరాశ్యం, అసంతృప్తి తొంగి చూశాయి అనేది మాత్రం ఖాయంగా చెప్పవచ్చు. ఆ నైరాశ్యానికే దత్త ఇలాంటి అందమైన రూపకల్పన చేసి ఉంటాడు.

ఆ తర్వాత జరిగిన సంఘటన మాత్రం ఎవరూ కల్పించింది కాదు. అక్కడ రామకృష్ణుడు అకస్మాత్తుగా తానున్న భవనంలో నుండి కింది వరండాలోకి దిగివచ్చాడు. అక్కణ్ణించి కనిపించే నదీ ప్రవాహం వంక కాసేపు చూస్తూ నుంచున్నాడు. అటు

తర్వాత వరండా నుండి నాలుగు మెట్లు దిగి శారదా మాత నివసించే నహబత్ గృహానికి నడుస్తూ వచ్చాడు. అక్కడికి రాగానే ఎవరికోసమో వెతుకుతున్నట్లు కలియ చూడడం ప్రారంభించాడు. అక్కడే నిలబడిన పేదరాలిని చూచి, "ఆకలేస్తున్నది తల్లీ. ఏదైనా ఉంటే పెట్టు" అని తనంతట తానే అడిగాడు. అమితానందంతో ఆ బీద మనిషి తాను తెచ్చిన రసగుల్లాలు అతడి చేతిలో పెట్టింది. సంతృప్తిగా తిన్నాడు రామకృష్ణ. సంతృప్త మనస్సుతో సెలవు తీసుకుంది ఆ బీద వనిత.

తమ తమ కాలాల్లో పురాణ పురుషులైన రాముడూ కృష్ణుడూ కూడా, ఆతిథ్య మెవరిస్తున్నారు, ఏమిస్తున్నారు అనేది చూడకుండా, భక్తినే ప్రధానంగా ఎంచి, తమ చేత పెట్టిందేదో మారు మాట్లాడకుండా తినేవారు. శ్రీ రాముడు గుహుని అతిథ్యం స్వీకరించాడనీ, శబరి ఇచ్చిన ఎంగిలి ఫలాలను నిరభ్యంతరంగా భుజించాడని వాల్మీకి అంటాడు. రాయబారం నెరపటానికి కౌరవ సభకు వచ్చిన శ్రీకృష్ణుడు, లాంఛన ప్రాయంగా వారు ఏర్పాటు చేసిన బ్రహ్మాండమైన విందులో పాల్గొనకుండా, ఊరు బయట నివసిస్తున్న విదురుని బీద కుటీరానికి వెళ్ళి అక్కడున్న విదురుని సతితో "ఆకలేస్తున్నది, ఏదైనా ఉంటే పెట్టమని" అడిగాడని వ్యాసుడు రాస్తాడు. కృష్ణ భక్తితో నిండిన విదురసతి, కృష్ణ దర్శనంతో వివశురాలై, అరటిపండు తొక్కలు వడ్డించినా, వాటిని పరమానందంతో కృష్ణుడు తిన్నాడంటారు.

"భక్తి కలుగుకూడు పట్టెడైనను చాలు" అనే సూత్రం అవతారపురుషులైన రాముడికీ కృష్ణుడికే  కాకుండా, మనమధ్య జీవించి కాలంచేసిన శ్రీరామకృష్ణ, శ్రీ రమణుని వంటి భగవద్భక్తులకు కూడా వర్తిస్తుంది.

ఒకనాటి మధ్యాహ్నం రెండు గంటలవేళ ఎందరో భక్తులు తెచ్చి ఇచ్చిన భక్ష్యాలు భోజ్యాలు శ్రీ అరుణాచల రమణునితో బాటు ఆశ్రమ వాసులందరికీ వడ్డించడానికి సన్నాహాలు జరుగుతున్న సమయంలో, ఒక వృద్ధురాలు మఱ్ఱి ఆకు దొన్నెలో రెండు మూడు దోసెలు పెట్టుకొని వచ్చి, స్వతంత్రంగా రమణుని సమీపించి, "ఇదుగో ఈ దోసెలు తిను స్వామీ. వేరే ఏమీ తెచ్చేందుకు లేకపోయింది. ఏంచేయను?" అంటూ

ఆ దొన్నె ఆయనకు అందించబోయిన విషయం వివరిస్తారు శ్రీమతి సూరి నాగమ్మ తన గ్రంథంలో.

రమణుని అనుసరించి ఉన్నవారు, "అక్కడ పెట్టవమ్మా" అని ఆవిణ్ణి నివారింప జూశారు. ఆవిడకు కోపం వచ్చింది. "ఉండండయ్యా మీరు, మహా చెప్పవచ్చారు. నిన్నగాక మొన్న వచ్చిన వారు మీరు; మీకేం తెలుసును? ముందు ఈ సామికి ఇక్కడ తిన్నె కట్టించి పెట్టింది నేను కాదా? నన్నేమో దగ్గరకు పోరాదంటారు. చాలు చాలును" అంటూ గద్దించింది.

అక్కడున్న వారంతా విస్తుపోయారు. రమణులు మాత్రం ఆవిడ చేతిలోని దొన్నె ఆప్యాయంగా తీసికొని "అవ్వా, వాళ్లు తెలియని పిల్లలు. ఏమీ అనుకోకు. ఈ దోసెలు ఏ పిండితో చేశావ్? అని కుశల ప్రశ్నలడుగుతూ, "ఆ భక్ష్యాలన్నీ అందరికీ పంచిపెట్టి మీరూ తినండయ్యా. నేను ఈ దోసెలు తింటాను" అని చెప్పి, సరిగా కాలీ కాలని ఆ దోసెలు అమృతతుల్యంగా తినసాగారు. ఆ ముదుసలి ఆనందానికి మేర లేదు.

రమణులకు ఎవరి మనసునూ నొప్పించే అలవాటు లేదు. అందుకని దోసెలు తింటూ తింటూ "ఆ భక్ష్యాలన్నీ ఇటు తెండి" అని తెప్పించి, వాటిన్నిటి నుండీ రవంత తుంచుకొని, "ఊ, నాకిక చాలును. నావంతు కూడా ఆ అవ్వకిచ్చి పంపండి. నాకు ఈ దోసెలు చాలును." అని తన వంతు పిండి వంటలు కూడా ఆ వృద్ధురాలికిచ్చి పంపించారు.

భక్తితో, సంపూర్ణ ప్రేమతో, పెట్టిన ఏ కాస్తయినా, అది ఏదయినా, తిన్న వారికీ పెట్టిన వారికీ, ఇరువురికీ కూడా గొప్ప ఆత్మ సంతృప్తినిస్తుంది. నిజమైన ఆత్మ సంతృప్తి నిచ్చే ఏ కార్యంలోనైనా పరమాత్మ తొంగిచూస్తూనే ఉంటాడు.

# స్పష్టమైన చూపు

**'త్యా**గ'మనే పదం మహా పురుషులకు వర్తించదు. ఒక వస్తువుపై మమకార ముండి దానిని వదలలేక, వదలలేక, ఎలాగో వదిలేస్తే, దానికి త్యాగమని పేరు పెట్టవచ్చు. అంటే మనకు ఏ ఉల్లిపాయ మీదనో ఉర్లగడ్డ మీదనో అమిత ఇష్టముండి, ఏ గయలోనో దానిని ఇక ముట్టనని శపథం చేసి వదిలేస్తే, అది త్యాగంగా కనిపించవచ్చు. దాని గురించి మనం ఘనంగా నలుగురికి చెప్పుకుంటూ తిరగవచ్చు.

భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో 'ఆలోచనా పూర్వకంగా' చేసిన అనేక మంది 'త్యాగాలు' ఈ కోవలోకే వస్తాయి. ఏదో ఒక ఊపులో, ఓ మానసిక ఉద్రేకంలో, పెల్లుబికిన ఉత్సాహంలో ఒక ఉద్యోగానికి రాజీనామా చేయడమో, జైలుకు పోవడమో, ఊరేగింపులో పాల్గొంటూ లాఠీ దెబ్బలకు గురికావడమో మరేదో సంభవించేది. క్షణికోద్రేకంలో ఏమైనా జరిగి ఉండవచ్చు. కానీ ఆ తర్వాత పరిణామాలు జూచినప్పుడు, మనిషి మనస్సు మారిపోవడం కద్దు. అప్పుడు ఆ 'త్యాగ'మనే దానిని ఏదో విధంగా సొమ్ముచేసుకోవాలనే బలీయమైన కాంక్ష బయలుదేరుతుంది.

ఎవరో కొందరు దేశాన్ని గాఢంగా ప్రేమించిన అసలు సిసలైన దేశభక్తుల్ని మినహాయిస్తే మిగతావారందరిలోనూ ఈ స్వార్థం ప్రకటితమవడం గమనిస్తూనే ఉండే వాళ్ళం. నిజమైన దేశభక్తుల నోటివెంట 'త్యాగ'మనే మాట వినిపించేదికాదు. మహా పురుషులకు విషయం తేట తెల్లంగా విశదంగా కనిపించినట్లే, నిజమైన దేశభక్తులకు కూడా దేశ దురవస్థ విశదంగా 'కనిపించేది'. తానూ, తన మనసూ, తన మేలును గురించి ఆలోచన స్థానే ఎట్ట ఎదుటనున్న తన దేశస్థుల బానిసస్థితి ప్రస్ఫుటంగా కనిపించేది. పరిస్థితి అంత స్పష్టంగా కనిపించినప్పుడు అతడి కర్తవ్యమేమిటో కూడా అంత బాగానూ కనిపించేది. ఇది ఏ ఆదర్శాన్ని, అంటే ఏ ఆలోచనా సరళిని అనుస రించినది కాదు. ఎట్ట ఎదుట ఉన్న పరిస్థితే ఈ ప్రాణిని ఒక విధమైన చర్యకు పురి కొల్పుతున్నది. ఈ చర్యకు ఇతడు నిమిత్తమాత్రమైన కర్త అవుతున్నాడు. ఆలోచనా

రహితమైన, సహజంగా జనించిన ఈ చర్యను ఇవతలనుంచున్న మనం 'త్యాగ'మని వర్ణించవచ్చు కానీ అతడు దీనిని త్యాగంగా భావించే వ్యవధానమేది? అలా అనుకునే లోగానే ఆ చర్య జరిగిపోయి ఉంటుంది.

పులిని చూచి నక్క వాతలు పెట్టుకున్నట్లు, ఆ చర్య ఫలితంగా ఆ మనిషికి దక్కిన కీర్తి ప్రతిష్టలను చూచి, మరొక వ్యక్తి ఆలోచనా పూర్వకంగా ఆ చర్యను అనుకరించవచ్చు. సంఘానికి కళ్లు అంత బాగా కనిపించవు కాబట్టి అసలు సరుకునూ, ఈ నకిలీ సరుకునూ సమానంగానే ఆదరించవచ్చు. ఆ మాటకొస్తే, అసలు సరుకు తన విషయం తాను ప్రకటించుకోదు కాబట్టి, అతిగా ప్రకటించుకునే ఈ నకిలీ సరుకుకే మరింత ప్రచారం లభించవచ్చు.

మనకు అనేక వస్తువుల మీద వ్యామోహం అధికం కాబట్టే, వాటిని వదిలేసిన వారిని చూచి ఎంతో త్యాగం చేశారని కీర్తిస్తాం. మన దృష్టికి అవి త్యాగంగా కనిపించడంలో ఆశ్చర్యంలేదు. కానీ ఎదుటనున్న దృశ్యాన్ని మోహరహితంగా స్పష్టంగా ఉన్నది ఉన్నట్లు చూచే కళ్ళున్న వారికి 'కర్తవ్యం' కనిపిస్తుంది కానీ, 'త్యాగం' కనిపించదు. 'తాను' ఈ పనిచేస్తున్నాననే ఆలోచన ప్రవేశించకముందే కర్తవ్య నిర్వహణ పూర్తయిపోతుంది.

అలా బ్రతికిన పుణ్య పురుషులెందరో ఉన్నారు. వారిలో ఒకరైన శ్రీ అరుణాచల రమణులు బ్రతికిన తీరు వివరిస్తాను. విషయం చిన్నదిగా కనిపించినా, ఆహారం స్వీకరించేప్పుడు ఆయన ఎలా వ్యవహరించేవారో గమనించండి. ఆశ్రమంలో అందరికీ వడ్డించడానికని ఒకావిడ పూరీలు వేయించింది. పూరీలన్నీ నూనెలో వేయించి, కొన్ని పూరీలు మాత్రం ప్రత్యేకంగా నేయిలో వేయించింది. అలా నేతిలో వేయించిన వాటిని పూరీల దొంతరపై భాగాన ఉంచుకొని, సద్దు చేయకుండా వాటిని రమణునికి వడ్డించి, మిగతావి అక్కడున్న వారందరికీ వడ్డించాలని ఆవిడ ఉద్దేశం. వడ్డన పూర్తయిన తర్వాత శ్రీరమణులు ఆవిణ్ణి విడిగా పిల్చి, "లక్ష్మీ ఈ పని మళ్ళీ చేయకు. ఇలా గనక మనిషి మనిషికీ తేడా చేశావంటే, నువు వండిన ఏ పదార్థమూ ఇక ముట్టను" అని ఖండితంగా తనతో చెప్పేశారని తర్వాత ఆవిడే నలుగురికి చెప్పుకున్నది.

అసలు విషయం ఆయనకెలా తెలిసిందో అంతుబట్టక ఆవిడ ఆశ్చర్యపోయింది కూడాను. రమణుడు ఈ విషయం ఎలా గ్రహించాడు అనే విషయం అలా వదిలేసి, మనమిందులో చూడవలసింది ఏమిటంటే నలుగురికీ వడ్డించిందే తనకూ వడ్డించాలనే రమణుని పట్టుదల. మామిడి తొనలు వడ్డించే సమయంలో కూడా, తనకు ప్రత్యేకంగా పెద్దవి వడ్డిస్తే అలా చేయవద్దని అప్పటికప్పుడే హెచ్చరించేవాడు.

జీవితమంతా అతికొద్ది బట్టతో, నలుగురూ తినే సామాన్యమైన తిండితో, కొద్ది పాటి చోటులో పదిమంది మధ్యా శయనిస్తూ గడిపాడు. ఎవరు ఏ ఖరీదైన బహుమానం ఇవ్వజూపినా ఏదో విధంగా, వారి మనసు నొవ్వకుండానే మర్యాదపూర్వకంగా దానిని వదిలించుకునేవాడు. ఆఖరికి తన ఆరోగ్యం కోసం విలువైన ఆయుర్వేద ఔషధాలు ఇద్దామని ఎవరైనా ప్రయత్నించినా, "ఇది అందరూ కొనుక్కోగలిగిందేనా? కానప్పుడు నాకు మాత్రం ఎందుకు?" అని దానిని తీసుకునేవాడు కాదు.

మధ్యాహ్న భోజనానంతరం, రోజు 12 గంటల వేళ రమణుడు పల్లకొత్తుకు నడిచి వెళ్లి ఒకటిన్నర గంటలలోగా తిరిగివచ్చేవాడు. ఇసకతో నిండిన ఆదోవ అంతా మిట్ట మధ్యాహ్నపు ఎండకు కాలిపోతుండేది. పాదరక్షలు లేకుండా మొదట్నించీ ఉత్త కాళ్ళతోనే నడవడం అలవాటైన రమణుడు ఎండైనా వానైనా అలా నడిచి వెళ్ళివస్తూనే ఉండేవాడు. తాను మెల్లిగా నడుస్తూ కూడా తనతో వచ్చే అనుచరుడితో మాత్రం "పరుగెత్తి వెళ్ళి ఆ చెట్టునీడన నుంచో, భుజంమీది వస్త్రం తీసి పాదాలకింద వేసుకొని కాసేపు అలాగే నిలబడు," అని అనుచరుడి బాధను గురించి ఆదుర్దా ప్రకటించే వాడే కానీ, తాను మాత్రం అలవాటు ప్రకారం నెమ్మదిగా, ఒడుదుడుకులు లేకుండా తన పాదయాత్రను సాగించేవాడు. ప్రతి జీవియెడలా అతడి హృదయం అంత మృదువై పోయింది.

రమణుడి జీవితం మన కంటికి 'త్యాగ'మయంగా కనిపించవచ్చు. కానీ రమణుడి దృష్టిలో తనలో నుండి పుట్టుకు వచ్చింది 'త్యాగం' కాదు; అభేద భావం, స్పష్టమైన చూపులో నుండి జనించిన మహాకరుణ.

# సింప్లిసిటీ

'**సిం**ప్లిసిటీ'కి తెనుగు పదాలు లేవని కాదు కానీ, నిఘంటువుల్లో ఇచ్చిన పదాలు నాకెందుకో అంతగా నచ్చలేదు. వాటిలో సాధారణత్వం, సామాన్యత్వం అనే పదాలు ఉన్న మాట నిజమే; అయితే ఈ సింప్లిసిటీ కలిగున్నవాడు అసాధారణంగానూ, అసామాన్యంగానూ కనిపిస్తాడు. ఇతడిలో 'అమాయకత్వమూ, వెర్రిబాగులతనమూ, బేలతనమూ, లోక విలువలను తిరస్కరించే మూఢత్వమూ' మొదలైన నిఘంటు లక్షణాలున్నట్లు కనిపించినా, ఇతడి మాటే మిగతా వారి మాటకన్నా తెలివైనదీ, శ్రేయో దాయకమైనదీ అనే విషయం మెల్లమెల్లగా మనకు తెలియ నారంభిస్తుంది. మనం చెప్పిన మాట, ఇతడు పిచ్చిగా నమ్మినా నమ్మవచ్చు; ఆ విధంగా ఇతణ్ణి మోసగించడం సులభమే అవచ్చు. కానీ ఏదో శక్తి చివరకు మనల్నే ముంచవచ్చు. ఇతడు నిష్కపటి; అందుకు సందేహంలేదు. "కానీ లోకంలో బ్రతకాలంటే కాస్త లౌక్యం కూడా ఉండాలండీ, ఇంత మరీ ఉన్నదున్నట్లు అనేయడం అంత మంచిది కాదు సుమండీ" అంటూ అతణ్ణి విమర్శిస్తాం. అతడు స్పష్టంగా పలికే పలుకు అనేక సందర్భాల్లో మనకు నిష్ఠూరంగా వినిపిస్తుంది. అతడి వాక్కు అమిత సరళంగా ఉంటుంది కాబట్టి, పండితా లంకారాలు, సమాసాలు ఆ మాటల్లో కానరావు. మరి ఇలాంటి మనిషిని మీరు ఆదరిస్తారా లేదా అనే విసయం, మీమీ దృక్పథాల ననుసరించి వుంటుంది.

మొత్తానికి లోకం కంటికి నిరుపయోగంగా, హాస్యాస్పందంగా, వ్యర్థంగా కనిపించే కొన్ని గుణాలు, మరొక కంటికి అత్యున్నతమైనవి గానూ, అక్కడ దర్శనమిచ్చే నిరాడంబ రత్వం ఆదర్శప్రాయంగానూ కనిపించవచ్చు. కానీ ఈ నిరాడంబరత్వం, అనాలోచితంగా, సహజంగా, సరళమైన మనస్సు నుండి జనించాలి కానీ, ఆలోచనా పూర్వకంగా అవలంబిస్తే ప్రయోజనం శూన్యం. ఆ మధ్య పదేళ్ళ క్రిందట కొత్తగా రాజకీయాల్లోకి కాలుపెట్టిన ఓ నాయకుడు, వీధి అంచుల్లో నిలబడి, స్నానమాచరించడం, పత్రికల వారి చేత ఫోటోలు తీయించుకొని ప్రచురింపచేసుకోడం, మొదలైన వాటిని ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు.

సింప్లిసిటీని దర్శించాలని మీకనిపిస్తే, నిజమైన 'ప్రేమికుడు భక్తుడు' కోసం వెతకండి. మీ అదృష్టం బాగుండి అలాంటివాడు తారసిల్లితే, వాడి వేషం ఎలాంటిదైనా వాడి మనసు సరళంగా, మాట స్పష్టంగా ఉందని కనుగొంటారు. అతడి మాటకు డొంక తిరుగుడు అర్థాలు వుండవు. కాకపోతే మీకు అర్థమయిన దానికన్నా, ఆ మాటల లోతుల్లో మరింత హెచ్చు అర్థముండవచ్చు. మీకు ఈ జీవితం అర్థమయిన కొద్దీ, అతడి మాటల్లో కొత్త లోతుల్ని కనుగొంటారు. ఆ మనిషి జీవిత విధానం అతి సరళంగా కనిపించినప్పుడు ఆశ్చర్యపడకండి. అతడెవరినీ ఇంప్రెస్ చేయడానికి చేసే పనులు కావవి.

ఫ్రాన్స్ దేశంలో పరమ సాధువైన జాన్ వియన్నీ అనే ఒక క్రిస్టియన్ మత గురువు తాను తీసుకునే కొద్దిపాటి ఆహారం ఒక ప్లేటులో పెట్టుకొని ఎక్కడో ఒకచోట నుంచొని తినేసేవాడు. అక్కడి నుండి మరో ఇంటికి త్వరితంగా వెళ్ళాల్సి వుంటే, చేతి లోని ప్లేటును అలాగే పట్టుకొని భిక్షుకుడిలాగా బజారు వెంట నడుచుకుంటూ వెళ్లే వాడు. ఈ మత గురువు ప్రశస్తి అనేక ప్రాంతాలకు పాకినందువల్ల, ఫ్రాన్సులోని మరో ప్రాంతం నుండి ఇతణ్ణి దర్శించుకోడానికి ఒక చర్చి ఫాదర్ ఇతడుండే ఊరికి వచ్చాడు. ఆ ఫాదర్ వచ్చిన సమయానికి ఈ సాధు పురుషుడు ఆహారం ప్లేటుతో బజారు వెంబడి పడిపోతున్నాడు.

"అందరూ చెప్పుకునే ఫలాని సాధు పురుషులు మీరేనా?" అని అడిగాడు.

"అవును. నేనే ఆ పేదవాణ్ణి" అన్నాడు ఆ మహానుభావుడు. వచ్చినవాడు మరేమీ మాట్లాడకుండా వెనక్కు తిరిగాడు. "నేను ఎంతో గంభీరమైన వ్యక్తిని, ఎన్నో ఉదాత్త లక్షణాలు ఉట్టిపడే ముఖారవిందాన్ని చూడనున్నానని ఆశించాను. కానీ నా ఊహాచిత్రానికి , నే చూచిన వ్యక్తికీ ఏమీ సంబంధంలేదు. ఈ పెద్దమనిషికి తగిన అంగ సౌష్ఠవం కానీ, హుందాతనం గానీ కనిపించవు. మట్టూ మర్యాదా లేకుండా బజార్న పడి అలా తింటూ వెళ్తాడేమిటి? ఇదంతా ఏదో పెద్ద దగా వ్యవహారంగా కనిపిస్తున్నది" అని మరెవరితోనో చెప్పుకొని ఆ ఊరు వదలి వెళ్ళిపోయాడు. ఇలా అనుకుంటూ వెళ్లాడని ఎవరో వచ్చి ఆ సాధువుకు చెప్పగా, అతడు లోలోన నవ్వుకున్నాడు.

ఈ క్రైస్తవ సాధు పురుషుడు, చర్చి ఫాదర్‌కి భిక్షుకుడిలాగా కనిపించడం వరకే జరిగింది. మన అరుణాచల రమణులైతే తన కాలంలో వీధుల వెంబడి తిరిగి సాక్షాత్తూ మాధాకవళ మెత్తుకుంటూ, ఏ గుమ్మంలో ఏ తల్లి ఇంత అన్నం ముద్ద పెడితే అది తిని కడుపు నింపుకునేవాడు. పైగా అలా అన్నం చేతిలో వేయించుకొని తిన్న రోజులను, ఆ తర్వాత ఆశ్రమంలో వున్న కాలంలో తల్చుకొని ఎంతో సంతోషిస్తుండేవాడు.

సింప్లిసిటీకి మరో ముఖ్య చిహ్నం, మనిషి తన పేరు ప్రతిష్ఠా తల్చుకోకపోవడం. అసలే తెలియకపోవడం అనుకోవద్దు; వాటిని తరచూ తలుచుకోడం, నెమరు వేయడం వేరు. విరూపాక్ష గుహకు ముందున్న వసారాలో ఒక అరుగు గనక కడితే, వచ్చేపోయే వారు కూర్చునేందుకు అనుకూలంగా ఉంటుందని ఒకసారి రమణునితోబాటు మరి కొందరు అనుకోవడం జరిగింది. సరేనని, రమణుడు స్వయంగా రాళ్ళు పెట్టి మట్టి అడుసుతో తాను అరుగు కట్టనారంభించాడు.

రాళ్ళు పేర్చి కాళ్ళతో మన్ను తొక్కి అడుసుతో అరుగువేస్తూ వున్నప్పుడు, ఎవరో ఓ కొత్త వ్యక్తి అక్కడికి వచ్చాడు. “స్వామి ఎక్కడ?” అని అడుసు వేస్తున్న రమణుణ్ణే అడిగాడు. ఆ సమయానికి అక్కడ రమణుడు తప్పితే మరెవ్వరూ లేరు. అందువల్ల రమణుడే బదులివ్వాల్సి వచ్చింది. ఇక శ్రీమతి సూరి నాగమ్మగారి పుస్తకంలో ఈ ఉదంతం వివరాలు, రమణుడి మాటల్లోనే చదవండి :

“స్వామియా? ఇప్పుడే ఎక్కడికోవెళ్ళారు” అన్నాను. “ఎప్పుడు వస్తారని” వారంటే, “ఏమో”నన్నాను. “ఎంతసేపవునో ఏమో?”నని వారు కొండ దిగిపోతూ వుంటే, ఎచ్చమ్మ ఎదురై విషయం అడిగి తెలుసుకొని “స్వామిని నే చూపుతాను రండి” అని వెంటబెట్టుకు వచ్చింది. ఈ లోపల నేను స్నానంచేసి వచ్చి కూర్చున్నాను. ఎచ్చమ్మ అన్నపు గిన్నె లోపలపెట్టి నాకు నమస్కరించి లేచి, ఆ వచ్చిన వారితో “అదుగో, వారే స్వామి” అన్నది. పాపం వారు తెల్లబోయి నమస్కరించి, “స్వామివారు వీరేనా అమ్మా? ఇంతకు ముందు నేను వచ్చినప్పుడు అరుగు కడుతున్నారు. ఎవరో ననుకొని ‘స్వామి ఎక్కడ?’ అని అడిగాను. ఎక్కడికో వెళ్ళారని సెలవిచ్చారు. నిజమేననుకొని వెనక్కు వచ్చానమ్మా” అన్నారు. “అదేమి స్వామీ అట్లా మాయమాటలు చెప్పి పంపారు పాపం” అని ఎచ్చమ్మ

నాతో జగడం పెట్టింది. "ఓహో, సరిపోయింది. నేనే స్వామినని మెడలో బోర్డు కట్టుకునేదా ఏమి?" అన్నాను నేను. అదొక తమాషా" అని చెప్పారు శ్రీ రమణులు.

తానొక మానవుణ్ణని తప్పితే మరేదీ గుర్తుంచుకోని రమణుణ్ణి, సింప్లిసిటీకి మారు పేరుగా పరిగణించవచ్చు.

## EYE : I

'భగవాన్, సృష్టి ప్రయోజనమేమి?' అని డాక్టర్ సయ్యద్ ప్రశ్న ఇంగ్లీష్‌లో వేసెను.

సాధారణంగా శ్రీ భగవానులు తన ప్రత్యుత్తరములు అరవములోగానీ మలయాళములోగానీ చెప్పి వాటిని తర్జుమా చేయిస్తారు. కానీ ఈ మారు శ్రీ భగవానులు ఇంగ్లీష్‌లోనే భాషించిరి.

"Can the Eye see itself? (కన్ను తనను తాను చూడగలదా?) అని శ్రీ భగవానులు బదులు ప్రశ్నవేసిరి.

దానికి డాక్టర్ సయ్యద్ 'చూడలేదు. అది ఇతరమునంతటిని చూడగలదు; ఒక్క తనను తప్ప' అని జవాబిచ్చిరి.

"మరి అది తనను తాను చూడగోరితే?" అని శ్రీ భగవానులు మరల అడిగిరి. డాక్టర్ సయ్యద్ ఒక్క నిమిషమాలోచించి ఇట్లు పలికెను.

"అది అద్దములో తన ప్రతిబింబమును మాత్రము చూడగలదు"

ఈ ప్రత్యుత్తరమును పట్టుకొని శ్రీ భగవానులిట్లు వ్యాఖ్యానించిరి. "సరి. అట్లే సృష్టి; 'ఐ' తనను జూచుకొనుటకు అద్దము."

ఇది విని నేను "శ్రీ భగవానులు ఉద్దేశించినది Eye యా, లేక I యా?" అని అడిగితిని.

శ్రీ భగవానులు "ఉపమానమునకు EYE పరమార్థమునకు I గ్రహించవచ్చును" అని సెలవిచ్చిరి.

*ప్రొఫెసర్ గుఱ్ఱం సుబ్బరామయ్యగారు వ్రాసిన*
*'రమణ స్మరణామృతము" నుండి*

# గురువులు పలు తెఱగులు

గురువు లేనిది ఆధ్యాత్మిక విద్య నేర్వలేమనీ, తమంతట తాము అడుగు ముందుకు వేయలేమనీ, భారతీయ మనస్తత్వంలో ఎంత గాఢంగా నాటుకుపోయిందటే "నన్ను గురువుగా భావించకండి మొర్రో" అనిన మహానుభావుల్ని కూడా "నువ్వు గురువువే, కాదని ఎందుకంటావ్?" అని వారిని కూడా బాధించడం జరుగుతుండేది.

గురు శిష్య సంప్రదాయం పేరిట నేడు జరుగుతున్న పరస్పర వంచన, దోపిడీని గమనించిన కొందరు మహా పురుషులు ఆ పేరును, ఆ భావాన్ని పూర్తిగా తిరస్కరించారు. అయితే ఆ కారణంచేత అలాంటి పుణ్య పురుషులు తమ వద్దకు వచ్చిన జిజ్ఞాసువులను నిరాదరణకు గురి చేశారని కానీ, మార్గాన్ని చూపించలేదని కానీ అనుకోకూడదు. సాధకుడు ఏ ఒక్కరిమీద ఆధారపడకుండా ఆప్తుడైన వాడు సూచించిన విషయాన్ని అర్థం చేసుకొని తనంతట తానే ముందుకు నడవాలని వారి ఉద్దేశం.

అద్వైత శిఖరాల నధిరోహించిన అరుణాచల రమణుడు 'గురు' పదాన్ని మృదువుగా పక్కకునెట్టి "అంతగా గురువే అవసరమనుకుంటే ఈ లోకమంతా నీ గురువుగా పరిగణించవయ్యా" అని అంటుండేవాడు. ఈ విషయం ఆయన ఎన్నిమార్లు చెప్పినా "అలా అనకండి. మీరు మా గురువులే" అని ఆయన శిష్యుల్లో కొందరు అడ్డం తగిలేవారు. శ్రీ జిడ్డు కృష్ణమూర్తిగారి వద్ద ఇలాంటి ఆటలు సాగేవి కాదు కాబట్టి, ఈ మొండివాదం ప్రయోగించేవారు కాదు. అరుణాచల రమణుల స్వభావం వేరు; ఆయన ఇలాంటి వారిని ఏమీ చేయలేక మౌనంగా ఊరుకునేవారు.

ఆర్థర్ ఆస్‌బోర్న్ రమణ బోధను ఎంతో శ్రద్ధాసక్తులతో ఆచరించడమే కాక ఆంగ్ల పాఠకులకు ఆ బోధల నందించిన వారిలో అగ్రగణ్యుడు. గురువు ఆవశ్యతకను గురించి భారతీయుల్లోనే కాక, సంప్రదాయాన్ని నమ్మిన కొందరు పాశ్చాత్యులలో కూడా ఈ విశ్వాసం ఎంత బలీయంగా ఉంటుందో చెప్పిన సందర్భం ఒకటున్నది.

"ఫ్రెంచి తత్త్వవేత్త రెనిగినాన్‌తో సహా మేము కొందరం సూదంటురాయి ఇనుప ముక్కలను ఆకర్షించినట్లు భగవాన్ రమణుని ఆకర్షణకు లోనై ఆయన చుట్టూ చేరాం.

మాలో డేవిడ్ మెక్‌లెవర్ అనే అతడు భగవాన్ రాసిన త్రిపుర రహస్యం, అద్వైత బోధ దీపిక అనే గ్రంథాలను ఆయన ఆజ్ఞానుసారం అనువదించిన వాడు కూడా. కానీ ఆ తర్వాత ఎందువలననో కాని త్రివేంద్రం వద్ద నివసిస్తున్న ఒక యోగిపైకి మా డేవిడ్ మనసు మళ్ళింది. ఆయన్ని తన గురువుగా స్వీకరించి ఆయన సన్నిధిలో స్థిర నివాస మేర్పరుచుకున్నాడు డేవిడ్.

నేనంటేనూ, నా భార్య అంటేనూ డేవిడ్‌కు చాలా అభిమానం. అందువల్ల తాను సేవించే గురువును మేమిద్దరమూ కూడా సేవించాలని అభిలషిస్తుండేవాడు. ఆత్మసాక్షాత్కారానికి సజీవ గురువు ఎంతైనా అవసరమనీ, భగవాన్ రమణులు తాను గురువని ఎన్నడూ ప్రకటించుకోలేదు కాబట్టి నేనూ, నా భార్య, శ్రీరమణుల్ని వదలి పెట్టి, మాబోంట్లను శిష్యులుగా స్వీకరించడానికి సిద్ధంగా ఉన్న ఈ త్రివేంద్రం గురువు వద్దకు వచ్చేయమని రాస్తుండేవాడు. ఈ విషయమై చాలా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. వీటన్నిటినీ ఎప్పటికప్పుడు నేను భగవాన్‌కు చూపిస్తుండేవాణ్ణి. భగవాన్ రమణులొక్కరే నా గురువని నా లేఖల్లో నేను తరచు ఉద్ఘాటిస్తూ ఉండడం, ఆ లేఖల్ని శ్రీరమణులు చూచి 'అవును' అన్నట్లుగా తల పంకించడం జరుగుతూనే వుండేది.

ఒకనాడు డేవిడ్ దగ్గర నుండి ఉత్తరం అమిత తీవ్రమైన హెచ్చరికతో వచ్చింది. రమణుల వారిని తక్షణమే విసర్జించి నేను వెంటనే త్రివేంద్రం రాకపోతే పరిణామాలు అనూహ్యంగా వుంటాయని వున్నది ఆ ఉత్తరంలో. నేనాందోళన చెందాను. సాయంత్రం శ్రీ రమణులతో సమావేశమైనప్పుడు ఆ ఉత్తరం చూపిద్దామనుకున్నాను.

ఆ మధ్యాహ్నం ఒంటరిగా తోటలో గొంతుక్కూచొని తలవంచుకొని కలుపు మొక్క లేరేస్తున్నాను. అకస్మాత్తుగా నా వెనుక 'ధం' అనే పెద్ద శబ్దం వినిపించింది. వెనుకనున్న వృక్షం మీది నుండి ఏదో జంతువు కిందికి దూకినట్లూ, నా మీదికి వెనుక నుండి వస్తున్నట్లు అనిపించింది. తృటిలో అది నా వీపుమీద ఎక్కి కూచున్నది. దాని వెనక కాళ్ళతో నా వీపుమీదుగా రొమ్మును చుట్టి పట్టుకొని వుండడం కనిపించింది. ఆ కాళ్ళనున్న రోమాలను బట్టి అది ఎలుగుబంటి అయివుంటుందని ఊహించాను. అదేమి విచిత్రమో గాని ఆ సమయంలో అది 'ఏమి' జంతువో తెలుసుకుందామని గాని. నాలో

భయం కలగడం కాని, కనీసం ఏమిటి ఈ దురవస్థ అని అనుకోడం గాని ఇవేవీ జరగలేదు. ఒక విధమైన వైరాగ్య భావం నన్నలముకున్నది. అందువల్లనే చలించలేదు; మొక్కలు ఏరేస్తూ ఉండిపోయాను.

నా నిర్లక్ష్యాన్ని గమనించిన ఆ జంతువు పరిమాణంలో పెరిగి పెద్దదవుతున్నట్లు గాను, తన బరువంతా నామీద మరింతగా మోపుతున్నట్లు గానూ అనిపించింది. ఆ బరువుకి ముందుకు వంగిపోతున్నాను. కానీ ఎందుకనో నాకు భయం మాత్రం కలగ లేదు. ఉన్నట్లుండి అది తన ముందు కాళ్ళతో నా గొంతును పట్టుకొని నొక్కనారంభించింది. నాకు ఊపిరి సలపడం కష్టమైంది. దాని పట్టు మరింత బిగియ జొచ్చింది. ఇంత జరుగుతున్నప్పటికీ నాలో భయం జనించకపోవడం, నా మనస్సు సంపూర్ణంగా స్వాధీనంలో ఉండడం ఆశ్చర్యకరమైన విషయమే. ఇక నాకు ఊపిరాడదనే స్థితి ఉదయించింది. అది దాని పట్టు వీడలేదు సరిగదా, మరింత బిగించ నారంభించింది. భయమైతే లేదు గానీ ఇక నా మరణం మాత్రం తథ్యమని నాకు తెలిసిపోయింది. అప్పుడు జరిగింది ఓ అద్భుతం.

మరణం తప్పదని నాకు తట్టిన సమయంలో “అరుణాచల శివ, అరుణాచల శివ” అనే శబ్దం నాలో వినిపించ నారంభించింది. ఆ శబ్దం చేస్తున్నది నేను కాదు; లోపలి నుండి మరెవరో ఆ పదాల నుచ్చరిస్తున్నట్లు తోచింది. ఆ జపం వేగం పుంజు కున్నది; తీవ్రతరమయింది. ఒక వంక మరణ సామీప్యం, మరొకవంక ఈ దైవజపం, ఒకదాని సరసన మరొకటి సంభవిస్తూ ఉండడం ఒక వింత ఆనందానుభూతి అనవచ్చు. ఈ జపం స్థాయి పెరిగినకొద్దీ, నా కంఠంమీది వత్తిడి తగ్గనారంభించింది. ఆ జంతువు పరిమాణం, దాని బరువు కూడా తగ్గనారంభించాయి. లోలోన ఈ అజపజపం ఆగకుండా దానంతట అది సాగిపోతూనే ఉన్నది. ఒక్కసారిగా ఆ జంతువు నా వీపు మీది నుండి దూకి చెట్టు వద్దకు పరిగెట్ట నారంభించినట్లు నాకు అనిపించింది. దాని అడుగుల సవ్వడి నాకు వినిపిస్తూనే ఉంది. చెట్టెక్కి అది అదృశ్యమయింది. నేను నా యథాపూర్వ స్థితికి తిరిగివచ్చాను. అప్పటికీ నాలోన ఈ స్తోత్రం అంతరాయం లేకుండా సాగుతూనే వుంది. లేచి నుంచొని ఆ జంతువుకై వెతుకులాడాను కానీ అది ఎక్కడా కనిపించ

లేదు. నాలో ఈ 'అరుణాచల శివ' అని వినిపిస్తున్న ఉచ్చాటన మాత్రం నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది.

మర్నాడు ఉదయం భగవాన్ వాహ్యాళి నుండి తిరిగి వస్తుండగా ఉత్తరం చూపించి జరిగినదంతా విన్నవించుకున్నాను. అంతా విని భగవాన్ చిరునవ్వుతో "వారు చేయగలిగిందంతా అంతే. అయినా అంతా సుఖాంతమే కదా" అంటూ నడిచి వెళ్ళిపోయారు. మా సహచరుడు డేవిడ్, అతడిచేత ఈ ఉత్తరం రాయించిన ఆ గురువు, ఇద్దరినీ ఉద్దేశించి 'వారు' అనే పదాన్ని భగవాన్ వాడినట్లు నాకనిపించింది.

రమణుల వంటి సద్గురువును ఆశ్రయించినప్పుడు, క్షుద్రదేవతోపాసన ద్వారా చేసే ఈ ప్రక్రియలు కూడా సాధకుడికి చివరకు మేలే చేస్తాయి. 'అరుణాచల శివ' అనే జపం సిద్ధించడానికి ఆఖరికి ఆ క్షుద్ర ప్రక్రియే మూల కారణమని చెప్పవచ్చు" అని ముగిస్తాడు ఆస్‌బోర్న్.

నిజంగా మీ మేలు కోరేవారు ఎవరూ కూడా తాము మీకన్న అధికులమైనట్లూ, తాము నేర్పేవారు, మీరు నేర్చేవారు అన్నట్లు మాట్లాడరు. కేవలం మీ శ్రేయస్సు కోరే మిత్రులవలె మెలగుతారు.

# అభేదభావం

హెచ్చు తగ్గులు లేనివాడు అరుణాచల రమణుడు; సృష్టిలో ఏ ఒక్కరినీ ఎక్కువగానూ తక్కువగానూ పరిగణించిన వాడు కాదు. జీవితాంతం అలాగే బ్రతికాడు. పండితుడని కానీ పామరుడని కానీ తేడా చేయలేదు. విదేశీయుడు స్వదేశీయుడు, హిందూ మతస్థుడు, ఇస్లాం మతస్థుడు అనే భేదాలు పాటించేవాడు కాదు. ఆయనకు కులభేదం, లింగ భేదం కూడా కనిపించేది కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన కేవలం మానవుడు, భేద భావమెరుగని మనిషి. సృష్టిలోని జీవరాశిలో ఎవరికి ఏ బాధ కల్గినా ఓర్వగలిగేవాడు కాదు. ఒకనాడు కొండమీది నుండి దిగివస్తూ, ఏదో ఒక ఉడతను ఓ కుక్క తరిమి పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు గమనించి, ఆ ఉడుత ప్రాణం రక్షించడానికి తన చేతి కర్రను విసిరేశాడు. కుక్క ప్రయత్నం విఫలమయింది. ఉడుత తన ప్రాణాన్ని రక్షించుకుని వెళ్ళిపోయింది. కానీ రమణుడు, కర్ర సహాయం లేని కారణం చేత పక్కకు ఒరిగి కిందపడి మెడవద్ద ఎముక విరగ్గొట్టుకున్నాడు.

పూజార్థమే అయినప్పటికీ, ఒక చెట్టు మొక్కనున్న పూవులన్నిటినీ కోసి, చెట్టున ఒక్క పువ్వు కూడా మిగల్చకుండా పూసెజ్జలో పోగేసుకుంటున్న ఒక ఆశ్రమ భక్తురాలిని వారిస్తూ, "ఈ పూలన్నీ పెట్టి పూజిస్తే కానీ దేవుడు ఒప్పుకోనన్నాడా?" అని సున్నితంగా వేళాకోళం చేసి, చెట్టును ఎప్పుడూ అలా దిగదుడిచినట్లు ఉన్న పూలన్నీ కోసి అంద వికారంగా చేయవద్దన్నాడు. సున్నితత్వం లోపించిన దైవ పూజైనా ఆయనకు సమ్మతం కాదు. దేవుడూ, ఆ దేవుడు సృష్టించిన పుష్పమూ రెండూ కూడా రమణుడి దృష్టిలో సమానమే. అంటే ఆ మహాశక్తిని అన్నిచోట్లా దర్శిస్తుండేవాడన్న మాట.

ఒకసారి ఆశ్రమంలో భోజన సమయం సమీపించింది. రమణుణ్ణి రమ్మనమని కబురంపించి, మిగతా వారంతా భోజనానికి ఆసీనులయారు. మోకాళ్ళ నొప్పితో బాధపడుతున్న రమణుడికి బయలు దేరడం కాస్త ఆలస్యమయింది. తీరా రమణుడు తలుపుదాటి భోజనశాల లోకి వెళ్ళేలోగా, వీపుమీద కంబళీ వేసుకున్న పాలవాడు ఒకడు అటు వచ్చాడు. రమణుడు ఓ క్షణమాగి, "చిన్నప్పయ్య కదూ?" అని గుర్తు

పట్టాడు. “అవును స్వామీ, నేనే” అని సగౌరవంగా పలికాడు ఆ వ్యక్తి. “బాగున్నావా చిన్నప్పయ్యా? నన్ను చూడడానికి వచ్చావా? మంచిపని చేశావు. ఏమిటా కుండలో చిన్నప్పయ్యా? గంజి ఏమన్నా తెచ్చావా?” అని అడిగాడు రమణుడు ఆప్యాయంగా. “అవునయ్యా గంజే” అన్నాడు అతడు, కాస్త సిగ్గుపడుతూ. “అయితే ఇంకేం? ఇట్లా పొయ్యి మరి” అంటూ రమణుడు చేతికర్రను పక్కకు పడేసి, రెండు చేతులతోనూ దోసిలొగ్గి ముందుకు వంగాడు. పాలవాడు దోసెట్లో గంజిపోస్తూ వుండడం, రమణుడు నిస్సంకోచంగా తాగడం, స్వామి తన గంజిని తాగుతున్నాడని చిన్నప్పయ్య ముఖం మీది సంతోషం, అమృతమే తాగుతున్నానన్నట్లుగా స్వామి ముఖం మీది ఆనందం చూచిన ఆశ్రమవాసులకు మాత్రం ఈ వ్యవహారం వింతగానూ విడ్డూరంగానూ కనిపించింది. అక్కడ పంక్తి భోజనానికై ఎదురు చూస్తున్న వారి ఆకలినీ, ఒకింత ఆగ్రహాన్ని, పట్టించుకోకుండా స్వామి ఇట్లా చేయడం, ఆయన్ని మళ్ళీ పిలవడానికి వచ్చిన వారికి ఏమాత్రం నచ్చలేదు. “అదేమిటి స్వామీ, అక్కడ అందరు ఎదరుచూస్తుంటే, మీరిక్కడ ఈ పాలవాడు పోస్తున్న గంజి తాగుతూ –” అని తమ చిరాకును కొద్దిగా ప్రదర్శించారు. ఓ మాదిరి చిరుకోపం రమణుడు కూడా ప్రదర్శించగలిగేవాడు, : “ఏమి ఎందుకు తాగకూడదు? నేను మీ కోసమే ఉన్నానా? నేనొకప్పుడు కొండమీద ఉండే రోజుల్లో మీరంతా వచ్చి నన్ను పోషించారా? అప్పుడు నేనెవరికీ అవసరమని పించలేదే? ఈ గొల్లవాళ్ళే ఆ రోజుల్లో తమ గంజిలో నాకింత పోస్తుండేవారు.” అంటూ భోజనశాల వద్దకు బయలుదేరాడు.

ఒక విదేశీ వనిత, వయసులో బాగా పెద్దది, స్థూలకాయురాలు కూడాను. ఆవిడ రమణుడి సమక్షంలో కాళ్లు ముందుకు చాపి కూచొని వుంటే, ఆశ్రమంలోని శిష్యులు ఆవిణ్ణి స్వామివారి ముందు కాళ్లు ముడుచుకు కూచోవాలని సౌంజ్ఞ చేసి వెళ్ళారు. కానీ వారటు వెళ్ళగానే, ఆవిడ తనకుండే బాధ కారణాన మళ్ళీ కాళ్ళు జాపుకున్నది. శిష్యులు ఆవిణ్ణి మళ్లీ హెచ్చరించడానికి ప్రయత్నించబోగా, ఇదంతా గమనిస్తున్న రమణుడు, “ఊరుకోండి ఆవిణ్ణి అలాగే కూచోనివ్వండి. పాశ్చాత్యులకు కాళ్లు ముడుచుకోడం ఏమిటో తెలీదు. దానికి తోడు ఆవిడ పెద్దదైపోయింది. కాళ్లెలా వొంగుతై? ఈ లెక్కన మోకాళ్ళ నొప్పివున్న నేను కూడా కాళ్ళు ముడుచుకు కూచో మంటారా ఏమిటి?” అనేశాడు అక్కడి శిష్యులతో.

ఇట్లా ఎన్నెన్నో సంఘటనలు, కానీ అందర్నీ సమాన దృష్టితో చూచిన ఈ మహానుభావుణ్ణి గురించి ఆయన శిష్యులు ఒకసారి ఎలా పొరబడ్డారో చూడండి. కావ్యకంఠ గణపతి ముని అంటే రమణుడికి ఎంతో ఇష్టం. తాను ఏదైనా రాస్తే అది గణపతి మునికి చూడమని ఇచ్చేవాడు; గణపతి ముని పాండిత్యం, విజ్ఞానం మీద రమణుడికి  అంత గురివుండేది. రమణుడి మైత్రీభావం, గణపతిశాస్త్రి యెడల ఆయన కుండే గౌరవాభిమానాలు అటుంచి, స్వతహాగా గణపతి ముని ఆనాటి భారతదేశంలో మహా విద్వాంసుడుగా పరిగణన పొందినవాడు, కావ్యకంఠబిరుదాంకితుడు. రమణుణ్ణి, అతడి ఆప్తమిత్రుడైన గణపతి మునిని కలిపి ఒక ఫోటో తీస్తే బాగుంటుందని ఒక భక్తుడికి గాఢంగా కోరిక కలిగింది. రమణుడు అంగీకరించిన అనంతరం, బావి వద్ద ఒక జంపకాణ పరిచారు. రమణుడు ఆసీనుడవడానికి దానిమీద ఒక సోఫా వేశారు. గణపతిశాస్త్రి రమణుడి పాదాలవద్ద కూచున్నాడు. కానీ రమణుడు అందుకు అంగీక రించకుండా, గణపతిశాస్త్రిని సోఫాలో తన సరసన కూచోమన్నాడు, శాస్త్రిని బలవంతంగా సోఫా మీద తన పక్కనే కూచుండ పెట్టుకున్నాడు.

ఫోటో తీసిన అనంతరం ఫోటో కాపీలు కొందరి భక్తులకివ్వడం జరిగింది. ఆశ్రమాధికారులు, ఈ ఫోటో సంగతి తెలిసి మండిపడ్డారు. గురువు సరసనే కూచొని ఆధ్యాత్మికతలో ఆయనకు సమానుణ్ణి అన్నట్లుగా ఎవరైనా ఫోటో తీయించుకోడం వారికి మహాపరాధంగా కనిపించింది. ఫిల్మ్ నెగెటివ్, ఫోటో ప్రింటులు అన్నీ తమ కిచ్చి వేయమని హుకుం జారీ చేశారు. కానీ ఆ ఫోటో గ్రాఫర్ భక్తుడు అందుకు నిరాకరించాడు. అటు తర్వాత ఆ ఫోటో గ్రాఫర్ భక్తుడు బ్రతుకు చెడి, ఆత్మహత్య చేసుకున్నాడని ఆ వ్యాసంలో వ్రాసి ఉన్నది. రమణుడు, శాస్త్రిని తనతో ఎందుకు అట్లా కూచోబెట్టుకున్నాడో ఎవరికీ అర్థం కాలేదని మరో వాక్యమున్నది. అందరిలో ఉన్న బలహీనతలు వెలికి తీసుకురావడానికే రమణుడు ఆ పనిచేసి వుంటాడని మరో అర్థాన్ని వెలికితీశారు.

ఈ వ్యాఖ్యలన్నీ ఎంత అసందర్భమైనవో పాఠకులు గమనించే వుంటారు. గణపతి శాస్త్రి రమణుడి పాదాల వద్ద కూచున్నప్పటికీ, రమణుడు బలవంతంగా శాస్త్రిని పైకి లేవదీసి సోఫాలో కూచోబెట్టుకోడం రమణుడి తప్పందామా, లేక శాస్త్రి అలా కూచోడం

తప్పు అని తేలుద్దామా? రమణుడి అంగీకారంతో తీసిన ఆ ఫోటో నెగటివ్ తిరిగి ఇవ్వనని, ఆ ఫోటోగ్రాఫర్ భక్తుడంటే, అలా తిరస్కరించినందువల్లనే అతడు నాశన మయ్యాడని అనడం ఏమి సబబు?

రమణుడు మహనీయుడు. అలాంటి వాడికి గురువూ లేడు, శిష్యుడూ లేడు, పెద్దా లేదు, చిన్నా లేదు. ఉన్నదల్లా మహానుభవమే, భావభక్తే. విశ్వమానవుడిగా ఎదిగిన రమణుడు తన అనుంగు మిత్రుణ్ణి ఎక్కడ కూచోబెట్టుకుంటే మాత్రం అతడి కొచ్చిన కొదవేమిటి? అనాటి ఆశ్రమాధికారుల్లో ఈ అవగాహన లోపమే కనిపిస్తుంది కానీ రమణుడు, గణపతిశాస్త్రి, ఫోటోగ్రాఫర్ భక్తుడూ, ఈ ముగ్గురిలోనూ నాకే దోషమూ కనిపించడం లేదు.

## కర్తృత్వ భారం

రైలు బండిలో ప్రయాణం చేసేవాడు తన నెత్తిమీద బరువు దించుకోకపోతే అది అతని తప్పే అవుతుంది. అతడా బరువు దించివేసుకోడం అవసరం. అతనితోపాటు ఆ దించిన సరుకు కూడా తుదకు గమ్యం చేరి తీరుతుంది. అట్లే ఈ జగత్తులో మనం కర్తృత్వ భారం తలనిడుకోరాదు. జగన్నియంతపై ఆ భారం వదిలి కూర్చొనడం మంచిది.

# అజాత శత్రుత్వం

**శ**త్రువులు లేని మనిషంటూ ఉండడు. అవతార పురుషులైన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వంటి వారు కూడా తమ జీవిత కాలాల్లో అనేకమంది శత్రువులతో పోరాడి సంహరించ వలసి వచ్చింది. జీసస్ జీవితం పొడుగూతా, శత్రువులు అతణ్ణి వెన్నాడుతూనే ఉన్నారు. చిట్టచివరకు శిలువ మీదకెక్కించారు. మహమ్మదు తన జీవిత కాలంలో ఎందరో శత్రువులతో యుద్ధాలు చేశాడు.

పరమ శాంతమూర్తి అయిన బుద్ధుడికైనా ఈ మానవ శత్రుత్వం తప్పలేదు. గౌతమ బుద్ధుడి పేరు ప్రఖ్యాతులు పెరగడం, బౌద్ధ భిక్షువులకు ప్రజలు అనేక కానుక లందించడం, పూర్వాశ్రమంలో అత్యంత ధనికుడైన ఒక అనుచరుడు బుద్ధుడు నివసించ డానికి, విహరించడానికి అతి సుందరమైన ఉద్యానవనాన్ని క్రయంచేసి తన గురువుకు బహూకరించడం, ఇవన్నీ చూచిన ఇతర మత వర్గీయులు ఓర్వలేకపోయారు. ఇదే కాక బింబిసార మహారాజు తన ఆస్థాన వైద్యుడైన జీవకుణ్ణి, బుద్ధుడికి, అతడి శిష్యులకు వైద్యం చేయమని నియోగించడం, వారందరి అసూయను మరంత ప్రజ్వరిల్ల చేసింది. ఆ కారణం చేత బుద్ధుడి శీలం మీద బురద చల్లాలనే ఉద్దేశ్యంతో, భిన్న మతావలంబి అయిన చించ అనే సన్యాసిని చేత, బుద్ధుడు పరస్త్రీ సంగమానికి పూనుకున్నాడని సభాముఖంగా అభియోగం చేయించారు. ఆవిడ వేసిన ఈ అభాండం శుద్ధాబద్ధమని రుజువయిం తర్వాత, విధి వశాన ఆవిడ ఎన్నో ఇడుమలకు గురయింది. అంతటితో ఆగకుండా గౌతముడి వ్యతిరేకులు మరో మతానికి చెందిన సుందరి అనే వనిత చేత, బుద్ధుడి పడక గదిలో తానొక రాత్రి గడిపానని పదిమంది ముందూ చెప్పించారు. ఇది ప్రజలలో ప్రచారం అయిన తర్వాత, ముందు ముందు సుందరి తాను అబద్ధం చెప్పాననే విషయం బయట పెడుతుందేమోననే సంకోచంతో, ఒక తాగుబోతు ముఠా చేత ఆవిణ్ణి హత్య చేయించారు. ఇలాంటి దుష్కృత్యాలు చేయడంలో మానవ స్వభావం ఆనాటికీ ఈ నాటికీ ఒక లాగానే ఉందని గ్రహించవచ్చు.

వధించిన సుందరి శవాన్ని తీసుకెళ్ళి బుద్ధుడు నివసించే జటావన విహారం వద్ద పడేశారు. ఈ హత్య సందర్భంగా బుద్ధుడిపై చర్యగైకొనాల్సిందేనని రాజ్యా పాలకుల్ని

అభ్యర్థించారు. కాని సుందరిని చంపిన తాగుబోతులు, ఓ కల్లు దుకాణంలో కూచొని చిత్తుగా తాగేసిన తర్వాత వొళ్ళు తెలియని స్థితిలో, 'సుందరి చావుకు నువ్వు కారణమంటే నువ్వు కారణమని' పోట్లాడుకుంటుండగా, రాజ భటులు వచ్చి పట్టుకు పోవడం జరిగింది. రాజు సమక్షంలో సుందరిని తామే చంపినట్లు అంగీకరించడమే కాక, తమని ఎవరు ఈ పనికి నియోగించారో అది కూడా బయట పెట్టేశారు. రాజు, వారికీ వీరికీ కూడా మరణదండన విధించాడు. అప్పటికీ ఊరుకోకుండా, ఆ భిన్న మతస్థులు గౌతముణ్ణి పరిమార్చడానికి శ్రీగుప్త అనే వ్యక్తిచేత బుద్ధుడి ఆహారంలో విషం పెట్టించడానికి ప్రయత్నించి విఫలులయ్యారు; కరుణామయుడైన బుద్ధుడు శ్రీగుప్తుణ్ణి క్షమించాడు.

ఈ శతాబ్ది ప్రథమార్థంలో జీవించి తరించిన అరుణాచల రమణునికైనా శత్రువులు తప్పలేదు. కొత్తగా కొండమీదికి వచ్చి కూచున్న రమణుడి వద్దకు ఎక్కువ మంది వచ్చి పోతున్నారని, తన వద్దకు వచ్చేవారు తగ్గిపోతున్నారనే స్పర్థతో అదే కొండమీద నివసిస్తున్న మరో పాతస్వామి, రమణుణ్ణి చంపడానికి పైనుండి రాళ్లు దొర్లిస్తుండేవాడు. ఇదే విధంగా ఒకసారి అతడో పెద్ద బండరాయి కిందివైపుకు దొర్లించినప్పుడు అది దారిలో మరో పెద్ద రాయికి తగిలి రెండు ముక్కలై రమణుడు కూచున్న రెండువైపుల నుండి దూసుకొని, కొండకిందకొచ్చి పడ్డాయంటారు. అద్భుతాల సంగతి ఎలా ఉన్నా తనకన్నా ముందు వచ్చి కొండమీద నివాసమేర్పరచుకున్న ఈ 'స్వామి' చేతుల్లో రమణుడు చాలాసార్లు ప్రాణాపాయం తప్పించుకున్నాడు.

ఇంకో చదువుకున్న స్వామి తాను రమణుడికి గురువుగా ప్రకటించుకొని, అరుణాచల శిఖరంపైని రమణుడి నివాసం ముందు వరండాలో బైఠాయించి, రమణుణ్ణి పలు రకాలుగా వేధించాడు. శాంత స్వభావుడైన రమణుడు ఈ బాధనంతా అలాగే ఓర్చుకున్నాడు. రమణుడి శిష్యులు మాత్రం ఈ వరండా 'గురువు' ఆగడాలు సహించలేక, చివరకు బయటకు గెంటివేశారు.

శ్రీ జిడ్డు కృష్ణమూర్తి గారికి కూడా ఇంటా బయటా శత్రువులుండేవారు. ఈయన మీద హత్యాప్రయత్నాలు జరుగుతాయేమోనని శంకించి అతడి చిన్నతనంలో,

అనీబిసెంటు ఎన్నో కట్టుదిట్టాలు చేస్తూ ఉండేది. ప్రముఖ తియానఫిస్టులు కృష్ణమూర్తి తమ చెప్పుచేతల్లో ఉంటంలేదనే ఆగ్రహంతో “ఈ కృష్ణమూర్తిని దుష్టశక్తులు పట్టి పీడిస్తున్నై” అని ఆరోపించారు. కానీ కృష్ణమూర్తి ఈ ఆరోపణలను వేటినీ పట్టించుకోలేదు. దేనికీ తొణికేవాడు కాదు; బెణికేవాడు కాదు. తాను చేయదలచుకున్నదేదో – అనగా తాను జీవితాన్ని దర్శించిన తీరును వివరిస్తూ ముందుకు సాగుతుండేవాడు. కృష్ణమూర్తితో కలిసి జీవిస్తూ, ఆయన వ్రాతప్రతులను మొదట్లో సమర్థవంతంగా ఎడిట్‌చేసిన రాజ గోపాల్ అనే సహచరుడు, కృష్ణమూర్తి ఖ్యాతిని చూసి ఓర్వలేక అసూయకొద్దీ అనేక వివాదాలను సృష్టించి, కోర్టుకెక్కించి ఆయన్ని వేధించాడు.

భూమి మీద పుట్టిన తర్వాత, ప్రయోజకుడైన మనిషికి శత్రువులు లేకుండా ఉండడంకల్ల. వారి సామర్థ్యమే వారి యెడల పరాయి వారి మనస్సుల్లో ఈర్ష్యాసూయలు, ద్వేషమూ తద్వారా శత్రుత్వమూ జనింప చేస్తాయి. అయితే సామాన్యులమైన మనవంటి వారందరికీ పరస్పర శత్రుత్వముంటుంది. అనగా అవతలివాడు మన యెడల శత్రుత్వం వహించినప్పుడు, అతడి యెడల మనమదే రకమైన వైరాన్ని ప్రకటిస్తాం. కానీ మనం ప్రస్తావించుకున్న మహా పురుషుల వంటి వారికి, లోకంలో శత్రువులైతే ఉండవచ్చు కానీ, వారి యెడల వీరికి శత్రుత్వముండదు. తమ అజ్ఞానం వల్లనే వారు ఈ శత్రు భావాన్ని ప్రకటిస్తున్నారని కనుగొని మిన్నకుంటారు. తమకు కలుగనున్న అపాయం నుండి బయటపడేంతవరకూ జాగ్రత్త పడతారే కానీ, అవతల వారి చర్యలకు వీరు ఆగ్రహించేది, ఆవేశపడేదీ ఉండదు. మనకూ ఈ మహాపురుషులకూ ఇదే తేడా.

# గురువుల బరువు

**భా**రత దేశంలో గురువులకు ఎప్పుడూ కొదువలేదు. ప్రజల అవసరాలను బట్టే గురువులు ప్రభవిస్తూ ఉంటారు. ఆయా కాలాల్లో మనుషుల వాంఛల ననుసరించి – "వాటిని తీర్చడానికే మేమున్నాము" అంటూ – వినియోగదారుని "డిమాండ్"ను బట్టి ఉత్పత్తిదారుడు వస్తువును రూపొందించినట్లు, గురువులు ఆయా శిష్యవర్గానికి కావలసినదేదో అందజేయడానికే ఉన్నారు. పూర్వకాలంలో మనుషులు ఆశించిన ధన రాసులకై, కామించిన వనితా రత్నాలకై తాపత్రయపడితే, అందుకు తగినట్లుగా లక్ష్మీ స్తోత్రాలు, వశీకరణ మంత్రాలు నేర్పుతుండేవారు. నేటి కాలంలో పిల్లవాడికి ఇంజనీరింగ్‌లో సీటు, అమెరికాలో ఉద్యోగం, తన "టెండర్"నే ప్రభుత్వం అంగీకరించి ఆ కాంట్రాక్టు తనకే ఇప్పించడం వంటి కోర్కెలే ముఖ్యమనిపిస్తున్నాయి. కాబట్టి, గురువులు అలాంటి కోర్కెలు తీర్చడానికే పోటీపడుతున్నారు. ఇందులో కూడా ఎవరి స్పెషలైజేషన్ వారిది. కొందరు గురువులు వణిక్ ప్రముఖుల లాభాలను వృద్ధి చేస్తుంటారు. కొందరు గురువులు తమను ఆశ్రయించిన రాజకీయ నాయకులను ఎన్నికలలోనూ, నాయకత్వ పోటీలో ప్రత్యర్థుల మీదనూ గెలిపిస్తుంటారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగాలలోని ఉద్యోగులకు ప్రమోషన్లు ఇప్పించే గురువులు వేరు. ఈ ప్రయోజన సిద్ధి యావత్తూ అలౌకిక శక్తితోనే జరగాల్సిన పనిలేదు.

కంపెనీలోని అధిపతి, కిందిస్థాయి ఉద్యోగి తమవద్ద శిష్యులైతే, చిన్నవాణ్ణి సిఫార్సుతో పైకి లేవదీస్తుంటాడు. ఇవేవీ దక్కని శిష్యులు తమ కర్మను నిందించుకుంటారే గానీ గురుశక్తిని మాత్రం శంకించరు. శిష్యుల మెదళ్ళను గురువు, అతడి ప్రధాన అనుచరులు, అంతకు మునుపే ఆ విధంగా 'కండీషన్' చేసి ఉంటారు.

సద్గురువు పాలిటబడితే పులి నోట పడ్డట్టేనంటారు. అర్థమేమిటంటే, పులివాత పడిన మనిషికి నాగుబాము కాటుకు గురైన మనిషికి చావెట్లా తథ్యమో, సద్గురువును చేరిన మనిషికి అహంకార నాశం అంత ఖచ్చితంగానూ జరుగుతుందనీ, తద్వారా తరిస్తాడని. కానీ ఈ ఆధునిక కుహనా గురువుల వలలో పడిన మనిషికి ఏ రకమైన

విముక్తి లభించదు. మానవునికుండాల్సిన ప్రశ్నించే గుణం మాత్రం నశించి, దాని స్థానే వెర్రి నమ్మకం ఏర్పడుతుంది. జిజ్ఞాసా పూర్వకంగా కనుగొనే శక్తి క్షీణించి, అంధ విశ్వాసంతో బ్రతకడం ఆరంభమవుతుంది. గురువుకై తన ధన మాన ప్రాణాలైనా అర్పించాల్సి ఉంటుందని, గురువూ, అతడి అనుచర గణమూ నిత్యమూ బోధిస్తుంటారు. శిష్యవర్గమంతా ఒకరకమైన సమ్మోహనా శక్తిచేత కట్టివేయబడి, మర మనుష్యుల్లాగా తిరుగుతుంటారు. కదిలిస్తే గురు నామాన్ని ఉచ్చరిస్తూ కేకలు పెడుతుంటారు. కంటి ఎదుట మానభంగాలు, మర్డర్లూ, మరే అకృత్యాలు జరిగినా, ఏమీ జరగనట్లే చరిస్తుంటారు.

ఈనాడు ఈ కలుషిత వాతావరణం మరీ విస్తరిల్లుతున్నది. కానీ ఇంతకు ముందూ ఇలాంటి కుహనా గురువులు లేరనుకోనక్కరలేదు; అప్పుడూ ఉండేవారు. ఐదారు దశాబ్దాల క్రితమే అరుణాచల రమణుణ్ణి ఎవరో ఒక వ్యక్తి "పలు మార్గాలు సూచించే అనేక గురువులున్నారు. గురువుగా ఎవర్ని స్వీకరించాలంటారు?" అని ఆ మహాపురుషుణ్ణే అడిగాడు. ఈనాటి గురువులలాగా తన ప్రచారం చేసుకునే స్థితికి ఎప్పుడూ దిగజారని రమణుడు ప్రశాంతంగా – "నీకు ఎవరి వద్దనైతే మనశ్శాంతి లభిస్తుందో అతణ్ణి ఎంచుకో' అని ముక్తసరిగా సమాధానం చెప్పాడు. "ఆయన బోధను కూడా పరిగణనలోకి తీసుకొని ఎంచుకుంటే మంచిదంటారా?" అని మళ్ళీ ప్రశ్నించాడు ఆ వ్యక్తి.

ఆత్మ విచారానికి అత్యంత ప్రాధాన్యమిచ్చిన శ్రీ రమణుడు, ఇప్పుడు మనకున్న అజ్ఞానాన్ని వదల్చుకోమని ప్రబోధిస్తూ ఉంటే – అది గ్రహించలేక ఏదో అడ్డదిడ్డమైన ప్రశ్నలు వేస్తే ఏమి చెప్తాడు?

"నిజమైన అన్వేషకుణ్ణి – "ఇది చెయ్యి. అది చెయ్యి" అని చెప్పేవాడు అసలైన గురువు కాదు. అన్వేషి అప్పటికే తన జీవితంలో పలు సాధనాలతో పలు చర్యలతో సతమతమవుతూ ఉంటాడు; అతడికి కావలసింది ప్రశాంతీ, విశ్రాంతీని. అంటే అతడి నిరంతర కార్యకలాపాల నుండి విముక్తి. ఇప్పటికే అతడు ఆచరిస్తున్న అనేక కర్మలకు మరికొన్నింటిని జోడించడంలో ప్రయోజనమేమిటి? అతడి కది మరింత మోయలేని భారమవుతుంది. కానీ, అలాంటి బోధ అతడికేవిధంగా ఉపకరిస్తుంది?

"భూమి మీద ఉన్నంతకాలం మనిషి పలు రకాల కార్యకలాపాలలో మునిగి తేలుతుండడం సృష్టిలో సహజంగా జరుగుతూ ఉండేదే. ఇలాంటి చర్యలన్నీ ఆ అఖండానంద వినాశ హేతువులు. సాధకుడు ఇప్పుడు చేస్తున్నవి కాక, మరిన్ని తల పెట్టమని సలహా ఇచ్చేవాడు గురువు కానేరడు. సాధకుడి పాలిటి మృత్యుదేవత. ఈ లెక్కన ఇప్పుడు గురు రూపంలో దర్శనమిస్తున్న వారు, సృష్టికర్త అయిన బ్రహ్మదేముడైనా అయి ఉండాలి. లేక మృత్యుదేవత అయిన యమధర్మరాజైనా అయి వుండాలి. ఇలాంటి గురువు సాధకుడికి విముక్తి కల్గించకపోగా, మరింత శృంఖలా బద్ధుణ్ణి చేస్తున్నాడని భావించాలి" అని ముగించాడు శ్రీరమణుడు.

గురువులను తలకెత్తుకునే ముందు వారు ఎలాంటి బరువు మోపుతున్నారో ఆలోచించుకోడం శ్రేయస్కరం అని నాకు అనిపిస్తుంది.

## గురువు ఆత్మ

గురువు నీ వెలుపల ఉన్నాడని భ్రమిస్తున్నావు. కాదు, నీ లోపల ఉన్నాడు. వాస్తవానికి నీ ఆత్మయే నీ గురువు. ఈ యథార్థం గుర్తించి గురువును నీ లోపలనే అన్వేషించు. నీ మనస్సు బహిర్ముఖమై ఉన్నది. అందువల్ల విషయములను వెలుపల ఉన్నట్టుగా చూస్తున్నది. గురువు కూడా ఆ విషయాలలో ఒకడవు తున్నాడు. కాని, సత్యం దీనికి భిన్నం. ఆత్మయే గురువు. మనస్సు నంతర్ముఖం చేస్తే విషయాలను నీ లోపలివిగానే గుర్తిస్తావు. నీ ఆత్మయే గురువనీ, ఆయనకంటె అన్యమేమీ లేదనీ తెలుసుకోగలుగుతావు.

# సేవాధర్మం

**కొం**దరు వ్యక్తి సేవకనో, సంఘ సేవకనో అమిత వేగిరపడుతుంటారు. హనుమంతుడు శ్రీరాములవారి సేవకై అరాట పడినట్లుగా వీరికీ సేవా ధర్మం మీద ఇంత ఆసక్తి ఎలా ఏర్పడిందా అని మనకు ఆశ్చర్యం కలగవచ్చు. కానీ పరిశీలించి చూస్తే, ఈ ఆసక్తికి అనేక కారణాలున్నాయని గ్రహిస్తాం. అవతలివాడి వద్దనున్న ఆస్తి కోసమో, వాడు అనుగ్రహించగలిగిన మరి దేనికోసమో ఆశపడి వీరు ఇలాంటి సేవకు పూనుకున్నారని మనకు అర్థమవుతుంది. చాలామంది విషయంలో సంఘ సేవాసక్తి కూడా ఈ సూత్రం యొక్క విస్తృత రూపమనే అనవచ్చు. కాకపోతే ఆ రంగంలో ఆశించేది గుర్తింపు. తద్వారా సాంఘిక, రాజకీయ పలుకుబడి, పదవులు, అధికారం వగైరా. ఇది మానవ నైజం.

తమాషా ఏమిటంటే, ఏ రంగంలోనైతే ఏమీ ఆశించటానికి వీలులేదో, అలాంటి ఆధ్యాత్మిక రంగంలో కూడా, మనిషి తన సహజ స్వభావాన్ని వదలుకోలేక ఏదో ఒక దానికై ఆశపడుతూ ఉంటాడు. ఆశామోహాలు వీడితేగానీ నిజమైనదేదీ దక్కదని ఒక వంక జపిస్తూనే ఉంటాడు; అయినప్పటికీ ఏ గురువునో గట్టిగా సేవించి తాననుకున్నది సాధించగలనని అనుకుంటూనే ఉంటాడు. గురుసేవ అయినా, సంఘసేవ అయినా ఉద్దేశపూర్వకమైనంత కాలం, అంటే ఏదైనా ఆశించి సేవించినంతసేపూ, నిజమైన దేదీదక్కదు. ఈ ఆధ్యాత్మిక మార్గంలో మొదటిమెట్టు వద్దనే ఆశ తొలగిపోవాలి. దాని అర్థం నైరాశ్యం అలముకోవాలని కాదు. ఆశ నిరాశల మధ్య మనసుపడే ఊగిసలాట అంతంకావాలి. ఈ ద్వంద్వాలకు మనసు అతీతం కావాలి. ఈ స్థితి నెలకొంటే గానీ అసలు పని ప్రారంభం కాదు.

అరుణాచల రమణుడి కాలం నాటి జ్ఞాపకాలు స్మరించుకుంటూ శ్రీ కుంజు స్వామి అనే అనుచరుడు, శివయ్య అనే ఆంధ్ర భక్తుణ్ణి గురించి రాసిన ఉదంతమొక టుంది. రమణుడు విరూపాక్ష గుహలో నివసించే రోజుల్లో, ఈ శివయ్య తరచూ ఆయన వద్దకు వెళ్ళి సేవిస్తుండేవాడు. చాలాసేపు జపంలో గడిపేవాడు. ఎచ్చమ్మాళ్

అనే భక్తురాలు వండిన సామగ్రినంతా పాత్రల్లో పెట్టుకొని తానే స్వయంగా ఆశ్రమానికి మోసుకువెళ్ళేవాడు. స్వచ్ఛందంగా తన సేవలను ఏదో రూపంలో ఆశ్రమానికి అందజేస్తూనే ఉండేవాడు. ఒకమారు రమణుడు, ఆయన అనుచరులు కొండపైకి వెళ్ళగా, ఒక కుండెడు మంచినీళ్ళు ఎంతో శ్రమకోర్చి పైకి మోసుకువెళ్ళాడు. సేవా ధర్మనిర్వహణకై ఉరకలు వేస్తుండేవాడు.

రమణుడి పట్ల ఈ శ్రద్ధాభక్తులూ, ఈ సేవానురక్తీ అందరినీ ఎంతో ఆకర్షిస్తుండేవి. అటు తర్వాత ఇతడు సన్యాసం పుచ్చుకుని దక్షిణాదిలో ఒక పీఠాధిపతిగా స్థిరపడ్డాడు. ఆ పీఠాధిపత్యంలో ఉన్న అనేక మఠాలపై అధికారం చెలాయిస్తూ ఉండేవాడు. అతడు అధికార దర్పాన్ని ప్రదర్శిస్తున్న రోజుల్లో, అతడిలో వచ్చిన మార్పు తెలియని ఎచ్చమ్మాళ్, వాసుదేవశాస్త్రి అనే రమణ శిష్యులు, అతణ్ణి చూడడానికి వెళ్ళగా, ఆ పీఠాధిపతి తన ఇంద్రజాలంతో మధుర మీనాక్షీ దేవాలయంలో కుంకుమను తన అరచేతిలోనికి రప్పించి, మౌనవ్రతావలంబి అవడం మూలాన ఒక కాగితం మీద, “మీస్వామి తానేది తలచుకుంటే అది ఈ విధంగా మీ ముందుంచగలడా?” అని రాస్తూ సగర్వంగా ఒక సవాలు విసిరాడు. అంటే రమణుడి కన్నా తాను మరింత గట్టివాణ్ణని. రమణ భక్తులకు నిరూపించదలిచా డన్నమాట. ఈ లెక్కన ఈ పెద్దమనిషి ఒకప్పుడు రమణుణ్ణి ఆశ్రయించుకొని చేసిన సేవలన్నీ, ఆయన అనుగ్రహం సంపాదించి జీవితంలో తన ఆశ ఫలించాలని చేసినవే అనుకోవాలి. ఈ కారణం చేతనే ఈ గురుధిక్కారం, గురువెటకారం, ఇలా ప్రదర్శితం అయ్యాయి. కానీ వాసుదేవశాస్త్రిని, ఆ పెద్దమనిషి తక్కువగా అంచనా వేశాడు. శాస్త్రి ఏమాత్రం కంగారుపడకుండా “ఇది శ్రీరమణులకు నిస్సందేహంగా సాధ్యం కాని విషయమేనండీ” అన్నాడు.

స్వామికి, శాస్త్రి మాటల్లో ఏదో తిరకాసు ఉన్నట్లు కనిపించి, “ఏమిటి మీరనేది? సరిగా చెప్పండి” అని మళ్ళీ కాగితం మీద రాసి చూపిస్తూ భృకుటి ముడిచాడు.

అందుకు శాస్త్రి “భగవాన్ రమణుడికి అసలు ఆలోచన అనేదే ఉండదు. అలాంటప్పుడు, ఏ ఆలయంలోని కుంకుమనో ఇక్కడికి రప్పించడం అనే ఆలోచనతో కూడుకున్న చర్య ఎలా వలనుపడుతుంది? ఆలోచన, విస్మరింపు అనే స్థితులను దాటిన

పరిశుద్ధమైన స్థితి రమణుని మానసికస్థితి. అలాంటి స్థితిలో ఆలోచనాపూర్వకమైన చర్యలు ఏమి ఉంటవి?" అని వివరించాడు. పీఠాధిపతికి ఏమనాలో, ఏమి రాయాలో తోచక కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయాడు !

రామకృష్ణ పరమహంస భక్తుడైన దుర్గాచరణ్ నాగ్‌ను స్వామి వివేకానందుడు అమితంగా ఆదరిస్తుండేవాడు; 'నాగ్ మహాశయుడు జన్మించిన తూర్పు బెంగాల్ ధన్యత నొందింది' అంటుండేవాడు. నాగ్‌లో సేవాధర్మం ఎంతగా జీర్ణించుకు పోయిందంటే, తనకై ఎవరే సేయ చేయబూనుకున్నా అతడి మనసు నొచ్చుకునేది. ఆఖరికి తాను నివసించే కుటీరాన్ని కూడా మరొకరొచ్చి మరమ్మతులు చేయడానికి అంగీకరించేవాడు కాదు ! ఒకమారు అతడు గ్రామాంతరం వెళ్లిన వేళలో, భార్య శరత్‌కామిని ఎవడో కూలీవాణ్ణి పిలిపించి చూరు మరమ్మతులు ప్రారంభింపజేసింది. అనుకోకుండా నాగ్ మధ్యలోనే తిరిగివచ్చి, తన కుటీరం ఎవరో రిపేరు చేస్తున్నారని చూశాడు. తనకై మరొకరు శ్రమించడం చూడలేని నాగ్, "నన్నెందుకు సంసారిగా ఉండమని ఆజ్ఞా పించావయ్యా రామకృష్ణ ప్రభూ? నా సుఖానికై మరొకరిని వినియోగించుకో మంటావుటయ్యా? దీనికంతటికీ కారణం ఈ గృహస్థ జీవితమే కదా?" అని దుఃఖించ నారంభించాడు. ఇదంతా ఏదో గోలగా ఉందని, చూరుమీదికెక్కిన కూలీవాడు కిందికి దిగి వచ్చేశాడు. పని పూర్తికాకపోయినప్పటికీ, వాడితో కుదుర్చుకున్న మొత్తం డబ్బులు చెల్లించి, మరేవో మర్యాదలు చేసి, వాణ్ణి పంపించి వేశాడు !

పడవ ప్రయాణం చేసేటప్పుడు, నావ నడిపేవాని తెడ్డుకర్రలు తన చేతపుచ్చుకొని వాడి శ్రమ తీసేసేవాడు. ఒకసారి కుండపోతగా వర్షం కురుస్తున్న ఓ రోజున నాగ్‌ను దర్శించుకుందామని అతడి అభిమాని ఒకడు బయలుదేరాడు. జలమయమైన ఆ ప్రాంతాన్ని దాటడానికి ఆ రోజున పడవ దొరకనందువల్ల, దూరమయినప్పటికీ, ధైర్యం చేసి నీటిలో ఈదుకుంటూ నాగ్ కుటీరానికి వచ్చాడు. రాత్రి తొమ్మిది గంటలవేళ తడిసి ముద్దయి వచ్చిన ఆ భక్తుడితో నాగ్, "ఇంత రాత్రివేళ పాములు తిరిగే ప్రాంతాలన్నీ దాటుకుంటూ, ఎలా వచ్చావు నాయనా?" అని అతడి అవస్థకు వ్యధచెందుతూ, అతడికి పొడిగుడ్డలివ్వడానికి లోనికి తీసుకు వెళ్లాడు. అతడికేదైనా వండిపెడదామని,

గృహిణి శరత్‌కామిని వంట గదిలోకి వెళ్ళింది. కానీ ఆనాటి వర్షపు ధాటికి కట్టెపేళ్ళన్నీ తడిసి నీళ్ళు కారుతున్నై. ఇది చూసిన నాగ్, క్షణకాలం కూడా ఆలోచించకుండా, కుటీరాన్ని నిలబెడుతున్న ఒక మూలనున్న పెద్ద బొంగును తెగవేయనారంభించాడు. అలాంటి పనిచేస్తే కుటీరం కూలిపోగలదని ఎవరెన్ని చెప్పినా వినకుండా, “సర్పాలను కూడా సరకుగొనకుండా నా మీది అభిమానం కొద్దీ ఇంత శ్రమపడి ఇంతదూరం ఈదుకుంటూ వచ్చిన వాడికి వండిపెట్టవలసి వచ్చినప్పుడు ఎలా ఊరుకునేదయ్యా? కుటీరం కూలినా సరే ఇలాంటి వారిని సేవించినప్పుడే నా జీవితం ధన్యమవుతుంది” అన్నాడు.

నాగ్ మహాశయుని సేవా నిరతి, అహంకారలేమిని గమనించిన వివేకానందుడు, “ప్రపంచంలో నేనెన్నో ప్రాంతాల్లో తిరిగాను. కానీ నాగ్ మహాశయ్ లాంటి మహాత్ముణ్ణి నేనెక్కడా చూడలేదు” అని ఎంతగానో కొనియాడాడు.

జీవితంలో ఆ మహాశక్తిని కనుగొన్నవాడు ఈ లోకంలోని అన్నిట్లోనూ దానినే కళ్ళారా చూస్తుంటాడు కాబట్టి, అతడు అన్నిటినీ సేవిస్తూ తిరుగుతుంటాడు. ఇదొక్కటే నిజమైన సేవాధర్మం. మిగతాదంతా ఉద్దేశపూర్వకంగా ప్రయోజన సాధకం.

# మన తప్పు మనమే తెలుసుకోవాలి

**మె**హర్‌బాబా వద్దకు వచ్చిన ఓ అంధ యువకుడు, "మిమ్మల్నీ కళ్ళతో చూడ గల్గిన అదృష్టం నాకు లేదు. నేను పుట్టు గుడ్డిని" అని విచారించాడు. "భౌతిక నేత్రం లేనందుకు చింతించకు. అంతర్నేత్రం విచ్చుకునే అవకాశం నీకే అధికంగా ఉన్నది. అదృష్టమంటే అదేనన్న సంగతి గ్రహించు" అని ఓదార్చాడు మెహర్.

మనిషికీ అంతర్వీక్షణ ఏర్పడకపోతే బాహ్యంగా ఎన్ని అమరినా వ్యర్థమే. అతడి అంగవైకల్యానికీ, ఆర్థికలేమికీ, బాధలకూ, నివారణోపాయాలు కనుగొనాల్సిందే. అమలు జరపాల్సిందే. తగిన కార్యక్రమాల ద్వారా అతడి నిరక్షరాస్యతను నిర్మూలించాల్సిందే. కానీ 'అజ్ఞాన'మనే అంధత్వాన్ని ఏ మనిషి కామనిషి తనకు తానే తొలగించుకోవలసి ఉంటుంది. ఈ విసయంలో ధనిక నిర్ధన భేదం కానీ, అగ్ర నిమ్న వర్గాలనే తేడా కానీ, విద్యావంతులు విద్యాహీనులనే అంతరం కానీ ఏదీ వర్తించదు. మనిషి ఏ ఉన్నత స్థానాన్ని అలంకరించి ఉన్నప్పటికీ, అజ్ఞానాన్ని తనంతటతాను పూనికతో నిర్మూలించు కుంటే గానీ అది అంతం కాదు. ఈ సందర్భంగా ఎవరికి ఎవరూ సహాయ పడగలిగి లేరు. ఎవరైనా మహిమాన్వితుడు మనకు భౌతికంగా ఏదైనా మేలు చేసినా, మనం నిజంగా బాగుపడుతామనే నమ్మకం లేదు.

"మంచి చేసెడి మనిషి" అనే ఒక కథలో ఆస్కార్ వైల్డ్ జీసస్ క్రైస్తును గురించి రాస్తూ, ఆయన చేసిన 'మంచి'కి పర్యవసానమెలా ఉంటుందో తెలియజేస్తాడు. జీసస్, తన కాలంలో ఒక కుష్ఠరోగికి వ్యాధి నివారణ చేశాడు; ఒక అంధుడికి నేత్ర దృష్టి ప్రసాదించాడు; మృతి చెందినవానికి ప్రాణభిక్ష పెట్టాడు. ఈ బైబిల్ కథలు అక్కడితో సుఖాంతమైనట్లుగా ఉంటాయి. కానీ మహా రచయిత ఆస్కార్ వైల్డ్ ఆ కథలను తన ఊహతో పొడిగిస్తూ, కొంతకాలం అనంతరం జీసస్ తిరిగి వచ్చి, తాను ఉద్ధరించిన వారి పరిస్థితి ఎలా ఉందో చూడడానికి బయలుదేరాడట.

ఒక పెద్ద భవనంలో బ్రహ్మాండమైన విందులు వేడుకలు జరగడం చూశాడు జీసస్. భవనమంతా అనేక వినోదాలతో అలరారుతున్నది. భవన యజమాని మధు

సేవలో మునిగి తేలుతూ ఎరుపెక్కిన పెదవులతో, కైపెక్కిన కళ్ళతో ధగధగా మెరిసే ఒక పరుపుమీద శయనించి ఉన్నాడు. "ఇంతటి సుఖలాలసత్వంలో, నువ్విలా ఎందుకు జీవిస్తున్నావ్?" అని ప్రశ్నించాడు జీసస్. అదిరిపడ్డ ఆ యువకుడు, "అదేమిటండీ? నేను కుష్ఠురోగంతో బాధపడే కాలంలో మీరు నా వ్యాదిని తొలగించారు. ఇప్పుడు మంచి ఆరోగ్యంగా ఉన్నాను. ఇలాకాక ఎలా జీవించమంటారు?" అని అడిగాడు.

జీసస్ మౌనంగా బయటికి వచ్చేశాడు. వీధిలో నడుస్తుండగా కామోద్రిక్తుడైన ఓ కుర్రాడు, అందమైన ఓ ఆడపిల్లను వెంబడించడం, వేధిస్తూ ఉండడం గమనించాడు. జీసస్ ఆ కుర్రవాణ్ణి ఆపి, "కామాంధతతో ఈ అమ్మాయిని ఇలా వేటాడవచ్చా?" అని అడిగాడు "అయ్యా నాకు దృష్టిలేని కాలంలో మీరు నాకు దృష్టిని అనుగ్రహించారు. భూలోకంలోని ఈ అందాన్ని చూచిన తర్వాత అనుభవించక ఏమి చేయమంటారు?" అని ఎదురు ప్రశ్నించాడు.

జీసస్ సీరియస్‌గా ఊరి బయటికి వచ్చాడు. అక్కడ ఓ యువకుడు అరుగు మీద కూచొని విలపిస్తూ ఉండడం గమనించాడు. "ఎందుకు ఏడుస్తున్నావ్?" అని అడిగాడు జీసస్. "నేను ఒకప్పుడు మృతిచెందాను. మీరు నాకు మళ్ళీ ప్రాణం పోశారు. ఇప్పుడిక ఏడవక నే చేసేదేముంది?" అంటూ రోదించాడు.

ఈ కథల సారాంశం ఏమిటంటే మనిషి తనని తాను స్వయంగా బాగు చేసుకుంటే, అది అతడి శ్రేయస్సుకు దోహదం చేస్తుంది కానీ ఎవరో బలవంతంగా బాగు చేస్తే ఏమీ ప్రయోజనం ఒనగూరదు సరిగదా, పైపెచ్చు అలాంటి సహాయాల వల్ల లోకానికి మరింత హాని జరిగే ప్రమాదమున్నది. నిజంగా బాగుపడాలనే కోరిక మనిషిలో బయలుదేరినప్పుడు, అతడికి ఏ రూపంలో చేయూతనిచ్చినా ప్రయోజన ముంటుంది. కానీ, తనకేవో సిద్ధులున్నవి కదా, అనే ఉద్దేశంతో అతడనుభవిస్తున్న దానిని బలవంతంగా తీసేద్దామనుకుంటే, అది ఒకవేళ సాధ్యమైనా, విపరీత ఫలితాలనే కలగజేస్తుంది.

అలాగే 'నేచేస్తున్నది తప్పు. ఇది సరియైన మార్గం కాదు' అనే సత్యం ఎవరికి వారే కనుగొనాలి కానీ, వేరొకరు చెప్పినందువల్ల గ్రహింపు రాదు. తప్పుచేస్తున్నవారే

దానిని తప్పుగా గుర్తించగలిగి ఉండాలి. ఈ ఆధ్యాత్మిక సత్యాన్నే అరుణాచల రమణుడు చాలా సున్నితంగా ఒక సామాన్య విషయం ఆధారంగా ఒకావిడకు నేర్పాడు.

లోకమ్మాళ్ అనే శిష్యురాలు శ్రీ రమణుల సమక్షంలో 'తేవరం'లోని ఒక గీతాన్ని తప్పుగా చదివింది. రమణుడు ఆవిణ్ణి అక్కడికి ఆపి, 'తేవరంలో అలా రాసి ఉందంటావా? మళ్ళీ సరిగా చదివి చూడు' అని సూచించాడు. ఒకటికి రెండుసార్లు మళ్ళీ అదే తప్పుతో ఆవిడ చదివింది. చివరకు రమణుడు కాస్త గంభీరంగా, "ఎక్కడ తప్పు చేస్తున్నావో నువ్వే గ్రహించాలి. నేను సరిచేస్తా ననుకోవద్దు. నేనలా చేస్తే, తప్పు ఎక్కడ జరుగుతున్నదో నీవు స్వయంగా తెలుసుకోకపోవడమే కాక, అదే తప్పు మళ్ళీ మళ్ళీ చేసే ప్రమాదమున్నది" అన్నాడు.

ఆ సమయంలో అక్కడే హాలులో కూచొని ఉన్న కుంజుస్వామి అనే ఆయన లోకమ్మాళ్‌కు ఈ విషయంలో తోడ్పడదామని ప్రయత్నించగా రమణుడు అతణ్ణి వారించాడు. అక్కడే ఉన్న రత్నం అనే మరొక శిష్యుడు, లోకమ్మాళ్ చేస్తున్న పొరపాటేమిటో మీరు సెలవివ్వండని రమణుణ్ణి అడిగి చూశాడు. రమణుడు "ఇదేదీ కుదరదు. ఆవిడ తాను చేస్తున్న తప్పు తెలుసుకోకుండా చదువుతున్నది. తగిన శ్రద్ధతో తన తప్పుతానే తెలుసుకోవాలి. నేను ఆవిణ్ణి సరిదిద్దాలని ఆవిడ అంతర్గత ఉద్దేశమై ఉండవచ్చు" అన్నాడు.

ఇంత జరిగిన తర్వాత కూడా లోకమ్మాళ్ తన తప్పు తాను తెలుసుకోలేదు. భోజనానికి వేళ అవుతున్నందువల్ల. అందరికీ వడ్డించడానికని వంట గది వైపుకు వెళ్లడానికి ఉపక్రమించింది. కానీ రమణుడు ఆటంకపరిచాడు. "అలా తప్పించుకు వెళ్ళే వీలులేదు. ముందు నీ తప్పేమిటో కనుక్కో. అది కనుక్కునే వరకూ ఇక్కడే కూచొని, అది తెలుసుకొని మరీ వెళ్లు" అని నిర్మొహమాటంగా చెప్పాడు.

ఆశ్రమంలోని 'భోజనం బెల్' మ్రోగినందువల్ల రమణుడు కూచోనున్న సోఫా నుండి లేచి భోజనశాలకు వెళ్ళాడు. ఆ తర్వాత లోకమ్మాళ్ అక్కడి నుండి విచారంగా బయలుదేరింది. భోజనానంతరం ఆవిడ సోమసుందరం పిళ్ళై అనే ఆయన వద్దకు వెళ్ళి, తాను చదివేటప్పుడు చేస్తున్న తప్పేమిటో ఆయన్ని అడిగి తెలుసుకుంది. తిరిగి

వచ్చి రమణుడి ముందు, ఈసారి సరిగా చదివింది. "నీ తప్పు నీవు స్వయంగా కనుక్కున్నట్లు లేదు. ఎవరో చెప్పినట్లున్నారు. ఇలా ప్రయోజనం ఉండదు. నీ అంతటనువు నీ తప్పు తెలుసుకున్నప్పుడే అది నీలోగాఢంగా నాటుకొని, నిలకడగా ఉండిపోతుంది. అలాంటి తప్పు మళ్ళీ ఈ జీవితంలో చేయడం జరగదు. అందుకు అవసరమైన శక్తి సామర్థ్యాలు వాటంతట అవే నీకు కలుగుతాయి" అన్నాడు.

విషయం చిన్నదైనా, ఇందులో ఇమిడి ఉన్న ఆధ్యాత్మిక రహస్యం మాత్రం చాలా గొప్పది. మనిషిలో మౌలికమైన మార్పు రావాలంటే, మనిషి నిజంగా తన శ్రేయస్సును కాంక్షించినట్లయితే, రమణుడు నేర్పినదే తరుణోపాయం. తమ తమ కర్మాచరణ తమని ఏ దశకు తీసుకువచ్చిందో, తమ పొరపాటేమిటో స్వయంగా తెలుసుకోకుండా ఎవరో ఏదో బోధించారని ఉట్టుట్టిగా దానిని ఆచరించేవారంతా చివరకు వైఫల్యాన్నే చవిచూస్తారు.

## జగత్తు సత్యాసత్యాలు

ఆత్మకంటే వేరుగా చూడబడినప్పుడు జగత్తు అసత్యం. ఆత్మకు అభిన్నంగా, ఆత్మగా చూడబడినప్పుడు జగత్తు సత్యం.

# మనోలయం : మనోనాశనం

**"ఈ** 'నేను' అనేది ఎక్కడ ఉద్భవిస్తున్నదో విచారించే తరుణంలో మనసు చలనాలు ఆగిపోయిన స్థితి ఒకటి సంభవిస్తుంటుంది. కానీ అటు తర్వాత ముందుకు సాగలేకుండా ఉన్నాను. ఏ రకమైన ఆలోచనలేని ఆ ప్రత్యేక స్థితిలో ఒక 'శూన్యత' నన్ను ఆవరిస్తుంది. నేనేదో చిన్న వెలుతురు చుక్క అయిపోయినట్లూ, నాకు దేహమే లేనట్లూ ఒక వింత అనుభూతి కలుగుతుంది. దేనినీ గుర్తించలేను. నా శరీరమూ, రూపమూ గుర్తులేకుండా పోతుంది. ఇటువంటి పరిస్థితి సుమారు ఒక అరగంట సేపు కొనసాగుతుంది; ఇది మనసుకు ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. మోక్షమనండి, కైవల్యం, శాశ్వతానందం, ఏదైనా అనండి – ఇవన్నీ సాధించడానికి నేనిప్పుడు చేస్తున్న ఈ సాధనే కొనసాగిస్తూ, కేవలం అరగంటసేపు కాకుండా, గంటలతరబడి లేక రోజులు నెలలు ఇదే చేస్తూ ఉంటే చాలంటారా?" అని ఒక సాధకుడు అరుణాచల రమణుల వారిని అడిగాడు.

అందుకు సమాధానంగా శ్రీ రమణులు "ఇది మోక్షం కాదు. ఈ స్థితిని మనోలయ మంటారు". అంటే ఆలోచన ఆగినందువల్ల ఏర్పడే నిశ్శబ్దం, కదలికలేని స్థితి.

అసలు ఈ మనోలయమంటే ఏమిటి? మనోలయమంటే ఏకాగ్రత; ఆలోచనా తరంగాలను తాత్కాలికంగా నిరోధించడ మన్నమాట. ఏకాగ్రత విరమించగానే, ఆలోచనలు – కొత్తవి, పాతవి, కోకొల్లలుగా యధావిధిగా మనసులోకి తోసుకు వచ్చేస్తాయి. ఈ విధంగా మనస్సును జోకొట్టి నిద్రపుచ్చిన స్థితి ఓ వెయ్యేళ్ళు సాగినప్పటికీ, ఆలోచనను శాశ్వతంగా నిర్మూలించడం జరగదు; ఆలోచనల శాశ్వత నిర్మూలన మాత్రమే జనన మరణాల చక్రం నుండి విముక్తి ప్రసాదించగలుగుతుంది. అందుచేత సాధకుడు నిత్య జాగరూకతతో 'ఈ అనుభవం తనలో ఎవరికి కలుగుతున్నది?' 'ఎవరు ఈ రకమైన సుఖాన్ని పొందుతున్నారు?' అనే విషయాన్ని నిశితంగా పరిశీలిస్తూ ఉండాలి. ఈ విచారణ చేయకపోతే అతడొక దీర్ఘమైన సమాధి స్థితిలో యోగనిద్ర వంటి దానిలో మునిగిపోతాడు. చాలామంది సాధకులు ఇలాంటి పొరపాటుచేసి ఇదే కైవల్యమని, మోక్షమని భ్రమపడుతుంటారు.

ఇందుకు సంబంధించిన ఓ చిన్న కథ చెప్తాను విను. ఒక యోగి గంగవొడ్డున కూచొని చాలా ఏళ్ళపాటు తపస్సుచేస్తూ ఉండిపోయాడట. ఏకాగ్రతలో చాలా ఉన్నత స్థాయికి చేరిన అనంతరం, అదే స్థితిలో దీర్ఘకాలం మనసును నిలపగలిగి ఉండడమే మోక్షమని భావించి, ఆ సాధనే చేస్తూ ఉండేవాడు. ఒకనాడు ఈ విధమైన ఏకాగ్రతలో పూర్తిగా మునిగిపోకముందు, దాహంగా ఉన్నందువల్ల గంగానది నుండి కాసిని మంచి నీళ్ళు తెచ్చిపెట్టమని శిష్యుడికి చెప్పాడు. కానీ ఈ శిష్యుడు ఆ నీరు తెచ్చేలోగా ఆ తపస్వి యోగ నిద్రలోకి వెళ్ళిపోయాడు. ఈసారి ఆ నిద్రాస్థితి ఏళ్ళ తరబడి అలాగే ఉండిపోయింది. ఈ నిద్రానుభవం నుండి యోగి చాలాకాలం తర్వాత మేల్కొన్నాడు. కానీ మేల్కొన్న మరుక్షణమే "మంచినీళ్ళు, మంచినీళ్ళు" అని కేకపెట్టాడు. ఏళ్ళూ పూళ్ళూ గడిచిపోయిన కారణంగా అక్కడ శిష్యుడూ లేడు. ఆపాటికి ఆ గంగా మహానదే ఎంతో దూరంగా ప్రవహిస్తోందిట !

యోగనిద్రలోకి జారుకునే ముందు అతడి ఆలోచనల్లోకెల్లా ప్రధానమైన 'మంచి నీటి ఆలోచన' మనును పైపొరల్లోకి వచ్చింది. ఎంతటి తీవ్రమైన ఏకాగ్రతను సాధించి నప్పటికీ, ఎంతకాలంపాటు దానిని నిలపగలిగినప్పటికీ, ఆ ఆలోచన మనసు అంత రాంతరాళాల్లోకి అణగతొక్కబడిందే కానీ నిర్మూలనం కాలేదు. తీరా నిద్ర నుండి మేల్కొన గానే మనసు పైశ్రేణిలోని ఆలోచనల కుప్ప నుండి ఈ 'మంచినీటి ఆలోచన' వరద నీటిలాగా కట్టలు తెంచుకుని ముందుకు ఉరికింది.

యోగనిద్ర కుపక్రమించక ముందు, తాత్కాలికంగా కలిగిన ఈ 'మంచినీటి' ఆలోచనే నిర్మూలనం కాలేదంటే, ఇక చాలాకాలంగా పాతుకుపోయిన ఆలోచనల గతేమిటో ఆలోచించు. సమయం వచ్చినప్పుడు ఈ తలపులన్నీ పైకినెట్టుకు వస్తూనే ఉంటాయి. ఆలోచన అనేది సమూలంగా తుడిచిపెట్టుకుపోతేనే మోక్షము అని అంటుంటే, ఈ యోగి విముక్తుడని ఎలా అనగలం?

తాత్కాలికంగా ఆలోచనలు అణగతొక్కి మనసును కదలకుండా ఉంచగలిగే మనోలయానికీ, తలపులను సంపూర్తిగా నిర్మూలించే మనోనాశనానికీ, వుండే భేదాన్ని సాధకులు సామాన్యంగా గ్రహించరు. తలపులను అంతంచేసే మనోలయాన్ని సాధించి వెయ్యేళ్ళపాటు ఆలోచనను అణగార్చినా, ఆ మనోలయం అంతమైన మరుక్షణాన, ఆ

ఆలోచన మళ్ళీ పొడసూపుతుంది. కాబట్టి ఈ తాత్కాలిక నిరోధంతో సాధకుడు సంతృప్తి పడరాదు.

ఇలాంటి 'ప్రశాంతత' నెలకొన్నప్పుడు, చైతన్యాన్ని తిరిగి మేల్కొల్పి, ఈ ప్రశాంతత అనుభవిస్తున్నదెవరు అనేది. జాగ్రత్తగా గమనించాలి. నిజానికి అన్నిటికన్నా సులభ మైనది, సూటి అయినది నీ చేతుల్లో ఉన్నదీ, 'విచారణ మార్గ' మొక్కటే. ఈ విచారణ నీ ఆలోచన మూలస్థానానికి తోసుకు వెళ్తుంది కాబట్టి. అది అక్కడ అంతమవుతుంది. అప్పుడే సమస్తమైన ఆలోచనలను శాశ్వతంగా నాశనం చేసి, నీ స్వస్థానంలో నీవు విశ్రమించగలవు" అని ముగించాడు.

ఈ సందర్భంలో 'ఆలోచన' అన్నప్పుడు, ఒక సామాన్య కార్యనిర్వహణకు అవసరమైన ఆలోచన గురించి కాదు చెప్తున్నది. ఒక చెరువు గండి పూడ్చడానికి, ఒక వంతెన నిర్మించడానికి, ఒక చోటుకి వెళ్లేందుకు రవాణా సౌకర్యం కుదుర్చుకోడానికి, ఒక యంత్రాన్ని పనిచేయించడానికి, ఆఖరికి మన ఇంటికి మనం తిరిగి వెళ్ళడానికి కూడా కొంత ఆలోచన అవసరమనేది ఎవరికైనా తెలుస్తుంది. దీనిని విసర్జించి, అనాలోచితంగా, అయోమయంగా జీవించమని ఎవరూ సూచించడంలేదు.

రమణుడు గానీ, మరో మహా పురుషుడుగానీ ఉదహరిస్తున్న 'ఆలోచన' మనిషి తరచూ తన ఊహాలోకంలో చేసే భావన. తాను అది అందుకోవాలని, ఇది అందుకోవాలని, ఏదో గొప్ప సాధించాలనీ, ఎంతో కీర్తి ఆర్జించాలనీ, ఎన్నో కోర్కెలు తీర్చుకోవాలనీ, చేసే అనేకానేక భావనల సంగతి ప్రస్తావిస్తున్నారు. ఈ భావనలే మనిషి జనన మరణాలకూ, లోకంలో మనిషిపడే పలు బాధలకూ మూలమని జ్ఞానులు అంటారు. మనిషి ఈ భావనలను [concepts] వదిలితే చాలని జెన్ [ZEN] బౌద్ధుల విశ్వాసం; ఇక ఆ తర్వాత జ్ఞానం, తరణోపాయం కోసం విడిగా ప్రత్యేకమైన కృషి అవసరమే ఉండదని అంటారు. వారిలో ఒకరు అనిన మాటల సొగసు చూడండి.

బుద్ధుడి బోధ యావత్తూ ఒక్కందుకే ఉద్దేశించబడింది !

ఆలోచించే స్థితి నుండి మనల్ని ఆవలకు చేర్చడమే దాని పరమ లక్ష్యం !

నేనే కనుక నా ఆలోచనల నుండి విముక్తి చెందగలిగితే !

ఇక నాకు బుద్ధుడు నేర్పిన ధర్మాలతో పనేముంది"?

# హృదయంలోనే గురుశిష్యులు

అరుణాచల రమణులకు ఒక బంధువు వుండేవాడు. అతడి పందొమ్మిదేళ్ళ కొడుకు, విశ్వనాథన్ అనే యువకుడు, ఇల్లు వదలి రమణాశ్రమంలో వుండి పోవడాని కంటూ వచ్చేశాడు. కొడుకుతో ఈ విషయం అటో ఇటో తేల్చుకోడానికని. తండ్రి బయలుదేరి రమణాశ్రమానికి వచ్చాడు.

అంతకుమునుపు రమణస్వామిని గురించీ, అతడి దైవీ సంపత్తిని గురించీ, వారూ వీరూ ప్రశంసిస్తూ ఎంతో చెప్పినప్పటికీ, మధురైలో రమణుని బాల్యాన్ని ఎరిగి వున్న ఆ పెద్దమనిషి. ఆ మాటలేవీ విశ్వసించలేదు. కాస్త వుంటే గంపంత చేస్తారులే అనుకుంటూ, ఆశ్రమంలోనికి నడిచాడు. కానీ తీరా ఒకనాడు తాను వెంకట్రామన్‌గా ఎరిగిన ఈ రమణుణ్ణి దర్శనం చేసుకోగానే, అతడి వొళ్ళంతా జలజలా వొణికి పోయింది. ఏ ఆలోచనా మెదలకముందే ఆయన ముందు సాష్టాంగ పడిపోయాడు.

“ఆనాటి వెంకట్రామన్, ఇక్కడ నాకే మాత్రం కనిపించడంలేదే”? అని ఆశ్చర్య పోయాడు.

శ్రీ రమణులు నవ్వుతూ, “వాడా? వాడు అదృశ్యమై చాలా కాలమయింది” అని తనను గురించి తాను చమత్కరించుకున్నాడు.

శ్రీ జిడ్డు కృష్ణమూర్తి బాల్యంలో, బడిలో చెప్పే చదువులు సరిగా నేర్వలేకపోయి నందువల్ల మద్రాసులో అతడి మాస్టారు కొట్టేవాడు. అటు తర్వాత లెడ్ బీటర్ కృష్ణమూర్తిని తియసాఫికల్ సొసైటీలోకి తీసుకొని ఇంగ్లీష్ నేర్పనారంభించాడు. అనీబిసెంటు అతణ్ణి బ్రిటన్‌కు తీసుకువెళ్ళి మరింత చదువు నేర్పించింది. పలు విధాలుగా వికసించిన కృష్ణమూర్తి స్వదేశానికి తిరిగివచ్చి, మద్రాసు అడయారులోని మర్రిచెట్టు కింద ఉపన్య సిస్తుంటే, ఎందరో పెద్దలు ఆయన నోటి నుండి వెలువడిన సత్యాన్ని ఎంతో శ్రద్ధగా విన్నారు. ఆ శ్రోతల్లో, అతడిపై చిన్నప్పుడు చేయి చేసుకున్న ఆ మాస్టారు కూడా ఉన్నాడు; కృష్ణమూర్తి ప్రసంగం విని అచ్చెరువొందాడు. కృష్ణమూర్తిగారు వేదిక దిగి

ఇవతలికి రాగానే, "ఎంత వాడివయ్యావయ్యా? నీ చిన్నప్పుడు నా తెలివి తక్కువలో నిన్ను శిక్షిస్తుండేవాణ్ణి. ఎంతో అపచారమయిపోయింది" అని బాధపడ్డాడు.

జరిగిపోయనదేదీ మనసులో ఉంచుకోనంటూ, కృష్ణమూర్తి అతణ్ణి ఓదార్చాడు.

చిన్నప్పుడు మొద్దుల్లాగా కనిపించింది శ్రీ రమణులు, శ్రీకృష్ణమూర్తి వంటి అగ్రశ్రేణి అధ్యాత్మికులే కాదు; ప్రపంచ విఖ్యాత సైంటిస్టు శ్రీ ఐన్‌స్టీన్ కూడా అట్లానే వుండేవాడు. అతడికి మాటలు రావడమే చాలా ఆలస్యమైంది. తొమ్మిదేళ్ళ వయసులో కూడా ధారాళంగా మాట్లాడ గలిగేవాడు కాదు. పిల్లవాడు అందరి పిల్లల్లాగా సరిగా ఎదగడం లేదని తల్లిదండ్రులు చింతపడేవారు. అందువల్ల ఆల్‌బర్ట్ ఐన్‌స్టీన్ తండ్రి ఒక రోజున స్కూల్ హెడ్ మాస్టర్ వద్దకు వెళ్ళి, తన పిల్లవాడి వెనకబడినతనాన్ని దృష్టిలో ఉంచుకొని, అతణ్ణి ఏ వృత్తిలో ప్రవేశపెడితే బాగుంటుందో చెప్పమని సలహా అడిగాడు. "ఈ పిల్లవాడు ఎందులోనూ రాణించే అవకాశం లేదు" అని తేల్చేశాడు ఆ హెడ్ మాస్టర్.

పెరిగి పెద్దవాడయిన తర్వాత ఎంతగానో వికసించిన ఐన్‌స్టీన్, విద్యార్థులకు ప్రైవేట్ ట్యూషన్లు చెప్పే కాలంలో, ఒకప్పుడు తనకు విద్య నేర్పిన టీచర్లు అవలంబించిన విధానాలన్నీ విడనాడి, వారు తనకు విద్యనెలా నేర్పితే బాగుండేదని అనుకున్నాడో, ఆ విధానాలను తన విద్యార్థుల విషయంలో అమలు జరిపాడు.

ప్రశ్నలకు సమాధానాలు బట్టీ పెట్టే పద్ధతి కాకుండా, విద్యార్థులను ప్రశ్నించి వారిలో జిజ్ఞాసాసక్తిని ప్రేరేపించి, తమంతట తామే సమాధానాలు కనుగొనేట్టు చేసే వాడు. "తెలిసికోవాలనే ఇచ్ఛ అతి సున్నితమైన మొక్క; ఆ మొక్క పెరిగి పెద్దవాలంటే అందుకు అవసరమైన ప్రేరేపణే కాక, విద్యార్థికి తగిన స్వేచ్ఛ కూడా ఉండాలి" అని వివరించే వాడు ఐన్‌స్టీన్.

చిత్రమైన సామ్యమేమిటంటే, అధ్యాత్మిక విషయాల్లో కూడా శ్రీ రమణులు, శ్రీ జిడ్డు కృష్ణమూర్తి, "నీ అంతట నువ్వే స్వేచ్ఛగా జిజ్ఞాసాపూర్వకంగా కనుక్కో"మని సాధకుల్ని ప్రోత్సహించే వారే కానీ, "ఇది నమ్ము. ఇది విశ్వసించు, ఈ మార్గమనుస

రించు" అని నిర్దేశించే వారు కాదు. గురువు ప్రేరణ కలిగిస్తాడే కానీ, జ్ఞానార్జనకు శిష్యుడు తన శక్తియుక్తుల మీదనే ఆధారపడవలసి ఉంటుంది. అప్పుడు శిష్యుడిలోనే నేర్పేవాడూ నేర్చుకునే వాడూ, ఇద్దరూ ప్రవర్తిల్లుతారు.

ఇక్కడ మనదేశంలో రమణుడు అరుణాచల పర్వతాన్ని అంటిపెట్టుకొని ఉండి పోయినట్లే, శతాబ్దాల క్రితం మరొక సాధుపురుషుడు చైనాలోని హూవాంగ్‌పో [HUANG PO] అనే పర్వతాన్ని ఆశ్రయం చేసుకొని జీవితకాలమంతా అక్కడే ఉండిపోయాడు. ఈ చైనీస్ మహనీయుడి విషయంలో జరిగిన చిత్రమేమంటే, అతడి అసలు పేరు మరుగున పడిపోయి చివరకు హువాంగ్‌పో అనే ఆ కొండపేరే అతడి పేరుగా స్థిరపడి పోయింది.

ప్రఖ్యాతిగాంచిన ఈ జెన్‌మాస్టర్ "జెన్ [ZEN] అనే బోధ ఉన్నది కానీ, ఈ జెన్‌కు బోధకులు లేరు" అంటుండేవాడు; ఈ జెన్‌ను ఒకరు మరొకరికి నేర్పలేరని ఆయన ఉద్దేశం. ఎవరికి వారు తమ సహజమైన స్పృహ [INTUITION] ద్వారా నేర్చుకోవలసిందే. కానీ, ఈ విద్యను, కూచోబెట్టి ఎవరూ ఎవరికీ నేర్పగలిగిన అవకాశం లేదు. మరొక అర్థమేమిటంటే, నేర్పేటి మనిషి ఇవాళ వుంటాడు, రేపు ఉండడు. కానీ మనిషి గనక జెన్ ధ్యానంలో నిమగ్నమైతే ద్వంద్వాతీత పరిస్థితి ఏర్పడి, అతడిలో తానూ, వేరొకరూ అనే స్ఫురణ నశిస్తుంది. అప్పుడిక మిగిలేది, గురువూ శిష్యుడూ అని ఇద్దరుకాక ఒక్కరే ఉండడం తటస్థిస్తుంది.

# జ్ఞానులు : జ్ఞానబంధువులు

సుప్రసిద్ధ బ్రిటీష్ గ్రంథకర్త ఆల్‌డస్ హక్స్లీ గొప్ప మేధావి. అతడి మెదడు ఒక విజ్ఞానఖని అని చెప్పుకునేవారు. ఆయన శ్రీ జిడ్డు కృష్ణమూర్తి గారికి ఆప్తమిత్రుడు. హక్స్లీ కృష్ణమూర్తితో ఒకమారు ఇలా అన్నాడు : "నేను సైన్సును గురించి, చిత్రలేఖనం గురించి, కవిత్వం, వేదాంతం, బౌద్ధం, హిందూమతం మొదలైన వాటిన్నిటినీ గురించి సాధికారికంగా ప్రసంగించగలను."

హక్స్లీ మెదడు సర్వశాస్త్ర సముచ్చయమని కృష్ణమూర్తి గారికి కూడా తెలుసు. కానీ ఈ మాట కృష్ణమూర్తితో అని, హక్స్లీ, "మరి నేనింత విజ్ఞానం, పాండిత్యం కలిగుంటే, ఇక నాకు నూతనము, స్వతంత్రము అయినటు వంటిది, 'ఒరిజినల్' అయి నటువంటిది అనుభవంలోకి వచ్చేనా అనే అనుమానం కలుగుతున్నది" అన్నాడు.

"ఇది ఎంత విచారకరమైన విషయమో ఆలోచించండి" అంటారు శ్రీ కృష్ణ మూర్తి మనతో. "అందుకే హక్స్లీ చివరకు 'మెస్కలిన్' వంటి మాదక ద్రవ్యం సేవించ నారంభించాడు. అదేమంటే 'ఒరిజినల్' అయినటువంటిది ఏదో ఒకటి నేను కనుగొని తీరాలి" అని సమాధాన మిచ్చేవాడంటారు కృష్ణమూర్తి.

"మరి మీ మెదడు, పవిత్రంగా ఎంచే పాత గ్రంథాలనే వల్లె వేస్తుంటుందా? లేక నిత్య నూతనమూ, ఒరిజినల్ అయినటువంటి దానిని కనుగొనగలిగి ఉన్నదా? ఆలోచించండి" అంటారు కృష్ణమూర్తి మనతో.

అరుణాచల రమణులకు కూడా శాస్త్ర పాండిత్యం ఆధ్యాత్మికతకు, అనగా నిత్య నూతనమైన దానిని కనుగొనేందుకు, అవరోధంగానే కనిపించేది. ఆశ్రమంలోని శ్రీ వెంకటరత్నం అనే అసిస్టెంట్ లైబ్రేరియనుతో, ఏదో సందర్భంలో శ్రీ రమణులు ఇలా అన్నట్లు శ్రీమతి సూరి నాగమ్మ తన పుస్తకంలో రాశారు. "శబ్దజాల మహారణ్యం చిత్త భ్రమణకారకం" అన్నారు పెద్దలు. అవి దరిచేర్చేవి కావు. శాస్త్ర పఠనమూ, పాండిత్యమూ కీర్తి భోగదాయకములే గానీ, ముముక్షువుకు కావలసిన ముక్తి సాధకమైన చిత్తశాంతికి

వినాశకరములే. పెద్ద పెద్ద బీరువాలు నిండుకొని ఎన్నో గ్రంథాలు. ఎన్నని చదువ గలరు? ఎన్నో మతాలు. ఎన్నెన్నో గ్రంథాలు. ఒక్క మతానికి చెందిన గ్రంథాలు చదివేందుకే జీవిత కాలం చాలదు. ఇక ఆచరణ ఎప్పుడు? చదివినకొద్దీ చదవాలనే అనిపిస్తుంది. అందుకు గల ఫలితం చదివిన వారితో చర్చిస్తూ కాలయాపన చేయడమే కానీ కడతేరనీయవు" అన్నారు.

అందుకే తనకు అత్యంత సన్నిహితుడైన శ్రీ కావ్యకంఠ గణపతిమునికి ఆత్మ సాక్షాత్కరించి ఉంటుందా అని ఎవరో శ్రీ రమణుల నడిగితే, "అంత గ్రంథ విజ్ఞానంతో నిండిపోయిన అతడికి ఆత్మ సాక్షాత్కారం ఎలా సాధ్యం?" అని కృష్ణమూర్తిగారు హక్స్లీ విషయంలో అన్నట్లే, శ్రీ రమణులు గణపతిముని విషయంలో అన్నారు.

ఆత్మ సాక్షాత్కారమొందిన ఏ నిజమైన మహానుభావుడైనా మనకిదే చెప్తుంటారు. శ్రీ శృంగేరి పీఠ ముప్ఫై నాల్గవ పీఠాధిపతి శ్రీ చంద్రశేఖరేంద్ర భారతి కూడా ఇదే విషయాన్ని మరింత మనోజ్ఞంగా ఒకమారు ఇలా చెప్పారు :

"నీకు సత్యాన్ని గురించి సందేహం ఉంటే, లేదా దానిని తర్కం చేత నిలబెట్టాలని అభిప్రాయముంటే, ధారాళంగా కావలసినన్ని పుస్తకాలు చదువు. నీకు సత్యాన్ని గురించి సందేహం లేకుంటే, జీవితంలో దానిని అనుభవానికి తేవాలని మాత్రం కోరుకున్నట్లైతే ఈ విస్తార గ్రంథాలోడన అనవసరం.

ఒక వంటవాడున్నాడనుకో. అతడు ఓ రుచికరమైన పదార్థం చేయాలను కుంటాడు. అప్పుడు ఆ భక్ష్యానికి కావలసిన వస్తువులూ, పరిమాణమూ, వండవలసిన విధానమూ అతనికి తెలియవలసిన అవసరం ఉన్నది. రుచి చూచేవారికి ఆ జ్ఞానమక్కర లేదు.

నేటి కాలంలో, ఆచార్యులవారి భాష్యాలన్నీ చదివితే కానీ అద్వైతి కాడనే భ్రమ ఒకటి ఉన్నది. ఆచార్యులు సత్యదర్శనం చేసినవారు; ద్రష్టలు. కానీ వారు తాము వ్రాసిన భాష్యములను చదివే ద్రష్టలయ్యారా ఏమి? పోనీ – వారు తాము రాసినది మరల మరల మననం చేసి అద్వైత దర్శనం చేశారనుకుంటే గోవిందపాదులు,

గౌడపాదులు, శుకాచార్యులు, వ్యాసాచార్యుల మాటేమిటి? వారు భగవత్పాదుల దర్శనాలను చదివే అద్వైతులయ్యారా ఏమి?

అందుచేత ఆత్మదర్శనానికి ఆచార్యుల భాష్యాలను అన్నిటినీ చదవాలన్న నియమమేమీ లేదు. పోతే ఈ భాష్యాలపై అనర్గళంగా ఉపన్యాసం చేయగలవారిని మనం ఎంతో మందిని చూస్తున్నాం. వాళ్ళంతా అద్వైత సత్యానికి అతి దాపులో ఉన్నారని ఏమైనా చెప్పగలమా?" అన్నారు.

అనుభవ పూర్వకంగా జ్ఞానం సంపాదించిన వారు వేరు; జ్ఞానబంధువులు వేరు. పూర్వం జ్యోతిశ్శాస్త్రం, వైద్యం, వేదాదులు పరోపకారానికే అభ్యసించారని, యోగ వాసిష్ఠంలోని ఈ శ్లోకాన్నిబట్టి తెలుస్తుంది:

వ్యాచష్టేయః పఠతి చశాస్త్రం భోగాయ శిల్పవత్।
యతతే న నత్వష్ఠానం జ్ఞాన బంధుః న ఉచ్యతే।

శాస్త్రాభ్యాసము, ఉపన్యాసాలు, శిల్పం చేసినట్లుగా భోగం కొరకు చేసేవాడు, అనుష్ఠానం కోసం – అనగా యోగాభ్యాసం మొదలగు వాని కొరకు ప్రయత్నించడు. అందువల్లనే అతడ్ని జ్ఞానబంధువన్నారు. ఆ కాలంలో శిల్పాదులు మాత్రమే జీవిత నిర్వహణకు అభ్యసించడం జరిగేది.

అదట్లా ఉంచి, దేనిని గురించైనా విని, చదివి, ఆ విధంగా కొంత పరిచయ మేర్పరచుకొని తెలుసుకోవడం ఒక జ్ఞానం. ఇలా సమాచారం గ్రహించడం ద్వారా తెలుసుకోడాన్ని ఆంగ్లంలో Knowledge through information అంటారు. అలా కాకుండా నేరుస్తున్న దానిలో ప్రవేశించి, అదే తానై తెలుసుకోవడం వేరు; ఈ రకమైన Knowledge by being అనేదే ఆధ్యాత్మికరంగంలో ప్రయోజనకారి. మొదటిరకం లోక వ్యవహారంలో మాత్రమే ఎక్కువగా ఉపయోగపడుతుంది.

# మహాత్ముల మహిమలు

మన 'మంచితనం' అనేది, తరచూ స్వార్థంతో కూడుకొని ఉంటుంది. ఏదో ఒక ఫలితం ఆశించకుండా మనం 'మంచి'గా ఉండలేము. మంచితనం మన సహజ స్వభావం కానంతవరకూ, అనగా అది మనలో నుండి 'స్పాంటేనియస్'గా పుట్టుకు రానంతవరకూ, దాని మూలం ఎప్పుడూ స్వార్థంతోనే ముడి వేసుకు ఉంటుంది. అలాంటి మన సాధారణ 'మంచితనానికి', మనలో కొందరు అవతలి వారి నుండి ధనాన్ని ఆశించవచ్చు; మరి కొందరు సంఘంలో కీర్తి ప్రతిష్ఠలను, లేదా ఇతరుల హృదయాల్లో శాశ్వత స్థానాన్ని, ఏదో ఒకటి ఆశించవచ్చు. ఆశించకుండా ఉండలేము.

మన మెరిగిన ఈ 'మంచితనం' కాక మరో మంచితనం ఉన్నది. అది ఆలోచనాత్మకమైనది కాదు. అది కరుణలో నుండి జనించేటువంటిది. కరుణ, ప్రేమ ఆకారణమైనవి. అవి ఎవరిపై ఎప్పుడు జనిస్తాయనేది ఎవరూ నిర్ధారించలేరు. కరుణాళువులైన మహానుభావుల్లో అరుణాచల రమణులు ఒకరు. ఆయన స్వయంగా పూనుకొని ఏ మహిమలూ ప్రదర్శించే వారు కాదు. 'పాపులారిటీ' కోసం పాకులాడాల్సిన అవసరం ఆయన కేనాడూ కలుగలేదు.

కానీ ఆయన సమక్షంలో కొన్ని విచిత్ర సంఘటనలు జరుగుతుండేవి. వాటి గురించి ఆయనతో ఎవరైనా ప్రస్తావించినా కూడా, ఆయన ఏమీ వ్యాఖ్యానించే వారు కాదు. 'ఏదో సంభవించిందనీ, అది అవతలి వారి బాధను నివారించిందనీ, ఆయనకు తెలుసు. కానీ అందుకాయన కర్తృత్వ బాధ్యత స్వీకరించడం గానీ, ఆ విషయాన్ని మరో సందర్భంలో అనడంగానీ జరిగేది కాదు: చూచి వూరుకునే వాడు.

శ్రీ రామస్వామి పిళ్ళై అనే శిష్యుడు రమణుణ్ణి గురించి ఇలా చెప్పుకొస్తాడు: "నేనిప్పుడు చెప్పబోయే సంఘటనలో రమణుడు నాటకీయంగా ఏదో సిద్ధిని ప్రదర్శించాడని అనుకోవద్దు. కానీ ఈ విషయాన్ని గనక జాగ్రత్తగా పరిశీలిస్తే, రమణుడు ఎంత నెమ్మదిగా ఎంత సహజ సిద్ధంగా కొన్ని కార్యాలు నిర్వహించాడో తెలుస్తుంది.

తిరువణ్ణామలై సమీపంలోని ఒక ఊర్లో మనిషి ఏదో తీవ్రమైన జ్వరం వల్లనో, 'అమ్మవారు' పోయడం వల్లనో రెండు నేత్రాల దృష్టిని కోల్పోయాడు. రమణాశ్రమం వెళ్ళి రమణుణ్ని సందర్శిస్తే మళ్ళీ దృష్టి కలుగుతుందని ఎవరో తమ విశ్వాసం కొద్దీ అతడితో చెప్పగా, మరొక మనిషి తోడు తీసుకొని ఆశ్రమానికి వచ్చాడు. శ్రీ రమణులు ఎక్కడ కూచోనుంటారు అని అక్కడున్న వారిని విచారిస్తున్నాడు.

అంతకు మునుపు కొద్ది రోజుల క్రితమే రమణుని దర్శనానికై ఇద్దరు యువ డాక్టర్లు ఆశ్రమానికి వచ్చారు. ఆ ఇద్దరికీ రమణునిపై ఎంతో గౌరవ భావం ఏర్పడింది. దర్శనం, ఆశ్రమ నివాసమూ పూర్తి చేసుకొని మద్రాసుకు తిరిగి వెళ్ళడానికి తమ కారుతో సహా అన్నీ సిద్ధం చేసుకున్నారు. రమణుని వద్ద సెలవు తీసుకొని బయట తమ కారు వద్దకు బయలుదేరుతూ, వెళ్ళేముందు ఒక్కసారి రమణ రూపాన్ని తనివితీరా చూచిపోదామని మళ్ళీ హాలు వద్దకు వచ్చారు. ఈలోగా హాలులోనికి ప్రవేశించిన ఆ దృష్టిహీనుడు, ఏదోవిధంగా తనకు దృష్టిని ప్రసాదించమంటూ రమణుణ్ణి వేడు కుంటున్నాడు. రమణుడు వింటున్నాడు కానీ ఏమీ మాట్లాడడం లేదు. ఇదంతా చూచిన ఆ ఇద్దరు డాక్టర్లు, ఆ వ్యక్తిని తమతో మద్రాసుకు తీసుకువెళ్ళి కంటి ఆపరేషను చేయిస్తామని అన్నారు. చివరకు ఆ వ్యక్తి ఆ డాక్టర్లతో కలిసి కారులో మద్రాసుకు వెళ్ళడం జరిగింది.

కొన్ని నెలల తర్వాత నేను శ్రీ రమణుల వారి చెంత కూచోనున్నప్పుడు, ఒక వ్యక్తి వచ్చి రమణుల ముందు ఒకటే సాష్టాంగ పడుతూండడం చూశాను. ఒక కంటికి చూపు కలిగిందనీ, ఇదంతా రమణుని కరుణేననీ అతడు పదే పదే చెప్పుకుంటూ ఉండడం చూశాను. ఆ డాక్టర్లు అప్పుడు అతణ్ణి మద్రాసుకు తీసుకువెళ్లి, ఆపరేషన్ వగైరా చేయించి, రెండు కళ్ళకూ దృష్టివచ్చేట్లు చేద్దామని గట్టి ప్రయత్నం చేసి, అది సాధ్యం కాకపోగా ఒక్క కంటికి మాత్రం దృష్టి వచ్చేట్లు చేయగలిగారట. శ్రీ రమణులు చెప్పినదంతా వింటూ మారుపలక్కుండా వుండిపోయారు. ఈ విషయంలో తనకేమీ సంబంధం లేనట్లు కూచున్నారు.

రమణుని సమక్షంలో అడపాదడపా ఇలాంటి మహిమాన్వితమైన సంఘటనలు జరుగుతుండేవి. కానీ రమణుడు ప్రతిపాదించిన నిశితతత్వ విచారణ ముందు ఈ వచ్చిపోయే అనుభవాల ప్రాధాన్యమేపాటిది?" అని ముగిస్తాడు శ్రీ రామస్వామి పిళ్ళై.

బొంబాయి నగరంలో జీవించి తరించిన నిసర్గ దత్త మహరాజ్ సమక్షంలో కూడా మనుషులకు 'మంచి' జరుగుతుండేది. ఆయన చెంత వచ్చి కూర్చున్న వారు అక్కడ జరిగే సంభాషణలు విన్నందువల్ల చిత్తశాంతిని పొందేవారు; జ్ఞానం సముపార్జించుకునేవారు. వారి వారి ప్రాప్తాన్ననుసరించి లౌకికంగా కూడా కొంత మేలు జరుగుతుండేది.

అందుకే ఆయన ఒక వ్యక్తి ప్రశ్నకు సమాధానమిస్తూ "నీవు నీ లక్ష్యాన్ని అందుకున్నందువల్ల నీకు స్వస్వరూప జ్ఞానం ఉదయించగానే, భూమిపై నీ ఉనికే మనుష్యుల కొక మహాదీవెనగా పరిణమిస్తుంది. ఆ విషయం నీవు ఎరుగకపోవచ్చు; ఒక్కోమారు లోకానికి కూడా తెలియకపోవచ్చు. అయినప్పటికీ నీ నుండి సహాయం నాలుగు వైపులా విస్తరిల్ల నారంభిస్తుంది. లోకంలోని రాజకీయవేత్తలు, ధర్మదాతలు అందరూ కలిసి చేయగలిగిన మేలుకన్నా, ఎక్కువ లోకోపకారం చేసే సాధు పురుషులున్నారు. ఏ విజ్ఞానమూ లేని వారైనప్పటికీ, ఉద్దేశ రహితంగా ఇలాంటి సజ్జనులు, దశదిశలా వెలుతురును ప్రసరింపచేస్తుంటారు. ఇటువంటి పుణ్య పురుషులు చేసిన 'మహిమలను' గురించి ఎవరైనా వారికి వెళ్ళి చెప్పినప్పుడు, అందరితోబాటు వారు కూడా ఆశ్చర్యపడుతుంటారు. కానీ ఇవేవీ తమ స్వంతమనుకోరు. కాబట్టి, వారికి గర్వమూ ఉదయించదు. పేరు ప్రతిష్ఠలకై పాకులాడే ప్రసక్తీ లేదు. వారు తమ కోసం తాము కోరేదంటూ ఏదీ వుండదు; ఆఖరికి మరొకరికి సహాయ పడుతున్నామనే ఆనందం కూడా వారికి అక్కరలేదు. అన్నిటికీ ఆ భగవంతుడి దయే కారణమని పూర్తిగా ఎరిగి ఉన్నవారు కాబట్టి, వారి హృదయమెప్పుడూ శాంతంగానే ఉంటుంది" అంటారు శ్రీ నిసర్గదత్త

# జాఫ్నా మనిషి

అరుణాచల రమణుడి జీవిత కాలంలో ఆయనకు సేవ చేసిన వారిని తలచు కోవడం కూడా మన మనస్సుకు ఎంతో సంతోషన్నిస్తుంది. శ్రీరామచంద్రుడికి సేవ చేసిన వారి భాగ్యమెటువంటిదో, ఈ రమణుడి సేవకుల భాగ్యం కూడా అటువంటిదే.

రమణుడు విరూపాక్ష గుహ వద్ద నివసిస్తున్న రోజుల్లో ఆయనకు తోడుగా కంద స్వామి అనే భక్తుడొకడుండేవాడు. ఆ కాలంలో అక్కడ దగ్గరలో నీటి సదుపాయం ఉండేది కాదు. వంట చేయడానికి తగిన వసతి కానీ, మనుషులు నివసించే చోటు గానీ లేదు. ఆ ప్రాంతంలో నీటి ఊట ఒకటుంటే దానిచుట్టూ ఉన్న రాయి రప్పా తీసి, నీరు లభించేట్లు  చేశాడు కందస్వామి. పెరిగిఉన్న ముళ్ళ చెట్లూ, దుబ్బూ అంతా తెగ్గొట్టి, పెకలించి వేశాడు. అక్కడ ఒక చిన్న కుటీరం నిర్మించి ఆ చుట్టూ ఉన్న నేలనంతా చదును చేశాడు. మామిడి, పనస, కొబ్బరి వంటి ఫలవృక్షాలు నాటాడు. పెరుమాళ్ స్వామి అనే మరో భక్తుడి సాయంతో ఇప్పుడక్కడ ఉన్న ఇటిక నిర్మాణాన్ని పూర్తిచేసి శ్రీ రమణుల వారిని అక్కడికి వచ్చి నివసించమని ఆహ్వానించాడు. రమణుడితో అక్కడే కొన్నాళ్ళు కలిసి జీవించి ఆ తర్వాత తన స్వగ్రామానికి వెళ్ళిపోయాడు. మళ్ళీ తిరువణ్ణామలై తిరిగి రాలేదు. అటు తర్వాత అతడిని గురించి ఏ వర్తమానమూ లేదు. అతడు ఎంతో శ్రమించి నిర్మించిన ఆశ్రమానికి శ్రీ రమణులు అతడి పేరే పెట్టించారు. ఈ స్కందాశ్రమం ఈనాటికీ అక్కడ ఉన్నది. రమణాశ్రమ నిర్వాహకులే దానిని చూస్తుంటారు. రమణ భక్తులు ఈ స్కందాశ్రమాన్ని ఆసక్తితో వెళ్లి చూచి వస్తుంటారు.

సేవా ధర్మాన్ని పాటించిన వారిలో శ్రీలంకలోని జాఫ్నా నుంచి వచ్చిన అమృతానంద అనే మరో వ్యక్తి ఉండేవాడు. రమణుడి ఔన్నత్యం గురించి వినిన అమృతానంద, తిరువణ్ణామలై వచ్చి స్కందాశ్రమంలో కొంతకాలం నివసించాడు. కంద స్వామిలాగే ఇతడు కూడా ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే ఉండేవాడు. బాటలమీద రాలిన చెట్ల ఆకులూ, చెత్తా చెదారం అన్నిటినీ ఊడ్చి అవతల పారేస్తుండేవాడు. ఆవు

పేడతో అలకతగిన ప్రదేశాలన్నీ అలికి చక్కగా ఉంచుతుండేవాడు. రమణుడు తిరుగాడే చోటంతా అమిత పరిశుభ్రంగా ఉండాలని అతడి భావన. అమృతానంద ఎప్పుడైనా ఒకసారి తిరువణ్ణామలై వెళ్ళి అక్కడ రెండు మూడు రోజులు ఉండిపోయేవాడు. ఆ సమయాల్లో బాటలమీద, రాయీ రప్పా, చెట్ల కొమ్మలూ, చెత్తా కనిపిస్తే రమణుడు చిరునవ్వుతో "జాఫ్నా పెద్దమనిషి ఆశ్రమంలో లేడా ఏమిటి?" అని అంటుండేవారు.

ఒక రోజున అమృతానంద నీళ్ళలో ఆవుపేడ ఎక్కువగా కలిపి, బాటలన్నీ అలికే సరికి, వాటిపై నడచివెళ్ళిన వారి కాళ్ళకి, కొద్దిగా పేడ అతుక్కొన్నది. పెరుమాళ్ స్వామికి అమృతానంద మీద చెడ్డ కోపమొచ్చి, "ఈ జాఫ్నా మనిషి ఆవుపేడతో ఈ ప్రదేశాన్నంతా ఖరాబు చేస్తున్నాడు. అతడికిక్కడ ఇక అన్నం పెట్టకండి" అన్నాడు తోటి వారితో.

రమణుడు అమృతానందను 'జాఫ్నా జంటిల్‌మన్' అని ఎంతో ఆదరంగా వ్యవహరిస్తే, పెరుమాళ్ స్వామి అతణ్ణి 'జాఫ్నామాన్' అనే వాడనేది పాఠకులు ఈపాటికే గ్రహించి ఉంటారు. దీనినిబట్టి రమణుడికి అమృతానంద పట్ల ఎలాంటి అభిప్రాయం ఉండేదో, పెరుమాళ్‌స్వామి వంటి వారికి అతణ్ణి గురించి ఎలాంటి భావముండేదో తెలియడమే కాక, "ఆశ్రమంలో అన్నం పెట్టకండి" అనేటంతటి శిక్షకు అమృతానంద అర్హుడేనా అనే విసయం కూడా పాఠకులు ఆలోచించవచ్చు.

మరికాసేపటికి అమృతానంద ఆశ్రమంలో కనిపించలేదు. అందరూ అతడి కోసం వెతుకనారంభించారు. అమృతానంద చివరికో కొబ్బరిచెట్టు మీద మట్టల వెనుక కనిపించాడు. పెరుమాళ్‌స్వామి, అతణ్ణి కిందికి దిగిరమ్మని అన్నాడు. అమృతానంద ఇతడికే సమాధానమూ చెప్పకుండా, తన చేతికందిన లేత కొబ్బరికాయలు కొట్టి, అందులోని నీరు తాగనారంభించాడు. పెరుమాళ్‌స్వామి 'ఇతడికి అన్నం పెట్టవద్దని' శాసించగలిగాడే కానీ, ప్రకృతి ప్రసాదించిన కొబ్బరి నీళ్ళను తాగడాన్ని అంత సులభంగా ఆటంకపరచలేడు కదా?

పెరుమాళ్‌స్వామి అమృతానందను దిగి రమ్మని మళ్ళీ పిలిచాడు. అక్కడున్న వారంతా కూడా, 'దిగిరావయ్యా' అని ఎంతగానో అభ్యర్థించారు. కానీ అతడు ఎవర్నీ

లెక్క చేయలేదు. ఎవరి మాటా పట్టించుకోలేదు. మధ్యాహ్న భోజనవేళకు అమృతానంద హాజరుకాలేదనే విషయం గమనించిన శ్రీరమణులు 'అతడేడీ?' అని అడిగాడు. అమృతానంత చెట్టెక్కి కూచున్నాడనీ, అందుకు సంబంధించిన వృత్తాంతమంతా రమణుడికి చెప్పారు.

శ్రీ రమణుడు బయట చెట్టు వద్దకు వెళ్ళి, అమృతానందను దిగిరమ్మని పిలిచాడు. ఆశ్రమంలో మరెవర్నీ లెక్కచేయని అమృతానంద, రమణుడు పిలవగానే, మారు మాటాడకుండా, చిన్న పిల్లవాడి వతుగా ఆయన చెప్పినట్లు చేస్తూ, దిగివచ్చాడు. శ్రీ రాముడు ఆజ్ఞ ఆంజనేయుడికి శిరోధార్యమైనట్లే, శ్రీ రమణుల మాటమీద అమృతానందకు అంత గురి ఉండటంలో ఆశ్చర్యమేముంది?

అతి సామాన్యుడిగా కనిపించే ఈ అమృతానంద, మహా గురువుగా గుర్తింపడిన శ్రీ రమణుల వారి మధ్య ఉన్న ఈ పరస్పర ఆదరాభిమానానికి కారణమేమిటో !

# సిద్ధ పురుషుడు

శ్రీ రమణుడి అభీష్టం నెరవేర్చడం తన పరమ కర్తవ్యంగా భావించిన అమృతానంద, ఆయన నోటి నుండి వెలువడే మాటకు ఎంత ప్రాధాన్యమిచ్చేవాడో మరో విషయం చెబితే తెలుస్తుంది. ఒకసారి అమృతానంద యాత్రలుచేస్తూ చాలా చోట్లకుపోయి, రిషీకేష్‌కు కూడా వెళ్ళి, ఆశ్రమానికి తిరిగి వచ్చాడు. ఒకప్పుడు గోవిందగిరి అనే ఒక సాధకుడు, రమణుణ్ణి దర్శించుకున్న తర్వాత, రిషీకేశ్‌లోని ఆ ఆశ్రమానికి వెళ్లి, తిరువణ్ణామలైకి తిరిగి వచ్చిన తర్వాత, ఒక రోజున రమణుడు ఏదో పుస్తకం గురించి అడిగాడు. ఆ పుస్తకాన్ని అమృతానంద రమణాశ్రమంలో చదువుకోడానికని తీసుకొని, అనుకోకుండా రిషీకేష్ ఆశ్రమంలో వదిలేసి వచ్చానని చెప్పాడు.

మర్నాడు అమృతానంద రమణాశ్రమంలో కనిపించలేదు. మధ్య మధ్యలో ఈ విధంగా అదృశ్యం కావడం అమృతానంద విషయంలో ఆశ్రమంలో అందరికీ అనుభవమే కాబట్టి, దీనిని గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. కానీ ఆశ్రమం నుంచి అరువు తీసుకొని రిషీకేష్‌లో వదిలేసిన ఆ పుస్తకం కోసమై, అతడు అప్పటికప్పుడే తిరువణ్ణామలై నుండి బయలుదేరి మళ్ళీ రిషీకేష్ వెళ్ళి వచ్చాడని, తర్వాత తెలిసింది. రైల్వే వారు కూడా ఇతడి బీద వేషం చూచి, టిక్కెట్టు చూపించమని అడిగేవారు కాదు. కొన్నాళ్ళకు పుస్తకంతో సహా అమృతానంద మళ్ళీ రమణాశ్రమంలో కనిపించి, ఆ పుస్తకం రమణుడి చేతుల్లో పెట్టాడు. రమణుడి వాక్కు అమృతానందకు అనుల్లంఘనీయం ! శ్రమ ఎంతటిదైనప్పటికీ అదొక లెక్కలోనిది కాదు.

శ్రీ రమణుల తల్లి మరణించినప్పుడు, ఆమెను కొండ కింద ఉన్న ప్రదేశంలో సమాధి చేశారు. అక్కడి మొదటి పూలచెట్లను అమృతానందే నాటాడు. ఈ ప్రాంతం అంతా ఇప్పుడో చిన్న ఉద్యానవనంగా రూపొందింది. కొంతకాలం అనంతరం అతడు జాఫ్నాకు తిరిగివెళ్ళి అక్కడే మరణించాడు. రమణుడికి ఈ వార్తనందచేసినప్పుడు "అమృతానంత గొప్ప సిద్ధపురుషుడు" అన్నాడు.

ఎంతటి వాడినైనా రమణుడు ఊరకనే ప్రశంసించడనే మాట పాఠకులకు తెలియనిది కాదు. ఆ మాటకొస్తే "ఉన్నది ఉన్నట్లు చూచే వాడెప్పుడూ ఉన్నది ఉన్నట్లు తప్ప మరో విధంగా మాట్లాడడు. ఈ లోకుల నుంచి అతడాసించేది ఏమీ ఉండదు. కాబట్టి అనవసరంగా ఎవర్నీ మెచ్చుకోవలసిన పనిలేదు.

అమృతానంద సిద్ధపురుషుడనడానికి రమణుడికి మరెన్నో విషయాలు తెలిసి ఉండవచ్చు. కానీ ఆ సందర్భంలో రమణుడు చెప్పిన ఈ ఉదంతమొకటి తెలుసుకుంటే, రమణుడు ఆ మాట ఎందుకన్నాడో మనకూ కొద్దిగా స్ఫురిస్తుంది. ఒకసారి జాఫ్నాలో వర్షపు చినుకు పడనందువల్ల తీవ్రమైన క్షామం ఏర్పడింది. ఆ ప్రాంతంలో వర్షం పడేట్లుచేసి సస్యశ్యామలం చేయాలని అమృతానంద అభిప్రాయపడ్డాడు. అందుకని అక్కడే అడవిలో ఉన్న మరియమ్మన్ ఆలయానికి కుంభాభిషేకం చేయించాలని అమృతానంద నిశ్చయించాడు. బీదలకు అన్నదానం కూడా జరగడానికి ఏర్పాట్లు గావించ నారంభించాడు. కుంభాభిషేకం ముందు రోజు కొబ్బరికాయలు, నిమ్మకాయలు, బెల్లం మొదలైన వస్తు సామగ్రి తీసుకు వచ్చి, ఆ గుడి వద్దనున్న ఓ గదిలో దాచారు. ఆ గది తాళపుచెవి అమృతానంద చేతికిచ్చి చూచుకోమన్నారు.

కుంభాభిషేకం ముందు రోజునే చాలామంది పేదలు, పెద్ద చిన్నా, ముసిలీ ముతకా, అంతా ఆ రాత్రికి అక్కడికి చేరుకున్నారు. ఆ ఎండాకాలంలో నడిరాత్రి వేళ వారందరికీ అమితంగా దాహం వేసింది. పిల్లలు ఏడవ నారంభించారు. పెద్దలు మూలుగుతున్నారు. అమృతానంద వీరందరి బాధ చూడలేకపోయాడు. ఓ పెద్ద పాత్ర తీసుకొని, లేత కొబ్బరికాయలన్నిటినీ కొట్టి ఆ నీరు ఆ పాత్రలో పోశాడు. నిమ్మకాయలు పిండి ఆ రసం కూడా అందులో పోశాడు. ఇంత బెల్లం కలిపాడు. కావలసినన్ని మంచినీళ్ళు పోశాడు. అక్కడి వారందరికీ ఈ మధుర పానీయం అందించాడు. అక్కడి పేదవారందరూ దాహం తీరి చాలా ఉపశమనం పొందారు.

మర్నాడు కుంభాభిషేకానికి ఆ ఆలయం వద్దకు వచ్చిన వారికి, ఈ విరిగిన కొబ్బరి చిప్పలు, నిమ్మకాయ తొక్కలు కనిపించాయి. 'ఇదేమిటని' అమృతానందను అడిగారు. "నేటి కుంభాభిషేకానికి అవసరమైన కొబ్బరికాయలు నిమ్మకాయలు, మిగతా

వస్తువులు సిద్ధంగా ఉన్నాయి.  ఇక్కడ పడివున్న మిగతా కాయలతో నేను నిన్న రాత్రే కుంభాభిషేకం చేశాను. మానవ సేవే మాధవసేవ అంటారు కదా?" అని సమాధానం చెప్పాడు అమృతానంద. అతడు చేసిన పనిని ఎవరూ విమర్శించకపోగా, అందరూ అతణ్ణి ప్రశంసించారు. "అమృతానంద అంతటి ఆత్మోన్నతి కలిగినవాడు" అని ముగించాడు శ్రీ రమణుడు.

రమణుడి భక్తి భావంలో జాలి, దయ, కరుణ, మానవత్వం మొదలైన గుణాలకే అధిక ప్రాధాన్యం ఉండేది. అలాంటి రమణుడికి అమృతానందమీద అభిమానముండ టంలో ఆశ్చర్యమేముంటుంది?

అయితే ఆత్మసాక్షాత్కారం కలిగిన రమణ, అమృతానంద వంటి వారి మానవ సేవ మాధనసేవగా రూపొందడం వేరు. మనవంటి వారు ఇదే పదాలను వాడుతూ ప్రారంభించే ఆలోచనాపూర్వకమైన 'మావనసేవ' ఉద్దేశం వేరు; ఉద్దేశపూర్వకమైన ఈ సేవ ఏదో ఒక ఫలితాన్ని ఆశిస్తుంది. మనది అవ్యాజమైన కరుణ కాదు. అలాంటి కరుణ, లేక ఆత్మ, మనిషికి సాక్షాత్కరించిన తర్వాతనే, అంటే తనను తాను తెలుసుకొని నందువల్లనే, మానవుడెవరో అర్థమవుతుంది. అది అర్థమైనప్పుడు, ఆశ మిగలదు; కరుణ మాత్రమే ఉంటుంది. ఆ కరుణకు కారణం ఉండదు.

## మోక్షప్రాప్తి

మోక్షమనగా నీవు పుట్టనివాడవని తెలుసుకోవడమే. నిశ్చలత్వము పొంది 'నేనే బ్రహ్మము'నని తెలుసుకో. నిశ్చలత్వము పొందడమంటే మనోభావన లేవీ లేకుండా ఉండడం. కావలసినది 'తెలుసుకోడం' గాని 'భావించడం' కాదు.

# భేదభావ నిర్మూలన

'**భా**రతజాతి ప్రగతి సాధించాలంటే వర్ణాశ్రమ ధర్మాన్ని అంతంచేయాలి గదా?' అని అరుణాచల రమణుణ్ణి, ఆయన దర్శనార్థమై వచ్చిన ఓ పెద్దమనిషి అడిగాడు. అందుకు రమణుడు, 'వర్ణాశ్రమం అవసరమో, అనవసరమో చెప్పడానికి ఎలా వీలవుతుంది? ఇలాంటి విషయాలమీద నేనేమీ చెప్పజాలను. వర్ణాశ్రమ ధర్మంపై మీ అభిప్రాయమేమిటని, వచ్చిన వాళ్ళు నన్నడుగుతుంటారు. నాకు తోచించి నేనేదైనా చెప్తాననుకోండి, అది తీసుకువెళ్లి పత్రికల్లో వేసుకుంటారు. ఫలాని ఆయన కూడా ఈ అభిప్రాయం వెలిబుచ్చాడంటారు. ఏ శాస్త్రాలైతే ఈ వర్ణాశ్రమ ధర్మాన్ని ప్రతిపాదించాయో అవే శాస్త్రాలు ఈ జీవులందరూ ఒకటేననీ, వీరి యెడల అభేద బుద్ధి కలిగి ఉండటం ఒక్కటే వాస్తవమనీ కూడా చెప్పాయి. జీవులందరూ ఒకటేననీ, సమస్త జీవరాశి వెనుక ఉన్నదొక్కటేనని చెప్పడంకంటె, గొప్ప సత్యాన్ని బోధించడం సాధ్యమా? జాతినంతా సంస్కరించే ముందు, మనిషి ప్రథమంగా తనను తాను సంస్కరించుకోడం ఎంతైనా అవసరం. ప్రతి మనిషి మొదట తన స్వరూప స్వభావాలేమిటో తెలుసుకోవడం అత్యవసరం. ఇది చేసిన తర్వాత, దేశాన్ని కానీ జాతిని కానీ సంస్కరించాలి అని భావిస్తే సంస్కరణకు పూనుకోవచ్చు. (అవిభక్త పంజాబ్‌కు చెందిన) స్వామి రామతీర్థుడు ఓ మారు ఒక ప్రకటన వంటిది జారీ చేశాడు. "సంస్కరణకర్తలు కావాలి – కానీ ముందు తమని తాము సంస్కరించుకున్న వారే ఇందుకు అర్హులు సుమా !" అన్నాడు.

ఈ లోకంలో ఏ ఇద్దరూ ఒకలాగా వుండరు, ఒకే మాదిరిగా కర్మను ఆచరించరు. మనము తొలగిద్దామని ఎంతగా ప్రయత్నించినప్పటికీ మనిషికీ మనిషికీ బాహ్యంగా కనిపించే భేదాలు ఉండి తీరుతాయి. సంఘ సంస్కర్తలనబడేవారు ఈ వర్ణాశ్రమం సృష్టించిన భేదాలను అంతంచేద్దామని ప్రయత్నించారు. వారు ఆ ప్రయత్నంలో విజయం సాధించకపోగా, తమ ప్రయత్నం ద్వారా మరికొన్ని వర్ణాలను, అనగా బ్రహ్మ సమాజీయులు, ఆర్య సమాజీయులు అనే వర్ణాలను మాత్రం సృష్టించారు. అందువల్ల

ఎవరికి వారు తమ నిజ స్వరూప స్వభావాలను కనుగొనడం ఒక్కటే మార్గం” అని సమాధానమిచ్చాడు.

శ్రీ రమణుణ్ణి గురించి కృష్ణ భిక్షు అనే శిష్యుడు ఒక చిన్న ఉదంతం చెప్పుకొస్తాడు. ఒక మారు రమణుడు ఆశ్రమ భోజనశాలలో కూర్చొని ఉన్నప్పుడు, తాను బ్రాహ్మణుడని కానీ, బ్రాహ్మణేతరుడని కానీ తనకు అనిపించదు అని అన్నాడు. అందువల్ల తాను వర్ణాశ్రమ ధర్మానికి చెందని ‘అతి ఆశ్రమి’గా పేర్కొనవచ్చునన్నాడు.

రమణుడు జీవించిన రోజుల్లో భోజనశాల మధ్యగా ఒక తెర కట్టేవారు. బ్రాహ్మణులందరూ ఒక వంక కూర్చునేవారు. బ్రాహ్మణేతరులు తెరకు అవతల పక్కన కూర్చుండేవారు. రమణుడు తెరకట్టిన చోట దానికి ఎదురుగా గోడవద్ద భోజనానికి కూర్చొనేవాడు. ఏకకాలమందు తెర ఇవతల అవతల నున్నవారికి కనిపిస్తుండేవాడు. ఒక రోజున రమణుడి బంధువైన ఒక బ్రాహ్మణుడు తాను వెళ్ళి బ్రాహ్మణేతరుల నడుమ కూచుంటానన్నాడు. ఆశ్రమ సర్వాధికారి అంగీకరించలేదు. వారిద్దరూ ఆ విషయమై వాదులాడుకుంటూ ఉండగా, రమణుడు ఆ సమయానికి అటువస్తూ విషయమేమిటని అడిగాడు. “ఇతడు తాను ఏ కులానికి చెందనివాణ్ణి అంటున్నాడు. శ్రీ రమణుల సమక్షంలో అందరూ సమానులేనట. తాను కేవలం మనిషినే కానీ, తనని ఈ కులమతాలు, జాతి భేదాలు బంధించలేవనీ, అందువల్ల తాను వెళ్ళి బ్రాహ్మణేతరుల మధ్య కూచుంటానంటున్నాడు” అని వివరించాడు సర్వాధికారి.

“అలాగా?” అంటూ రమణుడు తన ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ, “అలాగైతే, అతణ్ణి బ్రాహ్మణుల మధ్యే కూచొని భోజనం చేయమని నువ్వు బలవంతపెట్టటం భావ్యం కాదు.” అని సర్వాధికారితో అంటూ, ఇటు తన బంధువు వంకకు తిరిగి “కానీ నీదీ పొరపాటే. తెర ఇవతల కూచున్న వీరంతా తాము బ్రాహ్మణేతరుల మనుకుంటున్నారు. నువ్వా, కులభేదం లేనివాడివైతివి. మరి కులాన్ని గుర్తుంచుకున్నవారి మధ్య నువ్వు ఎలా కూర్చుంటావ్? తాను బ్రాహ్మణుడిని కానీ బ్రాహ్మణేతరుణ్ణి అని కానీ గుర్తించని మనిషిని ఇక్కడ నేనొక్కణ్ణే ఉన్నాను. అందువల్ల నువ్వు నాతో కూర్చోవచ్చు” అంటూ

అక్కడున్న ఒక సహాయకుణ్ణి పిలిచి "ఇతడికి నా పక్కనే ఒక విస్తరి వేయండి. నాతోనే కూర్చొని భోంచేస్తాడు" అన్నాడు. రమణుడి బంధువైన ఆ యువకుడికి, మహానుభావుడైన శ్రీ రమణుడి సరసనే కూచొని, తానూ కులభేదానికి అతీతంగా ఎదిగానని ప్రకటించుకోడం దుస్సాహసమనిపించి, మారు మాటాడకుండా వెళ్లి బ్రాహ్మణ పంక్తిలో కూచున్నాడు.

ఇక్కడ మనం జాగ్రత్తగా గమనించాల్సింది రమణుడికి, అతడి బంధువుకీ, మానసిక స్థితిలోనున్న తేడా. మనమందరం ఆ యువకుడి వంటి వారమే. ఆలోచనా పూర్వకంగా "మేము కులమత భేదాలు పాటించడంలేదని" ఆర్భాటంగా ప్రకటించవచ్చు. కానీ బలవంతంగా సాధించిన ఈ భేద భావ నిర్మూలన ఎక్కువకాలం నిలవదు. ఆలోచన అనేది ఎప్పుడూ ఏదో ప్రయోజనమాశిస్తునే ఉంటుంది. ఐడియా, ఐడియాలజీ, ఆదర్శం మొదలైన వాటి ఆధారంగా నిర్మించుకున్న సిద్ధాంతాలన్నీ కూడా ఆలోచన నుండి జనించేవే. వీటన్నిటికీ చివరకు ఫలితం దక్కాలి. మనసు ఊహించిన ఒక అనుభూతి కలగాలనే ఆశ ఉంటుంది. మనసులో ఆ ఆశ ఉన్నంతకాలం, ఆశాభంగమూ, దాని వెన్నంటే ఉంటుంది. ఏదో ఒకనాడు ఎక్కడో ఆశాభంగం జరగక తప్పదు. వర్గ విభేదాలు నశింపజేయడానికి ఆలోచనా పూర్వకంగా ప్రయత్నించి, అతిపెద్ద విప్లవాలు లేవదీసిన వారు, అందుకు అనుకూలంగా రాజ్యాలు నెలకొల్పిన వారు కూడా, మనుష్య స్వభావాన్ని బలవంతంగా మార్చలేక నిరాశోపహతులైనారు.

భేదభావం, వర్ణ, వర్గ విభేదాలు, నశించే వీలున్నది. అయితే అది ఆలోచనతో సాధించలేము. వాస్తవాన్ని దర్శిస్తేనే నశిస్తుంది. భేదాలు సృష్టించేది ఈ మనసేనని కనుగొన్నప్పుడు, 'లేని భేదాన్ని' పట్టుకు వేళ్ళాడుతున్నానని, భ్రమపడి తిరుగుతున్నానని తెలిస్తే, భేదభావం దానంతట అదే రాలిపడిపోతుంది.

కాబట్టి చేయవలసిన ప్రయత్నం, భేదం తొలగించడానికై కాదు. మనసు ఈ 'లేని భావాన్ని' ఎలా సృష్టించుకున్నదీ, ఎందుకు సృష్టించుకున్నదీ, దీని ఫలితంగా తన దృష్టి ఎలా సంకుచితమైనదీ, అనే విషయాలన్నీ తనలో తాను అమూలాగ్రంగా కను

గౌనాలి. సంఘపు విలువలను తాను ఎందుకు గౌరవిస్తున్నదీ, ఇందులో నుండి బయలు దేరుతున్న క్రౌర్యంలో తానెలా పాలుపంచుకొంటున్నదీ, అన్నీ గనక కంటికి నిజంగా కనిపిస్తే, భేద భావం నశిస్తుంది.

పులిని చూచి నక్క వాతపెట్టుకున్నట్లుగా, శ్రీ రమణుణ్ణి చూచి అతడ్ని అనుకరిద్దామని వ్యర్థంగా ప్రయత్నించిన అతడి బంధువులాగా కాకుండా, నిజంగా భేదం నశించి రమణుని మానసిక స్థితి ఏమిటో అర్థం చేసుకొని, దాని నందుకోవాలి.

## వ్యవహారదశ - సమాధి

వ్యవహార దశలో కూడా సమాధి వున్నది. సమాధిని విడిచి మన వ్యవహారానికి ప్రత్యేక సత్తా లేదు. బొమ్మలు ప్రదర్శితమౌతున్నా కాకపోయినా, సినిమా తెర ఉండనే ఉన్నది. అదే రీతిగా వ్యవహారంలోనూ శాంతిలో కూడా ఆత్మ నిత్య సిద్ధమే.

# మేధావుల నిర్లిప్తత

**కీ**ర్తికాముకత్వ మున్నవారు తత్త్వజ్ఞానాన్ని ప్రేమించలేరు. మొదటిది ఇహలోకంతో ముడిపడ్డది; రెండవది చర్మచక్షువులకు కనిపించే ఈ లోకానికి అతీతమైనది. మానవాళిలో అధిక భాగం ఇహలోకంతోనే సరిపెట్టుకుంటుంది. కాకపోతే మానవుల్లోనే పలు రకాల శ్రేణులు, వారిలోనే తరతమ భేదాలు ఎన్నో కనిపిస్తాయి. సామాన్య ప్రజ దృష్టి యావత్తూ తిండీ బట్టా వసతి మీద ఉంటుంది. ఉండక తప్పదు కూడాను. ఇవి అవసరంలేని వారు ఎవరు? అయితే ఈ కనీసావసరాలు తీరగానే, మనిషికి సంఘంలో తన స్థానమేమిటి, దానిని ఎలా అభివృద్ధి పరచుకోవాలి అనే ఆలోచన ప్రారంభమవుతుంది. విద్యావంతులు, మేధావి వర్గాల వారికి వృత్తి ఉద్యోగాల ద్వారా కనీసావసరాలు అప్పటికి తీరే ఉంటాయి కాబట్టి, వారి కాంక్షలన్నీ భాగ్యమూ కీర్తి మొదలైన వాటిని చుట్టుముడుతాయి. ఇవి కూడా తీరిన కొందరు అదృష్టవంతులు ఇక ఇక్కడ సాధించవలసింది ఏమీ లేదు కాబట్టి "ఆధ్యాత్మికత" అనే దానిని సాధిస్తే ఎలా ఉంటుందో ఆ అనుభవం కూడా పొంది చూద్దామనుకుంటూ ఉంటారు. మిగతా లౌకికానుభవాలతో విసిగినందు వల్ల ఈ ఆధ్యాత్మికానుభూతి ఎలాంటిదోనని 'ఐడిల్ క్యూరియాసిటీ'యే కానీ, ఇది వారిలో ఏర్పడిన నిజమైన 'దాహం' కాదు; జీవితాన్ని గురించి లోతుగా ఆలోచించిన కారణంగా ఏర్పడిన జిజ్ఞాస కాదు. ఈ తరహావారిలో జీవితంపట్ల నిజమైన "సీరియస్ నెస్" ఉంటుందని మనం భావించనక్కరలేదు.

సీరియస్‌గా ఉండడమంటే గంభీరవదనంతో కనుబొమలు ముడివైచి దృక్కులు సారించడం, 'అధరము కదలియుగదలక మధురములగు భాషలుడిగి మౌనవ్రతు'డై ఉండడం', చిరునవ్వులేని విచారగ్రస్తమైన ముఖంతో తిరుగాడుతూ ఉండడం కాదు; ఒక విషయాన్ని పట్టువదలని విక్రమార్కునిలా తదేక దీక్షతో అన్వేషిస్తూ పరిశోధిస్తూ జీవించడం, విసుగూ విరామం లేకుండా రేబవళ్ళూ సంతోషంగా స్వేచ్ఛగా "టెన్షన్ ఫ్రీ"గా తన లక్ష్యాన్ని ఎల్లప్పుడూ దృష్టిలో ఉంచుకొని కృషిచేస్తూ ఉండడం 'సీరియస్ నెస్' అనిపించుకుంటుంది.

*నీలంరాజు లక్ష్మీప్రసాద్*

పెద్ద చదువులు చదివి, పదిమందిలో ప్రసంగించి పేరు ప్రఖ్యాతులు ఆర్జించిన వారు కూడా నే చెప్పేటువంటి సీరియస్ మనుషులు కాకపోవచ్చు. వీరిలో కొందరైతే భారతీయ వేదాంతాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన సుప్రసిద్ధ వేదాంతులు అయినప్పటికీ వీరికి ఆ చదివిన విషయాన్ని తమ జీవితాలలో ప్రయోగంచేసి చూడాలనిపించలేదు.

"ధనం సంపాదించడానికి వేయి మార్గాలు" అనే పుస్తకం రాసి దాని ద్వారా డబ్బు చేసుకుందామని ప్రయత్నించి విఫలుడైన మనిషిలాగా లోకమంతటికీ భారతీయ వేదాంత ప్రాశస్త్యాన్ని ప్రకటించి ఆ వేదాంతం ద్వారా స్వయంగా తామేమీ లాభం పొందలేని స్థితిలో పడుతూ ఉంటారు. హిందూమతం విశిష్టతను, ఔన్నత్యాన్ని దేశ దేశాలకూ తెలియజేసి ప్రసిద్ధ గ్రంథకర్తగా గొప్ప ఫిలాసఫర్‌గా, వక్తగా పేరొందిన శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత చరిత్ర రాస్తూ మేధావి, చరిత్రకారుడు అయిన ఆయన కుమారుడు శ్రీ సర్వేపల్లి గోపాల్ ఇలా అంటాడు. 'మంచంలోనే ఉండిపోయిన ఆయన (తన తండ్రి) చివరి రోజుల్లో మానసికంగానూ ఆధ్యాత్మికంగానూ ఒంటరితనాన్ని అనుభవించాడు. ఆయనే ఒకప్పుడు అన్నట్లు 'మానసిక ఒంటరితనం' 'డిప్రెషన్'కు దారితీస్తుంది. వైఫల్యాన్ని కలగజేస్తుంది. మన మనసుకూ, దృష్టికీ ఒక లక్ష్యమంటూ, చేయతగిన పనంటూ ఏమీ కనిపించదు"

చరిత్రకారుడు శ్రీ గోపాల్ ఇంకా ఇలా రాస్తాడు: "బ్రిటిష్ ఫిలాసపర్ బెర్‌ట్రాండ్ రస్సల్ లాగానే, ఈయన (శ్రీ రాధాకృష్ణన్) కూడా జీవితానికి అర్థమేమిటో కనుగొందా మనే, ఫిలాసఫీని అధ్యయనం చేశారు. ఈ లోకాన్ని గురించి ఆయనకో శక్తివంతమైన తీక్షణమైన దర్శనం [Vision] ఉండేది. కానీ ఇది 'దైవం ద్వారా బయల్పడిన రహస్య విషయం [Divine revelation]' అనే దానికి ఆయన ఎక్కువ ప్రాధాన్యమివ్వలేదు. అందువల్ల ఈ ఫిలాసఫీ అనేది కేవలం ఈశ్వర విషయకమైన దాని పనికత్తె [Handmaid of Theology] అని గ్రహించక, ఫిలాసఫీ మనిషి చిత్తము, ఇచ్ఛపై ఆధారపడి [autonomous] ఉన్నదని భావించారు" అంటారు శ్రీ గోపాల్.

పండిట్ నెహ్రూ, రవీంద్రనాథ్ టాగోర్ మొదలైన వారిచేతగాక, ప్రపంచ మేధావులందరిచే కీర్తింపబడిన శ్రీ రాధాకృష్ణన్‌ను ఈ శతాబ్దపు ప్రముఖ వేదాంతిగా

మనం పరిగణించక తప్పదు. కానీ ఆత్మజ్ఞానం ఆర్జించే బదులు ఫిలాసఫీని కూలంకషంగా అధ్యయనం చేసినందువల్ల కీర్తి దక్కిందే కానీ, మనశ్శాంతి లభించలేదు. ఒక టన్ను ఫిలాసఫీకన్నా, ఒక ఔన్సు ఆత్మజ్ఞానం మనిషికి సుఖశాంతులు, స్థిరత్వం, దృఢత్వం ప్రసాదించగలదని ఆయనకు తట్టకపోయినందుకు మనకొకింత విచారం కలుగుతుంది.

శ్రీ రాధాకృష్ణన్ మార్గం వేరనేది, అందరికీ అంతకు మునుపే తెలుస్తూ ఉండే దనుకుంటాను. శ్రీ రమణాశ్రమ లేఖల్లో శ్రీమతి సూరి నాగమ్మగారు ఇలా తెలియజేస్తారు: “నిన్న ఉదయం సర్వేపల్లి రాధాకృష్ణయ్యగారు, కుటుంబంతో వచ్చారిక్కడికి. వారంతా భగవాన్ దర్శనం చేసుకుని అరుణాచలేశ్వరాలయానికి వెళ్ళి వచ్చి, భోజనానంతరం కొంచెం విశ్రమించి సాయంత్రం మూడింటికే ఊరికి వెడతామని బయలుదేరి భగవాన్ సన్నిధికి వచ్చి నమస్కరించి సెలవడిగారు. భగవాన్ ప్రసన్నతతో తల ఊపారు. ఆడవారితో కలిగిన పరిచితివల్ల కారు వరకూ సాగనంపి వచ్చాను. నేను కూచోగానే, “ఏం వెళ్లారా, వారంతాను?” అన్నారు భగవాన్. “వెళ్ళారు” అన్నాను. “వీరు పదేళ్ళకిందట ఒకసారి వచ్చి వెళ్ళారు. ప్రణవానంద స్వామికి వేలు విడిచిన అన్న కుమారుడే” అన్నారు భగవాన్. “అట్లాగా?” అన్నాను.

ఇంతలో నా పక్కన కూచున్న యూరోపియన్ స్త్రీలూ, గుజరాతీ స్త్రీలూ, ‘రాధాకృష్ణన్ భగవాన్‌ను ఏమైనా ప్రశ్నించారా? భగవాన్ ఏమి సెలవిచ్చారు?” అని మెల్లగా హిందీలో నన్నడగడం భగవాన్ గమనించి, “ఏమది?” అన్నారు. ‘రాధాకృష్ణన్ భగవాన్నేమైనా ప్రశ్నించారా?” అని అడుగుతున్నారు, అన్నాను. “అదా, వారంతా బాగా చదివినవారు. విషయమంతా తెలుసుకునే ఉన్నారు. ఏమడుగుతారు?” అన్నారు భగవాన్.

“లోగడ వచ్చినప్పుడు ఏమైనా ప్రశ్నించారా?” అన్నారొక ఆంధ్రులు. “ఊహు. అప్పుడూ ఇంతే. ప్రణవానందుల ద్వారా మన విషయమంతా విని వారితోనే వచ్చారు. వచ్చి కూర్చున్నారంతే. పెదవి కదపలేదు” అన్నారు భగవాన్.

“బయట అంతంత ఉపన్యాసాలిస్తారు కదా, ఇక్కడ ఏమీ చర్చించక పలక్కుండా కూర్చున్నారెందువల్లనో” అన్నారా భక్తులు.

భగవాన్ నవ్వుతూ, "1938లో రాజేంద్ర ప్రసాదు ఇక్కడికి వచ్చారు. వారూ అంతే. నాల్గయిదు రోజులున్నా ఒక్కసారైనా ప్రశ్నించలేదు. పలక్కుండా పిల్లిలాగా కూచునేవారు. వెళ్ళేటప్పుడు మాత్రం 'మహాత్మునికి ఏమి సందేశం ఇస్తా'రని అడిగారు. అంతే అదీ పక్కనున్నవారి చేత అడిగించారు" అన్నారు భగవాన్.

రమణ మహర్షి వద్దకొచ్చినప్పుడు ఈ మేధావివర్గం ఆయనతో మాట్లాడదగింది ఏమీలేదని ఊరుకునేవారో, తీరా మాట్లాడితే తాము ధరించే 'సర్వజ్ఞత్వపు' శాలువలోని చిరుగులేమైనా కనిపిస్తాయేమోననే సంకోచమో మనకు తెలియదు. ఏది ఏమైనప్పటికీ వీరి మూగనోము వెనకాల ఏదో ఇరుకు, ఇబ్బంది ఉన్నట్లు మనం గ్రహించగలం.

'మహాత్మునికి మీ సందేశమేమిట'న్నప్పుడు రమణుడు ఆ ప్రశ్నను ఎంత అలవోకగా పక్కకు నెట్టేశాడో, ఆనాటి రాజకీయ ప్రముఖులు జ్ఞానజ్యోతి అయిన శ్రీ రమణుడికి ఎలా దూరం తొలిగేవారో, రాబోయే వ్యాసంలో వివరిస్తాను.

# 'చదువుకున్నవారు'

మహాత్మునికి ఏమి సందేశమిస్తారని శ్రీ రాజేంద్రప్రసాద్‌బాబు (తర్వాత భారత దేశానికి ప్రథమ అధ్యక్షుడు) శ్రీ రమణుణ్ణి అడగగా, "మహాత్మా ! ఎప్పుడూ అంతరాత్మ ఈ విధంగా చెప్తున్నది" అని కదా అంటారు? అంతరాత్మ అక్కడా ఉన్నది. ఇక్కడా ఉన్నది. ఎక్కడైనా ఉన్నదే ! ఇక చెప్పేందుకేమి ఉన్నది? అని భగవాన్ సెలవిచ్చారట కదా?" అన్నారు అక్కడున్న భక్తులు. అందుకు రమణుడు, "అవునవును. అప్పుడే జమ్నాలాల్ బజాజ్ కూడా వచ్చారు. వారూ అంతే. ఉన్న యెడం (చోటు) తెలియకుండా ప్రశాంతంగా కూర్చునేవారు".

"1944లో మను సుబేదారు (జ్ఞానేశ్వర భగవద్గీతకు అనువాదకర్త) వచ్చినప్పుడు కూడా ఏమీ ప్రశ్నించినట్లు లేదే?" అన్నారు చుట్టూ చేరిన భక్తులు. "అవును నేరుగా ఏమీ ప్రశ్నించలేదు. వారంతా చదివినవారు. ప్రశ్నించేందుకేం ఉంది? శాంతి నిమిత్తం వస్తారిక్కడికి" అన్నారు భగవాన్.

ఉత్తరాది నాయకులకు రమణుడితో స్వయంగా తమిళ, తెనుగు భాషల్లో మాట్లాడే సావకాశం లేనందువల్ల, ఊరుకున్నారేమోనని మనం సమర్థింపజూస్తే వారంతా ఏదైనా ఇంగ్లీష్‌లో అడిగినా రమణుడికి సులభంగానే అర్థమై ఉండేది. సమాధానం చెప్పడం తమిళ, తెనుగు భాషల్లో చెప్పినా, ఇంగ్లీష్ పదాలను కూడా అవసరమైనంత మేరకు వాడుతూనే ఉండేవారు. కాబట్టి భాష అటంకమనుకునే వీలులేదు. ప్రపంచం నలు మూలల నుంచి వివిధ దేశాల నుంచి వచ్చిన పాశ్చాత్యులు రమణుడిని ప్రశ్నించి తమ ఆధ్యాత్మిక ఆరాటాన్ని తీర్చుకోగా లేనిది, ఇక్కడి భారతదేశస్థులకు వచ్చిన పెద్ద చిక్కే ముంటుంది? పోనీ ఉత్తరాది నాయకులకు భాష పెద్ద ప్రతిబంధకమైన దనుకుందాం. మరి దక్షిణాది నాయకుల మాటేమిటి?

రమణుడి చుట్టూ ఉన్న భక్త బృందం ఈ రాజకీయ నాయకుల విషయాన్ని మరింత సాగదీస్తూ, రమణుడు ఊరకుండిపోయినా తాము ఊరుకోకుండా, "సత్యమూర్తి, కళ్యాణ సుందర మొదలియార్, జ్ఞానియార్, (ఆనాటి ప్రముఖ తమిళ రాజకీయ

నాయకులు) బులుసు సాంబమూర్తి, టంగుటూరి ప్రకాశం, కరపత్ర స్వామి ఇక్కడికి వచ్చినప్పుడు మాట్లాడనే లేదు. వీరంతా బయటకు వెడితే సింహాల మాదిరి గర్జిస్తూ బల్లగుద్ది ఉపన్యాసాలిస్తూ ఉంటారు భగవాన్" అన్నారు ఆ భక్తులు.

అనుచరుల మాటలు రెచ్చగొట్టేవిగా ఉంటాయి కానీ, రమణుడి మాట నెమ్మదిగా ఉంటుంది అనే విషయాన్ని పాఠకులు గమనించాలి. మనుషులందరిలోనూ ఒకే అంశాన్ని దర్శిస్తున్న రమణుడికి, అజ్ఞానం కనిపించినప్పుడు ఒకింత విచారం కలగవచ్చునే కానీ, భేదభావం జనించి అనవసరమైన మాటలకు దారితీయదనే సంగతి గుర్తుంచుకోవాలి.

"అవునండీ. వారు అంతా చదివిన వారు. కొందరు రాస్తారు. కొందరు ఉపన్యాసాలిస్తారు. నాయన (కావ్యకంఠ గణపతిముని) కూడా అంతే" అన్నారు భగవాన్.

"అయితే బాగా చదివినవారు భగవానునేమీ ప్రశ్నించరన్న మాట. మావంటి మధ్యరకమేనా వేధించేది? అడక్కపోతే మాకేవిధంగా తెలుస్తుంది భగవాన్?" అన్నారా భక్తులు. "అది సరి, దానికేమి?" అంటూ మందహాసంతో మౌనం వహించారు భగవాన్.

సంఘంలో నాయకులుగా చలామణి అయ్యే ప్రముఖులనందరినీ రమణుడు 'చదివిన వారు' అని వర్ణిస్తూ, "వారికేమి సందేహాలుంటాయ్?" అని ఆ విషయాన్ని తోసిపుచ్చడంలో ఓ చమత్కారమున్నది.

శ్రీ రమణుల అనుచరుడైన ఆర్థర్ ఆస్‌బోర్న్, రమణుణ్ని గురించి తన ఆంగ్ల గ్రంథాల ద్వారా ప్రపంచానికి తెలియజేసిన వారిలో ముఖ్యుడు. పాండిత్యం ఉన్నవారిని గురించి, అతడేమంటాడో చూడండి. "వినయ శూన్యమైన పాండిత్యం కలిగి ఉండడం ఒక దురదృష్టం. అటువంటిది లేనివారు ఆ దురదృష్టం నుండి తప్పించు కున్నట్లే అనుకోవచ్చు. గర్వాతిశయం అనే భూతం నుండి కాపాడబడినట్లే భావించ వచ్చు. చెల్లాచెదురుగా తిరుగాడే ఆలోచనలు, వ్యర్థమైన మాటలు అనే వ్యాధి బారిన పడనట్లే ఎంచవచ్చు. ధనాశతోనూ, కీర్తి కాంక్షతోనూ అటూ ఇటూ పరిగెట్టే స్థితి నుండి విముక్తి చెందినట్లే. ఆ విధంగా అనేక రకాల పాపాల నుండి రక్షింపబడినట్లే".

ఇదీ పాండిత్యంలోని ప్రమాదం. పండితుడనేవాడు నిజానికి సమదర్శి అయి ఉండాలి. అంటే ఈ కనిపించే సృష్టి యావత్తూ అతడికి ఒకటిగానూ, పిపీలికాది బ్రహ్మ పర్యంతం సమానంగానూ కనిపించాలి. ఇది పుస్తకాలు చదవడంవల్ల, అందు లోని విజ్ఞానం సేకరించడంవల్ల, పరిమితమైన స్వానుభవం ద్వారా కూడా సిద్ధించేది కాదు. ఆలోచనాపూర్వకంగా లోకంలోని అన్నిటినీ సమంగా దర్శించాలని ఎంతగా ప్రయత్నించినా, అది సాధ్యమయ్యే విషయం కాదు.

ఏ రకమైన పూర్వజ్ఞానంతో నిమిత్తం లేని శూన్యమైన, పరిశుద్ధమైన మనస్సుతో, అనగా ఏ అభిప్రాయమూ, ఏ వాసనాబలమూ, ఏ లోక ప్రభావమూ లేని ఖాళీ మనస్సుతో చూచి, విని, నేర్చుకునేవాడే సమదర్శి కాగలడు. ఆ విధంగా సమదర్శి అవడం వేరు. సమదర్శిత్వం గురించి చదివి, ఆలోచించి, ఊహ చేసి ఆ ఆదర్శాన్ని కళ్ళ ముందుంచుకొని, అందుకోసం ప్రయత్నం చేయడం వేరు. అంటే ఇప్పటి తన పూర్వజ్ఞానానికి ఈ 'సమదర్శిత్వం' అనే ఆభరణాన్ని కూడా జోడించగలనని అనుకోవడం భ్రమ. పూర్వజ్ఞానం, అంటే ఇప్పటికే తెలిసిన దాని నుండి విముక్తి చెందినప్పుడే, చూడడం, వినడం, నేర్చుకోవడం ప్రారంభమవుతుంది. 'సమదర్శిత్వం' ఆ ప్రక్రియ నుండి పుట్టుకు వస్తుంది.

ఆలోచనాపూర్వకంగా, అంటే అనుకరణ ద్వారా 'సమదర్శిత్వాన్ని' సాధించవచ్చు; కానీ అలాంటిది గట్టి పరీక్షా సమయంలో కుప్పకూలిపోతుంది. అందుకు కారణం అది మన మెదడుతో నేర్చినదే కావడం, మన సత్తతో నేర్చుకున్నది కాకపోవడమే అనవచ్చు. ఆ కారణం చేతనే రమణుడు, దేశ స్వాతంత్ర్యానికై పోరాడే ఆనాటి నాయకులపట్ల గౌరవ భావం ప్రకటించినప్పటికీ, ఆత్మజ్ఞానం వైపు వారు మళ్ళలేక పోయారు అనే విషయం మృదువుగా తెలియజేస్తున్నాడు.

ఆంగ్లేయులు వాడే ఓ నానుడి లాగా ఆత్మవిద్య అందరి 'కప్ ఆఫ్ టీ' కాదు. అది కొందరికే రుచిస్తుంది. అందుచేతనే రామనామం శిరోధార్యమనుకున్న మహాత్మా గాంధీ కానీ, రామాయణ, మహాభారతాలను మక్కువతో తిరగ రాసిన రాజాజీ కానీ రమణాశ్రమ దాపుల్లోకి వచ్చినా, రమణుణ్ణి దర్శించాలని అనుకోలేదు. వారికున్న

కార్యభారం, అటువైపు వెళ్ళనిచ్చింది కాదు. దూరాన్నుండే ఒక నమస్కారం పెట్టి వెళ్ళారనుకుంటాను.

మరెందరో కూడా అరుణాచలంలో ఆత్మజ్ఞానాన్ని మేల్కొలిపే రమణుడున్నా, కోర్కెలు తీర్చే తిరుపతి వేంకట రమణుణ్ణి కొలవడానికి వెళ్ళేవారు. అరుణాచల రమణుడి తత్త్వంలో, యోగవాశిష్టం ప్రతిఫలిస్తున్నప్పటికీ, సజీవమైన ఈ తత్త్వాన్ని కనుగొనే బదులు, యోగవాశిష్ఠ గ్రంథాన్నే భట్టీయం వేస్తుండేవారు. అందుకే శ్రీ రామచంద్రుడు ఈనాడు మన మధ్య ప్రత్యక్షమయినా, వాల్మీకి రామాయణం పారాయణ చేయడంలోనే మనకానందముంటుంది.

## సత్యశ్రవణం

సత్య వస్తువును గురించి శ్రవణం రెండు రకాలు : మొదటిది గురువు వివరించి చెప్పగా వినడం. రెండవది తనకు తానే ప్రశ్నించుకొని అఖండమైన 'నేను'గా తనయందే అన్వేషించి, సమాధానం కనుగొనడం. నిక్కమైన శ్రవణం రెండవదే.

# శాస్త్ర ప్రయోజనం !

**ఆ**ధ్యాత్మిక సాధనను గురించి ప్రస్తావిస్తూ శ్రీ లక్ష్మీకాంతానంద స్వామి తన కోదండరామ శతకంలో, "చేయగల్గిన వారు చెప్పకుంద్రు, చెప్పగలిగినవారు చేయ కుంద్రు" అని రాశాడు. అయితే 'చేయగలిగినవారు కూడా ఎవరైనా ఏదైనా సందేహ నివృత్తి చేసుకోదలచినప్పుడు, వారి ప్రశ్నకు వివరంగా సమాధానం చెప్పడం జరుగుతుంది.

అరుణాచల రమణుడు ఏనాడూ ఏ సభనుద్దేశించి ప్రసంగించలేదు. భాషణలు ఇవ్వడమంటే ఏమిటో ఎరగడు. రమణుడిని ఉత్తర హిందూస్థాన పర్యటనకు తీసుకు వెడదామనీ, అక్కడ ఉపన్యసింపచేద్దామనీ అనుకున్న ఓ స్వామి కోర్కెను రమణుడు సున్నితంగా వమ్ముచేశాడు. విద్య పట్ల శ్రద్ధ ఉన్నవారే అయితే తానెక్కడ నివసిస్తే అక్కడికే వస్తారులే అన్నట్లుగా అరుణగిరి వద్దనే ఉండిపోయాడు. పాశ్చాత్యులు కానీ, భారతీయులు కానీ, మహానుభావులు కానీ సామాన్యులు కానీ, ఆయన స్థిరంగా ఉండి పోయిన అరుణాచలానికే వచ్చి తమ తమ అర్హత కొద్దీ విద్యనార్జించి వెళ్ళారు.

రమణుడు అడపా దడపా మాట్లాడినప్పటికీ, ఒకింత రాసినప్పటికీ మొత్తం మీద మహా మౌనంలోనే తన జీవితం గడిపాడని చెప్పుకోవచ్చు. ఆ మాటకొస్తే ఆయన మౌనాన్ని అర్థంచేసుకోగలిగిన ఉత్తమ సాధకులకు, అదే బోధగా పరిణమించేది. ఆయన జీవించే తీరూ, మనుషులతో వ్యవహరించే పద్ధతీ మొదలైనవే గొప్ప గుణ పాఠంగా రూపొందుతుండేవి. ఆయన 'మౌనసందేశాన్ని' స్వీకరించగలిగిన తాహతులేని వారు, ఆయనతో ప్రసంగించి తమ సందేహాలు తీర్చుకువెళ్ళేవారు. ఇక అనర్హులైన మిగతా వారు ఆయనతో ఎన్నాళ్ళు కలిసి జీవించినా, ఎంతగా సంభాషించినా చాలా కొద్దిగానే గ్రహించేవారు.

ఈ 'నేర్చుకోడం' అనే క్రియకు గ్రంథ పాండిత్యం దోహదకారి కాకపోగా ఒక్కొక్కసారి అవరోధంగా కూడా పరిణమించేది. శ్రీ గణపతిముని రమణుడి ప్రియమైన మిత్రుడు; కావ్యకంఠ బిరుదాంకితుడు. అసాధారణ ప్రతిభావంతుడు కూడాను. కానీ

శ్రీ గణపతి ముని రమణుని సన్నిహితుడై ఉండి కూడా ఆయన సూచించే ఆత్మ విచారాన్ని ఆశ్రయించే బదులు ఇతర సాధనలు, అనుష్ఠానాలు, తపశ్చర్యలు, మంత్రోచ్చాటనతో సతమతమవుతూ ఉండేవాడు. "గణపతి మునికి మోక్షప్రాప్తి ఉంటుందంటారా?" అని ఎవరో రమణుణ్ణి ఒకమారు అడగగా, "అంత పాండిత్యం ఉన్న మనిషికి మోక్షమార్గం ఎలా కనిపిస్తుంది?" అని విచారంతో అన్నాడు రమణుడు.

ఇతర విధాల ఆధ్యాత్మికతపై ఎంతో శ్రద్ధాసక్తులు ఉన్న శ్రీ గణపతిమునికే, పాండిత్యమనేది అంత పెద్ద అవరోధమయింది. ఇక అటువంటి కఠిన తవశ్చర్య మృగ్యమై కేవల గ్రంథ పాండిత్యంపై ఆధారపడేవారి విషయమెలా వుంటుందో చెప్పాలా?

శ్రీ జిడ్డు కృష్ణమూర్తిగారు ఏ గ్రంథం పేరూ ప్రస్తావించేందుకు ఒప్పుకునేవారు కాదు. "మీ పవిత్ర గ్రంథాలనేవైనా మనిషి మెదడు సృష్టించినవే కదండీ? వాటిని పూజిస్తూ పారాయణచేస్తూ కూచుంటే మీకేమి సిద్ధిస్తుందండీ? మీ జీవితమనే గ్రంథాన్ని తెరచి అందులోని ప్రకరణాలన్నీ జాగ్రత్తగా చదవండి. మీ చరిత్రేకాక, మానవాళి చరిత్ర యావత్తూ అందులో లభిస్తుంది. ఆత్మజ్ఞానం సిద్ధిస్తుంది" అంటూ గ్రంథాలను తోసిపుచ్చేవారు. శ్రీ రమణుడు అంత తీవ్రమైన సరళి ననుసరించక పోయినప్పటికీ శాస్త్ర పాండిత్యం మీద రమణుడికి కూడా ఏమాత్రం ఆదరం లేదనేది ఒక శిష్యుడు చెప్పిన సంఘటన ద్వారా మనకు తెలుస్తుంది.

"ఒకసారి కొందరు సంస్కృత పండితులు ఆశ్రమంలోని పాత హాలులో కూచొని భగవాన్ సమక్షంలో ఉపనిషత్తులు మరికొన్ని శాస్త్రాలను చర్చిస్తున్నారు. వారు తమ సందేహాలను వెలిబుచ్చి శ్రీవారి సమాధానం కోరగా, రమణులు సమాధానమిస్తున్నారు. ఇదంతా చూచి నేను "వీరందరూ ఎంత బాగా చదువుకున్నారు ! ఎంతటి శాస్త్ర విజ్ఞానం ! భగవాన్‌తో కూర్చుని చర్చించగలిగిన వీరి సామర్థ్యం నాబోంట్లకు అసలు ఎన్నటికైనా సిద్ధిస్తుందా?" అని లోలోన అనుకున్నాను.

పండితులందరూ భగవాన్ వద్ద సెలవు తీసుకొని వెళ్ళిపోయిన తర్వాత భగవాన్ నావైపు తిరిగి, నా ఆలోచనలను గ్రహించినట్లు "ఈ శాస్త్ర విజ్ఞానమంతా పై ఊక మాత్రమే. శాస్త్రాలను వల్లెవేయడమూ వప్పజెప్పడమూ ఎందకూ కొరగానిపని. సత్యాన్ని

గ్రహించడానికి ఈ శ్రమ, ఈ చెఱ, యావత్తూ అనవసరం. గ్రంథపఠనం వల్ల సత్యం లభించదు. ప్రశాంతంగా వుండు, అదే సత్యం; నిశ్చలంగా వుండు; అదే దైవం" అన్నారు.

అటు తర్వాత ఆయన మళ్ళీ నావంక తిరిగి "నీకు నువ్వే షేవ్ చేసు కుంటుంటావా?" అని అకస్మాత్తుగా అడిగారు. ఆయన ఇలాంటి ప్రశ్న ఎందుకు వేస్తున్నారో తెలియక, మొదట్లో కాస్త ఖంగారు పడి కొద్దిగా వొణుకుతూ నేను "చేసుకుంటూ వుంటాను" అన్నాను.

"మరి షేవ్ చేసుకోడానికి అద్దం వాడతావు కదా? అద్దంలో చూచుకుంటూ నీ ముఖాన్ని షేవ్ చేసుకుంటావ్. అంతేకానీ అద్దంలో కనిపించే నీ ముఖాన్ని షేవ్ చేయవు కదా? అలాగే ఈ శాస్త్రాలన్నీ కూడా నీ ఆత్మసాక్షాత్కారానికి దోవచూపించేందుకు ఉన్నటువంటివి. నువు సరిగా ఆచరించడానికీ, సాధించవలసింది సాధించడానికి ఉద్దేశించినవి. కేవల గ్రంథ పఠనం, వాటిపైచేసే చర్చలు, అద్దంలోని ప్రతిబింబానికి షేవ్ చేసిన చందంగా ఉంటుంది" అన్నారు. ఆనాటి నుండి "నేను చదువుకోలేదే, మిగతా వారితో పోలిస్తే నాకేమంతశాస్త్ర విజ్ఞానం లేదే" అనే ఆత్మన్యూనతా భావం నాలో పూర్తిగా తొలగిపోయింది" అంటాడు.

# ఆత్మసాక్షాత్కారం

**మ**హా వేదాంతులు మామూలు పనులేమీ చేయకుండా, సామాన్య విషయాలన్నిటినీ వారికీ వీరికీ అప్పగించేసి తాము ఎప్పుడూ ఏదో ధ్యానం చేస్తూనో, మౌనం పాటిస్తూనో, పెంచిన గడ్డం సవరించుకుంటూనో, దీర్ఘనిశ్వాసాలు విడుస్తూ అర్ధనిమీలిత నేత్రాలతో కూచోనుంటారని మనం భ్రమపడవచ్చు. దైవానికి అంకితమైన స్వాములు ఈ పోజులోనే వుంటారని నాటకాల్లో సినిమాల్లో కథల్లో అలా చూపించి వర్ణిస్తుంటారు కాబట్టి, మనకీ అభిప్రాయం ఏర్పడుతుంటుంది.

కానీ ఇది నిజంకాదు. నిజంగా ఆత్మసాక్షాత్కారమొందిన వారు చాలా సహజంగా సాధారణంగా బ్రతుకుతుంటారు. తన ఆశ్రమంలో పనివాండ్రు, వంట వాండ్రు చేసే పనులన్నిటినీ తానూ స్వయంగా చేస్తూ, వారూ తానూ ఏ విధంగానూ భిన్నమనే భావనే లేకుండా చరించిన అరుణాచల శ్రీ రమణుల జీవితం ఇందుకో తార్కాణం.

వంటగదుల్లో తిరుగాడే ఈ పెద్దమనిషికి ఏమి జ్ఞానం వుంటుంది అని అహంక రించినవారు ఆయనకు తారసిల్లకపోలేదు. పైపెచ్చు వీరు, "మీరు ఆత్మాసాక్షాత్కారం పొందినట్లు అందరూ చెప్తారే? దానిని మీరు నాకు ఇవ్వగలరా?" అని సవాలు చేయడం కూడా జరిగింది. "నేను ఇవ్వగలను. అయితే నీవు తీసుకొనగలిగి వున్నావా?" అని ఆయన ఎదురు ప్రశ్న వేసేసరికి, "ఔరా, ఈయనకెంతటి అహంకారం?" అని అనుకున్నారు. మనలో వున్న గుణాన్నే, మనకు తటస్థపడ్డవారికి అంటగడుతున్నామనే స్పృహలేని అహంభావులు వీరు.

మహానుభావుల జీవిత చరిత్రలే వేరు. సత్ దర్శనంవల్ల వారు ఒక తీరుగా జీవిస్తూ వుంటారు. అది ఆలోచనాత్మకం కాదు కాబట్టి, ఆ తీరులో అన్నిటా సత్యం ప్రకటిత మవుతుంటుంది. వారు పెద్ద పనిచేస్తూ వున్నా చిన్నపని చేస్తూవున్నా, అన్ని పనులలోనూ వారి ఆత్మసాక్షాత్కారం వెలుగు ప్రసరిస్తూనే వుంటుంది. వారు ఏది ముట్టు కున్నా అందులో ఆ 'స్పిరిచువల్ టచ్' ప్రస్ఫుటంగా కనిపిస్తుంటుంది. అందుకు విరుద్ధంగా వారేదీ చేయజాలరు; ఆ శక్తి వారిని మరో విధంగా చేయనివ్వదు.

నేర్వగలిగిన శక్తి మనలో వుంటే, వారి సాహచర్యంలో, వారి సాంగత్యంలో, మనం ఎల్లవేళలా నేర్చుకుంటూనే వుండవచ్చు. వారి ప్రతిచర్యా, 'సెల్ఫ్'ను కరగదీసేదీ, నిర్మూలించేదీ అయివుంటుంది. ఆలోచనాత్మకంగా బ్రతికే మన ప్రస్తుత జీవన విధానంలో మన ప్రతిచర్యా 'సెల్ఫ్'ను బలపరిచేదే అవుతుంది.

చిన్నతనంలోనే భర్తను కోల్పోయిన శ్రీమతి వారణాశి సుబ్బలక్ష్మమ్మ అరుణాచల రమణుణ్ణి కొన్నిసార్లు దర్శించుకున్నప్పటికీ, మనసు అక్కడ లగ్నమవలేదు. ఆయన సమక్షంలో కొంత మనశ్శాంతి లభించినట్లే ఉన్నప్పటికీ, ఇవతలి కొచ్చేసరికి మాయ మయ్యేది.

కానీ ఆవిడ ముప్ఫై ఒకటవ సంవత్సరాన "అటూ ఇటూ ఆ గురువు వద్దకూ ఈ గురువు చెంతకూ ఎందుకు వృధాగా తిరుగుతావు? రమణుడే నీకు సర్వస్వమూను. ఆయనే తరుణోపాయం చూపిస్తాడు" అని స్ఫురింపచేసే కలలు వస్తూండడం మూలాన, కాశీలో స్థిరపడదామని అనుకున్న మనిషి, తిరువణ్ణామలైకి తిరిగివచ్చి, అక్కడ ఓ ఇల్లు అద్దెకు తీసుకుని, ఒకరోజున రమణ దర్శనానికని బయలుదేరింది. వెళ్తూ వెళ్తూ, జీడిపప్పు, కలకండ కొనుక్కొని రమణుని ముందున్న ఒక బల్లమీద పెట్టింది. 'లక్ష్మి' అనే పేరుగల గోవు రమణుని సోఫా పక్కనే కూచోనున్నది. స్వామివారికి అర్పించిన ఆ ఖరీదైన జీడిపప్పును 'లక్ష్మి' తినసాగింది. రమణుడు చూస్తూనే ఉన్నాడు. కానీ ఏమీ మాట్లాడకుండా వూరుకున్నాడు. రమణుడి సరసనే నుంచున్న ఆయన సహాయకుడు మాధవస్వామి ఆ వంకను చూడనుకూడా లేదు. గోవును అడ్డుకొనడం అంత భావ్యం కాదనే అభిప్రాయంతో కాసేపు మొదట్లో ఊరుకున్నప్పటికీ, సుబ్బలక్ష్మమ్మ చివరకు ఓర్చుకోలేక, "ఈ ఆవును అవతలికి తీయండి" అన్నది. "మీరు ఆ తినుబండారాలు ఆవు కోసమే తెచ్చారనుకున్నాను" అన్నాడు. మాధవస్వామి. అంటే రమణుణ్ణి దర్శించు కోవడానికి వచ్చినవారు ఆయనకై ఏమీ తీసుకు రానక్కరలేదనే కదా అర్థం?

కానీ ఆ విషయం శ్రీమతి సుబ్బలక్ష్మమ్మ వెంటనే గ్రహించలేకపోయింది. అటు తర్వాత కూడా గురువు వద్దకు వెళ్ళేటప్పుడు సంప్రదాయాన్ననుసరించి ఉత్తి చేతుల్తో వెళ్ళకూడదనే ఉద్దేశంతో, మిగతా అందరిలాగానే తిరువణ్ణామలై నుండి వెళ్ళినప్పుడల్లా

తోటే కాసిని ఎండుద్రాక్ష గానీ, మరేదైనా గానీ తీసుకు వెళ్తుండేది. కానీ రమణుడికి ఈ రకంగా మనుషులు తమ భక్తిని ప్రదర్శించడం ఇష్టముండేది కాదు. "ఈ విధమైన గౌరవం, భక్తి శ్రద్ధలు ఎవరి యెడల ! ఈ కాపట్యమంతా మీకెవరు నేర్పారు? దీనివల్ల మీకేమి వస్తుంది? సహజంగా ఉండలేరా? మనిషికి నిర్మలమైన హృదయం ప్రధానం కానీ, ఇవన్నీ దేనికి? ఇలాంటి మర్యాదలు, ప్రదర్శనలతో నన్ను మీరు సంతోషపెట్ట గలమని అనుకుంటున్నారా?" అని మందలించేవారు.

అటు తర్వాత రమణులు మురుగానార్ అనే భక్తుడి వైపు మళ్లీ "ఇక్కడి వారి అందరి భక్తీ పైపైన కనిపించేదే కానీ లోన ఏమీలేదనీ, ఈ ప్రదర్శించేదంతా కూడా చాలా చౌకబారుగా ఉన్నదని" విమర్శించారు. ఇలాంటి కుహనా భక్తికి తార్కాణంగా ఒకసారి ఆయన ఒక కథ కూడా చెప్పారు.

"ఇలా ఆర్భాటంగా భక్తి నటించే వారు కొందరు గురువును ఊరేగింపుగా తీసుకువెళ్లి ప్రజల ముందు ప్రదర్శిస్తారు. తమ ప్రయోజనం తీరిన తర్వాత ఓ గొయ్యి తవ్వి 'మీ అంతట మీరే ఈ గోతిలోనికి దిగుతారా, లేక మేమే మిమ్మల్ని అందులో పడదోయమంటారా?" అని అడుగుతారు.

రమణుడు అలా మాట్లాడుతున్నప్పుడు సాధారణంగా ప్రతిరోజూ స్వామి ముందర ప్రణమిల్లే మురుగానార్ కూడా ఆనాడు ప్రణమిల్లడానికి జంకాడు. స్వామి తన ప్రసంగం కొనసాగిస్తూ, "మనుష్యులు ఈ ఆశ్రమానికి వచ్చేటప్పుడు చాలా శ్రద్ధాళువులన్నట్లు, చాలా నిష్కపటులన్నట్లు కనిపిస్తారు. తీరా ఇక్కడ స్థిరపడి, నివసించ నారంభించింతర్వాత ఇక్కడ అందరిమీదా అజమాయిషీ చేద్దామని ప్రయత్నిస్తారు. అన్నీ తమ గుప్పిట్లో ఉండాలంటారు. స్వామి (అంటే తనని గురించే) కూడా తమ చెప్పుచేతల్లో ఉండాలనీ, తాము చేసే ఆగం, అల్లరి చూడనట్లు ఉండిపోవాలనీ వారి ఉద్దేశం. స్వామికి తాము నిత్యమూ ప్రణమిల్లుతూంటారు. కాబట్టి, ఆశ్రమంలో వీరు చేసే చెత్తనంతా స్వామి ఓర్చుకోవాలని వీరి అభిప్రాయం. ఇలాంటి వారినందరినీ స్వామి తన తలకెత్తుకొని తిరగాలని వీరి ఆలోచన" అంటూ ఆశ్రమ కార్యకర్తల్ని తీవ్రమైన విమర్శకు గురిచేశాడు రమణుడు.

రమణుడి జీవిత వృత్తాంతం ఎరిగున్న వారికి అతడి భూతదయ ఎటువంటిదో తెలిసే ఉంటుంది. కోతి ఒకటి ఆయన చేతిని కొరికినప్పుడు కూడా దానిని ఒక్కమాట అనకుండా అది సకారణంగానే కొరికిందని దాని చేష్టనే సమర్థించడం, ఆశ్రమం మీదికి దాడికొచ్చిన దొంగలు 'జాకీ' అనే చిన్న కుక్కను కొట్టి చంపుతారేమోనని, తనపై జరుగుతున్న దౌర్జన్యాన్ని కూడా తలుచుకోకుండా ఆ కుక్క ప్రాణాన్ని రక్షించడానికి ఆయన చూపిన చొరవా, మొదలైన విషయాలు ఎరిగినవారు; ఆయన మనిషి ప్రాణానికీ, జంతువు ప్రాణానికీ తేడా చేసేవాడు కాదని తెలుసుకునే ఉంటారు. అందువల్ల సుబ్బ లక్ష్మమ్మ సమర్పించిన వస్తువులను రమణుని పక్కనున్న గోవు 'లక్ష్మి' తింటున్నప్పటికీ ఎందుకు మిన్నకున్నాడో గ్రహించవచ్చు.

పైకి ఏమీ అనకపోయినా రమణుడికి తనచుట్టూ ఉన్న వారందరి ఆంతర్యమూ తెలుసు. మహాజ్ఞానిని మనం మోసగించగలం అనుకోడం మన తెలివితక్కువ. ఆయన వద్ద భయభక్తులతో చరిస్తూ ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ, ఎవరు నిజంగా స్వస్వరూప జ్ఞానానికి పాటుబడుతున్నారో, ఆశ్రమంలో ఎవరు లౌకిక ప్రయోజనాలు సాధించు కుంటూ పెత్తనం చెలాయిస్తున్నారో ఆయనకు స్పష్టంగా తెలుసు. అలాంటి వారిని ఆయన ఎంత ఘాటుగా విమర్శించారో గమనించవచ్చు. కానీ తన ద్వారా, తన బోధ ద్వారా నిజంగా ఆత్మలాభం పొందేవారు కొందరుండనే ఉంటారు కాబట్టి ఆశ్రమం ఎలా నిర్వహించుబడుతూ ఉన్నా, దానిని ఏదోవిధంగా కొనసాగిస్తుండేవారు.

# జీవితం ధ్యానమయం

**తా**నెంతో భక్తితో తెచ్చి, సమర్పించిన కలకండ, జీడిపప్పును శ్రీ రమణుడు తన పక్కనే ఉన్న గోవు 'లక్ష్మి' తినేస్తూంటే చూస్తూ వూరుకోవడం, శ్రీమతి వారణాసి సుబ్బలక్ష్మమ్మకు అర్థంకాకపోవడాన్ని గతంలో వివరించాను. ఈ 'స్వామి' లక్షణాలు ఆమెకు కొంచెం ఆశ్చర్యం కలిగించాయి. మర్నాడు మళ్ళీ రమణాశ్రమానికి వచ్చి భోజనానంతరం హాల్లో కూచొని రామయ్య యోగికి భగవద్గీతలోని ఒక శ్లోకాన్ని వివరిస్తున్న శ్రీ రమణుల దర్శనం చేసుకున్నది. హాలులో మరెవ్వరూ లేకుండా ఉండడం చూచి, ఒకింత ధైర్యం తెచ్చుకొని వేదాంత ధోరణిలో ఓ గంభీరమైన ప్రశ్న వేయాలనుకుని "ఆత్మ అంటే ఏమిటి స్వామీ? ఈ అనంత ఆకాశమనుకోవాలా లేక అన్నిటినీ గుర్తించే ఎరుక అనుకోవాలా?" అని అడిగింది.

"ఆత్మ ఇదనీ, అదనీ అనుకోకుండా ఉండడమే ఆత్మ" అని మూడు ముక్కల్లో సమాధానం చెప్పి, రమణులు ఆమె వంక చూచారు. ఆ మాట వినగానే 'తన మనస్సులో ఏమీ లేకుండా అంతా కరిగిపోయినట్లయింది' అంటుంది ఆమె; ఆలోచనలన్నీ అంత మయినట్లయిందట. ఏదో ఒక అనిర్వచనీయమైన మనోశాంతి నెలకొన్నట్లు అనిపించింది. తన సందేహాలన్నీ తొలగిపోయాయి. మనసులో అచలమైన ఓ పర్వతం నిలిచినట్లయింది అని చెప్తుంది.

మనం ఆత్మని నిజంగా ఎరుగము. మనలో అనేకులు దాని స్పృహలేకుండానే కాలం చేస్తారు. అది మన, నిర్వచనాలకు ఆలోచనకీ ఊహకూ అందేది కాదు. "వర్ణనాతీతమైన ఈ ఆత్మను గురించి ఆలోచించకుండా, దానిని కనుగొను. నీవు ఆ ఆత్మవే" అంటున్నాడు రమణుడు. అందువల్లనే రమణుడు ఆ మాట అని ఆవిడవంక చూడగానే సుబ్బలక్ష్మమ్మకు అలాంటి విచిత్రానుభూతి కలిగింది.

తిరువణ్ణామలైలోని అద్దె ఇంట్లోనే ఉంటూ, అడపాదడపా వచ్చిపోతూ, ఆశ్రమం లోని వంటశాలలోని సుబ్బలక్ష్మమ్మ అక్కడి వంటవాళ్ళకు తోడ్పడుతూ ఉండేది. శ్రీ

రమణులు కూడా వంటశాలకి వచ్చి తానూ అక్కడి పనులలో పాల్గొంటూండేవారు. కానీ ఆశ్రమంలో తగినంత 'ఆచారం' పాటించకపోవడం ఆమెకు నచ్చలేదు. అదీగాక రోజంతా ఇలా పనిచేస్తూ ఉండడం ధ్యానానికి ఆటంకమని అనిపించింది. ఒంటరిగా ఒకచోట కూచొని ధ్యానించడం ఆమెకు అత్యంతావశ్యకంగా తోచింది. అందువల్ల ఒక సందర్భంలో తన స్వగ్రామానికి వెళ్ళి ఓ సంవత్సరం ఉండిపోయింది. కాసేపు ధ్యానం, మిగతా వేళల్లో ఖాళీగా ఉంటూ కాలం గడిపింది. ఆశ్రమానికి వెళితే బాగుండునని మనసులో అనిపించినా, అక్కడ ధ్యానానికి అవకాశముండదు అనే ఆలోచన తోసుకు వచ్చేది. హృదయం మాత్రం "ధ్యానంకన్నా భగవాన్ సరసనే ఉంటూ ఆశ్రమ పాక శాలలో పనిచేయడమే మేలు సమా' అని సూచిస్తుండేది. స్వగ్రామంలో ఆమెకు కావలసినంత తీరిక ఉన్న మాట నిజమే కాని, వృథా కాలక్షేప మయిపోతున్నదని అని పించసాగింది.

తిరిగివెళ్ళి ఆశ్రమంలోని వంట గదిలో పనిచేస్తుండగా భగవాన్ తన వంక తీక్షణంగా చూస్తూ ఇలా అన్నారు. "నీకింకా ధ్యానిస్తూ ఒకచోట కూచోవాలని వున్నది కదూ?"

"ఇక్కడ అంతులేని ఈ పనిచేయడం తప్పితే, ఆధ్యాత్మికంగా నాకేమి లభిస్తున్నది?" అని ఎదురు ప్రశ్నవేసింది ఆమె.

భగవాన్ ఎంతో సాదరంగా "నీ చేతుల్తో నువ్వెంత పనైనా చేయవచ్చుగాక. కానీ నీ మనసు ధ్యానమగ్నమై నిశ్చలంగా ఉండవచ్చు. ఏ క్షణాన కూడా చలించని ఆ నిశ్చలత్వమే నువ్వు. దానిని కనుగొను. అప్పుడే పని కష్టమనిపించదు. అలా కాకుండా నువ్వీ శరీరానివే అవి అనుకున్నంత కాలం 'ఈ పనంతా చేయవలసి వచ్చింది' అని భావించినంతసేపు, బ్రతుకుంతా చాకిరితోనే వెళ్ళిపోతున్నట్లుంటుంది. నిజానికి కష్ట పడేది ఈ మనసే కానీ శరీరం కాదు. స్వగ్రామంలో నీ శరీరం ఊరకే వుంటున్నప్పటికీ నీ మనసు ఊరకే ఉండగలుగుతున్నదా చెప్పు. నిద్రలో కూడా మనసు ఏదో ఒకటి కల్పించుకొని కలల రూపంలో ఏదో చేస్తూనే వుంటుంది" అన్నారు.

అందుకు ఆమె, "ఈ శరీరం నేను కాదనే స్పృహమీకెంత సహజమో, ఈ శరీరమే నేను అని అనుకోడం మాకూ అంతే సహజం స్వామీ. ఈ మధ్య మీరీ విషయం మాకు విశదీకరించి చెప్తున్నట్లు నాకో కల వచ్చింది. మీరు తడికెల వెనక స్నానం చేస్తున్న సమయంలో నేను పాకశాలలో పనిచేస్తూ ఉన్నానుట. 'ఎవరక్కడ?' అని మీరన్నారుట. 'నేనెవరో ఎలా చెప్పను?' అని నేనన్నానుట. అప్పుడు మీరు "అదే నిజం. ఫలానా అని చెప్పుకోడానికి నువ్వు ఏదీ కాదు" అని మీరన్నారు. స్వప్నంలో అంతా స్పష్టంగానే ఉంది. కానీ మేల్కొన్న తర్వాత నేనీ శరీరాన్ని కాదనే స్పృహ నాకు అంత స్పష్టంగానూ ఉండదేమి?" అని అడిగానంటుంది సుబ్బలక్ష్మమ్మ. రమణుడు మందహాసంతో, "నీకా స్పృహ తగినంతగా కలగలేదు కాబట్టి" అని ఊరుకున్నాడు.

జీవించడం ధ్యానించేటందుకేననీ, ఎక్కడ ఏ కార్యంలో నిమగ్నమైనప్పటికీ ధ్యానానికి దూరమవవలసిన అవసరం లేదనీ, అలాగే మనిషికి తాను 'ఆత్మనే' అనెడి స్పృహ గాఢంగా ఏర్పడితే, మిగతా వాటన్నిటినీ వాటి యధాస్థానంలో ఉంచే వీలుందనీ తెలిపెడి ఈ రమణ బోధ అమిత రమణీయం.

సన్యాసి వేషం ధరిస్తే, సన్యాసికి ఉండే, లేక ఉండవలసిన మనస్తత్వం, ఏర్పడ గలదనే భ్రమలో సుబ్బలక్ష్మమ్మ, ఒకసారి రమణుణ్ణి అలాంటి దుస్తులు ధరించనివ్వమని అడిగింది. ఆ కాషాయాంబరాలు ధరించి భిక్షమెత్తాలని ఉందని విన్నవించుకున్నది. "రంగు వస్త్రాలు నీకు వైరాగ్యం కలగజేస్తాయంటావా? అసలు సన్యాసమంటే ఏమిటో అర్థం చేసుకో" అని సమాధానమిచ్చాడు రమణుడు.

రమణుడు తన జీవితంలో ఏనాడూ ఇలాంటి వేషం ధరించడం కానీ, ఎందరు బలవంత పెట్టినా ఒకరి దగ్గర దీక్షలు స్వీకరించడం గానీ, ప్రబోధం చేయడానికని తిరువణ్ణామలై నుండి కదలడంగానీ, ఇవేవీ చేసినవాడు కాదు. అత్యంత సామాన్యంగా తన సహజ స్థితిలో బ్రతుకుతుండేవాడు.

ఒకసారి కొందరు భక్తులు రమణుని సమక్షంలో కూచొని, తమ గురువైన రణణుని  కీర్తిస్తూ ఏదో కీర్తన పాడారు. కీర్తన పాడుతూ ఉండగా, రమణుడు మధ్యలో

లేచి అక్కడి నుండి వెళ్ళిపోయారంటుంది, సుబ్బలక్ష్మమ్మ. వెళుతూ "ప్రార్థనలూ సంకీర్తనలూ, ప్రశంసలూ మనిషిని ముందుకు తీసుకువెళ్ళగలిగిలేవు. గురువు కరుణా పూరితమైన దృక్కే నిజమైన జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది" అన్నాడు. భగవాన్ రమణుడి కరుణాత్మమైన దృష్టి తనపై ఎన్నోమార్లు నిలిచింది కాబట్టి, తనకు ఏమీ కొదవలేదని సంతోషించానంటుంది సుబ్బలక్ష్మమ్మ. కానీ ఆ మర్నాడే మరో సందర్భంగా రమణుడు, 'మనిషి ఆర్నెల్ల శిశువు మానసిక స్థితి సిద్ధింప జేసుకుంటే తప్పితే, ఆత్మజ్ఞానం విషయంలో ఆశ వదలుకోవలసిందే" అన్నాడు. ఆ మాటతో ఆమె ఉత్సాహమంతా దిగిపోయింది. అరుణాచల ప్రభువు సమక్షంలో తాను నివసిస్తున్నప్పటికీ, తాను ఆర్నెల్ల శిశువు మానసిక స్థితి అందుకోగలననే విశ్వాసం తనకు లేకుండా పోయింది – అంటుంది.

గురుకృప దైవకటాక్షం, పేరేదైనప్పటికీ, అది మనిషిపై ప్రసరించాలంటే, భజనలు సంకీర్తనలతో సంతృప్తి పడకుండా, మనిషి తన అసలు కర్తవ్యం నిర్వర్తించినప్పుడే, అది సంభవిస్తుంది అనే విషయం, పై సంఘటనల ద్వారా తెలుస్తున్నది. ఆలోచనా రహితమైన – అంటే ఆకలి దప్పులు తక్క మరేమీ ఎరగని ఆర్నెల్ల పసిపాపవలె – 'ఇది నాకు కావాలి' నేనిది అవాలి' అనే ఆలోచన ప్రవేశించని అమాయకపు జీవిలా జీవిస్తే గానీ, 'ఆత్మ' దర్శనమివ్వ దంటున్నాడు, రమణుడు. మనవంతు మనం చేయకుండా గురుకృప ద్వారా అన్నీ పొందవచ్చు అనుకోవడం దురాశ.

ఆశ్రమంలో శ్రీమతి సుబ్బలక్ష్మమ్మ నేర్చుకున్న మరికొన్ని 'పాఠాలు' తరువాత చెబుతాను.

# కర్మ కౌశలం

రమణుని ద్వారా శ్రీమతి సుబ్బలక్ష్మమ్మ నేర్చుకున్న మరికొన్ని విషయాలు వివరిస్తాను : "మరొకరికి కూడా వడ్డించడానికి చాలని వస్తువు ఆయన తన విస్తట్లో వేయనిచ్చేవాడు కాదు. వేసినా ఆ పదార్థాన్ని ముట్టుకోకుండా తీయించేసేవాడు. మనం వేర్వేరు కాదనీ, అందరమూ ఒకటేనని మా అందరికీ తెలిసి వచ్చేందుకు ఆయన ఈ కఠినమైన పద్ధతిని అనుసరించే వాడు.

ఒకసారి ఆయనకు పసికర్లవ్యాధి సోకింది. ఆయనకు పండ్లూ, పండ్లరసాలు మాత్రమే ఇవ్వాలని వైద్యులు నిశ్చయించారు. కనీసం అప్పుడైనా ఆయన తన కఠోర నియమాన్ని సడలించి, తనకు విడిగా పండ్ల తొనలు, రసాలు ఇవ్వనిస్తాడేమోనని అనుకున్నాం. కానీ 'అందరికీ పంచితేనే, నేనూ తింటాను', అని ఆయన భీష్మించుకు కూచున్నాడు. ఆశ్రమవాసులందరికీ సరిపడేన్ని పళ్లు అంత ఖర్చుతో ఎలా తెచ్చేట్లు? అయినా రోగికి పత్యంగా చెప్పినప్పుడు ఆయన తీసుకోవడంలో తప్పేమిటి? అని వాదించేవారికి ఆయన చర్యలు అర్థంకాకపోవచ్చు. రమణుడి శరీరానికి వ్యాధి సంక్రమించిందే కానీ, రమణుడు రోగగ్రస్తుడు కాదు ! (అంటుంది సుబ్బలక్ష్మమ్మ) ఎట్టి పరిస్థితులలోనూ తాను మరొకరికన్నా భిన్నంగా ఎక్కువ తీసుకునే ప్రసక్తిలేదని, అక్కడున్న తన శిష్యులకు తెలియజేయడమే ఆయన ఉద్దేశమంటుంది. "తన పసికర్లు తగ్గినా తగ్గకపోయినా ముందు మేమీ పాఠం నేర్చుకోడమే ఆయనకు ప్రధానం".

సరియైన పత్యం, అనువైన ఆహారం లేనందువల్ల ఆయన పసికర్లు కొన్నాళ్ళు నయంకాకుండా అలాగే ఉండిపోయాయి. అయితే ఒక రోజున ఒక వృద్ధుడు రెండు పుల్లటి నిమ్మకాలు తెచ్చి వాటి రసం తేనెలో కానీ, చక్కరతో కానీ కలిపి ఇస్తే వ్యాధి నయం అవుతుందని తనకు స్వప్నం వచ్చినట్లు చెప్పాడు. నిజంగానే ఆ రసం తీసుకునే సరికి, రమణుని వ్యాధి ఇట్లే తగ్గిపోయింది. "మాకు గుణపాఠం నేర్పడానికి ఆయనకీ పసికర్లు" అంటుంది సుబ్బలక్ష్మమ్మ.

## పునర్జన్మ ఉన్నట్టా, లేనట్టా?

ఒకనాటి మధ్యాహ్నం వేళ కుంభకోణం నుండి వచ్చిన ఒకామె భగవాన్ సమీపంలో కూచొని, "మిమ్మల్ని చూడాలని చాలాకాలం నుంచి అనుకుంటూ వుండేదాన్ని స్వామీ. నాకేమీ అక్కరలేదు, దయవుంచి నాకు మోక్షం మాత్రం ఇప్పించండి స్వామీ" అని వేడుకున్నది. ఆ మాట అనడమే తడవుగా, అక్కణ్ణుంచి లేచి వెళ్ళిపోయింది. భగవాన్ మనసారా నవ్వుకున్నారు. "చూశారా ఆమెను? కావలసిందల్లా ఒక్క మోక్షమేనట. మరేమీ అక్కరలేదట" అని అన్నారు.

అప్పుడు సుబ్బలక్ష్మమ్మ "మనమందరమూ కోరేది అదే కదా?" అన్నది భగవాన్‌తో.

"మోక్షమనేది కోరితే, ఒకరు ఇంకొకరికి ఇవ్వగలిగినదా? నేనేమైనా మోక్షాన్ని మూటలు కట్టి నావద్ద దాచుకో నున్నానా, అడిగిన వారికి ఇవ్వడానికి? ఆమె అన్న మాటలు విన్నారు కదా? 'నాకు మరేమీ అక్కరలేదు స్వామీ" అన్నది. ఆ మాటే ఆమె మనస్ఫూర్తిగా అనుకొని ఉంటే, అదే మోక్షమవుతుంది. నేనివ్వగలిగినది, తాము తీసుకో గలిగింది ఏముంటుంది?" అన్నారు.

సుబ్బలక్ష్మమ్మ, ఆశ్రమంలో చేరిన కొత్తల్లో భగవాన్ పచ్చడి రుబ్బడంలో, కూరల పెచ్చుతీయడంలో, వంట చేయడంలో సహాయపడుతుండేవాడు. తెల్లవారు ఝామునే లేచి వంటచేస్తున్న వారికి తోడ్పడడానికి వంటగది వద్దకు వచ్చేవాడు. సుబ్బలక్ష్మమ్మ ఇలా చెప్పుకొస్తుంది : "ఆడవాళ్ళమైన మేము సూర్యోదయ మవగానే అక్కడికి వచ్చే వాళ్ళం. మేము వచ్చేలోగానే, వంట ప్రారంభించడానికి అన్నీ సిద్ధం చేస్తుండేవారు భగవాన్. పలుమార్లు అప్పటికే సగం వంట అయిపోయి ఉండేది కూడానూ. ఈ విధంగా ఆయన అక్కడి పనిభారమంతా తనమీదే వేసుకుంటూ ఉండడం చూసి, ఇది నివారించడానికి మేమందరం తెల్లవారు ఝామున ఐదింటికే రానారంభించాము. ఇది గమనించి, భగవాన్, తాను నాలుగింటికే రావడం మొదలెట్టారు. ఇలా కాదని మేమందరం మూడింటికే రావడం ప్రారంభించాము. ఈ పోటీవల్ల మేము సరిగా నిద్రపోవడం లేదని గ్రహించిన భగవాన్, సూర్యోదయం ముందు వంట గదిలోకి అడుగుపెట్టడం మానేశారు. ఆ విధంగా మమ్మల్ని సుఖంగా నిద్రపోనిచ్చారని అనుకుంటాను".

"అడపాదడపా మేము చేసే పొరపాట్లను సహించినప్పటికీ, తాను చెప్పినది తు.చ. తప్పకుండా అనుసరించేట్లు, చేసేవాడు ఆయన. మేమేదైనా పనిచేయాల్సి ఉంటే, అది సరిగా సంతృప్తికరంగా చేసేవరకూ, మళ్ళీ మళ్ళీ చేయించేవాడు. ఇది కేవలం తన సంతృప్తికోసమా అంటే, కానేకాదు. ఏ పనివల్లనైనా ఆయనకు ఒనగూరే ప్రయోజన మేముంటుంది? మేము ఏ పనైనా సరిగా చేయగలమని మాకలాంటి శక్తి కలదని మాకు రుజువు చేయడానికి, మాలోని ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి, చేయిస్తుండేవాడు. అపసవ్యంగా చేస్తున్నామంటే అందుకు మా అశ్రద్ధ, ఓర్పు లేకపోవడం మొదలైనవే కారణమని మాకు తెలిసిరావడానికి అలా చేసేవాడు. ఒక్కోసారి ఈ పని చేయించే విషయంలో ఆయన చాలా కచ్చితంగా, మళ్ళీ మట్లాడితే, కఠినంగా కూడా ఉంటాడనిపించేది. కానీ మాకు తెలియని విషయం ఒకటి ఆయనకు తెలుసు; అదేమిటంటే; మేము ప్రయత్నం చేయాలేకానీ, ఆ పనిని సరిగానే నిర్వర్తించగలమని ఆయనకు తెలిసినంత స్పష్టంగా మాకు తెలియదు. అనుభవం గడించినకొద్దీ మాలో ఆత్మవిశ్వాసం పెరగజొచ్చింది; తద్వారా జీవితంలో ధర్మాచరణ సాగిపోతుండేది." అని చెప్పుకొస్తుంది శ్రీమతి సుబ్బలక్ష్మమ్మ.

జీవితంలో మనిషి 'నిజంగా నేర్చుకోదగినది' ఉట్టుట్టిగా వచ్చేదికాదు. అందుకు శ్రద్ధ తదేకదీక్ష అవసరం. సుఖదుఃఖాల కతీతంగా అంకితమైతే తప్పితే, జీవితం మనకు దర్శనం ఇవ్వదు.

శ్రద్ధాళువులై తన వద్దకు నేర్చుకునేందుకు వచ్చిన వారికి రమణుడు, పండిత పామర, ధనిక నిర్ధన స్త్రీ పురుష భేదాలేవీ పాటించకుండా ఎంత చిన్నపనైనా కుశలతతో చేయడం నేర్పి, అదే కర్మ కౌశలం ద్వారా వారికి తరణోపాయం కూడా చూపిస్తుండే వాడు. సామాన్య స్త్రీ పురుషులను కూడా ఆత్మ విద్యాపారంగతులుగా చేయగలిగిన శ్రీ రమణుని చాతుర్యం ఆమోఘం.

# మారిన మనిషి

**జి**డ్డు కృష్ణమూర్తిని చదివినందువల్లా, విన్నందువల్లా, 'మారిన' వారిని ఒక్కరిని చూపించండి, అని నన్ను అడిగిన వాళ్ళున్నారు. మారడమంటే ఏమిటో, మారిన వాడు ఎలా ఉంటాడో అనే విషయంపై అంగీకారముంటే, మారారో లేదో, మారితే ఎంత మారారు అనే సంగతి చర్చించవచ్చు. అసలు మారిన మనిషి ఎలా ఉంటాడో మనం నిర్ధారణగా చెప్పలేనప్పుడు, కృష్ణమూర్తిని చదివి ఎవరైనా మారారా అని అడిగి ఏమి ప్రయోజనం?

మార్పు అంటే మీ ఉద్దేశం, దేనికీ చలించకుండా, ఎవరికెంత కష్టమొచ్చినా ఏదో ఒక సంస్కృత శ్లోకం వప్పజెప్పి, అలా వూరికే చూస్తూ కూచోడమనా? పవిత్ర గ్రంథాలు పారాయణచేస్తూ కూచునేవారు చాలా మంది ఆ పనిచేస్తూనే వున్నారు. ఉదాసీనత మార్పును సూచిస్తుందా?

పోనీ మారిన వారు, బీదసాదలను ఆదుకుంటామంటూ, మెల్లమెల్లగా వారిని మతం మార్పిడికి ప్రోత్సహిస్తూ ఉంటారా? మారిన మనిషి ప్రియభాషణలే చేస్తుంటాడా, కఠినంగా ఎన్నడూ మాట్లాడడా? మారిన మనిషి ఎలా ప్రవర్తిస్తాడో మనం ఊహించ గలిగిలేము. మారిన మనుషులుగా పేర్కొనబడే వారు నిజానికి బాహ్యంగా ఒక్కొక్కరూ ఒక్కోరకంగా ప్రవర్తించినట్లు కనిపిస్తుంది.

చిన్నప్పుడే తిరువణ్ణామలైకి వచ్చి అక్కడే స్థిరపడిపోయిన రమణుడు, అక్కడి నుండి మరెక్కడికీ వెళ్ళకుండా, జీవితాన్ని అక్కడే పరిసమాప్తం చేశాడు. ఇక నిసర్గదత్త మహరాజ్ అయితే, బొంబాయిలో ఓ పచారీ దుకాణం దాటకుండా జీవించినట్లు కనిపిస్తుంది. అటు జిడ్డు కృష్ణమూర్తిని చూద్దామా, లోకంలో పర్యటించకుండా వున్న సందర్భాలు ఆయన జీవితకాలంలో కొన్ని మాత్రమే కనిపిస్తాయి.

రమణుడు మద్య మాంసాలు, గంజాదమ్ము, పొగత్రాగడం ఇలాంటివేవీ ఎరగనే ఎరగడు. శాకాహారి అవడం అటుంచి, అనేక సంవత్సరాలు అంబలి, గంజి, భిక్షాటన

ద్వారా సేకరించిన మధుకరంతో బ్రతుకుతుండేవాడు. తనకేది వడ్డించినా, బంతిలో కూచున్న అందరికీ సమానంగా వడ్డించాలని పట్టుబట్టేవాడు. మిగతా అందరికీ మజ్జిగ పోసి తనకు పెరుగు వడ్డించడానికి వచ్చినా ఊరుకునేవాడు కాదు. మార్పు సంభవించిన అనంతరం కూడా ఒకచోట కూచుని ఉపన్యాసాలు ఇచ్చే బదులు వంటగదిలో తిరగ మోతలు వేయడం, కూరలు తరగడం చేస్తుండేవాడు. తాను ఏ పూజచేయకపోయినా, చేసే వారిని ఆటంకపరిచే వాడుకాడు. ఎవరైనా తనని గురువుగా భావిస్తే వారించే వాడు కాదు. కానీ ఎవరైనా రమణుని గురువుగా పేర్కొని, తాను శిష్యుణ్ణని చెప్పుకుంటే, గురువెక్కడున్నాడు? నేను నీకు గురువుని, నువ్వు నాకు శిష్యుడివని నేను చెప్పానా? అనేవాడు. అందరికీ ఒక్కడే. ఆ పరమాత్ముడే గురువనేవాడు. అమితమైన దయా దాక్షిణ్యాలు చూపించేవాడు; కొందరు మాత్రం తాత్కాలికంగా చాలా కఠినుడు సుమా అనేటట్లు ప్రవర్తించేవాడు.

ఇక శ్రీ జిడ్డు కృష్ణమూర్తి అంటేనా ఆయన ధనికుల ఇళ్ళలోనే అతిథిగా ఉంటుంటేవాడు. వారందించిన ఖరీదైన దుస్తులు ధరిస్తుండేవాడు. ప్రకృతి రామణీయకత ఉన్న సుందర ప్రదేశాల్లో, కొండల్లో, గుట్టల్లో విహరిస్తుండేవాడు. విందుల్లో పాల్గొంటూ తాను స్వయంగా మితంగానే భుజించినా పలు రకాల వంటకాలు వడ్డించే భాగ్యవంతుల మధ్య కూచోడానికి ఆయనకు అభ్యంతరం ఉండేది కాదు. మాంసం ముట్టేవాడు కాదు కానీ కోడి గుడ్డుతో చేసిన ఆమ్లెట్లు తినేవాడు. తాను మద్యం సేవించకపోయినా స్విట్జెర్లాండ్‌లో తన అతిథిగా వచ్చిన పాశ్చాత్యుడికి స్వయంగా తన చేత్తోనే మూత తెరవని మద్యం సీసా అందించినట్లు ఆ పాశ్చాత్యుడు ఓ పుస్తకంలో రాశాడు. యౌవనంలో ఒక పాశ్చాత్య యువతిని గాఢంగా ప్రేమించాడని, కృష్ణమూర్తి జీవిత చరిత్రలో మేరీ లూట్యన్స్ వ్రాసింది. ఏ దేశంలోనూ, ఏ ప్రదేశంలోనూ స్థిరపడకుండా ఆయన కోసం ఎదురుచూసే అనేకమంది అభిమానుల కొరకై జీవితం పొడుగూతా 'దేశద్రిమ్మరి' లాగా తిరుగుతూ, ప్రబోధిస్తూ, మేధావులతో, సైంటిస్టులతో, చర్చలు, సంవాదాలు సాగిస్తూ, జిజ్ఞాసాపరులలో 'నిప్పు రాజేస్తూనే' ఉండేవాడు.

బ్రహ్మవేత్త అయినవాడు ఇంత పనిని ఎందుకు తలకెత్తుకోవాలి? కనిపించేదంతా మాయా ప్రపంచమని ముక్కు మూసుకుని ఒకచోట కూర్చోవచ్చుకదా? జీవితం పొడుగూతా పనిగట్టుకుని ఊరూరా తిరుగుతూ ఈ ప్రసంగించడమేమిటి? తిరిగినా మెహర్‌బాబా లాగా మౌనముద్ర ధరించవచ్చుకదా? మరి కృష్ణమూర్తిలో మార్పు సంభవించినట్లా? సంభవించనట్లా?

ఆధ్యాత్మిక రంగంలో ఎవరి పెత్తనంగానీ, ఏ గురువునుగానీ అంగీకరించని కృష్ణమూర్తితో పోలిస్తే, నిసర్గదత్తుడు దత్త సంప్రదాయంలో గురువును సేవించి కృతార్థుడినైనా నంటాడు. తన గురువు చెప్పిన మహా వాక్యాన్ని నమ్మి, ఆలోచిస్తూ రోజుల తరబడి మరో ధ్యాస లేకుండా కదలక మెదలక అలాగే ఉండిపోయిన అనంతరం హఠాత్తుగా జ్ఞానోదయమయింది అంటాడు. తానే సంప్రదాయం నుండి వచ్చినా గురు శిష్య సంప్రదాయంతో నిమిత్తం లేకుండా జీవితాన్ని నిశితంగా గమనించడం ద్వారా, మనిషి విముక్తుడు కావచ్చునని ప్రకటిస్తాడు.

అజ్ఞానం పటాపంచలయిన తర్వాత కూడా నిసర్గదత్తుడు ప్రబోధించడానికి ఎక్కడికీ బయలుదేరలేదు. అతడు ఆట్టే చదువుకున్నవాడు కాదు. మాతృభాష అయిన మరాఠీలోనే వ్యవహరిస్తుండేవాడు. నిత్యమూ తన పూజామందిరంలో అందరి దేవుళ్ళ పటాలకూ హారతులు పడుతుండేవాడు; ఆ వరసలో జిడ్డు కృష్ణమూర్తి ఫోటో కూడా పెట్టి హారతి వెలుగు చూపించేవాడు. అరుణాచల రమణుణ్ణి తమ జీవితంలో ఎవరైనా దర్శించామని ఆయనతో చెప్పుకుంటే పులకించిపోయేవాడు. ఇంటి నుండి బయటికి పోకుండా, తన వద్దకు వచ్చిన వారితో చర్చిస్తూ ప్రసంగిస్తూ వారి చేతనే సమాధానాలు చెప్పిస్తూ 'విద్య' గఱపుతుండేవాడు. ఈయన సరసన వచ్చి కూచున్నవారికి ఏదో వింత శాంతి, ఏదో శ్రేయస్సు, ఏదో సమస్య పరిష్కారం లభిస్తుండేది.

మరి మార్పు చెందినట్లుగా అందరూ భావించే ఈ పుణ్య పురుషుడు వారి కులా చారాన్ననుసరించి ఇంట్లో మాంసం వండి వడ్డిస్తే అందరితోపాటు తానూ తినేవాడు. చిన్నతనం నుండీ బీడీలు కాల్చే అలవాటున్నందువల్ల జీవితాంతం బీడీలు కాలుస్తూనే

ఉండేవాడంటారు. అతడు బతికున్న రోజుల్లో బొంబాయిలో అతణ్ణి “బీడీ బాబా”గా పేర్కొంటుండేవారు. ఈ లెక్కన చూస్తే అధ్యాత్మికులు ఈ అలవాట్లు కలిగి ఉంటారని కానీ, ఇవి ఉండవని కానీ చెప్పే వీలు కనిపించదు.

అరుణాచల రమణ, జిడ్డు కృష్ణమూర్తి, నిసర్గదత్త మహరాజ్ అనే ఈ శతాబ్దపు ముగ్గురు మహానుభావుల బోధలలోనూ కొంత సామీప్యం సారూప్యం ఉన్న కారణాన ఈ మూర్తిత్రయాన్ని తీసుకు చర్చించాను. కానీ ఈ మార్పు సంభవించక మునుపూ, సంభవించిన తదుపరీ, వీరి జీవన శైలిలో, ఆహార విహారాల్లో, పూజ సలపడంలో, పూజ సల్పకపోవడంలో ఎంత భేదమున్నదో గమనించండి. అయినప్పటికీ వీరందరినీ మహా పురుషులుగా ఎందుకు పరిగణిస్తున్నారో, మన సాధారణ చైతన్యం ఆవలనున్న ఏ మహా కరుణను వీరు దర్శించారో, వీరి జీవితాలను ఏది ప్రభావితం చేసిందో కాస్త ఆలోచించండి.

కృష్ణమూర్తిని చదివినందువల్ల మారిన వారిని ఒక్కర్ని అయినా చూపించగలరా అని అడిగిన పృచ్ఛకుడికి నేనేమని సమాధానం చెప్పను? ఈ కృష్ణమూర్తే కాదు కురుక్షేత్రంలో అలనాటి కృష్ణమూర్తి బోధించిన తర్వాత, అది నిత్యమూ పారాయణ చేస్తున్న వారెందరు మారారు?

ఈలోగా ఎవరైనా ఎక్కడైనా మారారా అని వెతికే బదులు మార్పు యొక్క ఆవశ్యకత ‘అర్జెన్సీ’ గుర్తించి మనం మారే వీలుందా లేదా అని ప్రయత్నిస్తే సరిపోతుంది కదా? అప్పుడు సాధ్యమో కాదో తేలిపోతుంది; ఇక ప్రశ్నించాల్సిన అవసరమే ఉండదు.

# ప్రే'మహా'శక్తి

నిన్ను నిన్నుగా ప్రేమించుటకు
నీ కోసమే కన్నీరు నింపుటకు
నేనున్నానని నిండుగా పలికె

తోడొకరుండిన అదే భాగ్యమూ, అదే స్వర్గమూ" అని శ్రీశ్రీ రాసినప్పుడు, అతడిలాగానే మేము కూడా ఆ కాలంలో, అలాంటి మానవుని తోడు కోసం ఆరాట పడ్డాం. కాలం గడిచినకొద్దీ, మానవులందరూ భయస్థులేననీ, అందరూ ఒంటరి వాళ్ళేననీ, మరొకరివద్ద ప్రేమ ఆశించే స్థితిలో ఉండేవారేననీ, తమలో ప్రేమ పొంగి పొరలుతున్న కారణంవల్ల, పదిమందికీ దానిని పంచివ్వాలనే స్థితిని అందుకున్నవారు కాదనీ, తెలియ నారంభించింది. ఆ విధంగా చూస్తే అందరమూ కూడా ప్రేమ భిక్షుకులమే కానీ, ఎక్కి తొక్కిడిగా ప్రేమ సంపద కలిగి ఉండి, మరొకరికి ఇవ్వగలిగిన స్థితిలో లేము. తన ఒంటరితనం నుండి విముక్తి చెందనివాడు, ఇంకొకరి ఒంటరితనం, తద్వారా కలిగే భీతిని ఎలా నివారించగలడు? స్త్రీ గానీ, పురుషుడు గానీ ఎక్కడ జీవిస్తున్నా, ఏ రంగంలో కృషిచేస్తున్నా, పడే ఆరాటమంతా ఈ ప్రేమ కోసమే.

అయితే ఈ ప్రేమ తోటి మానవుల నుండీ, వారి వద్ద దొరకనప్పుడు పెంపుడు జంతువుల నుండీ లభిస్తుందనుకోడం మరో భ్రమ. అలా లభించేది ఛాయామాత్రమైన ప్రేమే అవుతుంది. స్వలాభాపేక్షవల్ల జనించే ఆ ప్రేమకు విలువలేదు.

'నిన్ను నిన్నుగా' ఎవరూ ప్రేమించగలిగిలేరు. నువ్వేమి ఇవ్వగలవో దానికై ఎదురు చూస్తుంటారు. నిన్ను నిన్నుగా ప్రేమించగలిగిన ప్రేమ స్వరూపి ఆ ఒక్క మహాశక్తే. దానిపై నీకు ప్రేమ కలిగినప్పుడు, అనగా నీలో నిద్రాణమై ఉన్న ప్రేమ దానికై ఆరాటపడ నారంభించినప్పుడు, అదొక్కటే నీకు కడవలకొద్దీ ప్రేమనందించ గలుగుతుంది. అప్పుడు నీవు ఎవరి ప్రేమనూ ఆశించవు. మహా ప్రేమికుడిగా నువ్వే నలుగురికీ ఇంత పంచి పెట్టనారంభిస్తావు; పదిమందికీ పంచివ్వకుండా దానిని దాచుకోగలిగి కూడా ఉండవు.

అలాంటి ప్రేమను కలిగి ఉన్న మహనీయుల్లో అరుణాచల రమణుడొకడు. 'కృష్ణభిక్షు' అనే నామధేయంతో ఎక్కువమంది ఎరిగున్న కోరుగంటి కృష్ణయ్య శ్రీరమణలీల అనే గ్రంథాన్ని రచించారు. తెనుగు సంస్కృత భాషల్లో పండితుడు. ఆయన ఇలా రాసుకొస్తారు.

"నా అన్వేషణలో భాగంగా ఒకమారు వారణాశి వెళ్ళాను. అక్కడో నెలరోజు లుండి, పాండిచేరి వచ్చి ఆ వూళ్ళో అయిదు నెలలు గడిపాను. అటు వారణాసి వెళ్ళినా ఇటు అరవిందాశ్రమానికి వెళ్ళినా ప్రతిచోటా కూడా, 'నువ్వు మరీ బలహీనుడిగా కనిపిస్తున్నావు, యోగానికి పనికివచ్చేట్లు లేవు' అని కొందరూ, 'నీకు ఏకాగ్రత లేదయ్యా, నువ్వు పూరక రేచకాలు కుంభకం సరిగా చేయలేకుండా ఉన్నావు' అని ఒకరూ, 'నువ్వు ఉపవాసం చేయలేవోయ్' అని మరొకరూ, 'నీకు నిద్ర ఎక్కువోయ్, రాత్రిళ్ళు మేల్కొని ఉండలేవు, జాగారం చెయ్యలేవ్' అనీ, "నీకున్న ఆస్తినంతా త్యాగం చేస్తేకానీ లాభం లేదు" అనీ ఇలా రకరకాల సలహాలిచ్చేవారు.

తిరువణ్ణామలైలో భగవాన్ రమణుల వారొక్కరే నావద్ద నుండి ఏమీ ఆశించ లేదు. నాలో ఏ తప్పూ ఎంచలేదు. ఆయన అవ్యాజమైన కరుణకు నేనేవిధంగానూ అర్హుడిగా అనుకోలేదు. కానీ భగవాన్ కివేమీ పట్టలేదు. ఆయనకు నేను కావాలేగానీ, నా మంచితనం, నా అర్హతతో నిమిత్తంలేదు." అంటాడు కృష్ణయ్య.

దీని అర్థం మనిషి ఎలా ఉన్నాడో, ఆ ఉన్న స్థితిలోనే రమణుడు స్వీకరించే వాడన్నమాట, అంతేగానీ ఉన్నత స్థితిలో ఉండాలని ఎదురు చూసేవాడు కాదు. అదే అవ్యాజమైన కరుణ లక్షణం. నిన్ను నిన్నుగా ప్రేమించగలిగింది, నీ ఉన్న స్థితిలోనే నిన్ను స్వీకరించి, నిన్ను ఉద్ధరించగలిగేదీ ప్రేమ స్వరూపి అయిన ఆ మహాశక్తే. అది ఒకసారి శ్రీరమణుల రూపంలో దర్శనమిస్తుంది. మరోచోట మరొకరి రూపంలో.

కృష్ణయ్య ఇంకా ఇలా చెప్పుకొస్తారు. "నేను నీ వాణ్ణి అంటే ఆయనకు చాలు. మిగతాదంతా ఆయనే చేసేవాడు... ఆయన ప్రేమ నాకెలా తోస్తుండేదో, ఆయన శరణుజొచ్చిన మిగతా వారికి కూడా, ఆయన తమని ప్రత్యేకంగా ప్రేమిస్తున్నట్లే

తోచేది. ఆయన మమ్మల్నందర్నీ ప్రేమిస్తుండేవాడు, కానీ ఒక్కొక్కరినీ ఒక్కొక్క రీతిగా ప్రేమిస్తున్నట్లు కనిపించేది. బ్రహ్మాండమైన ఆ ప్రేమలో మా అసలు సత్త మేము కనుగొనగలిగాము అనుకుంటాను" అంటారు కృష్ణయ్య.

అదే ప్రేమలో ఉండే గొప్ప గుణం. అఖండమైన, విస్తారమైన ప్రేమ ఉన్న వాని సన్నిధిలో మనుషులందరూ తమ జీవితానికి ఏది సార్థక్యమిస్తుందో, ఈ లోకంలో తాను నిజంగా చేయదగినదేమిటో కనుగొంటారు.

మళ్లీ కృష్ణయ్య మాటలు చదవండి "ఒకసారి భగవాన్ కూరలు తరుగుతున్నారు. "నన్నూ ఆ పని చేయనీయండి' అన్నాను. మూడుసార్లు అక్కడున్న చాకు తీసుకున్నాను. మూడుమార్లూ 'అదక్కడ పెట్టేయ'మన్నారు ఆయన. 'నేను తరగవలసిందే' అని అనే సరికి 'నువ్వు నీ ఇంటివద్ద కూరలు తరుగుతావా?' అని అడిగారు. "లేదు. ఇంటి వద్ద తరగాల్సిన అవసరం రాదు" అన్నాను. "ఇక్కడ ఆశ్రమంలో నువ్వు ఇంటి వద్ద ఉన్నట్లు కాదా?" అన్నారు ఆయన. (అంటే ఏ విధమైన క్రమశిక్షణకు గురిచేసేవాడు కాదన్న మాట.)

## జ్ఞాని నిశ్చలత్వం

అతి వేగంగా తిరిగే బొంగరం నిశ్చలంగా వున్నట్లు చూపులకు కనిపిస్తుంది. కన్ను దాని వేగాన్ని అందుకోలేకపోవడమే ఇందుకు కారణం. అట్లే, జ్ఞాని నిశ్చలుడుగా కనిపించినా, ఆ నిశ్చలత్వం మాటున తీవ్రమైన కర్మణ్యత్వమున్నది. సామాన్య జనులు అది జడత్వమని పొరపాటుపడతారు.

## ‘ఆలోచనను జయించినవాడే యోధుడు’

‘దేవుడున్నాడా?’ అని సవాల్ విసిరిన వారిని కూడా, ఆగ్రహించకుండా, “దేవుడి సంగతి వదిలెయ్, నీవు ఉన్నావు కదా?” అని ప్రారంభించి, “నువ్వు ఉన్నావనే విషయం నీకు నిశ్చయంగా తెలుసు కాబట్టి, ఇక ఇప్పుడు నువ్వెవరో కనుక్కో”మని సూచించేవాడు అరుణాచల రమణుడు.

ఆయన ఎవరివద్దా దీక్ష పుచ్చుకున్నదీ లేదు; ఎవరికీ దీక్ష ఇచ్చినదీలేదు. మానవ మాత్రుడెవరూ అతడికి గురువు కాదు; తాను ఎవరికీ గురువునని కానీ, ఫలానావారు తన శిష్యులనికానీ చెప్పుకున్నదీ లేదు. 1896లో, తన పదిహేడో ఏట గోకులాష్టమి నాడు ఇల్లు వదలిన రమణుడు, నేరుగా మొదటిసారి రైలు ప్రయాణంచేసి తిరువణ్ణామలైకి వచ్చాడు; అదే అతడి ఆఖరి ప్రయాణం కూడాను. ఆ తిరువణ్ణామలై నుండి, తనని ‘పిలిచిన’ అరుణాచలేశ్వరుని నుండి, 1950లో దేహాంతమయ్యేవరకూ మరెక్కడికీ వెళ్ళలేదు.

స్త్రీ పురుష, ధనిక నిర్ధన, పండిత పామర భేదం లేకుండా కులమత వివక్షత పాటించకుండా, ఆయన అందించిన ‘విచారణ’ మార్గాన్ని ఆచరించినవారు దేశంలో ఎందరో ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా పలు జాతులు, మతాలకు చెందిన సాధకులు, ఆయన నివసించిన తిరువణ్ణామలైకే వచ్చి, తమ తమ సందేహాలు తీర్చుకొని ఆత్మ సంతృప్తి నొంది తిరిగి వెళ్లారు. కొందరు విదేశీయులు ఆశ్రమంలోనే ఉండిపోయారు. రమణుని నిర్యాణానంతరం సైతం, డేవిడ్ గాడ్‌మన్ అనే పాశ్చాత్యుడు ఆయన బోధచే ఆకర్షింపబడి ఆశ్రమంలో నివసించి ఆయన్ని గురించీ ఆయన అనుచరుడైన అన్నామలై స్వామిని గురించి చక్కని పుస్తకాలు ప్రచురించాడు.

పోలీసు అధికారిగా యౌవనంలోనే ఇంగ్లండు నుండి ఇండియాకు వచ్చిన ఎఫ్. హెచ్. హంఫ్రీస్, చిత్తూరు జిల్లాలో పదవిని చేపట్టినప్పుడు, తిరువణ్ణామలైలోని రమణుని గురించి విని, ఆసక్తితో ఆయన్ని సందర్శించడానికి వచ్చాడు. వయసులో

చిన్ననాడే అయినప్పటికీ ఆనాటి రమణుడి హుందాతనం, మృదుస్వభావం, ఆత్మ సంయమనం, నిశ్చలమైన విశ్వాసంతో ఆయన సంభాషించే తీరూ చూచి హంఫ్రీస్ అచ్చెరువొందాడు. 'అమానుష అద్భుతాలను' గురించి హంఫ్రీస్ ప్రస్తావించినప్పుడు, "ఆ అద్భుతాలనేవి సంభవిస్తున్న సమయంలో వాటిని చేసినట్లుగా భావింపబడేవారు తమ సాధారణ స్పృహలోనే ఉండి ఉంటారా?" అని రమణుడు సూటిగా ప్రశ్నించే సరికి, హంఫ్రీస్ అవాక్కయ్యాడు.

బ్రిటీష్ పత్రికా రచయిత పాల్ బ్రంటన్ రమణుణ్ణి సందర్శించి, ఆయనతో అనేక అధ్యాత్మిక విషయాలు చర్చించి, రమణుణ్ణి గురించి 'A Search in Secret India' అనే పుస్తకంలో రాశాడు. అది అనేకమంది పాశ్చాత్యుల దృష్టి నాకర్షించింది. ఆనాటి నుండి పశ్చిమదేశాల వారు అనేకమంది ఆశ్రమానికి వచ్చారు. అలా వచ్చిన వారిలో సోమర్‌సెట్‌మామ్ వంటి సుప్రసిద్ధ రచయిత, మేజర్ చాడ్‌విక్, ఆర్థర్ అస్‌బోర్న్ దంపతులు మొదలైన వారున్నారు. రమణ బోధను ఈ పాశ్చాత్యులే మరింత బాగా అవగాహన చేసుకున్నారేమో ననేటంతటి మంచి గ్రంథాలు ప్రచురించారు.

మారిస్ ఫ్రీడ్‌మన్ అనే పోలిష్ జాతీయుడు రమణుని వద్ద ఉంటూ తనకు సన్యాసమివ్వమని అడిగాడు. "నేను సన్యాసం పుచ్చుకున్నదీ లేదు; మరొకరికిచ్చే ప్రసక్తీ లేదు" అన్నాడు రమణుడు.

ఇతరుల విగ్రహ పూజకు తాను అభ్యంతరం చెప్పేవాడు కాదు; తాను మాత్రం దైవశక్తికి ఓ రూపముంటుందని ఎన్నడూ భావించేవాడు కాదు. రమణుని 'దేవుడు' ఆరాధించడానికి అనుకూలమైన ఓ రూపమున్న దేవుడు కాదు. ఈ విశ్వానికి ఆధార భూతమైన ఓ మహాశక్తి. విశ్వాన్ని 'అతడు' సృష్టించలేదు. ఈ విశ్వమే అతడి అనంత శక్తికి ఒక విరాట్ రూపం. విశ్వానికి అతడు వేరుకాదు; కానీ ఇది ఉన్నా లేకపోయినా అతడు పోగొట్టుకునేదేమీలేదు. భగవంతుడి యెడల నవవిధభక్తి, భక్తుడిగా, భృత్యుడిగా, ప్రియుడిగా ఏర్పరుచుకునే బాంధవ్యాలన్నీ భ్రమజనితమనీ, ఉన్నదల్లా ఆ దేవుడే అయినప్పుడు ఈ సంబంధాలేమిటని ప్రశ్నించేవాడు.

ఎవరు ఏ రకమైన యోగసాధన చేసినా, ఏ మంత్రజపం సలిపినా, ఏ సిద్ధాంతాలు చర్చించినా తాను అడ్డంవచ్చేవాడు కాదు. కానీ తన చెంతకు వచ్చి అడిగితే, తరణోపాయం 'నేనెవరు?' అని కనుక్కోడంలోనే ఇమిడి ఉంది అని చెప్పేవాడు. "ఈ 'నేనెవరు?' అని జిజ్ఞాసాపూర్వకంగా ప్రశ్నించుకోమని ఆయన చెప్పిన మాటలను సంప్రదాయబద్ధులైన అద్వైత సిద్ధాంతులు, ఇందుకు సమాధానం 'నేనే బ్రహ్మను' అని ఆయన చెప్తున్నాడని అనుకునేవారు. ఇకనేమి? పరిష్కారం లభించిందని భావించి వారు 'అహంబ్రహ్మాస్మి' అనే మహా వాక్యాన్ని జపిస్తూ ఉండిపోయేవారు. ప్రశ్న మనసులోనే వేసుకొని, అదే స్థాయిలో సమాధానం చెప్పుకుంటే 'నేను'ను కనుగొనలేమని, మనసు ఎక్కడ జన్మించిందో అక్కడ, అంటే ఆత్మలో అదృశ్యమయ్యే వరకూ ప్రశ్న కొనసాగాలని వారిని ఆయన హెచ్చరించాడు.

శ్రీ రమణుల వారిలో సున్నితమైన హాస్యముండేది. 'టౌన్ నుండి రమణాశ్రమానికి ఎవరో గుజరాతీ దంపతులొచ్చారు, వారీ ప్రాంతానికి కొత్త కాబట్టి, జట్కావాడు మామూలుగా తీసుకునే ముప్పావలా కిరాయి కాక మూడు రూపాయలివ్వమని వారిని వేధిస్తున్నాడు. మేమెవరం ఎంత చెప్పినా వినడంలేదు' అని ఓ అనుచరుడు ఉద్రేకంగా హాలులో కొచ్చి శ్రీ రమణులకు చెప్పాడు. అందుకు ఆయన మందస్వరంలో, "మీరంతా నామాట వింటున్నారు కాబట్టి ఆ ఒక్కణ్ణీ మందలిద్దామా;" అని ఊరుకున్నాడు.

పలు గురువులు సూచించిన వివిధ మార్గాలను చర్చిస్తూ, పాశ్చాత్య వేదాంతులను ఉటంకిస్తూ "ఒకరు ఒకటంటారు, మరొకరు మరొకటంటారు. ఏ మార్గం అనుసరించాలో తేలడం లేదు. నేనే మార్గాన వెళ్ళాలి?" అని ప్రశ్నించాడు ఒక పండితమ్మన్యుడు. హనుమంతుడి ముందర కుప్పిగంతులు వేసిన చందంగా, తనని తాను తెలుసుకోడానికి ప్రయత్నించకుండా వ్యర్థమైన సిద్ధాంత చర్చలు కిట్టని రమణుడు మౌనంగా ఉండి పోయాడు. కానీ ఆ వ్యక్తి వదలకుండా "నేనే మార్గాన్ని అనుసరించాలి?" అని మళ్ళీ మళ్ళీ అడుగుతూనే ఉన్నాడు. శ్రీవారు హాలు నుండి బయటికి వెళ్తూ, "ఎట్టా వచ్చావో అట్లాగే వెళ్తే సరి" అంటూ వెళ్ళిపోయాడు. ఇదేమి సమాధానం? వచ్చిన దారినే వెళ్ళ మంటే, తిరువణ్ణామలై బాటపట్టమనా?" అని అతడు అక్కడున్న వారితో మొరపెట్టు

కున్నాడు. "కాదయ్యా, ఏ ఆత్మ నుండైతే నీ మనసు బయలుదేరిందో, ఆ మనసుని మళ్ళీ ఆత్మ చెంతకే తీసుకువెళ్ళు అనే అర్థం స్ఫురించలేదా?" అని వివరించారు. కానీ ఆ వ్యక్తి తన పాండిత్య ప్రకర్షతో శ్రీవారిని వేధించినందుకు రమణుని సమాధానం ఆ వ్యక్తికి అర్థమయిన తీరు కూడా అతడి విషయంలో తగినట్లే ఉన్నదనుకోవాలి.

సుందరేశయ్యర్ అనే పెద్ద మనిషి తాను నలభై ఏళ్ళపాటు భగవాన్ సన్నిధిలో వారి బోధలు వింటూ కాలం గడిపాననీ, తనకీ నాడు ఉద్యోగరీత్యా ట్రాన్స్‌ఫర్ వచ్చిందనీ, భగవానుని వదలి తానెలా ఉండాలో తెలియడంలేదనీ మొరలిడుతూ ఉంటే, శ్రీమణుడు "నువ్వు ఎన్నాళ్లు భగవాన్‌తో ఉన్నానన్నావు?" అని, "నలభై ఏళ్లు" అని అయ్యర్‌చేత చెప్పించి, "ఇది చూడండి. నలభైఏళ్ళ పర్యంతం ఆయన నా బోధలు వింటున్నాడట. మరి ఇప్పుడేమో తాను భగవాన్‌కు దూరమవుతున్నాడట!" అని ఆశ్చర్యం ప్రకటించాడు. అంటే బోధను అర్థం చేసుకొని జీర్ణించుకున్న వాడికి భగవాన్ ఎల్లెడలా ఉన్నట్లే కదా? మరి ఈ శోకమేమిటి? అని రమణుని తాత్పర్యం. అదెట్లా ఉన్నా, అయ్యర్ వారికి ఆ తర్వాత బదిలీ రద్దయింది.

జ్ఞాని విశ్వాత్ముడు. అతడికి ఇక్కడ అక్కడ అని గానీ, రాకపోకలుగానీ ఉండవు. అతడి జ్ఞానబోధ సర్వకాల సర్వావస్థలయందు ఉంటూనే ఉంటుంది. మనం భగవానుని వదలి వెళ్ళినా, ఆత్మరూపమైన భగవాన్ మనల్ని వదలివెళ్లే అవకాశం లేదు.

'ధీ' అనగా మనస్సు, 'ర', అనగా ఆలోచనల ప్రవాహంలో శక్తిని కోల్పోకుండా రక్షించుకొనడం; అనే నిర్వచనమిస్తూ, 'ఎవడైతే ఆలోచనల వేగాన్ని అడ్డుకొని మనస్సును చిక్కపట్టగలడో అతడే 'ధీరుడు' అన్నారు శ్రీరమణులు.

అసలు తానెవరో కనుగొని తన సత్త వద్దకుచేరి అక్కడ ఉండిపోవడమే శ్రీరమణులు బోధ సారాంశం. ఆసక్తి గనుక ఉంటే ఇది ఏ మనిషైనా, చేసే వీలుంది. నిజానికి, తాను ఈ దేహం, ఈ మనసు కాదని తెలుసుకోడానికి అవ్యక్తస్థితిలోనైనా, మనిషికి కొంత ప్రయత్నం అవసరమేమో కానీ, ఒకసారి తన సత్తను, ఉనికిని గుర్తించినట్లయితే, ఆధ్యాత్మిక రంగంలో ఇక ప్రత్యేకంగా చేయదగింది ఏమీలేదు. అంతేకాదు, గుర్తింపు

జరిగిన తదుపరి ఏమీ చేయరాదు కూడాను. ఏదైనా చేస్తే ఆ మానసిక శ్రమ, మనిషిని తన సత్త నుండో, దాని అనుభవం నుండో దూరం చేస్తుంది. విరగబడి ఏదో చేసినందు వల్ల ఆత్మను కనుగొనవచ్చుననుకోడం భ్రమ. చేయవలసినదంతా చేసి – అనగా, ఆటంకాలు అవరోధాలను తొలగించి, కదలక మెదటక ఉండి పోవడమే సత్తను దర్శించే మార్గమనిపించుంటుంది. రమణుడి మాటల్లో చెప్పాలంటే:

ధ్యానించకు: ఉర్థినే ఉండు.

ఉన్నాను అని అనుకోకు: ఉండు, అంతే.

ఉండడం గురించి ఆలోచించకు. ఉండే ఉన్నావు.

## మూలాన్వేషణ

నీ ఉనికికి మూలం నీ లోపలే ఉన్నది. వెలుపల ఎక్కడనో లేదు. అది నీకు వెలుపల ఉన్న ఏ భగవంతుడో అని భ్రమించబోకు. ఆ మూలమేదో అన్వేషించి దానికి నిన్ను నీవు సమర్పించుకోడమే – అనగా దానిలో లీనం కావడమే కావలసినది. ఆ మూలానికి నీవు వెలుపల ఉన్నట్లు భావించుకోవడం వల్లనే అది ఎక్కడ వున్నదని నీవు ప్రశ్నించడం జరుగుతున్నది.

# నిందకు బాధపడనివారు

అరుణాచల రమణునికి బాగా పరిచయమున్న ఓ వ్యక్తిని గురించి ఎవరో మహర్షితో చెప్తూ, 'అతడు మిమ్మల్ని గురించి ఏవేవో మాట్లాడుతున్నాడని మీకు తెలుసా?' అని అడిగారు. అందుకు సమాధానంగా రమణుడు 'అతడలా మాట్లాడడానికి నేను అనుమతిస్తున్నాను. ఇప్పటికే అనుమతించినట్లే; మరింత వ్యతిరేకంగా మాట్లాడనివ్వండి; తదితరులు కూడా అతణ్ణి అనుసరించనివ్వండి. నే కోరుకునేదల్లా నా పాటికి నన్ను బతకనివ్వడమే. ఇలా అందరూ గనక నిందిస్తే, అలాగే ప్రచారం గూడా చేస్తే నా వద్దకు మనుషులు రావడం మానేస్తారు; ఆ విధంగా నన్ను నిందించే వారంతా నాకే మేలు చేసే వారవుతారు. ఇంతేగాక నన్ను గురించి మరేవైనా చెడు విషయాలు సేకరించి, క్రోడీకరించి జాబితా వేసి పుస్తకంగా ప్రచురించి, ప్రచారం చేయగలిగితే, ఆ మనిషికి కాస్త ధనంగూడా చేకూరుతుంది. ఉభయతారకం. అతడికి ధనార్జన, నాకు జనం తగ్గిపోవడం" అని వ్యాఖ్యానించాడు. మళ్లీ రెండు రోజుల తర్వాత మహర్షి ఏకాంతంగా వున్నప్పుడు ఆ నిందించే వ్యక్తిని గురించి శిష్యులు అదే ప్రస్తావన చేశారు. ఆ నిందకుడు తన చేష్టలతో చివరకు తనకే అపకారం చేసుకుంటున్నాడని మహర్షికి తెలియజేశారు. ఆ మాటలు విన్న రమణునికి అతడ్ని గురించిన ఆదుర్దా మొదలైంది. "అతడు నాలుగు డబ్బులు సంపాదించుకోడానికి ఎన్నుకున్న మార్గాన్ని మనం నిరోధించక పోయినప్పటికీ అతడు చిక్కుల్లో పడుతున్నట్లున్నాడు. అతడు మన యెడల ఎలా ప్రవర్తించినా కిమిన్నాస్తిగా వుండి పోయామని గ్రహించి బుద్ధిగా తన పద్ధతిని విడనాడి జాగ్రత్తగా మెసలుకున్నట్లైతే అతడి మీద ఇతరులకు ఈ శత్రుత్వం ప్రబలి వుండేది కాదు. కానీ, తీరా తన తల మీదికి తెచ్చుకున్న తర్వాత మనం మాత్రం ఏమి చేయగలం?" అన్నాడు రమణుడు.

శతాబ్దాల క్రితం ఇటోజాక్ అనే హీబ్రూ గురువుయొక్క తప్పులన్నిటినీ ఏకరువు పెడుతూ ఒక వ్యక్తి అతణ్ణి తరచూ విమర్శిస్తుండేవాడు. ఇటోజాక్ శిష్యవర్గమంతా గురువు మీద తిరగబడాలని అతడి ఉద్దేశ్యం. కానీ నిందకుడి మాటలు విన్న శిష్యులకు

ఆ వ్యక్తి మీదనే చాలా ఆగ్రహం జనించింది. ఈ విషయమంతా ఎవరో వెళ్లి గురువు ఇటోజాక్‌కు విన్నవించారు.

నిందిస్తున్న వ్యక్తికి కబురంపి, మరెవరూ లేని సమయం చూసుకొని ఇటోజాక్ అతడితో మాట్లాడాడు. "మూర్ఖుడా, నా మీద ఏవో కట్టుకథలు కల్పించి అబద్ధపు నిందలు వేస్తున్నావు. ఇవన్నీ అబద్ధాలు అని ప్రజలు తెలుసుకున్నప్పుడు నువ్వొక అబద్ధాల కోరువని ప్రజలు నిన్నే నిరసిస్తారు. వాళ్ళచేత ఆ మాట అనిపించుకోవడం దేనికి? నాలోని చెడు గుణాలన్నీ చెప్తాను విను. నా వద్ద నుండి బయటికి వెళ్లిన తర్వాత ఇవన్నీ గనుక నలుగురికీ చెప్పావంటే నువ్వు అబద్ధాల మనిషివని ఎవరూ నిన్ను అనజాలరు" అని సలహా ఇచ్చాడు.

రిషీకేష్‌లో ప్రప్రథమంగా ప్రసిద్ధ ఆశ్రమం స్థాపించిన స్వామి శివానంద దక్షిణాది మనిషి. అరవ ప్రాంతానికి చెందిన అతడి వంటవాడికి ఎందుకో ఆశ్రమాధిపతిమీద కోపమొచ్చింది. ఆయన వద్దకొచ్చి తన ఆగ్రహమంతా వెలిగక్కాడు. వింటూ వుండి పోయిన శివానందను చూచి అతడి కోపం మిన్నుముట్టింది. స్వామి మీద తన చేతిని కూడా ప్రయోగించాడు. అయినప్పటికీ శివానంద చలించలేదు.

"కోపం తీరిందా? మరికొన్ని దెబ్బలు వేయాలనిపిస్తే వేయి" అన్నాడు.

ఇలాంటి ప్రవర్తనను నటించి ఏదో గొప్ప పేరు తెచ్చుకోవాలని అనుకునే వారుంటారు. కానీ అది పనిచేయదు. లోపలి మనసు కోపాగ్నితో జ్వలిస్తూనే వుంటుంది. నిశ్శబ్దంగా పరివర్తన చెందినప్పుడే ఈ ప్రవర్తన మనిషికి సహజమవుతుంది.

ఆంతరంగిక మిత్రుల మధ్య కూచోనున్నప్పుడు శ్రీ జిడ్డు కృష్ణమూర్తిగారు ఓ మారు "నన్నొకసారి ఒక వ్యక్తి రాత్రివేళ పైని మెట్లమీది నుండి కిందికి తన్నాడు తెలుసా?" అని అన్నాడు. మిత్రుల నోటమాట రాకుండా ఆయన వంకే చూస్తూ వుండి పోయారు. 'మర్నాడు బ్రేక్‌ఫాస్ట్ టేబిల్ వద్ద సమావేశమైనప్పుడు అలా నన్ను తన్నిన వ్యక్తి తాను పొరపాటు చేశాను, క్షమించమన్నాడు. 'నిన్నటి సంగతి కదా; మరిచి పోదాం' అన్నాను. ఇలా బ్రతకడం అందరికీ సాధ్యమవదు. కానీ పరివర్తన చెందిన మనిషిని మన కొలతబద్దతో కొలవగలిలేము.

"నీ తోటి మానవుడు ఏదైనా అపరాధం చేస్తే అతణ్ణి మందలించు. అదే రోజున ఏడుమార్లు అదే రకంగా ప్రవర్తించినా, ఏడుసార్లూ గనక తన పశ్చాత్తాపాన్ని తెలియ జేస్తే నీవు అతణ్ణి క్షమిస్తూనే వుండాలి" అంటాడు జీసస్.

జీసస్ ఇచ్చిన సలహాను ఆలోచనాత్మకంగా ఏ మనిషీ చేయజాలడు. ఏడు దఫాలు అలా క్షమించగలిగి వుంటే, అది అతడి స్వభావమే అయి వుంటుంది.

లోపలి నుండి తోసుకువచ్చే కోపాన్ని అదుపులో పెట్టి క్షమించానని ప్రకటించినా, నిజంగా క్షమించగలిగి వుండం. అవతలి వాని ప్రవర్తన అజ్ఞానజనితమని ఖాయంగా తెలిసినప్పుడే, తాను అజ్ఞాని అయివుంటే తానూ అలాంటి పనేచేసి వుండేవాడినని గ్రహిస్తే తప్ప, మనిషి క్షమించలేడు. తాను అజ్ఞానదశలో చేసిన తప్పుల్ని కూడా జ్ఞానముదయించిన తదుపరి, తాను క్షమించుకోగలిగి వుండాలి. ఇతరులను క్షమించడమే గాక తనని తాను క్షమించుకోవడం అత్యవసరం. అప్పుడే మనిషి ప్రశాంతంగా బ్రతక గలడు.

మానవ జన్మ ఎత్తిన తర్వాత దూషించబడకుండా వుండని మనిషి వుండడు. అవతార పురుషులుగా పరిగణింపబడే శ్రీరాముడు, శ్రీకృష్ణుడంతటి వారికే నింద తప్పలేదు. ఇక మన మెంతటివారం? నిందను భరింపక తప్పదు. పరివర్తన వైపు అడుగువేస్తే నిందని ఓర్చుకోగల్గిన శక్తి ఏర్పడుతుంది. కేవలం ఓర్చుకోవడమే గాదు – నిందా, ప్రశంసా ఒకటిగానే కనిపిస్తాయి.

# రూపరహితం

**1935**లో ఇద్దరు హైందవేతరులు అరుణాచల రమణుల వారిని కలిసి 'భగవంతుడికి ఒకరూప ముందంటారా?' అని అడిగారు.

'అని ఎవరంటున్నారు?' అంటూ ఎదురు ప్రశ్న వేశారు శ్రీ రమణులు.

ఆ తర్వాత సంభాషణ ఇలా సాగింది.

'భగవంతుడికి రూపమనేది లేకపోతే అతడి విగ్రహాలు అని పేరు పెట్టి వాటిని పూజించడంలో వుండే ఔచిత్యమేమిటి?'

'భగవంతుడెవరో మనకు తెలియదు కాబట్టి, అతణ్ణి వదిలిపెట్టండి. నీ సంగతేమిటి? అది చెప్పు. నీకు రూపమున్నదా?'

'వున్నది, ఇదిగో, ఇది నేను. ఫలానా, ఇది నా వృత్తి.'

'అలాగే. అంటే నీవు కొన్ని అవయవాలతో కూడుకున్న మనిషివి. ఐదున్నర అడుగుల పొడవు, ఫలానావృత్తి వగైరా అంతేనా?

"అంతే"

"అయితే గాఢనిద్రలో వున్నప్పుడు ఈ వివరాలన్నీ నీకు ఎఱుకేనా?"

"నిద్ర మేల్కొన్న తర్వాత నేను నిద్రించాను అని గుర్తిస్తాను. దానినిబట్టి, నిద్రలో కూడా ఇదే విధంగా వుంటానని తెలుస్తూ వుంటుంది."

"నువ్వు శరీరానివే అయివున్నట్లయితే, శవాన్ని పూడ్చి పెడతారెందుకని? తనని అలా పూడ్చిపెట్టరాదని శరీరం మొరాయించవచ్చు కదా?"

"అలాగ కాదు. ఈ స్థూలదేహంలో నేను సూక్ష్మమైన జీవుణ్ణి"

"అంటే నిజానికి నీకు ఆకారమూ, రూపం లేదన్న మాటేకదా? కానీ ఇప్పుడు ఈ స్థూలదేహంతో మమేకం చెంది వున్నావు. నీకు ఆకారమూ, రూపమూ వున్నదను

కున్నంత కాలం రూపరహితుడైన ఆ భగవంతుడికి ఓ రూపం కల్పించి ప్రార్థించడంలో వున్న తప్పేమిటి?" అనేశాడు రమణుడు.

"ఎవరి స్థాయినిబట్టి వారు ఆరాధిస్తారు. పూర్వకాలంలో హైందవజాతిలోనే, విగ్రహపూజ అనేది కొన్ని వర్గాలకు మాత్రమే పరిమితమై వుండేది. మరికొన్ని వర్గాల వారు విద్యా తపస్సులచే భగవదారాధన సల్పుతుండేవారు. అట్టి తపశ్శాలురకు తమ యోగక్షేమముల గురించి చింత వుండెడిది కాదు. స్థూల బుద్ధి అన్ని వర్గాల వారి యందును పెరిగిపోవడం చేత విగ్రహ పూజయందు ఇంత ప్రేమ కలుగుచున్నది" అని తేల్చాడు, విజయనగర ప్రాంతంలో పుట్టి, గుజరాత్ రాష్ట్రంలో ప్రవచించిన స్వామి ప్రకాశానంద, ఈయనతోబాటు సహచరుడిగా తిరిగినస్వామి నిర్వికల్పానంద, 'జల రూపమును పొందిన తీర్థములను, మృత్పాషాణాది విగ్రహ రూపములను పొందిన దేవతలను, ఆత్మ ధ్యాన పరాయణులగు యోగులు సేవించరు" అని అర్థమిచ్చే ఉత్తర గీతలోని ఓ శ్లోకాన్ని ఉదహరిస్తుండేవాడు.

'చిల్లర రాళ్లకు మొక్కుతు వుంటే చెడిపోదువురా ఒరే, ఒరే' అని సామాన్య ప్రజలకు కూడా బోధించాడు బ్రహ్మంగారు.

'గ్రంథాన్ని పూజించడం అయినా విగ్రహారాధనే కదా?' అని అడిగేవారు జిడ్డు కృష్ణమూర్తిగారు.

ఆ మహాశక్తి రూపరహితం, నామరహితం అని తెలిసిగూడా హిందూమతం, మనుషుల ఎదుగుదలనుబట్టి వారి ఆరాధన వుంటుందని వదిలేసింది.

ఆరాధించడానికి వీలుగా దేవుడొకడున్నాడని ఉపనిషత్తులు ప్రతిపాదించవు. వ్యక్తిగతంగా అతడితో ఓ సంబంధం పెట్టుకోవడం అనే ప్రసక్తి ఎక్కడా కనిపించదు. మనిషి రూపం, మనిషి నామం, ఈ రెండూ కూడా భ్రమజనితమే. లోక వ్యవహారం కొనసాగడానికి ఈ నామ రూపాలు ఉపకరిస్తాయే కానీ, తనలోకి తాను చూచుకున్న వాడికి ఈ రెండూ అర్థరహితం.

మనిషి లోపల తిరుగాడుతున్నది ప్రాణశక్తి. దానికి పేరూ లేదు, రూపమూ లేదు. అలాంటి ఈ ప్రాణశక్తి, దీనికి మూలమైన ఆ మహాశక్తితో, ఇద్దరు మిత్రుల మధ్య, ఇద్దరు ప్రేమికుల మధ్య వుండే పేర్లుగల సంబంధంలాంటిది ఎలా నెఱపడం?”

ఆ మహాశక్తిని వర్ణింపనలవి కాదు. పురుషుడిగా ఊహిస్తే, స్త్రీ కాకుండా పోతుంది. వెలుగు అని నిర్వచిస్తే అంధకారం లేకుండా పోతుంది. ఇదీ, అదీ కూడాను. అని అంటే అర్థరహితమైపోతుంది. ఈ మహాశక్తిని కొన్ని మతాలు పితా అని మాతా అని, ప్రియతమా అని పలు రకాలుగా సంబోధిస్తాయి. ఉపనిషత్తులు ఇలాంటి వ్యక్తిగత సంబంధాలను అంగీకరించవు; కేవలం ‘తత్’ అని సరిపెట్టుకుంటాయి.

దానితో వ్యక్తిగత సంబంధం ఎలా సాగించడం? దానిలో కరిగిపోవడం ఒక్కటే మార్గంగా కనిపిస్తుంది. అప్పుడదే వుంటుంది; ఆత్మ శరీరాన్ని ధరిస్తున్నంత కాలం, అది భూమి మీదనే వుంటుంది. దాని గుణాలు, ఇక్కడ ఈ దేహంలో కూడా, సత్ చిత్, ఆనందం అంటుంది ఉపనిషత్. ఈ మూడు గుణాల్లో ఏ ఒక్కటి పూర్తిగా లభించినా, మిగతా రెండు గుణాలు వాటంతట అవే అక్కడకి చేరుతాయి.

పండితులైన భారతీయులు ఈ విషయాలన్నీ నిత్యం చర్చిస్తూనే వుంటారు. కానీ నేటి భారతీయులకు జీవితాన్ని ధ్యానయుక్తంగా, జ్ఞానయుక్తంగా గడుపుదామనే చింతన బదులు, ఏ విగ్రహాన్ని పూజిస్తే, ఏ మేలు కలుగుతుంది, ఏ గురువు వద్దకు చేరితే ఏమి లభిస్తుంది అనే ఆశతోనే సరిపోతుంటుంది.

ఉపనిషత్తులు మా భారతదేశంలో జనించినవి అని సగర్వంగా చెప్పుకునే ముందు, వాటిని మనలో ఎందరు అర్థం చేసుకొని ఆచరిస్తున్నారనేది ముఖ్యం. అప్పుడే మనం వాటికి వారసులమని చెప్పుకునే వీలుంటుంది.

# శ్రీ రమణులతో పూంజా



**పూం**జా మహాశయుడికి (హెచ్.డబ్ల్యు.ఎల్ పూంజా అనే కేరళీయుడు) భగవంతుణ్ణి దర్శించాలనే భావం చిన్నతనంలోనే అతి తీవ్రంగా నెలకొన్నది. వారినీ వీరినీ అడిగి చూశాడు; 'దేవుణ్ణి మేము చూపించగలం' అని ఎవరూ హామీ ఇవ్వలేక పోయారు. విసిగిపోయి, ఇంటికి తిరిగివచ్చిన ఓ సందర్భంలో, ఒక సాధువు ఆహార మాశిస్తూ వాళ్ల ఇంటి వద్దకు వచ్చాడు. లోపలికి పిల్చి అన్నంపెట్టి, తన తలలో మెదలుతున్న ప్రశ్ననతణ్నీ అడిగాడు: "నాకు దేవుణ్ణి చూపగలరా? పోనీ మీరు చూప లేకపోతే, చూపించగలవాణ్ణి ఎవరినైనా సూచించగలరా?"

"దేవుణ్ణి చూపించగల్గిన మనిషి నాకొకరు తెలుసు. మీరు అతణ్ణి పోయి చూస్తే అన్నీ సర్దుకుంటాయి. ఆయన పేరు రమణ మహర్షి"

ఆ పేరెన్నడూ పూంజా విని వుండలేదు. ఆయన ఎక్కడుంటాడని అడిగాడు. 'తిరుమణ్ణామలై' అన్నాడు సాధువు. అప్పటికి పంజాబ్‌లో నివసిస్తున్న పూంజా, ఆ ఊరి పేరు కూడా వినలేదు.

అక్కడికి ఎలా వెళ్లాలో కనుక్కున్నాడు కానీ, చేతిలో డబ్బులేదు. భగవదన్వేషణ అనే పేరుతో పూంజా తన భార్యాపిల్లల్ని వదిలేసి, వెర్రిమొర్రిగా సంచరించడం అతడి తండ్రికి ఏమాత్రం ఇష్టంలేదు. పూంజా ఆర్మీ కమిషన్ నుండి వెలువడిన తర్వాత, సంపాదన లేకుండా తిరుగుతున్నాడు.

'ఓ టీ స్టీల్' వద్ద కూచోనున్నప్పుడు అక్కడున్న ఓ పత్రికలో ప్రకటనొకటి చూశాడు. 'మద్రాసులో కాంటీన్ స్టోర్స్ నిర్వహించడానికి ఓ మాజీ సైనిక ఆఫీసర్ కావాలి;' జారీ చేసిన కంట్రాక్టర్ తాను నివసిస్తున్న పంజాబ్ రాష్ట్రంలోని పెషావర్‌లోనే వున్నట్లు గమనించి, మిలిటరీ యూనిఫారమ్‌లో వున్న తన ఫొటో పంపించాడు.

కంట్రాక్టర్, నియామకం ఖాయంచేసి, పూంజా మద్రాసుకు వెళ్లడానికి రైలు ఖర్చులు అందించి నెలరోజుల వ్యవధినిచ్చి, వెళ్లి అక్కడ పనిలో చేరమన్నాడు. ఆ బాధ్యతలు స్వీకరించే ముందు, మహర్షితో కొంతకాలం గడపడానికి, పూంజాకు అవకాశం లభించింది.

అది 1944వ సంవత్సరం; పూంజా వయస్సు ముప్పై నాలుగు. రైళ్లు, ఎద్దు బండి ప్రయాణం చేసి ఆశ్రమానికి చేరాడు. దేవుణ్ణి తనకు చూపించనున్న ఈ మనిషి ఎవరై ఉంటాడా అని బయటి కటికీలోగుండా లోనికి తొంగి చూశాడు. తనకొకరకమైన 'చీదర' కలిగించిందంటాడు పూంజా.

పంజాబ్‌లో తన ఇంట భోజనం చేసి సలహా ఇచ్చిన సాధువే, పూంజా ఈ వూరికి వచ్చేలోగా తాను ముందుగా వచ్చేసి, ఈ ఆశ్రమంలో కూచోనుండటం చూచి చెడ్డ అసహ్యం వేసిందంటాడు పూంజా. ఔరా, ఎంత మోసం ఎంత దగా! లోపలికి వెళ్లి ఆ మనిషిని నిలదీయాలని కూడా అనిపించలేదట. ఈ మోసపూరిత వాతావరణం నుండి బయటపడితే చాలనిపించిందట. ఈ దేవుడు వ్యాపారంలో వున్న వాళ్లందరూ దగాకోరులేనని తీర్మానించుకున్నాడు పూంజా. ఆశ్రమానికి తాను వచ్చిన బండిలోనే వెనక్కి వెళ్లిపోవడానికి నిశ్చయించుకున్నాడు.

ఆ సమయంలో, మద్రాసు నగరంలో ఓ సినిమా థియేటర్ ప్రొప్రయిటర్ అయిన ఫ్రాంజీ, పూంజాను తారసిల్లి 'ఉత్తరాది నుండి వచ్చినట్లున్నదే?' అని అడిగాడు.

'అవును'

'ఇప్పుడే వచ్చి, ఇప్పుడే ఈ వెళ్లిపోవడమేమిటి? రెండురోజులైనా వుండరా?'

'దొంగ సాధువులు దేశంలో అక్కడక్కడా తిరగడం, వారినీ వీరినీ ఈ ఆశ్రమానికి వచ్చేట్లు చేయడం, వాళ్లందరూ వచ్చేలోగానే తాము త్వరితంగా వచ్చేసి ఆశ్రమంలో కూచోడం, ఇవన్నీ ఎవరు సహిస్తారు? దేవుణ్ణి చూపించగలిగితే అక్కడ పంజాబ్‌లో నా ఇంటి దగ్గర తటస్థపడ్డప్పుడే చూపించి వుండవచ్చుగదా? ఈ నాటకమంతా దేనికి?' అని జరిగిన విషయం ఫ్రాంజీకి వివరించాడు.

'పొరబడుతున్నావ్. స్వామివారు ఇక్కడి నుండి ఏనాడూ కదలలేదు. నలభై ఎనిమిదేళ్లుగా ఆయన ఇక్కడే వున్నారు. ఆయన రూపం నీకు అక్కడ ఎలా తారసిల్లిందో మనకు తెలియరాదు. అమెరికా నుండి వచ్చిన ఓ అమ్మాయి కూడా ఇలానే అన్నది. నువ్వే పొరపాటు పడుతున్నా వేమోననే తలంపు నీకసలు వచ్చిందా?'

'నా పొరపాటేమీ లేదు'

మాంచి కోపంలో వున్నాడు పూంజా. ఫ్రాంజీ ఆహ్వానంపై ఆశ్రమంలో తిరిగి, భోంచేసిన తర్వాత మధ్యాహ్నం మహర్షిని చూచినప్పుడు కూడా, ఆగ్రహం అలాగే వుంది.

'పంజాబ్‌లో నా ఇంటివద్ద కలిసిన సాధువు మీరేనా?' అని ఆయన్నే అడిగాడు. మహర్షి నుండి సమాధానం లేదు.

'మీరు మా ఇంటికి వచ్చి, ఈ ఆశ్రమానికి రావలసిందిగా చెప్పినమాట నిజమా కాదా? అక్కడి నుండి ఇక్కడికి పంపించింది మీరు కాదా?'

మహర్షి నుండి మాట లేదు. మహర్షికి కూడా ఇదొక అనుభవమే. తాను పూనుకొని చేసింది ఇందులో ఏమీలేదు. ఇలాంటి ఘట్టాలు సృష్టించి ప్రగల్భంగా చెప్పుకోవలసిన అవసరం మహర్షికి లేదు. కానీ ఇలాంటివి సంభవించేటప్పుడు, ఆయన వాటిని ఆపగలిగి కూడా లేడు.

మానవాతీతమైన మరో శక్తి ఏదో పనిజేస్తున్నది. దానిని గురించి వ్యాఖ్యానించగలిగిన అవకాశమేది? ఆ శక్తి అందర్నీ మించినది; ఎవరి స్వాధీనంలోనూ వుండదు. శ్రీ రమణులవారు, ఏమి మాట్లాడతాడు?

ఇక తానడిగిన ప్రశ్నలకు మహర్షి ఎలాగూ సమాధానం చెప్పడని గ్రహించిన పూంజా, తాను అడగదలచుకున్న అసలు ప్రశ్న: "మీరు భగవంతుణ్ణి చూశారా? చూసి వుంటే, నాకు చూపించగలరా? ఎంత మూల్యమైనా చెల్లిస్తాను. ప్రాణమివ్వమన్నా ఇస్తాను. కానీ చూపించడం మీ వంతు; అది మాత్రం గుర్తుపెట్టుకోండి" అన్నాడు.

మిలిటరీలో వుండొచ్చిన పూంజా ఇలానే మాట్లాడి వుంటాడని మనం నమ్మవచ్చు. మహర్షి సమాధానాన్ని పూంజా మనకిలా తెలియజేస్తాడు.

"నే చూడలేదు; నీకు నేను చూపించగలిగి లేను. చూపించడానికి అదేమీ (వస్తుగతమైన) అబ్జక్ట్‌కాదు; సబ్జక్ట్ (లోన అనుభవించగలిగినది) అదే చూచెడిది. నువ్వు చూడగలిగిన వస్తువులతో పెట్టుకోవద్దు. చూచేదేదో, దాని సంగతి పట్టుకో. ఇక పోతే, నువ్వే అది అని నేనంటున్నాను"

పూంజాకిది నచ్చలేదుట, 'ఆ చూపు సారించేది నువ్వే, ఆ దేవుడనబడేది నువ్వేననే మాటలు' పూంజాకు ఏమాత్రం రుచించలేదు. తాను భగవంతుణ్ణి విడిగా ఒక ఆకారంగా, ఒక రూపంలో చూడాలనే కాంక్ష అతడికి ప్రబలంగా వుండిపోయింది.

తన వాంఛననుసరించి సాక్షాత్తూ శ్రీకృష్ణుణ్ణే, పూంజా తన దర్శన సమయాల్లో చూస్తుండేవాడు; చూడడమే కాదు, ఆ బాలకృష్ణుని రూపంతో భావపరంగా ఆడుకునే వాడు కూడాను. అరుణాచల రమణుని చుట్టూ చేరిన భక్తజనావళి, ఏదో కాలక్షేపం చేస్తున్న సోమరిపోతుల్లాగా కనిపించారు పూంజాకు. వారి మధ్యలో తీరికగా కూచున్న స్వామివారిని గురించి కూడా పూంజాకు సదభిప్రాయం కలగలేదు.

మద్రాసుకు వెళ్లి డ్యూటీలో చేరేలోగా, ఇలాంటి వారి మధ్యకాలం గడపటం కన్నా, అరుణాచల పర్వతం అవతలి వంకకు వెళ్లి ధ్యాన జపాదులలో నిమగ్నమవడం శ్రేయస్కరమని భావించి, కొండ ఉత్తర దిక్కున ఒక చిన్న అడవిలో చెట్ల మధ్య కూచుని, తనకు మొదట్నుంచీ అలవాటైన కృష్ణజపం ప్రారంభించాడు.

అలాంటి భక్తి మార్గాన్ని అనుసరిస్తూ వారం రోజులు అలా గడిపాడు. అడపా దడపా పూంజా చేసే పూజ ద్వారా అతడికి కృష్ణ దర్శనం తటస్థిస్తుండేది; తానూ తన ఇష్టదైవమూ ఆడుకుంటున్నట్లుండేది, వారం పూర్తవగానే, ఇక మద్రాసుకు వెళ్లాలని నిశ్చయించుకున్నాడు. వెళ్లేముందు మహర్షిని చూచి చెప్పిపోదామనీ, భగవంతుణ్ణి చూపించడంలో మహర్షి సహాయం తనకు అవసరంలేదనీ, తాను నిత్యమూ భగవంతుణ్ణి చూస్తూనే వున్నానని చెప్పిపోవాలనే తలబిరుసుతో వెళ్లాడు.

మహర్షిని కలిసినప్పుడు, ఆయన పూంజాతో, "ఏమయ్యా నువ్వెక్కడికి వెళ్లావ్? ఎక్కడుంటున్నావ్ ఇప్పుడు?" అని అడిగాడు.

"కొండ అవతల వుండిపోయాను"

"ఏం చేస్తున్నావ్?"

మహర్షి అడిగాడు కదా అని పూంజా సగర్వంగా 'నా కృష్ణుడితో ఆడుకుంటూ వుండిపోయాను' అని స్వయంతృప్త భావంతో చెప్పుకున్నాడు. అవును మరి, తనకు కనిపించిన కృష్ణుడు మహర్షికి కనిపించి వుండడు కదా, తాను మహర్షికన్నా ఎంత ఉన్నతుడోనని అనుకున్నా నంటాడు పూంజా.

మహర్షి ఆశ్చర్యపడి, పూంజా వంక చూస్తూ, "బాగుంది, బాగుంది. ఇప్పుడు కనిపిస్తున్నాడా?" అని నెమ్మదిగా అడిగాడు.

"ఇప్పుడు కనిపించడం లేదనుకోండి. నేను ఒకరకమైన దర్శన స్థితిలోకి వెళ్లి నప్పుడే కనిపిస్తాడు" ఇలాంటి దర్శనాలు మరెవరికీ దక్కకుండా తనకే దక్కుతుంటాయని పూంజాకు ఎంతైనా గర్వంగా వుండేది.

"అయితే కృష్ణుడొచ్చి నీతో ఆడుకున్నంతసేపూ ఆడుకొని, అటు తర్వాత మాయ మవుతాడన్నమాట" అంటూ రమణుడు, 'కనిపించినవాడు కాసేపటికల్లా మాయమవుతూ వుంటే అదేమి దేవుడయ్యా; నిజమైన దేవుడైతే నీతో పొడుగూతా వుండిపోవాలి కదా?" అన్నాడు.

పూంజాకు, తనని గురించి తానేర్పరుచుకున్న అభిప్రాయం సడలిపోనారంభించింది, "దేవుడి కోసం బాహ్యంగా వెతకకు" అంటున్నాడు మహర్షి. జీవితం పొడుగూతా, దేవుణ్ణి తాను బాహ్యంలో చూడగలననే నమ్మికతో పెరిగిన పూంజాకు మహర్షి సలహా నచ్చలేదు. తన పద్ధతే తాననుసరించ దలిచాననీ, ఇకపోతే మహర్షి గనక ఏదైనా మంత్రజపం సూచిస్తే దానిని ఆచరిస్తాననీ విన్న వించుకున్నాడు. కానీ మహర్షి అందుకు అంగీకరించలేదు.

*నీలంరాజు లక్ష్మీప్రసాద్*

కృష్ణభక్తి పూంజా హృదయాన్ని పెనవేసుకుపోయింది. అతడు తన ఉచ్ఛ్వాస నిశ్వాసాలను కృష్ణ నామ జపానికి జతచేశాడు. 'రోజుకో ఇరవై నాలుగువేలసార్లు శ్వాస తీసుకుంటూ వుంటా కదా' అని లెక్కకట్టుకొని, అన్నిసార్లూ దానికి కృష్ణనామాన్ని జోడిస్తే రోజుకు ఇరవై నాలుగు వేల జపం చేసినట్లు అవుతుంది అనుకున్నాడు. ఈ నామోచ్చారణ సల్పకుండా జీవితంలో కొంతకాలం వృథా చేశాననే తలంపుతో, దానిని భర్తీ చేయడానికి రోజుకో యాభై వేలసార్లు జపంచేస్తే సరిపోతుంది అనే భావనతో. దానిని ద్విగుణీకృతం చేశాడు. తెల్లవారు ఝామున మద్రాసు నివాసంలోని తన పూజా మందిరంలోకి రెండున్నర గంటలవేళ ప్రవేశించి, ఉదయం తొమ్మిదిన్నర వరకూ నామ జపంలో మునిగి వుండేవాడు. పదింటికి ఆఫీసుకు వెళ్లి ఇంటికి తిరిగి రావడంతోటే మళ్లీ పూజా మందిరమే, కృష్ణనామ జపమే. ఈ భక్తుడు దీక్షపరతంత్రుడు అనే అనుకోవాలి !

ఇలాంటి మనసు ఎలా అయిపోతుందో వేరే చెప్పనక్కరలేదు. ఒకరోజు రాత్రి తన పూజగది తలుపు ఆవల ఎవరో మాట్లాడుతున్నట్లు శబ్దాలు వినవచ్చినై. పంజాబ్ నుండి తన బంధువులు ఎవరైనా, రైలు లేటయినందువల్ల, ఆ వేళలో వచ్చారేమోనని అనుకుంటూ వెళ్లి తలుపు తీశాడు.

జీవితమంతా కృష్ణ నామోచ్చారణతో గడిపిన పూంజాకు, సీతారామలక్ష్మణ హనుమంతులు ఎదురుగా కన్పడ్డారు. సంభ్రమాశ్చర్యాలతో సాష్టాంగపడ్డాడు. చాలా సేపు ఆ దర్శనం అలాగే కొనసాగింది. 'ఇక్కడ మద్రాసులో ఎవరో కృష్ణ భక్తుడున్నాడంటే, చూసిపోదామని వచ్చాము' అని సీతామాత అన్నట్లు వినిపించింది పూంజాకు. ఇక ఆ రోజున కృష్ణనామోచ్చారణ జపం సాగలేదు.

పూంజా గదిలో రమణ మహర్షి రూపం దర్శనమిచ్చింది. 'ఆ వారాంతంలొ తిరువణ్ణామలై వెళ్లాను. నా పాతికేళ్ల సాధన, కృష్ణనామ జపదీక్ష, అన్నింటినీ మహర్షికి వివరించాను' అంటాడు పూంజా. 'ఆశ్చర్యంగా సీతారామలక్ష్మణ హనుమంతులు దర్శన మిచ్చారు. అటు తర్వాత జపతపాదులు ఆగిపోయినై. ఎంత ప్రయత్నించినా నోటికి ఏ

నామజపమూ రావడం మానేసింది. ఏ శాస్త్రాలు , ఏ పురాణాలు చదవగలిగి లేను. నా గతేం కావాలి?' అని మహర్షిని అడిగాడు.

మహర్షి పూంజావంక చూస్తూ, 'మద్రాసు నుండి ఇక్కడికి ఎలా వచ్చావ్?' అన్నాడు.

"తిరువణ్ణామలైలో రైలుదిగి..." అని ప్రశ్నార్థకంగా చూశాడు మహర్షిని; "టికెట్టు గేటులో ఇచ్చేసి ఎద్దుబండి ఎక్కి ఆశ్రమానికి..." అన్నాడు పూంజా.

"బండివాడి కిరాయి ఇచ్చేసిన తర్వాత, బండి ఏమయింది?"

"బహుశా వెనక్కి వెళ్లి వుంటుంది?" అని సమాధానమిచ్చాడు పూంజా.

మహర్షి ఇలా ఎందుకు అడుగుతున్నాడో పూంజాకు ఏమాత్రం అంతుబట్టలేదు.

"రైలు నిన్ను తీసుకురావలసిన వూరుకు తెచ్చింది. ఇక ఆ రైలుతో నీకేం పని? అలాగే ఎద్దుబండి నిన్ను తీసుకురావలసిన చోటికి తెచ్చింది. ఇక ఆ బండితో ఏమి పని? రావలసిన చోటుకు వచ్చేశావు... నీ సాధన కూడా ఇంతేననుకో. నీ అంతట నువ్వు ఆ సాధన, జపతపాదులు వదలలేకపోయావు? ఇప్పుడవే నిన్ను వదలి వెళ్ళిపోయినై; వాటి పని తీరిపోయింది. చేరవలసిన చోటుకి చేరావు" అంటూ మహర్షి పూంజాను 'చూడ'నారంభించాడు. అలలు అలలుగా ఏదో, పూంజాలోనికి రానారంభించింది. మనసు, దేహం, అణువణువునా మారిపోజొచ్చినై.

'వ్యక్తిపరమైన ఏ దేవుణ్ణి అంటిపెట్టుకోవద్దు. ఆ రూపాలన్నీ నాశనమయేవే. వాటిని చూడాలని అభిలషించేవాణ్ణి చూడు, కనుగొను' అనే మహర్షి బోధ తలకెక్కింది. 'నేనెవరు?' అనే ప్రశ్న ఆ మొదట్లోనే వేసుకొని వుండాల్సింది అని గ్రహించాడు పూంజా.

ఇక పూంజా మహాశయుడు – తర్వాతి కాలంలో ఈయనను పాపాజీ అని కూడా సంబోధించేవారు – రమణ మహర్షి బోధలు ఎలా అర్థం చేసుకున్నాడో చూద్దాం. 'మనసంటే ఆలోచన. తలపు. తాను సబ్జెక్ట్ అయితే తాను చూస్తున్న వస్తువు ఆబ్జెక్ట్.

మొదటి అల 'నేను', ఆ తర్వాత 'నేనున్నాను', అటు తర్వాత 'నేను అదై వున్నాను, ఇదై వున్నాను' ఇక చివరికి, 'ఇది నాకు చెందినది', ఇక్కడ మనసు ప్రారంభమవుతున్నది. ఇప్పుడు ఏ ఊసెత్తకుండా నిశ్శబ్దంగా వుండిపో. ఆ మూలాన్నుండి ఏ కోరికను బయలుదేరనివ్వకు. అలా వుండిపోగలిగితే నీకు మనస్సనేది లేదని తెలుస్తుంది. నిన్ను నువ్వు వర్ణించుకోగలిగి వుండవు. ఏదో అపరిమితమైన సంతోషంలో వుండిపోతావు. మన మసలు ఎవరిమో అర్థం చేసుకోగలిగి లేము; వాస్తవీకరించగలం, సాక్షాత్కారింప జేసుకోగలం.

మనసును ఉపయోగించడం వల్ల లోకంలో జరుగుతున్న కీడునంతా ప్రత్యక్షంగా చూస్తున్నావు కదా. మనసును వదిలేసి, నీలో ఆ మహాశక్తికి అవకాశమిచ్చినట్లయితే, సమస్త జీవరాశితో ఎలా కలిసిమెలిసి జీవించాలో తెలిసి వస్తుంది. తనని తానెరిగిన వాడు, జంతురూపంలో జీవించడమేమిటో, రాయిగా రప్పగా ఉండిపోవడమేమిటో, అన్నీ అర్థం చేసుకోగలుగుతాడు.

గతాన్ని ముట్టుకోకు; గతాన్ని తవ్వకు. కోరికలన్నీ గతంలో నుండి ఉద్భవించేవే. ఏ పాతకోరికా మనసులో తారట్లాడకపోతే, కళ్లు చక్కగా చూడగలుగుతై. గతం జోలికి పోకుండా బ్రతకగలిగితే, నీకు విచారముండదు. ఇప్పటి పరిస్థితిలో, ఈ వర్తమానంలోనే వుండిపో; ఇప్పుడు విచారంలేదు. అటు గతమూ, ఇటు భవిష్యత్తూ రెంటినీ వదిలెయ్; ఉండేది ఆనందమే.

"పూంజాజీ, మీరు ఇంత వయసులో, ఈనాటికీ, జీవితం అంచులు దాటి అవతలికి, ఇంకా అవతలికి పోతూనే వున్నారు గదా?" అని ఎవరో అడిగారు.

"అవును. క్షణక్షణమూ, ఇంకా ఇంకా అవతలికి, ఇంకా అవతలికి" అని పూంజా సమాధానం.

మరొక సాధకుడు పూంజా మహాశయుడ్ని ఒక ప్రశ్న వేశాడు. "మోక్షసాధనకనీ, లోకోద్ధారణకు అంకితమవడానికనీ, జీవిత ప్రవాహం నుండి ముఖ్యంగా సెక్స్ నుండి వైదొలగాలని కొందరు చాలా పట్టుదలగా మాట్లాడుతుంటారు. ఈ విషయంలో మీరేమంటారు?"

"అయ్యా, సెక్స్ కలయిక ద్వారా జన్మించిన జీవులే కదా ఇలాంటి ప్రతిపాదనలు చేసేది? వాళ్ళ ఉద్దేశమేమిటో మనం గ్రహించలేము కానీ, ఏదో వైయక్తిక కారణాల కొద్దీ శృంగార జీవితం నిషిద్ధమంటూ వుంటారు.

జ్ఞానోదయమైనచోట, జ్ఞానం మృతి చెందే ప్రసక్తి లేదు; జీవితంలో ఏదీ కూడా దాని మీద మచ్చపడనివ్వదు. శృంగారాసక్తి జ్ఞానాన్ని ఏ విధంగానూ భంగపరచదు. ఇది తగును, ఇది తగదు, అనేవి జ్ఞానోదయానికి వర్తించేవి కావు. అది ఏ తేడాలనూ లెక్కచేయదు. సెక్సును విసర్జించినందువల్ల శృంగారాభిలాష నుండి మనస్సు విముక్త మవుతుంది అనుకునే వీలులేదు. ఇదే గనుక నిజమైనట్లయితే, బుద్ధులవగలిగిన వారిలో నపుంసకులే ప్రథమశ్రేణిలో నిలబడతారు. అందుచేత ఆధ్యాత్మిక జీవనానికి సెక్స్‌ను త్యజించాలి అని నేననుకోవడంలేదు. జీవితంలో సెక్స్ ఒక సహజ పరిణామం. ఏదైతే సహజమో దానిని వదిలేయాల్సిన అవసరం ఎంతమాత్రం కనిపించదు.

అయితే ఈ మాటలన్నీ చెప్పిన తర్వాత నే సూచించేదేమంటే, ప్రతి విషయంలోనూ ఒక పరిమితీ, నియమం ప్రవర్తిల్లడం ధర్మమనిపించుకుంటుంది. ఆహారం కానీ నిద్ర గానీ, సెక్స్‌గానీ ఆరోగ్యవంతంగా బ్రతకడానికి దోహదపడాలి. మనిషి సహజ జీవిత సరళిని భంగపరిచేటట్లు వుండరాదు. జంతువులకీ మనిషికీ ఆహారభయ నిద్రామైథునాలు సమానమే. మరి ఇక మనిషిని జంతువు నుండి వేరు చేసేదేమిటి? వివేచనే కదా?" అన్నారు పూంజా.

ప్రశ్నిస్తున్న వ్యక్తి : "మనిషి యొక్క బాధలకన్నిటికీ మూలం సెక్స్‌ను అణచి వేయడమనే వారు మరికొందరున్నారు"

"నిజమే. జీవితంలో సెక్స్‌ని దూరంగా వుంచడానికి మొనాస్టరీలు, సన్యాసాశ్రమాలకు పరిగెట్టేవాళ్లున్నారు; ఆ విధంగా ఏ సెక్స్ సంబంధం లేకుండా వుండటానికి ప్రయత్నిస్తుంటారు.

విదేశాల్లో వున్న రోజుల్లో, మేరియా లాబ్ అనే పెద్ద మొనాస్టరీకి ఒకసారి వెళ్ళాను. అక్కడ నివసిస్తున్న సన్యాసులు, సన్యాసినుల వంక పరీక్షగా చూశాను.

అక్కడివారి నాయకుడైన ఏబట్‌ను కలిశాను. నేనాయనతో ఉన్నప్పుడు ఎవరో స్త్రీ ఆయన్ని చూట్టానికి వచ్చింది. కరచాలనం చేసి వెళ్లిపోయింది. అటు తర్వాత సుమారు గంటసేపు అతడి ధోరణి ఆవిడ తనను స్పర్శించి, కరచాలనం చేసింది అనే తలపును మరువలేక పోయాడన్నట్లు కనిపించింది.

నేనక్కడికి వెళ్లింది ఆయనతో మాట్లాడటానికి; నేనక్కడి నుండి ఎలా వెళ్లిపోవడం? కానీ గంటసేపూ, ఆవిడ ఆయన్ని ముట్టుకున్న మరుక్షణం నుండి, ఆయన మనస్సు మనస్సులో లేదు. నాతో మాట్లాడుతున్నాడు కానీ, మనస్సు ఈ మాటలమీద లగ్నం కావడం లేదు. ఆవిడ తనను ముట్టుకున్న అనుభూతే అతణ్ణి ఆ గంటసేపూ ఆవరించి వుంది. ఆయన తలపులన్నీ నాకు తెలుస్తూనే వున్నై : "నేను నిషిద్ధమైన చోటులోకి ప్రవేశించాను. నా చేతిని ఆవిడ చేతిలో వుంచాను" ఇదే అతడి ఆలోచన.

అందువల్ల ఇలాంటి వారు స్త్రీలను బాహ్యంగా తిరస్కరిస్తారనే మాట నిజమే కానీ, మనసులో వారిని వదల్చుకోగలిగి లేరు. ఇలాంటి అసహజ జీవితాన్ని నేను ఒల్లను. ఈ మొత్తం ప్రపంచం ఒక మొనాస్టరీ అయితే సృష్టి ఏమవాలి? మనల్ని సృష్టించడానికి భగవంతుడు మరేదైనా సాధనం ఉపయోగించాల్సి వుంటుంది.

ఇప్పుడు మానవ సెక్స్ కలయిక ద్వారా సృష్టింపబడిన ఈ శరీరాలు సుమారు నూరేళ్లపాటు బ్రతకగలిగి వున్నై. మనిషి తన జన్మహక్కయిన 'స్వేచ్ఛ' సాధించడానికి ఈ వంద ఏళ్ల జీవితకాలం చాలు. ఈ ఆయుష్షును మనం సద్వినియోగ పరచుకొని 'స్వేచ్ఛ'ను, బంధవిముక్తిని సాధించే వీలుంది. దృష్టి దీనిపై కేంద్రీకరించక, మనుషులు లైంగిక చర్యలకు దూరంగా వుండాలనే ఈ అహంపూరిత ఉద్బోధలేమిటో' అన్నారు పూంజాజీ!

* * *

"ధ్యానాన్ని గురించి చెప్పండి" అని అడిగినప్పుడు శ్రీ పూంజా, 'ధ్యానమనేది దేనిపైనా దృష్టి కేంద్రీకరించకుండా వుండిపోయినప్పుడు సాగుతుంది. గతంలో నుండి ఏ ఒక్క వస్తువును గానీ, స్మృతినిగానీ మనసులోనికి రానివ్వకపోతే, అప్పుడు ధ్యానం

నిర్విఘ్నంగా కొనసాగుతున్నట్లు లెక్క. మనసును వినియోగించకుండా వుంటం నేర్చుకో; అదే ధ్యానమంటే. ధ్యానించడానికి మనసును ఉపయోగించావంటే అది ఏదో ఒక దానిమీద దృష్టి నిలపడమవుతుంది. గతానికి సంబంధించిన ఏదో ఒక వస్తువు, ఒక విగ్రహం, ఒక జ్ఞాపకం, ఇలాంటి వాటికి అంటుకుపోవడం మనసు లక్షణం. మనసు లేకుండా ధ్యానించడమంటే ఏమిటో, నీకెవరైనా చెప్పారా?

ఈ గతమనేది అతి బలీయమైనది. గతానికి సంబంధించిందే ఈ 'విశ్వాస' మనేది కూడాను. గతానికి సంబంధంలేని విశ్వాసమనేది నువ్వు ఎరుగుదువా? అందువల్ల నేను విశ్వాసం కలిగుండమని బోధించను. నేను 'జ్ఞానించ'డాన్నే బోధిస్తుంటాను. ఎల్లప్పుడూ ప్రజ్ఞావస్థలోనే వుండాలి. అంటే సతతం నేర్చుకుంటూ జ్ఞానిస్తూ, ధ్యానిస్తూ, బ్రతక నేర్వాలి."

* * *

మనసు, సెక్స్, ధ్యానం గురించి మాట్లాడిన రమణ మహర్షి శిష్యుడు పూంజాజీ, తన పాశ్చాత్యాభిమానితో : "నా వద్ద నుండి వెళ్లే ముందు 'నీకు ఏ సమస్యలూ మిగిలి లేవు.' అనే మాట ఖాయం చేసుకొని మరీ బయలుదేరు. సమస్యలు లేకపోతే, ఇక నువ్వూ నేనూ కలవాల్సిందేముంది? నీకు నిజంగా గనక సమస్యలు నిర్మూలమైపోతే, మనం సతతం కలుస్తున్నట్లే లెక్క. నన్ను కలవడానికి మళ్ళీ ప్రయత్నించి కాలాన్ని వ్యర్థపరచుకోకు" అని చెప్పి పంపాడంటే, అతడు తనని అంటిపెట్టుకుని మమకారం పెంచుకో కూడదనీ, తాను అతణ్ణి పట్టుకొని వేళ్లాడకూడదనీ, ఆయన తాత్పర్యం. గురువులు సాధారణంగా తాము శిష్యులపై గానీ, శిష్యులు తమపై గానీ ఆధారపడకుండా జీవించ నేర్వాలని అనరు, అనుకోరు. పరస్పర ఆధారంలో సుఖమున్నది; ఆధారాన్ని తుంచేయడంలో జ్ఞానమున్నది.

"మేల్కొన్న, అనగా జ్ఞానోదయమైన మహా పురుషుల గురించి చదవవద్దు; ఆ జీవిత చరిత్రలు చదివితే, జ్ఞానోదయమైన వాడు ఇలా వుంటాడు, అలా వుంటాడు అని ఊహించడం, దాని రుచి ఇలా వుంటుంది కాబోలు అని తలపోయడం,ఆ ఊహ

ననుసరించే, దానికోరూపం కల్పించడం మొదలైనవన్నీ సంభవిస్తాయి" అని మీరు హెచ్చరిస్తుంటారు. అలాంటప్పుడు, ఇప్పుడు మనమిద్దరం సలుపుతున్న ఈ సంభాషణ ద్వారా, 'కళ్లు తెరవడం, మేల్కొనడం' అనే క్రియలను గురించి మాకేమి తెలియ జేస్తున్నట్లు?" అని ఒక పాశ్చాత్యుడు అడిగినప్పుడు, పూంజాజీ; "పవిత్ర గ్రంథాలు, పురాణాలు పుణ్యచరితుల జీవిత గాథలు చదవ వద్దనే అంటుంటాను. ఈ అధ్యాత్మిక గ్రంథాలనేవి చదివినప్పుడు అందులోని ఏదో కొంతభాగం మీద మీకు ఇష్టం జనిస్తుంది. అలా జరిగినప్పుడు అది మీ స్మృతిలో భాగంగా మిగిలిపోతుంది. అటు తర్వాత స్వేచ్ఛ నొందడానికని మీరు ధ్యానంలో కూచుంటారు. స్వేచ్ఛ సాధించాలని ఒక వంకా, ఆ స్వేచ్ఛ ఇలా వుంటుందని మీరు చదివిన పుస్తకంలో చెప్పిన విషయం మరొక వంకా, రెండూ లోన మెదులుతూ వుంటై.

తీరా ధ్యానావస్థలోకి దిగినప్పుడు స్వేచ్ఛను గురించి ముందే ఏర్పరచుకున్న ఈ అభిప్రాయం మెదడును ఆక్రమిస్తుంది. తదనుగుణంగా ఆ అనుభవమే సిద్ధిస్తుంది. నీ స్మృతిలో నిక్షిప్తమై వున్నదే నీవనుభవిస్తున్నావనే మాట గుర్తుకురాదు; ఏదో పాత అనుభవం పునరావృత మవుతున్నదే కానీ, ఇది జ్ఞానోదయం కాదు. నిజమైన అనుభవమెప్పుడూ పాత జ్ఞాపకాల నుండి పుట్టుకు వచ్చేది కాదు. నువ్వు ధ్యానించేటప్పుడు ఈ మనసు నిన్ను మోసగిస్తుంది; అందువల్ల ఏనాడూ దానిపై ఆధారపడవద్దు. మనసు దేనినైనా కోరితే, దాని మాట వినవద్దు. మనసు ఒక దానిపై ఇష్టపడితే, దాని యెడల నువ్వు అయిష్టం కలిగుండటం ఒక్కటే సరైన మార్గం. స్మృతి అంటే, గతమన్నమాట; ధ్యానించే టప్పుడు మనసులో వున్న ఏదో ప్రణాళికను అమలు జరుప బూనుకున్నావన్న మాట. 'నేను దేనిని గురించైతే చదివానో ఆ ప్రదేశానికి నే చేరుకోవాలి' అని అనిపిస్తుంటుంది చివరకు సిద్ధించేది కూడా అదే.

# పరిణతి చెందిన గోవులు, మానవులు

**అ**రుణాచలం శ్రీ రమణుల చైతన్యాన్ని స్పృశించి, తమలోని చైతన్యాన్ని ఆ చైతన్యంతో జతచేసి, ఒకటిగా చేసుకుందామనే ఇచ్ఛ, శ్రద్ధకన్నా, ఆయన్ని 'మహర్షి, భగవాన్' అని కీర్తిస్తూ, ఆయన పూజ, సంకీర్తనం చేసి సంతృప్తి చెందడం కనిపిస్తుంది. దీనివల్ల ప్రయోజనం దక్కదు. మన చైతన్యాన్ని ఆయన మహా చైతన్యంలో లీనంచేసే ప్రయత్నం జరగాలి.

మనుషుల కన్నా, కొన్ని సందర్భాల్లో జంతుజాలమే ఆయన ద్వారా అధికమైన మేలు పొందాయేమో ననిపిస్తుంది; అందుకు కారణం అవి మనిషి చేసే ఆలోచన చేయకుండా, ఆయన యొక్క ప్రేమ, కరుణని మాత్రమే గుర్తించడంవల్ల అయి వుండ వచ్చు. రమణ దర్శనార్థం అందరి భక్తులతోబాటు 'లక్ష్మి' అనే ఆవు కూడా ఒక సమయంలో ప్రతిరోజూ ఆయన వద్దకొచ్చేది. బయట నుంచొని కిటికీ గుండా కళ్లు తెరిచి కాసేపూ, కళ్లు మూసుకొని మరి కాసేపూ, ఆయన వంక చూస్తూ అలా గంటసేపు నిలబడేది. ఒక్కోసారి ఆ ఆవు కళ్లనుండి, కన్నీటి బొట్లు రాలి కిందపడుతుండేవి.

ఒక రోజున ఆ ఆవుకు జబ్బు చేసింది; దర్శనానికి రాలేకపోయింది. అది గమనించిన రమణుడు తానే 'లక్ష్మి' వద్దకు వెళ్లాడు. ఆయన అక్కడికి వెళ్లినప్పుడు దూరాన్నుండి 'లక్ష్మి' తన గదివైపు తలచాచి, కిటికీ వంక చూస్తూ కూచొని వుంది. రమణుడు అక్కడికి చేరినప్పుడు 'లక్ష్మి' కళ్లు మూసుకున్నది. కన్నీళ్లు ప్రవహించ నారంభించినాయి. తర్వాత కొద్దిసేపటికే అది కన్ను మూసింది.

'మనకు తెలిసిన మానవ చరిత్రలో ఓ పరిపక్వమైన చైతన్యం, పుష్పించిన మనిషికి వీడ్కోలు పలుకుతూ వెళ్లిన పుణ్యం, ఆ గోవుకు దక్కిందని అనవచ్చు'నంటాడు శ్రీ రజనీష్.

ఎవరో రమణుణ్ణి, "ఈ గోవు మళ్లీ జన్మ ఎత్తినప్పుడు మనిషిగా జన్మిస్తుందంటారా?" అని అడిగారు. మనమందరం సర్వసాధారణంగా మానవ జన్మే మోక్షానికి అర్హత

సంపాదించుకో గలుగుతుందని అనుకుంటుంటాం. రమణుడు అలా అనుకోలేదు. అందువల్ల ఆయన దృఢమైన రీతిలో, "లేదు, 'లక్ష్మి'కి మళ్లీ మనిషిగా జన్మ ఎత్తాల్సిన అవసరం లేదు. 'లక్ష్మి' ఆ స్థాయిని దాటిపోయింది. ఇక లక్ష్మి పుట్టడమనేది వుండదు. లక్ష్మికి జ్ఞానోదయమయి, పోయింది" అన్నాడు.

చతుష్పాద జీవులలోకెల్లా గోవులకు చాలా ఎక్కువ గ్రహణశక్తి వుందంటాడు శ్రీ రజనీష్, అందుకనే భారతదేశంలో గోవును పవిత్రమైన జంతువుగా ఎంచుతారు. వాటి చైతన్యం అభివృద్ధిగాంచే అవకాశమున్నది. పరిణామక్రమంలో ఉత్తమోత్తమంగా భావించే మానవ జన్మ ఎత్తకుండానే ఒక్క ఉదుటున మోక్షాన్ని అందుకోగలిగే అవకాశం ఆవుకే వున్నది అని అంటారు శ్రీ రజనీష్. 'ఈ కారణం చేతనే పూర్వకాలంలో ఆశ్రమాలన్నింటిలోనూ గోవులను వుంచుకునేవారు. అవి ఆ ఆశ్రమవాసులకు క్షీర మందివ్వడమేగాక, ఆ పరిసరాల్లో ఓ విచిత్రమైన పవిత్రతనూ, అమాయకత్వాన్నీ సృష్టిస్తుండేవి' అని ముగిస్తాడు రజనీష్.

జంతువులను రమణుడు, మానవులకు భిన్నమైన ద్వితీయశ్రేణి జీవులుగా పరిగ ణించేవాడు. వాటితో దాదాపుగా మానవులతో వ్యవహరించినట్లే చరించేవాడు. తన అనుచరులలో ఎవరైనా వాటిని తరిమి కొట్టితేగానీ, తిట్టితేగానీ, సహించలేక ఆ అనుచరులనే మందలించేవాడు. విచిత్రమేమంటే ఆయన అరవంలో గానీ తెనుగులో కానీ వాటితో ఏ మాట అన్నా, అవి ఆయన చెప్పినట్లే చేసేవి. వాటికా భాష అర్థమవక పోయివుండవచ్చు; కానీ ఆయన మనసులోని భావ చిత్రం వాటి భావనా ప్రపంచం లోకి ప్రవేశించేది అనుకోవాలి.

1935 సంవత్సరంలో, ఆశ్రమంలోని నాలుగు కుక్కల చర్య మరింత ఆశ్చర్యం గొలుపుతుంది. రమణుడు ఆహారం స్వీకరించిన తర్వాతగానీ, అవి తమ ఆహారాన్ని ముట్టేవిగాదు. నెల్లూరు నగరంలోని ఓ కళాశాలలో పండితునిగా ఉద్యోగం చేస్తున్న శ్రీ రంగాచారి, రమణాశ్రమానికి వచ్చినప్పుడు, 'ఈ మాట నిజమా' చూద్దామని, రమణుడు అప్పటికి ముట్టుకోని ఆహారం కొంత తీసి, ఆ కుక్కల ముందుంచాడు. కానీ కుక్కలా తిండిని ముట్టలేదు. కాసేపయిన తర్వాత రమణులక్కడికి వచ్చి అచట వున్న ఆహారంలోని

ఓ ముద్ద తీసి నోట పెట్టుకున్నాడు. ఆ వెంటనే కుక్కలు నాలుగూ తమకై పెట్టిన ఆహారం మొత్తం తినేసినై.

కాసేపుండి ఒక మనిషి రెండు నెమళ్లను కళ్లకు గంతలు కట్టి, రమణుడి ముందుకు తెచ్చాడు. వాటిని ఆయన సమక్షంలో వదలిపెట్టినప్పుడు, అవి అల్లంత దూరం ఎగిరి పోయినాయి. ఆ మనిషి వెళ్లి వాటిని వెనక్కు తెచ్చినప్పటికీ, అవి మళ్లీ పూర్వంలాగానే ఎగిరి దూరంగా వెళ్లిపోయినై. 'వాటిని ఇక్కడ వుంచడానికి చేసే ప్రయత్నం వ్యర్థం. ఇక్కడి ఈ కుక్కల్లాగా అవి పరిణతి చెందినవి కాదు' అన్నాడు రమణుడు. ఎంత ప్రయత్నించినప్పటికీ, అవి ఒక్క నిమిషంపాటు కూడా ఆయన వద్ద వుండలేదు.

మహనీయుడి అనుగ్రహం, వారూ వీరూ అనే తేడా లేకుండా అందరి మీదా వర్షిస్తూనే వుంటుంది. మనిషి కానీ జంతువుకానీ పరిణతి చెంది వుంటే, ఆ అనుగ్రహాన్ని స్వీకరించగలిగి వుంటారు. పరిణతి లోపిస్తే, వారు మనుషులైనప్పటికీ ఏ ప్రయోజనమూ పొందలేరు.

## తెంపులేని ఎరుక

తెంపులేని ఎరుకయే ఆత్మ. ఆత్మ స్వరూపాన్ని అట్టి ఎరుకగా తెలుసుకోడమే ఆత్మ విచారానికి లక్ష్యం. భేద భావం కలిగివున్నంత కాలం సాధకుడు ఆత్మ విచారం కొనసాగించవచ్చు. ఆత్మసిద్ధి కలిగిన తర్వాత ఇక విచారంతో పని లేదు. ఎరుక ఎవరిదనే ప్రశ్నకు ఆ ఎరుకలో తావుండదు. ఎరుక అచ్చమైన ఎరుకగానే ఉండిపోతుంది.

# మనసు, శరీరం వేర్వేరా?

"ఆలోచన, మనిషి పెరుగుదలకు సంబంధించిన శ్వాసక్రియ, రక్తప్రసరణ, ఇవి వ్యక్తిపరమైన జీవితానికి వివిధ రీతులు. ఇవన్నీ జీవితం మీద ఆధారపడినవే; జీవితంలో స్వతస్సిద్ధంగా వుండే క్రియలే. వ్యక్తిత్వం, మూర్తిమత్వం మొదలైన భావాలన్నీ, ప్రాణ సంబంధిత క్రియల నుండి పుట్టుకొచ్చినట్టే, పుట్టుకొస్తుంటాయి. శ్వాసించడం కానీ, మరేదైనా ప్రాణ సంబంధిత చర్యల్నిగానీ, బలవంతంగా నిరోధిస్తే, ఆలోచనని కూడా అణగత్రొక్కినట్లవుతుంది. ఆలోచనను గనక బలవంతంగా అణచివేస్తేనూ, లేక ఒక బిందువుపై నిలిపితేనూ, శ్వాసక్రియ కూడా చాలా మందకొడిగా నడుస్తుంది. కేవలం ప్రాణం నిలపడానికి మాత్రమే ఉపయోగించే స్థాయికి చేరుకుంటుంది. రెండు సందర్భాల్లోనూ ఆలోచనలు పరిపరి విధాలుగా వికర్షణ చెందుతూ వుండటం తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లవుతుంది. ఈ రెంటికీ వున్న పరస్పర సంబంధం ఇతర విధాల కూడా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది." అని విశదీకరిస్తాడు శ్రీ రమణ మహర్షి. "జీవించాలనే ఈ సంకల్పమే తీసుకుందాం. ఇది ఆలోచనయొక్క శక్తే. ఇతర విధాల ప్రాణశక్తి తరిగిపోతున్నప్పుడు కూడా, ఈ ఆలోచనా శక్తి, ప్రాణాన్ని పోనివ్వకుండా మరణాన్ని చెంతకు చేరనివ్వకుండా ఆలస్యం చేయిస్తుంటుంది. ఇలాంటి సంకల్పబలమే లేకపోయినట్లయితే, మరణం వేగిరంగా వచ్చేస్తుంది. అందుచేత ఆలోచనాశక్తి శరీరంలోని ప్రాణశక్తిని ప్రవహింపజేయడమే కాక, ఒక శరీరమయిం తర్వాత మరొక శరీరంలోకి ప్రవేశిస్తుందంటారు.

మనసు, సత్యపదార్థమైన ఆత్మయొక్క వ్యక్తీకరణ. దీనిని సూక్ష్మశరీరమంటారు – ఇది ఆలోచనలతో కూడుకున్న శరీరం. మనస్సు ఎల్లప్పుడూ, మనసు కానివాటిపై అనగా భౌతిక పదార్థాలతో సంబంధం పెట్టుకుని పనిచేస్తూ వుంటుంది. భౌతిక పదార్థాలతో నిమిత్తం లేకుండా తనంతట తానుగా మనసెప్పుడూ పనిచేయదు. అందుచేత మనసు, భౌతిక పదార్థం కలిసి సహజీవనం సాగిస్తుంటాయి" అని తేల్చాడు శ్రీరమణుడు.

ఏదో సందర్భంలో ఆయన ఈ మనసు యొక్క నిర్మాణం, దీని స్వభావం ఇంత స్పష్టంగా చెప్పినప్పటికీ, తమ మానసిక బాధను గురించి, ఆయన వద్దకు వచ్చినవారు చెప్పుకుంటూనే వుండేవారు. మహర్షితో ఒకాయన "నా మనసు చాలా అస్థిమితంగా వుంటుందండీ. నేనెంత అదుపులో పెడదామని ప్రయత్నించినా మళ్ళీ మళ్ళీ అలాగే విజృంభిస్తుంటుంది. మీరొక్కరే దానిని నిశ్చలంగా వుంచగలరు" అని మొరపెట్టుకున్నాడు.

శ్రీ రమణులు ఏమీ సమాధానమివ్వలేదు. ఆ మనిషి వెళ్ళిపోయిన తర్వాత (ఎవర్నీ బాధపెట్టే గుణం లేదు కాబట్టి) రమణుడు చిరునవ్వుతో, "ఈ మనసును గురించి మాట్లాడేదంతా ఏమిటి? ఎక్కడున్నదీ మనసు? ఇది ఎలా వుంటుంది? ఇది నలుపా తెలుపా? దీనికి జటాజూటాలుంటాయా? అసలు విషయమేమిటంటే, మనస్సనేదే లేదు. వున్నదల్లా ఎప్పుడూ వుండే అదొక్కటే' అన్నాడు.

మనస్సనేదే లేదని అంటున్న రమణుని మాటను మనం జీర్ణించుకోగలిగిలేము. రమణుడు అడిగిన ప్రశ్నలకు మనం సమాధానం చెప్పగలిగీ లేము. హాస్యంగా అడిగినప్పటికీ, దాని రూపురేఖలు మనం చెప్పగలిగి వున్నామా? దానిని మనం మనలోనూ చూడలేదు, 'తెలుసు నాకు నీ మనసు' అన్నప్పుడు నీ అభిప్రాయాలు గ్రహించాను అనే అర్థంలో వాడుతున్నాం. 'అతడి మనసు నేనెరుగుదును' అని వ్యర్థమైన మాట అంటామే కానీ, మన మనసు మరు నిమిషాన ఎలా ప్రవర్తిల్లనున్నదో మనకు తెలియదు. ఇక వారి మనసు మనకేమి తెలుస్తుంది?

అందువల్ల శ్రీరమణులు చెప్పిందే నిజమేమో? అలాంటి మనిషి అసత్యం పలకడు కదా? పలికి ఏమి బావుకుంటాడు? తాను ధరించేది ఒక పీలిక ముక్క. అందువల్ల మనకు ప్రస్ఫుటంగా వున్నట్లుండి, ఆయన అంతే కచ్చితంగా 'అట్లాందిది లేనే లేదు' అన్నప్పుడు ఆయన మాటనే శిరోధార్యంగా భావించడం భావ్యం. అయితే అంతటితో ఆగక, మనమాటను తరచి చూడాలి.

శరీరానికి ఒక పరిమితి వున్నది. అది పుట్టిన తేదీ ఒకటున్నది; మరణించే తారీఖు ఒకటున్నది. ఈ చావు పుట్టుకల మధ్య కాలంలో అది భూమి మీద

తిరుగాడుతుంది. మనకు తెలిసినంతవరకూ, మనస్సుగా మనం భావించేది శరీరంతోనే అంతమవుతుంది. మనసు శరీరానికి లోపలివైపు వుండే ఆకృతిగా కనిపిస్తుంది. కానీ ఖాయంగా చెప్పలేము. మనసు, శరీరం లోపల వున్నదనుకుంటే, మనసు అనేదానికీ ఈ శరీరం బయటి ఆకృతి. శరీరాన్ని స్థూలశరీరమనీ, మనసును సూక్ష్మ శరీరమనీ, వ్యవహరిస్తున్నారు కాబట్టి, ఈ రెండూ శరీర సంబంధితాలే.

ఈ రెండూ వేర్వేరు అన్నట్లుగా మనం భావిస్తూ వుండవచ్చు. శరీరాన్ని, మనసును, విడివిడి పదార్థాలుగా గుర్తిస్తుంటాం. అలాకాక, ఇది 'శరీర మనస్సు' అనే ఒకే పదంలో నిర్వచించదగునేమో? వాస్తవం అది అయినందువల్లనే 'మరణమంటే చచ్చేంత భయం కలుగుతున్నదేమో?'

మనస్సనేది కృత్రిమంగా సృష్టించిన ఈ 'నేను'ను చెంతనుంచుకొని 'వృద్ధి స్థూల శరీరం మాత్రం నేను కాదని' అంటే, మనసు సృష్టించిన ఈ కృత్రిమ 'నేను' రాజ్యమేల నారంభిస్తుంది. ఇది నకిలీ 'నేను'; అంటే చాలాకాలంగా మనల్ని వెంబడిస్తున్న 'నేను'. 'సత్యమైన సాక్షి నేనును' కనుగొన్న రోజున – లేక క్షణాన – మనసుచే సృష్టించబడిన ఈ 'నేను', ఈ అబద్ధపు నేను మాయమవుతుంది. అప్పుడు 'వున్నదల్లా ఎల్లప్పుడూ వుండెడి అదే' అనే రమణ వాక్యం మనకర్థమవుతుంది" అని వ్యాఖ్యానించాడు మిత్రశ్రీ.

"మనస్సును సృష్టించుకున్నది మనిషే ననడమేగాక, నామరూపాలకు మనమిచ్చే విలువను గురించి కూడా రమణుడేమన్నాడో చూద్దాం. ఓ భక్తుడొక మారు శ్రీరమణుల వారితో, "భగవాన్, మిమ్మల్ని తలచుకోగానే, మీ రూపం నాకంటి ముందువచ్చి నిలిచేది. కానీ ఇప్పుడలా జరగడం లేదు. నన్నేమి చేయమంటారు?" అని అడిగాడు.

"నా పేరు తలచుకొని జపిస్తే సరిపోతుంది. రూపంకన్నా నామమే శ్రేష్ఠం. కానీ కాలక్రమేణా ఆ పేరు కూడా అదృశ్యమవుతుంది. అప్పటి వరకూ నామ జపం చేస్తే సరి" అని ఓ రాజీ మార్గం సూచించాడు, రమణుడు.

అంటే జపానికి సహాయకారిగా కొంతకాలం రూపాన్ని, మరికొంత కాలం నామాన్ని జపించదలుచుకున్నవారు జపించవచ్చుగాక. కానీ అసలు వాస్తవమేమిటంటే, తర్వాతి కాలంలో అదృశ్యమయ్యే రూపానికి, నామానికీ ఏ విలువా లేదని సూచిస్తున్నాడు శ్రీరమణులు. నిజానికి మనోసృష్టి యావత్తూ కల్పితమే.

శ్రీరమణులవారి బోధ ఎంత విప్లవాత్మకమైనదో విజ్ఞులు మాత్రమే గ్రహించ గలరు" అన్నాడు మిత్రశ్రీ.

## భగవత్స్వరూపం

భగవంతుడు సాకారుడా, నిరాకారుడా అని తర్జన భర్జనలు పడినందువల్ల ఏమి ప్రయోజనం? నీకు ఆకారమున్నదో లేదో నీవు ముందు తెలుసుకో. అప్పుడు భగవంతుడు ఎట్టివాడో తెలుసుకోగలుగుతావు.

# ఆ నయనాల్లోని ప్రశాంతత

పదిహేడేళ్ళ వయసులో అరుణాచల పర్వతం వద్దకు వచ్చిన శ్రీరమణులు అక్కడే శాశ్వతంగా వుండిపోయాడు. మరెక్కడికీ వెళ్ళలేదు. తనకా అరుణాచల పర్వతం ఎంత పవిత్రమో, తన భక్త జనావళికి కూడా దానినంత పవిత్రంగా భావించేటట్లు చేశాడు.

ఒకమారు ఒక చిన్నపిల్ల, రమణుణ్ణి తనతోబాటు మద్రాసులోని తమ స్వగృహానికి రమ్మని ఆహ్వానించింది. అందుకు రమణుడు నవ్వుతూ, "నేనీ చోటుని వదిలి వెళితే, నన్ను చూడడానికై ఇక్కడికి వచ్చేవారికి ఆశాభంగ మవదూ? నీ తల్లిదండ్రులతో నన్ను చూడడానికని నువ్వు వచ్చావు. ఆ సమయానికి నేనిక్కడ లేకపోతే నీకెంత ఆశాభంగం కలిగుండేది? సరే, వీటన్నిటితో నిమిత్తం లేకుండా, ఇక్కడ నుండి బయల్దేరుతా ననుకో, నీ ఇంటికి ఖాయంగా వస్తానని నమ్మకమేమిటి? ఎందరో ఆహ్వానించేవారు ఉంటారు. ఎన్నో స్థలాలను సందర్శించాల్సి వుంటుంది. అప్పుడిక నీ ఇంటికి రానే రాలేకపోవచ్చు కూడాను' అన్నాడు.

అవును. శ్రీరమణుల హృదయంలో ఒక అసాధారణమైన 'శూన్య'ముండేది. ఒకప్పుడు గౌతమ బుద్ధుడు ఏ శూన్యాన్నైతే కనుగొన్నాడో అదే శూన్యాన్ని శ్రీ రమణుడూ దర్శించాడు. రమణుడికి దిశలేదు, దశలేదు, తానేదీ అవాలని లేదు. ఏదీ చేయాలని గానీ, సాధించాలని గానీ, ఒక ఉద్దేశం, ఒక ప్రణాళికగానీ లేదు.

ఒక వైపున ఏదైనా అరుగో, గోడో కట్టాలనే ఆలోచన వస్తే తానే పూనుకుని ఆ పనిచేయ నారంభించేవాడు. లేదా మరెవరి సహాయమైనా తీసుకునేవాడు. వంటశాలలో పచ్చళ్ళు నూరేవాడు; వాటిలో ఏవో రకరకాల ఆకులు తెచ్చి వేసేవాడు. పొరపాట్న తన చేయి తగిలి ఏ పక్షి గూడో పడిపోతే, అందులోని పసిగుడ్డును సంరక్షించి, దానికి రెక్కలు మొలిచేంత వరకూ కాపాడి, చివరకు దానిని స్వేచ్ఛగా ఎగిరి పోనిచ్చే వాడు. దేనినీ తన అధీనంలో వుంచుకోవా లనుకునేవాడు కాదు – తన పేరు విస్తృతంగా

ఎల్లెడలా తెలియడానికి, తాను శాశ్వతంగా భూమిపై గుర్తుండడానికి దోహదం చేసే ఏ ప్రక్రియా చేపట్టలేదు.

"మిమ్మల్ని ఉత్తర హిందూస్థానంలో సంచారం చేయించి, మీ దర్శనం వారందరికీ కలగజేయదలచుకున్నాను. మీ అమృతవాక్కు వారి చెవిన పడేట్లు చేస్తాను" అని ఓ పెద్ద మనిషి రెండు ఫస్ట్‌క్లాస్ రైలు టికెట్లు కూడా కొని, "మనం బయలుదేరాల్సి వుంది" అని చెప్పినప్పుడు, "ఎక్కడికి?" అని అడిగాడు రమణుడు.

"చెప్తూనే వుంటిని కదా. ఉత్తర హిందూస్థాన్ పర్యటనకు" అన్నాడు అతడు. "పర్యటనా? నువ్వు వెళ్లిరా" అన్నాడు రమణుడు. అంతే, అంతటితో చెల్లిపోయింది, ఆ పెద్ద మనిషి ప్రణాళిక.

ఆ నోటా ఈ నోటా ఈ మహనీయుడి ప్రశస్తి దశదిశలా ప్రాకి, ఎక్కడెక్కడి నుండో పాశ్చాత్యులు, భార్యాపిల్లలతో కూడా దిగి వచ్చారు. కోరికలు తీరుస్తాడని కాదు; జీవితం అర్థంగాక తమ మనసు పడుతున్న ఆరాటాన్ని తగ్గిస్తాడేమోనని తమ హృదయగాయాలను మాన్పి, సృష్టిపై ప్రేమను కనుగొనే మార్గం చూపిస్తాడని, వచ్చే వారు. పాశ్చాత్యులకై ప్రత్యేక వసతులు ఆహారాలు అంటూ ఏమీ వుండేవి కాదు. సోమర్‌సెట్ మామ్ వంటి ప్రఖ్యాత ఆంగ్ల రచయిత, రమణ దర్శనానికై వచ్చి, మేజర్ చాడ్‌విక్ అనే మరో పాశ్చాత్యుడి గుడిసెలో నివసించాడు. తీరా వచ్చిన తర్వాత రమణుణ్ణి ఏమీ అడగలేక పోయాడు. ఆయన కళ్ళల్లోకి చూస్తుంటే మనసు ఏదో అనిర్వచనీయమైన అనుభూతితో నిండిపోయింది. రమణుని కళ్ళను జట్కావారూ, పనివారూ చాలా గొప్ప రాజకీయ నాయకులూ కూడా చూచారు. మరి, అందరికీ ఆ వింత అనుభూతి కలిగిందా? లేదు. ఏవో పిచ్చి ప్రశ్నలు నాలుగువేసి, ఆయన్ని వేధించి లేచి నిర్గమించేవారు. అంటే ఆలోచనలు కుప్పలు తెప్పలుగా నిండిపోయిన మనసుతో ఆయన ముందు తమ ప్రతాపమేదో కొంత చూపి, నేర్చుకునే వినయం లేక వెళ్ళిపోయే వారు.

వర్ధా ఆశ్రమంలో వుండిన గాంధీజీ, తన వాళ్లెవరైనా మనశ్శాంతి లేదంటూ వుంటే, రమణాశ్రమానికి వెళ్లిరండని సలహా ఇచ్చేవాడు. కాని గాంధీజీ మద్రాసు

వచ్చినప్పుడు, అక్కడ పర్యటించే వేళ, రమణుని ఆశ్రమానికి వెళ్దామని ప్రయత్నించి నప్పుడు, రమణుని ప్రభావం గాంధీజీ మీద ఎలా వుంటుందో, ఏదైనా నిష్క్రియా పరత్వం సంభవిస్తే, తమ రాజకీయ భవిష్యత్తు ఏమవుతుందోననే భయంకొద్దీ ఒక ప్రముఖ దక్షిణాది నాయకుడు గాంధీజీని అటు పోనివ్వకుండా, ఆయనకు వేరే కార్యక్రమాలు రూపొందించాడు.

రమణుని ప్రశాంత నయనాల్లోకి చూచినప్పుడు ఒకరికి దక్కింది మరొకరి కెందుకు దక్కలేదు? రమణుని సాక్షాత్కార లోపం కాదుగదా? లోపం ఇవతలి వారిలోనే వుండాలి. అనేక రకాల అడ్డుగోడలు నిర్మించుకొని వాటిని తొలగించుకోలేక ఈ మనిషి వద్దకు వచ్చి ఏమి ప్రయోజనం? ధనాశ, కీర్తికాంక్ష, తనకు తనవారికి ఏ కష్టమూ రాకుండా బతకాలనుకోవడం, ఇవన్నీ ఈ జన్మలో తొలగేనా?

మనల్ని మనమే ఆటంకం పరుచుకుంటున్నాం. ఆ కళ్ళల్లోని ప్రశాంతతను స్వీకరించగలిగిన తాహతు మనకు లేదు. అరిషడ్వర్గాల ఆక్రమణలో వుండిపోయిన మనం, ఆ నయన ప్రశాంతత మనకు దక్కాలంటే ఎలా దక్కుతుంది. 'ఇతరులకేదో దక్కిందంటారు కానీ, మాకేమీ దక్కలేదు' అనే వారంతా ఇలాంటివారే; ఈ తాహతు పాండిత్యం ద్వారా, ధనం ద్వారా, హోదా ద్వారా వీటి వేటి ద్వారానూ సిద్ధించేది కాదు. అహం రద్దవాలి, అవినయం తొలగాలి, లోకం అందించగలిగిన వాటి యెడల ఆసక్తి నశించాలి.

నీలి ఆకాశం కింద ఆ ప్రశాంత తటాకం పరిశుభ్రంగా అలాగే వుంది; పక్షి ఒకటి ఆ తటాకం మీదుగా ఎగురుతూ వెళ్ళింది. ఆ కాసేపు ఆ పక్షి యొక్క ప్రతిబింబం ఆ స్వచ్ఛమైన నీటిలో కనిపించింది. తన ప్రతిబింబం ఆ నీటిలో కనిపించాలనే ఆలోచన పక్షికి లేదు. పక్షిని తన నీటిలో ప్రతిబింబింపచేయాలనే ఆలోచన తటాకానికీ లేదు. పక్షి తాను మళ్ళీ అక్కడికి వచ్చి తన ప్రతిబింబాన్ని నీటిలో చూచుకోవాలనే ఆలోచనే లేదు. పక్షి మళ్ళీ రావాలనే కోరిక తటాకానికీ లేదు. ఆకాశంలోకి చంద్రుడు వచ్చినా, తటాకంలోని నీరు చంద్రుణ్ణి ప్రతిబింబిస్తై. తటాకానికి చంద్రుడు ఎక్కువా కాదు. పక్షి

తక్కువా కాదు. తనలోని జల స్వచ్ఛమైనది కాబట్టి తనలో కోరికలు శూన్యం కాబట్టి ప్రతిబింబం స్వచ్ఛంగా కనిపిస్తుంది.

రమణుని హృదయమూ, మెదడూ నయనాలు అన్నీ స్వచ్ఛమైనవే. ఆయన నయనాల్లో తమని తాము చూచుకున్నవారు, తమ ఆరాటమేమిటో తెలుసుకొని, పూర్తిగా అర్థం కానప్పుడు ఆయన్ని ఒకటీ ఆరా అడిగి, ఆయన చెప్పిన సూత్రప్రాయమైన సరళమైన మాటల్ని అర్థం చేసుకొని సవినయంగా ఆచరించి, తరించారు. అన్వేషకులూ మేధావులూ ఆవిధంగా లాభపడ్డారు. అతి సామాన్యులూ, అట్టే చదువుకొనని స్త్రీలూ, వంటశాలలో ఆయనతోబాటు పనిచేస్తూ బ్రతికినవారు కూడా తమకు కలిగిన జ్ఞానోదయాన్ని చక్కగా వివరించారు. పండిత పామరుల తేడా లేకుండా, మనుష్యుల్ని జంతువులతో సహా తరింపజేసిన ఈ మహనీయుడికి నివాళులెలా అర్పించాలి?

## భగవద్దర్శనం

భగవద్దర్శనం మన లోపల కలిగేది కాని వెలుపల కలిగేది కాదు. మనస్సు అంతర్ముఖం చేయబడినప్పుడు, భగవంతుడు అంతశ్చైతన్యంగా మనకు సాక్షాత్కరిస్తాడు.

భగవద్దర్శనం కలిగేది మనస్సులోనే. ఏ రూపంలో భగవంతుడు సాక్షాత్కరిస్తాడనేది చిత్త సంస్కారాన్ని బట్టే ఉంటుంది. ఏమైనా అది చరమ దశ కాదు. అందులో ఇంకా ద్వైత భావం ఉన్నది. అది ఒక స్వప్న దర్శనం వంటిది. భగవద్దర్శనానంతరం విచారం ప్రారంభమై ఆత్మదర్శనంలోకి పర్యవసిస్తుంది. కట్టకడపటి మార్గం విచారమే.

# శ్రీరమణుల నకిలీ ఫిర్యాదు

**ఆ**శ్రమంలో ఉండే ముందు శ్రీరమణులవారు కొండమీద నిసిస్తుండేవారు. ఒకప్పుడు తనకు తమిళం బోధించిన టీచర్, నాటి తన శిష్యుడు చాలా ప్రఖ్యాతి గాంచాడని తెలిసి ఒకసారి చూసిపోదామని మధురై నుండి తిరువణ్ణామలైకు వచ్చాడు. తనని తాను ప్రత్యేకంగా ప్రకటించుకోకుండా దర్శనార్థం వచ్చిన మిగతా అందరితోబాటు తనూ ఒక పక్కకు ఒదిగి కూచున్నాడు. కానీ రమణుడు వారందరిమధ్యా కూచున్న తన పాత టీచర్‌ను గుర్తుపట్టి, తాను లిఖించిన అక్షర మణిమాల పుస్తకాన్ని ఆయన కందజేయమని తన అనుచరులనాదేశించాడు.

ఆ పుస్తకాన్ని అక్కడక్కడా చదువుతూ, అందులోని భక్తిప్రపత్తులకు, నిర్దుష్టమైన వేదాంతానికి ఆయన చాలా సంతోషించాడు. కానీ కొన్ని వాక్యాల సంపూర్ణార్థం తెలియడంలేదని అనిపించింది. అందుచేత, ఎలాగో ధైర్యం తెచ్చుకొని, లేచి నుంచొని, ఆ పుస్తకంలోని ఒక పద్యం చదివి, 'దీని పూర్తి అర్థం వివరించండి' అని రమణుణ్ణి కోరాడు.

"ఇది చూడండి, నేనే నాడో ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం తప్పించుకోవాలని, స్కూలు నుండి, ఇంటి నుండి పరిగెట్టి వచ్చేశాను. మరి ఆయనేమో ఆనాడు ప్రశ్నలడిగి నట్లే ఈనాడూ అడుగుతున్నారు. 'పుస్తకంలో ఈ భాగానికి అర్థం చెప్పు' అనే పాత ప్రశ్నతోనే నన్ను వేధిస్తున్నాడు చూడండి" అన్నాడు రమణుడు. ఈ విధంగా తన టీచర్ మీద చేసిన నకిలీ ఫిర్యాదును విని, అక్కడి వారంతా నవ్వుకున్నారు.

# నీ సంగతి నువ్వు చూచుకో

రమణాశ్రమంలో ఒకసారి వేదపఠనం జరిగిన పిదప, అనంతపూర్ నుండి వచ్చిన ఒక వృద్ధుడు లేచి నుంచొని, "వేదోచ్ఛరణను బ్రాహ్మణేతరులు వినరాదని అంటారే" అని తన సందేహం వెలిబుచ్చాడు.

అందుకు శ్రీరమణులవారు "నీ వ్యవహారం నువ్వు చూసుకోడం మంచిది, ఇక్కడికి ఎందుకు వచ్చావో ఆ విషయంపై శ్రద్ధ వుంచు. ఇలాంటి వ్యర్థమైన విషయాలపై నీ కాలాన్ని ఎందుకు వృధాచేసుకుంటావ్? 'నేను వేద పఠనం విన్నానని' నువ్వు అంటున్నావ్. ఆ 'నేను' అనేది ఎవరో కనుక్కో. ఆ 'నే'నెవరో తెలియకుండానే ఆ పదాన్ని వాడుతున్నావ్. దాని అర్థ తాత్పర్యాలు నీకు తెలిస్తే, ఇక ఇలాంటి సందేహాలుండవు. ఆ 'నేనె'వరో ముందు తెలుసుకో, ఆ తర్వాత మిగతా విషయాలను గురించి ప్రస్తావించుకోవచ్చు' అన్నారు శ్రీరమణులు.

రమణులవారి దృష్టిలో తానెవరో తెలుసుకోకుండా మనిషి ఏ పనిచేసినా, ఏ అభిప్రాయాలు వెలిబుచ్చినా, అదంతా కూడా పునాది లేకుండా కట్టిన ఇల్లు వంటిదే. ఎవరో ఏదో చెప్పారని, ఏదో శాస్త్రంలో ఇలా రాసి వుందని, ఎక్కడో ఒక మాట పట్టుకు వచ్చి, అవతలివారు తప్పుచేస్తున్నారని అంటూ వుండడం, శుద్ధ పొరపాటు. తనని తానెరుగని వాడికి ఉండే జ్ఞానమంతా సెకండ్ హ్యాండ్ జ్ఞానమే. తనకు స్వయంగా ఏదీ తెలియదు. 'నేను' ఎవరో తెలుసుకున్న తర్వాతే నిజంగా 'తెలుసుకోడం' ప్రారంభ మవుతుంది. అప్పుడు మనిషిలోకి ప్రవహించే జ్ఞానమంతా పుస్తకాలు, ఇతర వ్యక్తుల ద్వారా కాక, 'నేరుగా' అందుతుంది. అప్పుడు, ఈ వృద్ధుడికి కలిగిన సందేహం కలుగుతుందో లేదో స్వయంగా పరీక్షించి చూసుకోవలసి వుంటుంది. జాతి బ్రాహ్మణులు కాకపోయినా, అందులో ఎందరు బ్రహ్మజ్ఞానంపై ఆసక్తి కలిగి వున్నారో చూస్తేగానీ తెలియదు. ఏటా జనాభా లెక్కలు గనుక తీసుకోగలిగితే బ్రహ్మజ్ఞానానికి అంకితమై వున్న వారినందరినీ బ్రహ్మవాదులనీ, ఏదో వృత్తివ్యాపారం ఉద్యోగం చేసుకుంటున్న వారిని ఆయా ప్రధాన వృత్తులనుబట్టి వర్గీకరిస్తే సరిపోతుంది. మొదట్లో ఒక వృత్తిలో

వున్నవారు, వయసు దాటిన తర్వాత, బ్రహ్మవాదులవడానికి కూడా అవకాశముంటుంది. అప్పుడిక బ్రాహ్మణ అబ్రాహ్మణ భేదాలు పొడసూపనక్కరలేదు" అన్నాడు ఉత్కళరావు.

## శ్రీరమణుల సర్వజ్ఞత్వం

సుదీర్ఘకాలం రమణ శిష్యులుగా ఆశ్రమంలో ఉండిపోయిన శ్రీ యన్. బలరామ రెడ్డి గుర్తుతెచ్చుకొని చెప్పిన ఓ ఉదంతం. "ఒకసారి కావ్యకంఠ గణపతి ముని శ్రీరమణులతో కాళిదాస మహా కవీంద్రుని గొప్పతనాన్ని చెప్తూ వున్నాడు. ఆ సందర్భంగా కాళిదాసు శాకుంతలంలోని ఇంగుడి చెట్టు, రమణాశ్రమం సమీపాన ఉన్న అడవిలో వుందని శ్రీరమణులున్నారు.

ఆ ఇంగుడి చెట్టు చూపించడానికి, ఒకరోజు మధ్యాహ్నం 'నాయన' (గణపతి ముని)తోబాటు భగవాన్ ఆ అడవిలోకి వెళ్లారు. కాసేపయిన తర్వాత మురుగానార్ అనే భక్తుడు. ఆ తర్వాత విశ్వనాథస్వామి అనే భక్తుడు రమణుణ్ణి వెతుక్కుంటూ అడవిలోకి వెళ్లారు. అక్కడ భగవాన్, నాయనకు ఆ చెట్టును చూపిస్తూ, ఈ వెళ్లిన వీరిద్దరికీ కూడా చూపించారు. ఏ కావ్యమూ చదవని, వృక్షశాస్త్ర మెరుగని శ్రీరమణులు, సాధారణంగా ఎవరికీ తెలియని ఈ 'టర్మినాలియాకాటప్పా' అనే లాటిన్ పేరున్న చెట్టును ఎలా గుర్తించగలిగారా? అని ముగ్గురు పండితులూ చాలా ఆశ్చర్యపోయారు. అటు తర్వాత సర్వజ్ఞుడికి తెలియనిదంటూ ఏదీ వుండదని అర్థం చేసుకున్నారు.

"ఆత్మ విచారమే, జ్ఞానానికి దగ్గర త్రోవ అని మీరెందుకంటారు?" అని ఎవరో రమణుణ్ణి అడిగారు.

"మిగతా అన్ని సాధనాలకూ మనసు అనేది ఒకటి కావాలి. దాని సహాయంతోనే ఆ సాధన కొనసాగుతుంటుంది. మనిషిలోని 'అహం' అనేక రూపాలు, అవసరమైతే మరింత సూక్ష్మరూపం ధరించి సాధన కొనసాగిస్తుంది కానీ, తానే నాశనమవడం జరగదు. కానీ ఆత్మవిచారంలో, ఎత్తుకున్నప్పటి నుండీ, అహాన్ని నిర్మూలించడం ప్రథమ కర్తవ్యమవుతుంది' అన్నారు శ్రీరమణులు.

# మనిషి దేని యెడల మరణించాలి?

**1972** డిసెంబరు రెండో పక్షంలో జిడ్డు కృష్ణమూర్తిగారిని చూడడానికి, అప్పుడు ఆయన తాత్కాలికంగా నివసిస్తున్న రిషీ వ్యాలీకి వెళ్లాను. ఆ కాలంలో కాంగ్రెసు నాయకుడు శ్రీ చక్రవర్తి రాజగోపాలాచారిగారు మద్రాసులో చనిపోయారు. న్యూస్ పేపర్లు ప్రముఖంగా వార్తను ప్రచురించినై. రిషీ వ్యాలీలోని కొందరు టీచర్లు తమకు పెద్దగా సంబంధం లేకపోయినా, ఆ వార్తను చూచి భావోద్వేగానికి గురయ్యారు. ఈ వార్త తమకెంత ఉద్రేకం కలిగించిందో, కృష్ణమూర్తిగారికి కూడా అంతే కలిగిస్తుందని, ఆయన తన గదిలో నుండి బయటకు రాగానే అతివేగంగా ఆయనకు ఈ వార్త నందించారు. ఆయన సరేనని, అక్కడి పూలచెట్ల వద్దకు వెళ్ళాడు. ఆయన పెద్దగా స్పందించనందుకు వారికొకింత ఆశాభంగం కలిగింది.

ఈ ఘట్టం ఎంతో నయం. 1935లో ఐదవ జార్జి మహారాజు లండన్‌లో మరణించాడన్న వార్త వెలువడింది. మనదేశంలోని బ్రిటిష్ పాలకవర్గం, అధికార గణాలు పెను విచారంలో మునిగిపోవడం సహజమే. వారి జాతీయ గీతమే 'గాడ్ సేవ్ ది కింగ్' – పరమాత్ముడు మా రాజును రక్షించుగాక – అని ఆశిస్తూ వుంటుంది. కానీ రమణాశ్రమంలోని నలుగురైదుగురు ఆశ్రమవాసులను కూడా ఈ వార్త ఉద్రిక్తపరచింది. ఉద్రిక్తతను శ్రీరమణుల వారి వద్దకు మోసుకువెళ్లాలా అక్కరలేదా అనే ఆలోచన సరిగా చేయకుండా, వారితో కూడా ఈ మాట ప్రస్తావించారు.

"ఎవర్ని కోల్పోయినా, ఎవరు చనిపోయినా అది మీకేమి సంబంధం? మీరు చనిపోయి, మిమ్మల్ని మీరు కోల్పోయి, ప్రేమతో ఏకమవండి" అని సలహా ఇచ్చాడు శ్రీ రమణులవారు.

లోక సంబంధం అతిగా పెంచుకున్న వారికి ప్రతి సంఘటనా తరతమ భేదాలతో ఉద్రేకపూరితంగానే కనిపిస్తుంది. ఈ ఉద్రిక్తతను పెంచి పోషించడం న్యూస్‌పేపర్లు విధిగా చేస్తూనే వుంటై. కానీ అంతర్లోకాన్ని ఎడతెగకుండా వీక్షిస్తుండేవారు, అక్కడ సంభవించే ఆశ్చర్యకరమైన అద్భుత విషయాలకే ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. వెలుపలి

ప్రపంచంలో ఘట్టాలు వారి దృష్టికి రావని కాదు. కానీ వాటి యెడల, మనం స్పందించి నట్లుగా వారు భావోద్వేగం ప్రదర్శించరు. తమ సమక్షంలో ఎవరికైనా ఏదైనా నిజమైన ఇక్కట్టు కలిగినప్పుడు, వారి స్పందన సంపూర్ణంగా వుంటుంది. అక్కడి పని తీరిపోగానే ఇక ఆ విషయాన్ని గురించి ఆలోచించరు.

వారి ఉద్దేశం, ప్రపంచంలోని ఘటనలకు మనిషి స్పందించాల్సిన తీరు ఎలా వుండాలంటే, 'రాజుకైనా మరణం తప్పదు. మనకైనా ఇవాళో రేపో ఇది తప్పనిసరే. కానీ అసలీ మరణమంటే ఏమిటి? మనిషి ఆశలు, ఆశయాలు, అనంతమైన ఆకాంక్షలు, అన్నిటికీ తెరదించడమే కదా? మరణించిన ఆ మహారాజుకైనా చివరి ఘడియ వరకూ ఈ ఆశలన్నీ వుండే వుంటై కదా? మరి వాటి యెడల చనిపోకుండా, వాటినలాగే కొనసాగిస్తూ, మరణం అనే పేరుతో ఉత్థి శరీరాన్ని మాత్రం వదిలేసినందువల్ల, అసలు 'శరీరధారి' ఏమవుతాడు? ఎక్కడికి వెళ్తాడు? ఆ ఆశలన్నీ తీరడానికి మళ్లీ భూమిపై' ప్రవేశించక తప్పదు కదా? ఈసారి రాజుకాక పోవచ్చు. భిక్షుకుడవచ్చు. నిజానికి ఇప్పుడే తన ఆశలు, ఆలోచనలు, ఆకాంక్ష యెడల చనిపోగలిగితే, దేహం ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. జీవన్మృతుడై శక్తిసంపన్నుడై సంపూర్ణ స్వేచ్ఛతో బ్రతికే వీలుంది. అదే ధన్య జీవితం.

'కాబట్టి ఆధ్యాత్మిక నిలయమైన రమణాశ్రమంలో, ఆయన అనుచరులు నేర్వాల్సింది, ఉన్నపళంగా ఈ మనసు యెడల ఎలా మృతిచెందాలి? మనసును హృదయంలో ఎలా లయం చేయాలి? ఈ తరణోపాయాన్ని విస్మరించి, వారు చచ్చి పోయారు, వీరు చచ్చిపోయారు అనే ప్రస్తావనలతో కాలక్షేపం చేసుకుంటూ వుంటే, మిగతా లోకుల లాగా, లోక వ్యవహారంలో చిక్కుకున్నట్లే. శ్రీరమణులు చెప్పిన 'నేనెవరు?' అనేది కనుక్కోకుండా మరణిస్తే ఈ జీవితం వ్యర్థం. అష్టావక్ర గీతలో 'అహంకర్తేత్వహం మానమహాకృష్ణాహిదం శీతః/ నాహంకర్తేతి విశ్వాసామృతం పీత్వాసుఖీభవ" – తేట తెనుగులో అర్థం, 'అహం మృతితో సమానం. అహమున్నవాడు మృతి చెందినవాడే. అధ్యాత్మికత కలవాడే ప్రాణమున్నవాడు. నా కర్తృత్వం ఏమీలేదన్న విశ్వాసామృతం త్రాగినవాడే సజీవంగా వున్నాడు.' ఈ లెక్కన మనమందరం మృత జీవులమే' అని తేల్చాడు మిత్రశ్రీ.

# అన్నీ నీవే...అంతా నీవే...

"గురువూ నీవే, శిష్యుడూ నీవే" అని జిడ్డు కృష్ణమూర్తిగారు అన్నప్పుడు మనం ఉలిక్కిపడతాం. కానీ మన ఉలికిపాటు అర్థరహితం. ఆయన గురువు అక్కర లేదని ఎక్కడన్నాడు? ఎఱుకతో శ్రద్ధాన్వితమైన జీవితం గడుపుతూ నిజమైన శిష్యుడి కుండాల్సిన లక్షణాలు అలవరుచుకుంటే, ఆ గురువు నీలోనే లభిస్తాడు, అనే ఆ మాటలకర్థం.

అరుణాచల రమణుడు కూడా మరో విధంగా చెప్పిన మాటల సారాంశం చూడండి.

ప్రశ్న : ఈ రంగంలో విజయ సాధనకై గురుకృప మీద ఆధారపడవలసిందే కదా?

శ్రీరమణులు : నిజమే. నువ్వు చేసే సాధన మాత్రం గురుకృప వలన కాదా? నీ కందుతున్నదంతా ఈ సాధన ద్వారానే వాటంతట అవే అందుతున్నై. 'కైవల్య' గ్రంథంలో ఒక శ్లోకం ఇలా అంటుంది. 'ఓ గురువరా, నీవు నాతోనే ఎప్పుడూ ఉంటూ, జన్మజన్మలుగా నన్ను గమనిస్తూనే, నేను మోక్షమందుకునే వరకూ నన్ను నిర్దేశిస్తూ వస్తున్నావు. సందర్భం వచ్చినప్పుడు, ఆత్మ బాహ్యంగా అవతరిస్తుంది. అలాంటి పరిస్థితి ఏర్పడనప్పుడు, అతడు ఎల్లప్పుడూ లోననే వుంటూ అవసరమైనదంతా చేస్తూనే వుంటాడు.'

మరోసారి మరెవరో అడిగిన ప్రశ్నకు శ్రీ రమణులవారి సమాధానం చూడండి.

ప్రశ్న : మేము అనుసరించడానికి మాకు భగవానులు ఏదైనా ఉపదేశ మనుగ్రహిస్తారా? లేకపోతే, ఆరువందల మైళ్ళ అవతలనున్న మాకు సహాయ మందేదెలా?

శ్రీరమణ : ఆ సద్గురువు నీలోనే వున్నాడు.

ప్ర : అది అర్థంచేసుకోడానికి నాకు సద్గురువు అవసరం.

శ్రీరమ : ఆ సద్గురువు లోన వున్నాడు.

ప్ర : నాకు కంటికి కనిపించే గురువు కావాలి.

శ్రీరమ : ఈ కనిపించే గురువు, ఆ సద్గురువులోన వున్నాడని చెప్తున్నాడు.

ప్ర : నా సద్గురువు పాదాల మీద పడితే సరిపోతుందా?

శ్రీరమ : ఆహా. తనని తాను సమర్పించుకోనంత కాలమే ఉపదేశాలు కావలసి వుంటై.

ఇక నిసర్గ మహారాజ్ దృష్టి ఎలా వుందో చూద్దాం.

ప్రశ్న : భారతీయ సంప్రదాయంలో గురువు, అవశ్యం వుండి తీరాలి అంటారు. అతడి పాత్ర పరిమితమైనదంటారా? లేక మొత్తంమీద గురువు అవసరమేనంటారా? అది లేనిది ఏమీ జరగదా?

నిసర్గ : అంతరంగంలోని లోతుల్లో వుండే దీపం దాని పాటికి అది ప్రశాంతంగా, కాలాతీతంగా హృదయంలో వెలుగుతూనే వుంటుంది. అదే నిజమైన గురువు. మిగతా వారంతా దోవచూపించేవారే.

ప్ర : నాకా లోతుల్లో వుండే గురువు సంగతి అక్కర్లేదు. మార్గదర్శకుడైన గురువు సంగతే నేనడుగుతున్నది. గురువులేనిదే యోగసాధన సాధ్యంకాదని నమ్మేవారున్నారు. అలాంటివారు సరియైన గురువుకై ఎల్లప్పుడూ వెతుకుతూనే వుంటారు. ఒక గురువును మార్చి, మరో గురువుని అనుసరిస్తూనే వుంటారు. ఇలాంటి గురువుల ప్రయోజనమేమిటి?

ని : వీరంతా తాత్కాలిక గురువులు. కాలబద్ధులైన గురువులు, జీవితంలో ఏ రంగంలోనైనా ఇలాంటి గురువులు దర్శనమిస్తూనే వుంటారు; ఏ విద్య నేర్వాలన్నా, ఏ నైపుణ్యం సాధించాలన్నా వీరి ఆవశ్యకత ఉండనే వున్నది.

ప్ర : ప్రతి జ్ఞానము, ప్రతి నైపుణ్యానికి నాకు ఆధ్యాత్మిక గురువు వుండాలంటారా?

ని : వీటిని గురించి, నియామకంగా ఇలా వుండాలి అని ఏదీ చెప్పగలిగిలేము. ఒక్కటే చెప్పే వీలుంది. బాహ్యంగా కనిపించేది అస్థిరమూ అశాశ్వతమూను. అంతర్గతంగా

వుండేది శాశ్వతమైనది, మార్పుచెందనిది; అయి వుండి కూడా నిత్య నూతనంగా వెలుగుతుండేది. వినూత్నంగా చరిస్తూ వుంటుంది. లోని గురువు తన సమయానికై వేచి వుంటాడు. మొద్దుతనమూ, జడస్వభావమూ కలిగుండి అపమార్గాలు పట్టి నడవడము, మనిషిని ఒక క్లిష్ట పరిస్థితికి తీసుకువస్తై; సాధకుడికి తన గతి ఏమిటో అప్పుడు తెలిసి వస్తుంది. మనిషిని అదరగొట్టే ఇంతటి షాక్ వచ్చేవరకూ ఆగకుండా, ఇప్పుడే ఇటు మళ్ళేవాడు తెలివిమంతుడు. ఈలోన గురువు అహింసా వ్రతుడనుకోవద్దు; కొన్ని సందర్భాల్లో మొద్దు స్వభావం వుండే మనిషిని లేక విపరీత చర్యలనాచరించే వాణ్ణి, సర్వనాశనం చేసేటి దౌర్జన్యపరమైన చర్యనాచరించవచ్చు. సుఖసంతోషాల ననుగ్రహించినట్లే, మరణమూ దుఃఖమూ అనుభవింపజేస్తుంది. ఒక్క ద్వంద్వ మనస్తత్వానికే, అహింస ఒక ఏకీకృత సూత్రంగా కనిపిస్తుంది.

## అకర్మ

అకర్మ అనగా కర్మగాని కర్మ. అహంకారం నిర్మూలనమైన తరువాత చేయబడే కర్మే అకర్మ.

# జంతువులకు గుర్తింపు

**జే**న్ గుడ్ఆల్ అనే రచయిత్రి, ఆంగ్లంలో చాలా పుస్తకాలు రాసింది. 'మనిషి నీడలో', 'కిటికీ గుండా' మొదలైనవి ఆమె యొక్క ప్రసిద్ధ గ్రంథాలు. 'వేళ్లు, ప్రకాండాలు' (Roots and Shoots) ప్రోగ్రామ్ అనే సంస్థను నెలకొల్పింది.

ఫ్రెడ్ మాస్టర్, ఆమెతో సంభాషిస్తూ 'మీరు ప్రచురించిన సైంటిఫిక్ పేపర్లలో, జంతువులకు పేర్లు పెట్టి వ్యవహరించిన వారిలో మీరే ఆద్యులు.

జేన్ : అవును, నిజమే. నా పేపర్లు పరీక్షించిన జర్నల్ ఎడిటర్లు, పేర్లు వాడడాని కెలాగైతేనేమి, అంగీకరించారు. కానీ నేను ప్రథమంలో పంపిన పేపర్లో, ఆ జర్మన్ ఎడిటర్ ప్రతి 'అతడు' 'ఆమె' అనే పదాన్ని 'అది' అని దిద్దాడు. ఎవరు (who) అనే పదాన్ని ఏది (WHICH) అని తిరగరాశాడు. నేను దిగ్భ్రాంతి చెందాను; మిగతా వాటి సంగతి ఎలా వున్నా (CHIMP) పుంలింగమా, స్త్రీ లింగమా అనేది స్పష్టంగా తెలుస్తూనే ఉంటుంది.

ఏది ఏమైనప్పటికీ, నా వద్దకు తిరిగి వచ్చిన వ్రాతప్రతిలో మళ్లీ అన్నిటినీ మొదట్లో నే రాసినట్లుగానే తయారుచేశాను. చివరకు వారు నే రాసినట్లుగానే ప్రచురించారు. అదే నా మొదటి విజయం.

ఫ్రెడ్ : జంతువులకు మనస్సు ఉన్నదని కానీ, హృదయోద్వేగాలు వుంటై అని కానీ, అంగీకరించడం బహుశా సైన్స్‌కు ఇష్టం లేదనుకోవాలి. ఒకసారి గనక వాటిని అంగీకరిస్తే, జంతువులను పరిశోధనకు వాడడానికి మనస్కరించ దనుకుంటాను.

ఈ విషయంలో అరుణాచల రమణులు, సహజ స్ఫూర్తితో జంతువుల గురించి మాట్లాడేటప్పుడు పుంలింగ స్త్రీలింగ శబ్దాలు ఎలా ప్రయోగించేవారో గుర్తు తెచ్చుకుంటే, మనుషులకీ జంతువులకీ ఆయన ఎలా తేడా చేయలేదో తెలుస్తుంది. తనని చెంపదెబ్బ వేసిన కోతిని, 'ఏమిరా, కోపమొచ్చిందా?' అని నవ్వుతూ అడిగినప్పుడు కానీ, చీకట్లో చిరుతపులిని 'పోరా' (అరవంలో ఆయన అన్నది 'పోడా') అన్నప్పుడు కానీ, ప్రతి

జంతువునీ, వాటి వాటి లింగాన్నిబట్టి వ్యవహరించేవాడంటే, ఆయన హృదయ సౌశీల్యమెటువంటిదో, ఆయన ఎంతటి మర్యాద పురుషోత్తముడో తెలుసుకోవచ్చు.

## సంఘసేవ

స్వాతంత్ర్య పోరాట కాలంలో, నాటి కాంగ్రెస్ పార్టీ వర్కర్ శ్రీమతి రామేశ్వరి నెహ్రూ, శ్రీరమణుల వారిని, రాజకీయులు తమ అతి తెలివితో అడిగే ప్రశ్న, ఒకటి అడిగింది.

'నేను ఏదైనా కొంత సంఘసేవ చేయడం మంచిదంటారా? లేక ఏదో కొండ గుహకి వెళ్లి ధ్యానం చేసుకోడం మంచిదంటారా?'

ఛోటా నాయకుడి వద్ద నుండి బడా నాయకుడి వరకూ, నాటి ప్రధాన రాజకీయ పక్షమైన కాంగ్రెస్ పార్టీలో అందరికీ ఈ నిరసన భావముండేది. శ్రీరమణుల వంటి వారు, దేశానికి ప్రజానీకానికి ఏ మేలూ చేయకపోగా, వారికి నిరర్థకమైన దోవనేదో చూపిస్తున్నారని, దేశ స్వాతంత్ర్యేచ్ఛకన్నా పరమ పవిత్ర కార్యం మరేదీ లేదని, వారి దృఢ విశ్వాసం. ఆ నేపథ్యం నుండే ఈ ప్రశ్న.

అందుకు రమణులవారు, ఏమాత్రం చిరాకు పడక, 'రెండూ మంచివే. కానీ ఎవరైతే తనని తాను సేవించుకున్నాడో, అతడికే సంఘాన్ని సేవించడం తెలుస్తుంది' అన్నారు.

'తన సేవ'అనేది కూడా అపార్థం చేసుకోవచ్చు. ఎవరు కావలసిన ధనం, ఆస్తి, అధికారం సంపాదించుకోడం అని అనుకోవచ్చు కానీ, అర్థమది కాదు. తాను ఎవరనేది తెలుసుకోవడం, ఆత్మజ్ఞానం బడయడం అనేవి, నిజమైన 'తనని తాను సేవించుకోడం', స్వపర భేదం విసర్జించిన వారి జీవితమంతా సేవా కార్యక్రమమే.

# విశ్వసఖుడు

**నా**రాయణన్ అనే పెద్దమనిషి, మద్రాసు నగరంలో ఒక పెద్ద బ్రిటిష్ కంపెనీకి మానేజర్. అరుణాచల శ్రీరమణుల వారిని గురించి ఎవరో చెప్పగా విన్నాడు. ఒక వృత్తాంతం ఇలా తెలియజేస్తాడు.

'చిన్నచిన్న నగరాలకు ఆఫీస్ పని మీద వెళ్తుండేవాణ్ణి. తిరువణ్ణామలై వెళ్లడానికి విల్లుపురం రైల్వేస్టేషన్‌లో, నేనూ నా అసిస్టెంట్ పార్థసారథీ, రైలెక్కుతూ ఉండగా, ఒక యువకుడు కంపార్ట్‌మెంట్‌లో ఎక్కడానికి ప్రయత్నిస్తూ ఉంటం గమనించాను. ఆ యువకుడు ఎంత స్థూలకాయుడంటే, కంపార్ట్‌మెంట్ తలుపులోగుండా ఎక్కడానికి, శరీరాన్ని అటు ఊపి, ఇటు ఊపి, నానా అవస్థపడుతున్నాడు. రైలు బయట వైపున ఉన్న అతడి మనిషి - పరిచారకుడు అయి ఉండచ్చు - సాయం అందిస్తూ అతణ్ణి లోనికి నెట్టాడు. రైలు కాస్త దూరం వెళ్లిన తర్వాత అతడు మా వద్దకొచ్చి తన పేరు రతిలాల్ ప్రేమానంద్ షా అనీ, తాను గుజరాత్‌లోని ఒక ధనిక వ్యాపారి ఏకైక పుత్రుణ్ణనీ పరిచయం చేసుకున్నాడు. తన పదవ ఏట నుండీ ఈ స్థూల శరీరం, తన పాలిట శాపంగా మారిందని చెప్పుకొచ్చాడు. నిద్రపోతున్న వేళలో ఒకసారి తనకో స్వప్నంలో ఒక సన్యాసి తనని పిలిచాడనీ, అలా చాలసేపు పిలుస్తున్నట్లు కలలో అనిపించిందనీ చెప్పాడు. నిద్ర మేల్కొన్న తర్వాత ఆ స్వప్న వృత్తాంతం తన కళ్ళముందు తారట్లాడు తూనే ఉండిపోయిం దన్నాడు.

రెండు రోజుల తర్వాత, తన భార్య ఓ గుజరాతీ మేగజైన్ చదువుతుండెనట. ఆవిడ చదువుతున్న ఆ మాగజైన్‌ను, ఆవిడ వెనుక నుండి తాను చూడగా, అక్కడ ఉన్న బొమ్మల్లో మళ్లీ ఆ సన్యాసి రూపమే కనిపించిందట. ఆ సన్యాసి, భగవాన్ రమణ మహర్షి అని ఇంట్లో వాళ్ళని అడిగి తెలుసుకున్నాడు. వెంటనే తన తండ్రి వద్దకు వెళ్లి, తిరువణ్ణామలైకు తన ప్రయాణానికి ఏర్పాటు చేయమని కోరాడట. వాళ్ల కుటుంబానికి సేవలందిస్తున్న ఒక వ్యక్తిని తోటే ఇచ్చి పంపించాడట, తన తండ్రి. మహర్షి స్వప్నంలో

అంతసేపు కనిపించడం, నవ్వుతూ తనని రమ్మని ఆహ్వానించడం, ఆ ప్రేమానురాగాలు చూసి, తన దుఃఖం అంతమవుతుందని అతడు పరిపూర్ణ విశ్వాసంతో మాట్లాడాడు.

నా అసిస్టెంటు పార్థసారథి, రమణ మహర్షిని చాలామార్లు దర్శించుకొని వున్నాడు; చాలా విని వున్నాడు. సహజంగా ఆ రెండు గంటల రైలు ప్రయాణంలో అతడూ రతీలాల్, ఇద్దరూ రమణ మహర్షిని గురించి చాలా మాట్లాడుకున్నారు. నేనేదో ఇంగ్లీష్ నవల చదువతున్నాను. కానీ చెవులు వారిద్దరి సంభాషణ మీదనే వున్నై.

ఆ రోజు సాయంత్రం సుమారు ఐదు గంటలవేళ ఆశ్రమంలోకి ప్రవేశించినప్పుడు, అక్కడి వరండాలో ఓ యాభై మంది కూచోనున్నారు. మామూలుగా సోఫాలో వుండే భగవాన్ రమణ మహర్షి ఆ సమయాన అక్కడ లేరు. ఓ పది నిమిషాలు వేచి ఉండి, భగవాన్ ఇంకా రాకపోవడం చూచి, 'ఈలోగా మనం ఆశ్రమంలో తిరిగి, అక్కడి గోశాల, తదితర ప్రదేశాలు చూచి వద్దా'మన్నాడు పార్థసారధి.

అలా ఆశ్రమంలోని కొన్ని స్థలాలను చూచి తిరిగి వస్తుండగా, మాకో పసిపిల్ల వాడి గొంతు 'ఛీ' అనడం వినిపించింది. ఆ పక్కనే వంకాయ, బెండకాయ, మరికొన్ని కూరగాయ మొక్కల పొదలున్నై. అవి అన్నీ వంటశాల నానుకొని వున్న కూరగాయల తోట. ఎవరిదా ఈ గొంతు? అని ఆ పొదలలోనికి మరింత జాగ్రత్తగా చూశాము. ఆకుల మాటున ఓ చిన్న మేక, ఓ చిన్న కోతి, ఓ ఉడుత, గొంతు కూచొని వాటితో అమాయకంగా ఆటలాడుతున్న రమణుడు; రమణుని ఎడం చేతిలో ఓ కాగితం పొట్లం వున్నది. దాంట్లో వేరు శెనక్కాయలున్నై. కుడిచేతి వ్రేళ్లతో వాటిని పొట్లం నుండి తీసి, ఒక్కొక్కటీ మేకకు, కోతికి ఉడుతకు పెట్టి, తానొకటి తింటున్నాడు.

("ఈ అల్ప జీవులతో ఈ వేరుశెనక్కాయల విందారగించడమేమిటో మన వంటి వారికి ఎలా అర్థమవుతుంది? అన్నాడు. మిత్రశ్రీ. చేపలతో ప్రసంగిస్తూ నడివొద్దున నుంచున్న అతి బీద సన్యాసి సైంట్ ఫ్రాన్సిస్ ఆఫ్ ఎసిసీకి అర్థమవాలి. తోడేళ్ళకు హితవు పలికి ఇక ఆ గ్రామం పొలిమేరకు రావద్దని చెప్పిన ఆ జపనీస్ సాధు పురుషుడికి అర్థమవాలి. మేకను భుజంమీద వేసుకుని నడిచే గౌతమ బుద్ధుడికి అర్థమవాలి. ఉడుతను తన వ్రేళ్ళతో దువ్విన శ్రీరామచంద్ర ప్రభువుకు అర్థమవాలి")

రమణుడు వేరుశెనక్కాయలు పంచిపెడుతూ, ఉడుత పెదిమల మధ్య పెడుతూ ఉంటే, కోతి తన సహజ బుద్ధితో, ఆ కాయను లాగేసుకోడానికి ప్రయత్నించింది. అందుకు రమణుడు దానిని ఛీకొట్టాడు.

మేమలా చాటుగా చూస్తూ వుండగా, మమ్మల్ని చూడని ఆ తోటలోని నలుగురూ సంతోషంగా శెనక్కాయల విందు నారగిస్తూ నవ్వుకుంటున్నారు. ఆ నలుగురి పరస్పర మైత్రి ఎంతో చూడముచ్చటగా కనిపించింది. బాహ్య రూపాలలో ఎంత భిన్నత్వం ఉన్నప్పటికీ, నలుగురి మైత్రి చూపరులకు హృదయానందాన్ని కలిగించింది. ఆ దృశ్యం చూస్తుంటే నాలో కలిగిన అనుభూతులు వర్ణింపనలవి కాదు' అంటాడు శ్రీ నారాయణన్.

వేరుశెనక్కాయలు పూర్తయిం తర్వాత భగవాన్ ఆ పొట్లం కాగితం అవతల పారేసి, 'ఇహ పోండిరా' అని, ఏ వృద్ధుడైనా పిల్లలతో ఎలా అంటాడో అలా పలికి, లేచి నుంచున్నాడు. ఆ మూడూ వాటి దారిన వెళ్ళిపోయినై.

'మేమూ అక్కడి నుండి వేగంగా తప్పుకున్నాం. ఏదో దివ్యమైన సన్నివేశంలోకి అక్రమంగా తొంగి చూసిన వారమనే అపరాధ భావం మాలో కలిగింది. కానీ ఈ దృశ్యాన్ని కళ్లారా చూచామనే సంతోషమూ ఉండిపోయింది.

కాసేపట్లో భగవాన్ తన సోఫా వద్దకు వచ్చారు. కళ్లు, తన సమక్షంలో వున్న దేనినీ కాక, మరెక్కడో చూస్తున్నై. ఆ కళ్ళ వెనకాల ఏదో వెలుతురు ఉన్నది. ఆ వెలుతురును అడ్డుకుంటూ, ఎదురుగా ఉండే భౌతిక ప్రపంచాన్ని కనిపించకుండా చేస్తున్న తెరల్లాగా వున్నై ఆ నేత్రాలు.

భగవాన్ సోఫాలో విశ్రాంతి తీసుకుంటూ, ఎడం చేతిమీద తల పెట్టుకు కూచున్నారు. చూస్తూ కూచున్నాం. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. నిశ్శబ్దం. అయితే స్మశాన నిశ్శబ్దం కాదు, జీవంతో తొణికిసలాడే అనుభవం. మాలోని అంతరాత్మ, పరమాత్మ అయిన భగవాన్ చైతన్యంతో సంధాన మొందుతున్నది.

ఆ జంతుజాలమంతా ఆయనతో ఆ పొదల మాటున ఎలా ఆడుకున్నై. ఎంత విశ్వాసంతో ఆయనతో కలిసి మెలిసి, పిల్ల చేష్టలు చేస్తూ కాలం గడిపినై, అంతా కళ్ళకు కట్టినట్లనిపించింది.

స్థూలకాయుడు రతీలాల్‌లో ఓ నూతనోత్సాహం కనిపించింది. భగవాన్ కరుణా కటాక్షాలు అతడిలో ఏమైనా మార్పు తెస్తాయేమోనని, ఎద్దు బండిలో వెళ్తున్న అతణ్ణీ అతడి సహాయకుణ్ణీ చూసి అనుకున్నాను.

1953లో ఉద్యోగరీత్యా రాజ్‌కోటలో ఏదో పనుండి, ఒక లాడ్జిలో దిగాను. ఒక రోజు డైనింగ్ హాలులోకి వెళ్ళినప్పుడు ఓ ముప్ఫై ఏళ్ళ యువకుడు నన్ను కలిశాడు. “గుర్తుపట్టలేకున్నారా? ఐదేళ్ళ కింద మీతోబాటు రమణాశ్రమానికి వచ్చిన రతీలాల్‌ను”. అతడివంక పరీక్షగా చూశాను. అవును, అతడే ఇప్పుడు సన్నగా దృఢంగా ఉన్నాడు. ముఖం ఆరోగ్యంగా, తేటగా ఉన్నది. సంతోషంగా కరచాలనం చేశాడు. “భగవాన్ తానే స్వయంగా స్వప్నంలో ఆహ్వానించి, నన్ను బాగుచేశాడు. ఫామిలీ వ్యాపారమంతా నేను చూస్తున్నాను. నాకు ఇప్పుడు రెండేళ్ళ కొడుకు’ అని అన్నాడు.

రమణ ప్రేమానురాగాలకు అందరూ అర్హులే. సృష్టిలోని ప్రాణులన్నీ అతడి నెచ్చలులే. అతను విశ్వసఖుడు.

## అసలు నేను

‘అసలు నేను’ చూడబడే వస్తువుకాదు. చూడబడేది, చూచేది చూపు– మూడూ దాని అభివ్యక్తులు. ఆత్మసాక్షాత్కారంలో చూడబడేది ఏమీ వుండదు. ఎరుకయే దాని స్వస్వరూపం. దాని వెలుగులోనే శరీరం, అహంకారం, ప్రపంచం మొదలైనవన్నీ ప్రకాశిస్తాయి.

# ఆత్మవిశ్వాసం : అహంపై విశ్వాసం

**త**మకు ఆత్మవిశ్వాసం కలదని ప్రకటించే వారనేకమంది, తమ అహంపై వున్న విశ్వాసాన్ని, ఆత్మవిశ్వాసమని పొరబడుతుంటారు. ఆత్మని కనుగొనకుండా, అందుకై కృషిసల్పకుండా, ఆత్మవిశ్వాసం కలదంటూ వుండటం భ్రమ.

1936లో ఒక అమెరికన్ పెద్దమనిషి శ్రీరమణుల వారిని కలిశాడు. ఆ అమెరికన్‌కు వినికిడి లోపం సంభవించింది. ఒకప్పుడు తనకు ఆత్మవిశ్వాసం మెండుగా ఉండేదని, అందుచేత ఎవరి మీద ఆధారపడకుండా బ్రతికాననీ, ఇప్పుడు ఈ వినికిడి లోపం, తనకు చింత కలిగిస్తున్నదనీ శ్రీరమణుల వారితో అన్నాడు. అందుకు రమణుడు: 'మీకు ఆత్మవిశ్వాసం కలగలేదు; అహంపై మీకుండే నమ్మకం తొలగిపోవడం మంచిదే. అప్పుడే మీరు నిజంగా ఆత్మవిశ్వాసం పెంచుకోగలరు. చింతించాల్సింది ఏమీ లేదు. ఆత్మసాక్షాత్కారానికి ఇంద్రియాలపై విజయం సాధించడం ఎంతైనా అవసరం. ఒక ఇంద్రియాన్ని మీ తరఫున భగవంతుడే, అణగ తొక్కేశాడు. అది మీ మేలుకే ననుకోండి' అన్నాడు రమణుడు.

ఈ హాస్యధోరణికి ఆ అమెరికన్ నవ్వుకున్నప్పటికీ 'ఈ కారణాన తన ఆత్మ గౌరవం దెబ్బతింటున్నద'ని చెప్పాడు.

అందుకు రమణుడు 'ఆత్మ ఏకమే. నువ్వు స్వయంగా చేసిన తప్పులకు నిన్ను నువ్వు అసహ్యించుకున్నప్పుడు, నీకు గాయమైనట్లుంటుందా? ఆత్మను నువ్వు పట్టుకున్నావంటే నిన్ను నీచంగా చూడడానికి 'మరొక'డుండడు. ప్రపంచం గనక నీకు కనిపించిందంటే, ఆత్మను చెయ్యిజార నిచ్చావన్నమాట. అలా కాకుండా ఆత్మని స్థిరంగా పట్టుకో. ప్రపంచం మాయమవుతుంది' అన్నారు.

మిత్రశ్రీ వ్యాఖ్యానిస్తూ 'ఆత్మనెరిగిన వాడి అద్భుత బోధ. తన కళ్ళముందున్న ప్రపంచం క్షణక్షణమూ మాయమైపోతున్న ఆత్మజ్ఞానియైన రమణునికే ఈ సమాధానం

సాధ్యం. శ్రీరమణుల వారు ఈ భూమి మీద ఎటువంటి జీవితం గడిపారో మనబోంట్లకు ఇప్పుడు అర్థమవవచ్చు.

మెహర్‌బాబా కూడా, ఒక అంధబాలుడు తనకు దృష్టి లేకపోవటాన్ని గురించి విచారపడుతూ మాట్లాడగా, 'లేనందుకు చింతించకు. ఆత్మదర్శనానికి ఒక అవరోధం తొలగిపోయినట్లు భావించు. ఆత్మ దర్శనానికై ప్రయత్నించు' అని సలహా ఇచ్చాడు. కళ్లు లేనందుకు వినికిడి లోపించినందుకు, మరెన్నిటికో మనుషులు దుఃఖిస్తారే కానీ, ఆత్మను దర్శించకుండా జీవితం ముగిసిపోతున్నదనీ, తనకిచ్చిన మానవజన్మ వ్యర్థమై పోతున్నదనీ దుఃఖంచే వారు ఎక్కడా కానరారు' అన్నాడు.

## రమణుని స్వేచ్ఛ

రోజు పొడుగూతా సోఫా మీద కూచోడానికి శ్రీరమణులు ఇష్టపడేవారు కాదు. ఆ సోఫాను తన జైలు (చెఱ)గా భావించేవారు. తనని దర్శించుకోడానికని రోజంతా వచ్చే భక్తుల కోసమే అక్కడ కూచోవలసి వచ్చేది. 1930 సంవత్సరం వరకూ భగవాన్ హాలు వెలుపల చిన్న చిన్న పనులు – అవనీ, ఇవనీ చేస్తూ చాలాసేపు గడిపేవారు. దర్శనం కోసం ఎవరైనా భక్తులు వస్తే, సహాయకుడు మాధవస్వామి వచ్చి శ్రీరమణుల వారికి చెప్పేవాడు. అప్పుడు భగవాన్ ఆ సోఫా వద్ద కొచ్చేవారు.

ఒకసారి వృద్ధుడైన ఒక భక్తుడు, రమణుడు కలిసి ఏదో పని చేసుకుంటున్నారు. సహాయకుడు మాధవస్వామి తనవైపు వస్తుండటం చూశాడు రమణుడు, నిట్టూరుస్తూ. 'నా ఎరెస్టుకు మళ్ళీ ఏదో కొత్త వారంట్ వస్తున్నదయ్యా. మళ్ళీ జైలుకు వెళ్ళక తప్పదు.' అన్నాడు.

నిత్య జీవితంలో తాననుకున్నట్లుగా జీవించడానికి, భగవాన్‌కి బాహ్యంగా స్వేచ్ఛ ఉండేదికాదు. కానీ తన 'బంధ విముక్త స్వేచ్ఛ' సంపూర్ణమైనది కాబట్టి, ఆశ్రమం ద్వారా సిద్ధించిన అన్ని ఇరుకులూ, ఇబ్బందులూ అనుభవిస్తూ, వాటిని సాక్షీమాత్రంగా తిలకించే స్వేచ్ఛ వుండెను.

# సాక్షాత్కారంలో కళల ప్రాధాన్యమెంత?

ప్రొఫెసర్ సుబ్బరామయ్య శ్రీరమణుల వారితో, కళల ప్రాధాన్యాన్ని గురించి ప్రస్తావిస్తూ 'ఆత్మజ్ఞాన లబ్ధికై కవిత్వమూ తదితర లలిత కళలను సాధనాలుగా వాడుకునే వీలుందా?' అని అడిగాడు. అందుకు రమణులు 'మనసును కేంద్రీకరించేదేదైనా ఉపయోగిస్తుంది. కానీ ప్రతి కళారాధనలోనూ, 'ఇక చేసింది చాలు' అనెడి వేదన వస్తుంది. అప్పుడు దానిని దాటి వెళ్లడం జరుగుతుంది' అన్నారు.

కళాసాధనలో అత్యున్నత స్థాయికి చేరిన తర్వాత, దానిని దాటకపోతే, విస్మరించకపోతే, అదే మనసును ఆక్రమిస్తుంది. సమాజం ఆ కళారాధకుణ్ణి గౌరవిస్తుంటుంది, మన్నిస్తుంటుంది, సన్మానిస్తుంటుంది. సాధకుడు ఈ పురస్కారాలలో కొట్టుకుపోతాడు. సంఘానికి చేరువ – దైవానికి దూరం. సంఘ మర్యాద అధ్యాత్మికునికి గొడ్డలిపెట్టు. విద్యలూ, కళలూ, అన్నీ కూడా – ఆ శ్రీహరిలో పర్యవసించాల్సినవే. ఆ మహా సాగరమే సత్యం. ఈ నదులు కాదు. ఇవి ఉపకరణాలనవచ్చు.

సంగీత జ్ఞానం చివరి స్థాయివరకూ సాధించి దానిని భక్తిలోకి పర్యవసింప జేయకపోతే దాని సాఫల్యం పరిమితమే అవుతుంది. అందుకే త్యాగరాజు 'భక్తి వినా, సంగీత జ్ఞానము ద్వారా సన్మార్గము కలదే,' అని అనవలసి వచ్చింది. భక్తే ప్రేమ, ప్రేమే దైవం.

జిడ్డు కృష్ణమూర్తి గారు, కీట్స్, షెల్లీ, వర్డ్స్‌వర్త్ వంటి ఇంగ్లీష్ కవులను చదివి నందువల్ల తాను కొన్ని సంవత్సరాలు ఆంగ్లంలో కవిత్వం రాశాడు. కొంత కాలం అయింతర్వాత, సాక్షాత్కారం జరిగిన తదుపరి, అంటే తనకు ముప్ఫై ఐదేళ్ళు నిండక ముందే ఠక్కున మానేశాడు. ఇక మళ్ళీ పొయిట్రీ జోలికి పోలేదు.

రమణాశ్రమంలో, ప్రొఫెసర్ సుబ్బరామయ్య, డాక్టర్ సయ్యద్ అనే ఫిలాసఫీ ప్రొఫెసర్, శ్రీరమణుల వారిని అడిగిన ఓ ప్రశ్న. దానికి భగవాన్ ఇచ్చిన వివరణ ఇలా వుంది. 'సృష్టి యొక్క ఉద్దేశ్యమూ, ప్రయోజనమూ ఏమిటండీ?' అని ఆంగ్లంలో అడిగారు.

సామాన్యంగా దక్షిణాది భాషల్లో మాట్లాడే శ్రీరమణులు ఈసారి మాత్రం ఆంగ్లంలోనే సమాధానం చెప్పారు. 'కన్ను తనని తాను చూడగలుగుతుందా?' అని అడిగారు. అటు తర్వాత 'నిస్సందేహంగా చూడలేదు. మరెన్నిటినైనా చూడగలుగుతుంది కానీ తనని తాను చూడలేదు.  ఇక తనని తాను చూచుకోవాలంటే, అది అద్దంలో చూచుకుంటేనే సాధ్యం' అన్నారు.

'అతణ్ణి' చూడాలంటే సృష్టి అనే అద్దంలో చూడాలి. భూమి వున్నది, భూమీశుణ్ణి తెలుసుకోడానికే; దీని ద్వారా తెలియబడేవాడు.

*  *  *

అరుణాచల ప్రదక్షిణ ప్రాముఖ్యాన్ని చెప్తూ రమణుల వారు ఒకసారి ఇలా అన్నారు. ఇతర దివ్యక్షేత్రాలు, పర్వతాలను గురించి, అవి దైవం నివసించే పర్వతాలుగా పేర్కొంటారనీ, ఈ అరుణాచల పర్వతమైతే, సాక్షాత్తూ దైవం యొక్క ఆకారమేననీ, అందువల్ల ఈ పర్వతం చుట్టూ ప్రదక్షిణ చేయడం, దైవ ప్రదక్షిణ గానే భావించాల్సి ఉంటుందనీ, అదీ దీని ప్రత్యేకత అని వివరించారు.

ఒక రోజున దేవరాజు మొదలియార్ అనే రమణ శిష్యుడు, 'ఆశ్రమంలోని శిష్యుల మధ్య మీరు కొంత తేడా చూపిస్తారనుకుంటాను. మాట వరసకు ప్రొఫెసర్ సుబ్బరామయ్య యెడల  మీరు మిగతా వారిమీదకన్నా, కాస్త ఎక్కువ దయగా వుంటారనిపిస్తుంది' అన్నాడు శ్రీరమణుల వారితో. భగవాన్ చిరునవ్వుతో 'నాకు ఏ భేదమూ ఉండదు. కృప అనేది నిండుగా ఎప్పుడూ కురుస్తూనే ఉంటుంది. ప్రతి ఒక్కరూ తమ అర్హతనుబట్టి దానిని పొందుతూ ఉంటారు. చేతిలో ఒక చిన్న గ్లాసు పట్టుకొచ్చినవాడు, ఓ కూజా తెచ్చినవాడు తీసుకెళ్ళినన్ని నీళ్లు తీసుకుని వెళ్లలేక పోవడాన్ని గురించి వగచి ప్రయోజనమేముంటుంది?' అన్నారు.

'మనిషి మనిషికీ శ్రద్ధాభక్తుల్లో తేడా ఉంటుంది. గురుకృపను శంకించే బదులు, ఈ శ్రద్ధాభక్తుల్ని కొలిచి చూచుకోడం మంచిది' అన్నాడు మిత్రశ్రీ వ్యాఖ్యానిస్తూ.

# నిష్కామకర్మ

**మ**హా పురుషులను ప్రశ్నలు అడగడం మనకు చాలా ఇష్టం; అయితే వారు చెప్పింది చేస్తున్నామా అనేది అసలు ప్రశ్న.

నిష్కామకర్మ అంటే ఏమిటి? అని ఒక భక్తుడు శ్రీ రమణులవారిని అడిగాడు. మహర్షి అందుకేమీ సమాధానం చెప్పకుండా ఉండిపోయాడు. కాసేపయిన తర్వాత శ్రీరమణులు కొండపైకి ఎక్కనారంభించారు. కొందరు భక్తులు కూడా ఆయనతోబాటు నడవసాగారు. ప్రశ్న అడిగిన తెలుగు పండితుడు కూడా వారిలో వున్నాడు. దోవలో ముళ్ళతో కూడుకున్న ఒక కర్రముక్క పడి వుంది. శ్రీరమణులు దానిని చేతిలోకి తీసుకున్నాడు. అక్కడే ఒక చోట కూచొని తీరిగ్గా దానిమీది ముళ్ళనన్నిటినీ తీసేయడం మొదలుపెట్టాడు. అటు తర్వాత కర్రకున్న కణుపులన్నీ సాఫ్ చేయనారంభించాడు. ఒక ముదురు ఆకు తీసుకొని ఆ కర్రని చక్కగా పాలిష్ చేశాడు. ఈ కార్యక్రమమంతా పూర్తవడానికి ఆరుగంటలు పట్టింది. ఈ కర్రని మహర్షి ఇంత బాగా ఎలా తయారు చేయగలిగాడా అని తోటే వున్న వారందరూ ఆశ్చర్యపోయారు.

అక్కడి నుండి అందరూ లేచి వెళుతుండగా, యాదృచ్ఛికంగా గొర్రెలు కాచుకునే కుర్రాడొకడు వాళ్ళకు తటస్థపడ్డాడు. ఆ కుర్రాడు తానుతోటే తెచ్చుకున్న కర్రనెక్కడో పోగొట్టుకున్నాడు. ఏమి చేయాలో తెలియక అవస్థ పడుతున్నాడు. శ్రీ రమణులవారు మారు ఆలోచన లేకుండా తాను ఒక పూటంతా అన్ని గంటలు కష్టపడి తయారు చేసిన కర్రను వాడికిచ్చేసి అవతలికి నడిచి వెళ్ళిపోయారు.

ప్రశ్న వేసిన తెలుగు పండితుడు, మహర్షి తనకు నిష్కామకర్మ అంటే ఏమిటో ప్రదర్శించి చూపించినట్లే అయిందనుకున్నాడు.

శంకర్‌లాల్ అనే ఓ పెద్దమనిషి ఆధ్యాత్మిక ప్రగతికై నన్నేమి పుస్తకాలు చదవ మంటారు? అని శ్రీరమణుల వారిని అడిగాడు.

రమణుడు ఆయన వంకకు తిరిగి 'పుస్తకాలా' పుస్తకాలెందుకు? అవెందుకండీ?' అని ఆశ్చర్యపోతూ అడిగాడు. పుస్తకాలు చదివితే ఆధ్యాత్మికత సిద్ధిస్తుందని నమ్మే వారికి, రమణుడు పుస్తకాలను ఇందుకు పనికివచ్చే పరికరాలు కాదనడం ఆశ్చర్యం కొల్పవచ్చు.

'హృదయాన్ని పవిత్రంగా చేసుకోండి. వెలుతురు కనిపించి తీరుతుంది' అన్నాడు శ్రీరమణుడు. ఈ హృదయ పవిత్రతకు చేయవలసిందల్లా చేయాల్సి వుంటుంది. పుస్తకం కూడా జతపడవచ్చు. అంతేగానీ పుస్తకాలు తమంతట తాము మనిషికి ఆధ్యాత్మికత నివ్వజాలవు.

దేవరాజ మొదలియార్ అనే రమణ భక్తుడు మరెవరితోనో కలిసి 'ఇలా చేద్దామని' ఏదో ఆలోచన చేశాడు. అటు తర్వాత కొన్నాళ్ళకు అది అమలు జరిపే ముందురోజు మధ్యాహ్నం, ఆ మనిషితో ఏదో స్వల్పమైన తగాదావచ్చి, ఆ ప్లాను విరమించాడు.

దేవరాజు నమ్మకమేమిటంటే, ఈ ప్లాను అమలు జరిగితే తనకేదో హాని జరగ నున్నదని శ్రీ రమణుడే దీనిని భగ్నం చేశాడని; ఆయన ఊహ ఏమైనప్పటికీ, ప్రారబ్ధం గురించి భగవాన్‌తో ఆయన జరిపిన సంభాషణ మనకు ఆసక్తిదాయకం. "అంటే భగవాన్ ఉద్దేశం, మనం ఆలోచించి ఒక పథకం ప్రకారం చేసిన దాని ఫలితంగా కాకుండా దానంతట అదే మన వద్దకు వచ్చినప్పుడు తద్వారా మనకే హానీ జరగ బోదనా?" అని అడిగాడు.

అందుకు శ్రీరమణులు "అలాక్కాదు. మన ప్రతి ఒక్క చర్యకూ ఫలితముండి తీరుతుంది. ప్రారబ్ధ మూలాన దాని ఫలిత మేదైనప్పటికీ నువ్వు చేయగలిగిందేమీ లేదు. కలిగిన ఫలితాన్ని ప్రత్యేకమైన మమకారంతోగానీ, ఇంకాస్త దక్కితే బాగుండుననే కోరికతో గానీ, ఇలాంటిది మరొకసారి సంభవిస్తే ఎంత ఆనందంగా వుంటుంది అనే ఆశతో గానీ స్వీకరించక, ఉన్నది ఉన్నట్లు అనుభవిస్తే అది నీకు హాని చేయదు; అంటే మరో జన్మకు బీజం పడదు" అని విశదీకరించారు.

# సరళబోధ

శ్రీ రమణులవారి జీవితమొకటి బోధ మరొకటి అని రెండు వుండేవి కాదు. ఆయన ఉద్దేశించకుండానే ఆయన జీవించే తీరు ఒక బోధగా మారుతుండేది. ఆయన దినచర్య నుండే ప్రేమ, వాత్సల్యం అంటే ఏమిటి, దయ కరుణ అనేవి ఎలా వుంటై, సకల జీవులను తనవలెనే చూచుకోడమంటే ఏమిటి? అనేవన్నీ తెలుస్తుండేవి. గ్రహించి నేర్చుకునే శక్తి ఉన్నవారు నేర్చుకొని తరించారు; లేనివారు తమ గతిన తాము పోయారు.

చిన్న పిల్లలతో శ్రీరమణులు చిన్ని పిల్లవాడి వలె ఆడుకునేవాడు. కాపట్యమెరుగని పిల్లలతో ఆడుకోడమే నిష్కపటి అయిన రమణుడికి సంతోషంగా వుండేది. హంస రామయ్య అనే వనిత ఇలా రాస్తుంది : నా చిన్నన్నయ్య గోపాలమూర్తికి పదేళ్ళు ఉండేవి; తపస్సు ఎలా చేయాలి? అని రమణుణ్ణి అడిగాడు. ఆ కుర్రాడికి ధ్రువుడి కథ చెప్పావా? అని మా అమ్మని భగవాన్ అడుగుతూ వుండగా ఎవరో భగవాన్ తినడానికని కొన్ని దోసెలు పట్టుకొని వచ్చారు. భగవాన్ గోపును తన వద్ద కూచోబెట్టుకొని అతడికో దోసెముక్క పెట్టి, నావంక చూస్తూ కొద్ది కొద్దిగా ఆ దోసెను తింటూవుండు. ఇక చూడడం ఆపు అని నేననేంతవరకూ అలా చూస్తూనే వుండు అన్నారు భగవాన్. గోపు ఆయన చెప్పినట్లుగానే, ఆయన్నే చూస్తూ దోసె ముక్కలు నములుతూనే వుండి పోయాడు. ఒక దశలో భగవాన్ 'ఇక చూడడం ఆపెయ్' అన్నాడు. భగవాన్ వాని వీపు తట్టుతూ 'తపస్సంటే ఇది' అన్నారు. మనసును ఆ భగవంతుడి మీద లగ్నంచేసి మనం చేస్తుండే పనిని కొనసాగిస్తూ వుండాలని మనందరికీ ఇదే ఒక ఉపదేశం కాదా?

మా పిన్ని కాన్పు సమయంలో మా అమ్మ హాస్పిటల్‌కు వెళ్లి ఆమెకు సహాయ పడవలసి వచ్చేది. నేనూ మా అమ్మతో అక్కడికి వెళ్లవలసి వుండెను. నాకు అక్కడి పరిస్థితులు, వాతావరణం చాలా రోత కలిగించేది. ఈ విషయాన్ని మా అమ్మ భగవాన్‌కు విన్నవించింది. ఆయన నన్ను తన చెంతకు పిలిచి 'హాస్పిటల్‌లో ఎంత బాధా నివారణ జరుగుతున్నదో చూడు. అందువల్ల హాస్పిటల్‌ను పవిత్ర స్థలంగా ఎంచాలి. అంతే గానీ

హాస్పిటల్‌ను చూచి భయపడడంగానీ రోత చెందడం గానీ తగదు' అని అన్నారు. మరణం అన్నాగానీ మృత శరీరాలంటే గానీ, శవాలను స్మశానానికి తీసుకువెళ్లే ఘట్టాలు గానీ నాకు తగని భయాన్ని కలిగిస్తై అని అమ్మ భగవాన్‌కు చెప్పింది. అప్పుడు భగవాన్ నావంకకు తిరిగి 'ఏ హానీ చేయలేని శవాన్ని చూచి, ఎవరైనా భయపడతారా? 'బ్రతికున్న శవాల'ను చూచి భయపడడంలో అర్థమున్నది" అన్నారు. ఆ చిన్న వయసులో నాకాయన మాటలు అర్థం కాకపోవడం సహజమే. కానీ ఇప్పుడు పెద్దయింతర్వాత, ఆయన ఉద్దేశమేమిటో అర్థమవుతున్నది. అని ముగిస్తుంది హంసా రామయ్య.

భగవంతుణ్ణి నేను కనుగొనకుండా భగవత్సేవకు అంకితం కాకుండా ఇతర విషయాలపై శ్రద్ధ చూపిస్తూ, డబ్బు, కీర్తి, ఆస్తి మొదలైన వాటిని ఆరాధిస్తూ కాలం గడిపేవారందరూ 'బ్రతికున్న శవాలని' రమణుని ఉద్దేశం. ఇంత ఘాటైన మాటలు ఆయన స్వయంగా సంభాషణల్లో వాడేవారు కాదు. అలా తీవ్ర పదాలు పలకడం కబీరుకే చెల్లింది. జీసస్ కూడా ఒక సందర్భంలో "మృతి చెందినవారిని మృతి చెందిన వారే పూడ్చిపెడతారులే. నువ్వు నాతో వచ్చేయ్' అని భగవత్సేవ ప్రాధాన్యాన్ని ఒక అనుచరుడికి గుర్తుచేశాడు. భగవదారాధన లేనివారినందరికీ ఈ మహాపురుషులు మృత జీవులుగానే పరిగణించారు.

## 'అహం' - 'అహంకారం

ఒకే 'అహం' ఎప్పుడూ ఉన్నది. అప్పుడప్పుడు బయలుదేరేది 'అహంకారం' అభివ్యక్తం కాకముందు కూడా 'అహం' స్వయం ప్రకాశమానంగా ఎప్పుడూ ఉండనే ఉన్నది.

స్థూలదేహం పుట్టుక మన పుట్టుక కాదు. అహంకారం పుట్టుకయే మన పుట్టుక. ముక్తికి క్రొత్తగా సంపాదించుకునేది ఏమీలేదు. అది మన స్వతస్సిద్ధమైన స్థితి. ఎప్పటికీ అది మార్పులేకుండానే ఉన్నది.

# అద్వైతుల ఆత్మ, భక్తుల యొక్క భగవంతుడు ఒకటే

**భ**క్తుల వైఖరి, అద్వైతుల వైఖరి వేర్వేరుగా కనిపిస్తుంటం మూలానే, ఒకటి ద్వైతమని మరొకటి అద్వైతమనీ భావించిన ఒక ప్రొఫెసర్ అరుణాచల శ్రీ రమణుల వారిని ఇలా అడిగాడు. 'వైష్ణవం అద్వైతమ్ ఈ రెంటికీ సమన్వయం ఎలా కుదురుతుంది?'

అందుకు శ్రీరమణులు ఇలా సమాధానం చెప్పారు : 'వైష్ణవులు తమని తాము విశిష్టాద్వైతులుగా అభివర్ణించుకుంటారు. ఇది కూడా మరి అద్వైతమే. వ్యక్తిలో ఎలాగైతే ఆత్మ, అహం స్థూల శరీరం ఇమిడివున్నాయో, అదే విధంగా భగవంతుడిలో పరమాత్మ, ప్రపంచం వ్యక్తులు ఇమిడి ఉన్నారు.'

అందుకా ప్రొఫెసర్ 'మరి భక్తి అనేది ద్వైతాన్ని సూచిస్తుంది కదా?' అని అడిగాడు.

మహర్షి సమాధానం చెప్తూ, "నిద్రావస్థ స్వప్నావస్థ జాగ్రదావస్థ అనే మూడు అవస్థలు బాహ్యంగా వేర్వేరు అవస్థలుగా కనిపిస్తున్నప్పటికీ, మనిషి సాధారణంగా అన్ని అవస్థల్లోనూ, నిద్రిస్తూనే జీవితం గడుపుతుంటాడు. మూడు అవస్థలూ, మనస్సుకు సంబంధించినవే. మేల్కొని వున్న మూడవ అవస్థలో కూడా వాస్తవాన్ని చూడడు కాబట్టి, అదీ ఒక స్వప్నావస్థే. స్వప్నాలు నిద్రలోనే కొనసాగుతుంటై కాబట్టి. ఈ మేల్కొన్న స్థితి కూడా నిద్రలో భాగమే. నిత్య జీవితంలో వాస్తవాన్ని దర్శించడం – ఉన్నది ఉన్నట్లు చూడడం నేరిస్తే తప్ప, జీవించినంత కాలం నిద్రావస్థలోనే వుంటాడు.

భక్తి, ఆత్మ విచారం, రెండూ ఒకటే. అద్వైతుల ఆత్మ, భక్తులయొక్క భగవంతడుగా గుర్తించారు."

ఆ విధంగా రెండు వాదాలను సమన్వయించడమే కాక మార్గాలెన్నైనా చివరకు ఆత్మ విచారం నుండి తప్పించుకునే మార్గం లేదని తేల్చారు శ్రీరమణులవారు.

మిసెస్ జెన్నింగ్స్ అనే అమెరికన్ వనిత శ్రీ రమణులవారితో సంభాషిస్తూ, 'నేనెవరు? అని మీరు చెప్పే ఈ విచారణకన్నా, 'నేనే ఆ బ్రహ్మని' అని నిశ్చయార్థకంగా పలకడం మరింత సార్థకమేమో? ఇలా దృఢంగా పలకడం సకారాత్మకం అనిపించు కుంటుంది. నేనెవరు? అని ప్రశ్న వేసుకోడం నకారాత్మకంగా కనిపిస్తుంది. అంతేకాక, ఆ ప్రశ్న, మనిషికి తాను విడిగా వున్నాననే భావన కలగజేస్తుంది' అన్నది. సమాధానంగా శ్రీరమణులు : 'సాక్షాత్కరించుకోవాలి' అని అనుకున్నంత కాలం, అందుకు ఈ విచారణ మార్గం సూచింపబడింది. దీని ద్వారా నిన్ను నువ్వు తెలుసుకుంటావు. నీకొక విధానం కొఱకు వెతకడమంటేనే నువ్వు విడిగా వున్నావనే భావాన్ని సూచిస్తున్నది' అన్నారు.

'నేనెవరు?' అని సందేహంతో ప్రశ్నించే బదులు 'నేనే ఆ పరమాత్మను' అని అనడం శ్రేయస్కరం కాదా?' అని అడిగింది జెన్నింగ్స్. 'అలా నిశ్చయంగా ప్రకటిస్తున్న దెవరు? అలా చేయడానికి ఒకరుండాలి కదా? అలా అంటున్నదెవరో కనుగొనండి. అన్నారు శ్రీరమణులు. దేహాత్మ భావనతో బ్రతుకుతున్న ఈ జీవి, తాను పరమాత్మనని నొక్కి చెప్పగానే అవుతాడా అని రమణులవారి ప్రశ్న.

విచారణ కన్నా, ధ్యానం చేయడం శ్రేష్ఠం కాదంటారా? అని జెన్నింగ్స్ 'ధ్యానమంటే అందుకు మానసిక చిత్తర్వులు కలిగుండాలి. మరి విచారణేమో వాస్తవాన్ని కనుగొనడం కోసం జరుగుతుంది. మొదటిది వస్తుగతమైనది. రెండవది వ్యక్తిగతమైనది.' అని శ్రీరమణుల సమాధానం. 'ఏదైనా ఈ విషయానికి సైంటిఫిక్ దృష్టి వుండాలి' అన్నది జెన్నింగ్స్. 'అవాస్తవాన్ని తప్పించుకుంటూ వాస్తవాన్ని అన్వేషించడం సైంటిఫిక్ దృష్టి' అని శ్రీవారి సమాధానం.

'అంటే నా ఉద్దేశం, ఒక్కొక్కటీ క్రమంగా తొలగాలని; మొదట ఈ మనసు, ఆ తర్వాత ఈ మేధ, చివరకు అహం తొలగాల్సి వుంటుందని' జెన్నింగ్స్.

'ఆత్మ ఒక్కటే సత్యం. మిగతావన్నీ అసత్యమైనవి. నీవు (అంటే నీ అహం) లేకుండా ఈ మనసు మేధ అనేవి, విడిగా మనజాలవు. 'నిశ్చలంగా వుండు నువ్వే

భగవంతుడివని కనుక్కో' అంటున్నది బైబిల్. ఆత్మని పరమాత్మగా సాక్షాత్కరించుకొన డానికి నిశ్చలతత్వం ఒక్కటే కావలసింది' అన్నారు శ్రీరమణులు.

ఎవరు ఎలాంటి ప్రశ్నలు సంధించినా శ్రీరమణులు వాటిని ఎలా తుంచి అవతల పారేయగలరో శ్రోతలు గ్రహించే వుంటారు.

## పరమాత్మ జడమా?

పంచదార తన తీపి తాను తెలుసుకోలేదనీ, దానిని రుచి చూచేవాడు వేరుగా వుండాలనీ, అట్లే పరమాత్మ స్థితిలోని ఆనందం అనుభవించడానికి జీవాత్మ వేరుగా ఉండాలనీ కొందరంటారు. పరమాత్మ పంచదార వంటి జడ పదార్థమా? పరమానందానుభవానికై తనను తానొకవైపున అర్పించుకుంటూ తన వ్యక్తిత్వాన్ని నిలుపుకోడం ఎలా సాధ్యం?

# కనిపించేదంతా లోపల వున్నది

**త**మిళనాడు మదురై ప్రాంతం నుండి తిరువణ్ణామలైకు వచ్చి అక్కడే ధ్యానమూ తపస్సులో స్థిరపడిపోయిన శ్రీరమణులు, ఈ ప్రపంచంలో, ఆఖరుకు స్వదేశంలో కూడా ఎక్కడికీ కదలలేదు. బాహ్యంగా కనిపించే ఈ ప్రపంచమంతా తనలోనే ఉన్నదని గ్రహించిన మహనీయుడు. ఆయన మనో నేత్రానికి ఏదో సందర్భంలో ఏదో ఒక ప్రాంతం కనిపించేది. మెక్సికో నుండి వచ్చిన భక్త దంపతులతో వారు నివసించే ప్రాంతాన్ని వర్ణించేసరికి, ఈ వివరాలు రమణుల వారికి ఎలా తెలుసా అని వారు చాలా ఆశ్చర్యపోయారు. ఎప్పుడైనా ఒకసారి ఇలా దానంతట అది సంభవించేది గానీ, దీని నొక అద్భుతంగా ప్రదర్శించేవారు కాదు. కానీ అత్యుత్తమ సాధకునికి ఇది సంభవిస్తుంది అని మాత్రమే మనం తెలుసుకోవలసిన విషయం.

హిందూమతంపైని అభిమానంవల్ల, ఆ మతాన్ని అనుసరిస్తూ తన పేరు కూడా మార్చుకున్న పోలెండు దేశ వనిత ఉమాదేవి కాశ్మీర్‌లో పర్యటించి, అక్కడి సుందర దృశ్యాల ఫోటోలు చూపించినప్పుడు, ఆశ్రమవాసులు ఆసక్తితో వాటిని చూస్తున్నారు. శ్రీరమణులు నవ్వుతూ 'అక్కడికి ప్రయాణించే ప్రయాస లేకుండానే వాటిని మేము చూడడం జరిగింది' అని అన్నారు. మనవంటి వారికి ఇదొక చమత్కారంగా తోస్తుంది. కానీ ఆ సందర్భంలో శ్రీరమణులు ఇలా వివరించారు. "విధిలో రాసిపెట్టి ఉంటేనే వీటిని వెళ్ళి చూడడం జరుగుతుంది. లేకపోతే వెళ్ళే ప్రసక్తి వుండదు. ఈ ప్రపంచంలో ఎటు చూసినప్పటికీ చూడడానికి మరికొంత ఉండనే ఉంటుంది. ఈ భూమండలం మీద కాకపోతే మరేదో మండలం మీద కావచ్చు. తెలిసినదానికి అవతల తెలియనిది కూడా ఉన్నట్లే కదా? అందుచేత జ్ఞానం ఎప్పుడైనా పరిమితమైనదే.

శ్రీరమణులు ఒకింతసేపు ఆగి, మళ్ళీ మాట్లాడుతూ 'అప్పర్ అనే మహాభక్తుడు వయసు మళ్ళి శరీరం కృశించిపోతున్న వేళ, ఉత్తర హిందూస్థానంలోని కైలాస్ తీర్థ యాత్రకు పూనుకున్నాడు. దోవలో మరో వృద్ధుడు తారసిల్లి, అక్కడకు వెళ్ళడం అమిత కష్టమనీ, అందుచేత ఈ అశక్త స్థితిలో విరమించమనీ ఎంతగానో చెప్పిచూశాడు.

ఆ సలహాను తిరస్కరిస్తూ, అప్పర్ 'ప్రాణం వుంటే వుంటుంది, పోతే పోతుంది. నేను వెళ్లి కైలాస్‌ను చూసి తీరాల్సిందే'నన్నాడు. ఆగంతకుడు ఇది చూసి 'అయితే అటు పక్కనున్న చెరువులో మునిగి, తన వద్దకు రమ్మన్నాడు. అప్పర్ ఆ పనిచేయగానే కైలాస్ ఆయన ముందు ప్రత్యక్షమయింది. ఇదంతా ఎక్కడ జరిగిందనుకుంటున్నారు? తంజావూర్ దాపుల్లో తొమ్మిదిమైళ్ళ దూరాన వున్న తిరువాయూర్‌లో సంభవించింది. మరి కైలాస్ అనే తీర్థం ఎక్కడ వున్నట్లు? అది మనసులో వున్నదా లేక మనసు వెలుపల వున్నదా? తిరువాయూర్ గనక నిజంగా కైలాసమే అయితే అది ఇతరులకు కూడా అలానే కనిపించాలి. కానీ మహాభక్తుడైన అప్పర్ ఒక్కడికే అలా కనిపించింది.

అదే విధంగా దక్షిణాదిలోని ఇతర తీర్థ ప్రదేశాలు పరమశివుడి నివాస స్థలాలు అని అంటారు మహా భక్తులు. వారి దృష్టిననుసరించి అది వాస్తవమే. అందుచేత సమస్తమూ మనిషిలోపలే వున్నది. బాహ్యంలో ఏమీ లేదు' అని ముగించారు రమణులవారు.

అణిమాద్యష్ట సిద్ధులను శ్రీరమణుల వారు పక్కకు నెట్టేశారు. 'నేనెవరు' అని ఆయన బోధించే అఖండ విచారణలో వాటికి స్థానంలేదు. సిద్ధిని ప్రదర్శించే గురువుల నారాధించే ప్రజా బాహుళ్యం ఉన్నందువల్లనే సిద్ధిని ఆచరించే గురువులు కొందరున్నారని రమణులవారి అభిప్రాయం. ఒకసారి మాట్లాడుతూ "తాయి మనవర్ అనే మహానీయుడు ఈ సిద్ధులనన్నిటినీ సంపూర్తిగా ఖండిస్తాడు. ఆ శ్లోకాన్ని తన అనుచరులకు చూపిస్తూ 'తాయి మనవర్ మౌనం గురించి అనేక సందర్భాల్లో ప్రస్తావించినప్పటికీ ఒక్క చోట మాత్రం నిర్వచించాడన్నారు. అహాన్ని పూర్తిగా నిర్మూలించినప్పుడు ఏర్పడేదే మౌనం; ఈ స్థితి చీకటి కావలనున్నదనీ, అయినప్పటికీ మరే పదమూ దొరకనందువల్ల దీనిని వెలుగు అంటారనీ సెలవిచ్చారు.

# ఆత్మవిచారణ : యాంత్రిక సాధన

**మ**నసును కోర్కెల వెంబడి, ప్రాపంచిక చింతల వెంబడి పడిపోనిస్తూ, ఎవరో చెప్పిన ఏదో యాంత్రికమైన సాధన చేయమంటే చేశామని ఆధ్యాత్మిక ఫలితాలకై ఎదురు చూసేవారు ఎందరో వుంటారు. అలాంటివారు అరుణాచల శ్రీరమణుల వారిని ప్రశ్నించే తీరు కూడా విచిత్రంగానే వుంటుంది. ఆయన బోధిస్తున్న దానికన్నా ఇంకా చేయవలసింది ఎంతో వుండుంటుందని వారి ఊహ. అలాంటి పెద్ద మనిషి వేసిన ప్రశ్నలు. శ్రీరమణులు సున్నితంగా సూక్ష్మాన్ని తెలియజేస్తూన్న తీరు గమనించండి.

'జ్ఞానులతో కలిసి జీవించడం మనసును దృఢ పరుస్తుంది, అనే మాట నిజమై వుండచ్చు. అయితే సాధన కూడా ఉండి తీరాలి. ఏమి సాధన చేయాలంటారు?'

అందుకు రమణులవారు 'అవును. సాధన కూడా వుండాల్సిందే. సాధన అంటే ఆయత్తమై వున్న పూర్వాభిమానాలను తొలగించడానికే. సాధన నూతనంగా దేని కోసం కాదు. ఆ పూర్వానుకూలతను సంహరించడానికే' అని సమాధానం.

ఆయన చెప్పింది స్పష్టంగా వుంది. అలముకున్న బురద కడిగేయడానికేననీ, కొత్తగా ఏదీ పొందడానికి కాదని చెప్తున్నారు.

పృ : అభ్యాసం, నాకాశక్తినివ్వాలి.

ర : సాధనే శక్తి. ఆలోచనలనన్నిటినీ ఒకే ఒక్క ఆలోచనగా చేస్తే మనసు దృఢ పడుతుందనే అనుకోవచ్చు. సాధన గనక చలించకుండా వుంటే అది సహజమవుతుంది. అంటే మనసు పరి పరివిధాలుగా కోర్కెలననుసరించి వెళ్ళకూడదు. ఏకాగ్రత, దృఢత్వం సాధించాలి.

పృ : అలాంటి సాధన ఏదంటారు?

ఏదో యాంత్రికంగా చేసి పడేయవచ్చు కదా అని ఆశ. కానీ శ్రీవారు ఇచ్చిన జవాబు అతడికి నిరాశే మిగిల్చింది.

ర : ఆత్మ విచారణ చేయడమే ఆ సాధన. అంతే మరి. మనసును ఆత్మపై లగ్నం చేయడం.

పృ : ఏ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలి ! సాధనకు లక్ష్యముండాలి కదా?

ర : ఆత్మయే లక్ష్యం. ఇంకేమి లక్ష్యముంటుంది? మిగతా లక్ష్యాలన్నీ, ఆత్మ లక్ష్యం సాధించలేనివారికే. అవన్నీ కూడా చిట్టచివరకు ఆత్మ విచారణకే దారితీస్తై. అన్ని రకాల సాధనలకూ ఫలితం ఏకాగ్రతే. ఒకరికి త్వరగా సిద్ధించవచ్చు. మరొకరికి చాలా కాలం తర్వాత సిద్ధించవచ్చు. అంతా మనం చేసే సాధనమీదే ఆధారపడి వుంటుంది" అన్నారు శ్రీవారు.

ఈ సాధన అనే విషయాన్ని అమిత కఠినంగా ఊహించుకొని, దానికై ఇంత శ్రమించాలి అంత శ్రమించాలి అనుకోడం జరుగుతుంటుంది. అందువల్ల వాయిదా వేయడం కూడా జరుగుతుంది. శ్రీరమణుల వారు చెప్పినట్లు ఆత్మ విచారణే సాధన అని తెలుసుకున్నవానికి, సాధనే సాధ్యాన్ని అందుకునేట్లు చేస్తుంది. సాధ్యం ఒకటై, సాధన మరొకటి అవడానికి వీల్లేదు. మిగతావన్నీ డొంక తిరుగుడు మార్గాలు కాబట్టి సాధకుడు ఆత్మ విచారణ ద్వారా ఆత్మ దర్శనాన్ని సాధించవలసి వుంటుంది, అని శ్రీరమణుల బోధ.

# శ్రీరమణుల భావోద్వేగం

'రమణ మహర్షి సమక్షంలో కొన్ని అద్భుతాలు జరగడం వాస్తవమేనైనా, కొందరి ప్రార్థనలకు తగు సమాధానాలు లభించినప్పటికీ, మహర్షి ఏ అద్భుత శక్తినీ ప్రకటించేవారు కాదు' అంటాడు పాశ్చాత్య శిష్యుడు కోహెన్.

మహిమల ప్రదర్శనను నిరసిస్తూ, శ్రీ రమణులు ఒకసారి, మహాభక్తుడు కబీర్‌ను గురించి ఒక ఉదంతం, నాటకీయంగా తగు హావభావాలతో చెప్పారు. 'కబీర్ మహాశయుడికి సిద్ధులు వున్నప్పటికీ, అతడు నేత వృత్తితోనే జీవనం సాగిస్తూండేవాడు. ఒక రోజున కబీర్ తన మగ్గంమీద పనిచేసుకుంటూ వుండగా, శిష్యుడొకడు కబీర్ వద్ద కొచ్చి తత్తరపాటుతో, వీధిలో ఒక ఐంద్రజాలికుడు తన కర్రని ఏ ఆధారం లేకుండా గాలిలో నిలబెట్టి, ప్రజల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తున్నాడు' అని చెప్పాడు. జనం తండోప తండాలుగా అతడిచుట్టూ మూగి నోరువెళ్ళబెట్టి చూస్తున్నారు అన్నాడు. నిజ ఆధ్యాత్మికుడైన కబీర్‌కు ఈ గారడీ విద్యల ప్రదర్శన, అంటే అయిష్టం. అయినప్పటికీ ప్రజలు ఇలాంటి అమానుష కృత్యాలను చూచి, ఇదే ఆధ్యాత్మికత అని మోసపోకూడదని, ఈ క్షుద్ర విద్యల్ని, తలుచుకుంటే తానూ చేసి చూపించగలనని, తన చేతిలో వున్న పెద్ద దారపు కండెతో వీధిలోకి పరిగెట్టి, అందరిముందూ ఆ కండెను గాలిలోకి విసిరేశాడు. ఆ కండె కనుచూపుమేర దాటి మరీ మరీ పైకి వెళ్తూనే వుంది; చిట్టచివరకు ఆ కండె లోని దారం ఒక కడ్డీలాగా అందరి కళ్ళముందూ నిలిచింది. అది చూసిన అక్కడి ప్రజలు, ఆ ఐంద్రజాలికునితో సహా, అమిత ఆశ్చర్యానికి లోనై, విభ్రాంతి చెందారు.

ఈ దృశ్యాన్ని వర్ణిస్తూ భగవాన్ రమణ కూడా, ఆశ్చర్యంగా కళ్లు గుండ్రంగా తిప్పుతూ, అక్కడి ప్రజల మనోభావాలను అనుకరించారు. కళ్లు భక్తి పారవశ్యంతో నిండిపోయినై. గొంతు గద్గదికమైపోయింది; స్వరం రుద్ధమయింది. గొంతులో నుండి వస్తున్న శోకాన్ని ప్రయత్నపూర్వకంగా భగవాన్ ఆపుకుంటున్నారని అక్కడున్న వారంతా గమనించారు. కబీర్, ఆ దారపు కండెను విసిరేసినప్పుడు, అతడు తన చేయి ఎలాపైకెత్తాడో, భగవాన్ కూడా అదే విధంగా తన చేతిని బాగా పైకెత్తి, గాలిలో అలాగే

నిలిపారు. ప్రజలు ఆశ్చర్యచకితులైన దృశ్యం, గారడీవాడు దిమ్మెరపోయిన దృశ్యం అన్నీ నటించి చూపించారు. మా అందరికీ అసలు కబీరునే చూస్తున్నామనే భావం కలిగింది" అంటాడు శిష్యుడు కోహెన్.

శ్రీరమణులవారి జ్ఞానమెంత సూక్ష్మమో వారి హృదయమంత సున్నితమూ, కరుణామయమూను. ఆయన మహాభక్తుల్ని గురించి మాట్లాడేప్పుడు, ఆ భక్తినీ ఆ దైవ ప్రేమనూ సంపూర్తిగా అనుభవించేవారు.

టి.కె. సుందరేశయ్యర్, అనే తిరువణ్ణామలై స్కూల్ టీచర్ తన అనుభవంలోని ఒక ఘట్టాన్ని చెప్తూ, 'కన్నప్పన్ పరమశివుడికి తన రెండో కన్ను కూడా ఇవ్వ నిశ్చ యించుకున్నప్పుడు, ఆ శివలింగం చేయిచాపి 'ఆగు' అన్నా, అలా ఆపజూపినప్పటికీ...' అని చెప్తూ, రమణులు మాట్లాడలేకపోయారు. వారి గొంతు పలకడం మానేసింది. ఆయన శరీరం చెమటలతో నిండిపోయింది, వెంట్రుకలు నిక్కపొడుచుకున్నై. కన్నులలో నుండి నీరు ప్రవహించ సాగింది. నోటమాట లేదు. అక్కడ హాలులో సంపూర్ణ నిశ్శబ్దం నెలకొన్నది. ఇంతటి మహాజ్ఞానిని, ఉద్వేగం ఇంతగా ముంచెత్త గలిగిందా – కన్నప్ప భక్తి మహర్షిని ఏకకాలమందు ఇంతటి దుఃఖం, ఇంతటి ఆనందం కలిగించిందా అని అందరూ ఆశ్చర్యంలో మునిగిపోయాం.

కాసేపయిం తర్వాత, భగవాన్, తాను చదువుతున్న పెరియ పురాణం పుస్తకం మూసేసి, టవల్ అంచుతో కళ్ళు తుడుచుకొని 'ఇక ఈ పుస్తకం చదవడం నావల్ల కాదు' అని ఆగిపోయారు.

'మహాభక్తుల విషయమే కాక, సామాన్య మానవులు అనుభవించే అతి తీవ్రమైన కష్టాన్ని వర్ణించేటప్పుడు కూడా శ్రీరమణులు, నోటమాట రానంతగా బాధపడేవాడు. కళ్ళలో ఉబికే కన్నీరుని ఆపుదామని, దాచుదామని ప్రయత్నించి విఫలురయ్యేవారు. మనిషియొక్క తీవ్ర వ్యధ, తీక్ష్ణ భక్తి రెండూ కూడా రమణుల వారిని, చాలా చలింప చేసేవి' అంటాడు , ఇరాన్ దేశపు యూదు జాతీయుడు, సులేమాన్ సామ్యూల్ కోహెన్ (S.S. Cohen) అనే రమణ శిష్యుడు.

# మహాశాంతి సన్నిధిలో

అరుణాచల శ్రీరమణుల వారిని ఓ పెద్దమనిషి, "ఇంతమంది సాధువులు వున్న ఈ దేశంలో నిజమైన సాధువు ఎవరనేది నేనెలా గుర్తించాలి?" అని అడిగాడు.

కాస్త చిక్కు ప్రశ్నే. కానీ రమణుల వారిచ్చిన సమాధానం చక్కగా వుంది. "నీ అంతట నీవు ఏ ప్రయత్నమూ చేయకుండా, ఎవరి సమక్షంలోనైతే అనిర్వచనీయమైన మనఃశ్శాంతి లభిస్తుందో, అతడు నిజమైన సాధువు" అన్నారు. శాంతి లభించడమే మహాద్భుతం. అంతేగానీ, మరేరకమైన అమానుషకృత్యం, గారడీ ప్రదర్శన కాదు. పరమశాంత పురుషుడి సన్నిధిలోనే శాంతి లభిస్తుంది. మహామునులందరూ శాంత స్వభావులు. అంటే మన మామూలు మనుషులకు అలముకొని వుండే 'ఆవరణ' తొలగి, మనిషి తపస్సు ద్వారా తన నిజరూపం వద్దకు వెళ్లేసరికి అతడి మౌలికమైన శాంత స్వభావం ప్రకటింప బడుతుందన్నమాట. రమణుడు ఈ రహస్యం ఎరిగినవాడు కాబట్టే, అంత బాగా నిర్వచించాడు. రమణుని దర్శించిన వారందరూ తమలో ఎంత శాంతి నెలకొన్నదో చెప్పివున్నారు. సుడాస్కీ అనే ఆస్ట్రేలియా దేశస్థుడు కొన్ని నెలలు రమణాశ్రమంలో నివసించి 'మౌనిసాధు' అనే మారు పేరుతో In the days of great peace అనే చక్కని గ్రంథం రాశాడు.

క్రింది వర్గాలవారిని కొన్ని ప్రదేశాలకు వెళ్ళడానికి అనుమతి నిరాకరించే ఇరవైయవ శతాబ్దపు ప్రథమార్థంలో, శ్రీరమణులవారు, తన భగవాన్ నామానికి అనుగుణ్యంగా, కులాల మధ్య ఏ భేదం పాటించేవాడు కాదు. 'రమణదాస్‌గా' పేరు పెట్టుకొని, 'భగవాన్‌తో రోజూ రోజూ' అని పుస్తకం రాసిన శ్రీ దేవరాజ మొదలియార్ ఇలా తెలియజేస్తారు. "భగవాన్ స్కందాశ్రమంలో వున్న రోజుల్లో, నేను ఆశ్రమానికి వెళ్ళేదారిలో వున్న మెట్ల మీద కూచొని వున్నాను.

తన కుటుంబంతో సహా ఒక మనిషి ఆశ్రమం వద్దకు వచ్చి, గేటు దగ్గర ఆగాడు. తాను స్వామి దర్శనం చేసుకోవచ్చా? అని అడిగాడు. ఆ వ్యక్తి కులాన్ని బట్టి

అతడు ఆశ్రమంలో అడుగుపెట్టే వీలులేదని చెప్పారు కాబట్టి, నన్ను ఆశ్రయించాడు. నే వెళ్లి భగవానుని అడుగుదామని అనుకున్నాను. కానీ నాకే కొంత సంకోచమై, అతణ్ణి లోనికి వెళ్ళమన్నాను.

వారంతా గుంపుగా లోనికివెళ్లి సాష్టాంగపడ్డారు. భగవాన్ సుమారు పది నిమిషాలపాటు, తన కరుణాపూరిత దృష్టితో, అతడినీ, అతడి కుటుంబాన్నీ ఆదరించారు. ఎందరో ఉన్నత కులాలవారు సాష్టాంగ పడినప్పుడు, భగవాన్ ఉదాసీనంగా ఉండిపోయిన దృశ్యాలు ఎన్నో చూశాను' అని ముగిస్తాడు శ్రీ దేవరాజ మొదలియార్.

గురు సామీప్యం గొప్ప అదృష్టం; గ్రహింపుకలవాడు, ఆయన నిత్య జీవనం చూసి ఎంతైనా నేర్చుకోవచ్చు. కానీ గ్రహింపు లేకపోతే కేవలం భౌతిక సామీప్యం వల్ల ఏమీ లభించదు; హృదయ సామీప్యమే ప్రయోజనకారి. శ్రీరమణులు చెప్పిన ఒక దృష్టాంతం వినండి.

ఒక భక్తుడు శ్రీవారి వద్ద సెలవు తీసుకుంటూ, "మీ నుండి చాలా దూరం వెళ్తున్నాను. ఆశ్రమంలోని భక్తులు ప్రతి నిమిషం మీ దివ్య సాన్నిధ్యాన్ని అనుభవిస్తున్నారు. నన్ను కూడా వారిలో ఒకనిగా ఎంచండి" అని విన్నవించుకున్నాడు.

అందుకు శ్రీరమణులు సమాధానం చెప్తూ, "చెంతనున్నవారికి స్వామివారి అనుగ్రహం ఎక్కువగా లభిస్తుందని ఇక్కడున్నవారు అనుకుంటూ వుంటారు. కానీ అలా తేడాలు చూపించినవాడు జ్ఞాని ఎలా అవుతాడు? తనని శరణుజొచ్చిన భక్తుణ్ణి భగవంతుడు రక్షించకుండా ఉండదు. నిజానికి ఎవరైతే శరణుజొచ్చారో వారు ప్రార్థించాల్సిన అవసరం కూడా లేదు. భగవంతుడు భక్తుని చెందనే వుండి రక్షిస్తూనే వుంటాడు.

కప్ప తామర పుష్పం పక్కనే వుంటుంది. కానీ పుష్పాలలోని తేనెను, ఎంత దూరం నుండి వచ్చినవైనా, తేనెటీగలు మాత్రమే గ్రోలుతై"

# పేరునుదహరించడం, తొలగించడం

రమణాశ్రమ వంటశాలలోని వస్తువులు వృధా కాకూడదనే పట్టుదలతో, శ్రీ రమణులు అక్కడ పనిచేసే వారికి కొన్ని నియమాలు విధించారు. కానీ నిర్లక్ష్య కారణంగానో, స్వభావం మార్చుకోలేక పోయినందువల్లనో, వాళ్లు రమణుని సూచనలు పాటించలేదు. తమ మాట వినని పక్షంలో తాను వంటశాలకు రావడంలోని ప్రయోజనమేమిటని, శ్రీరమణులు అక్కడికి రావడం మానేశారు. అటు తర్వాత ఎంతమంది ఎన్ని రకాలుగా చెప్పి చూచినా ఆయన వెళ్ళలేదు. ప్రొఫెసర్ సుబ్బరామయ్యతో "ఎలా సంభవించాల్సుందో అలా సంభవిస్తుంది. జరిగేది అంతా మేలుకే జరుగుతుంది. ఇక్కడున్న వాళ్లు, ఎల్లకాలం నామీద ఆధారపడకూడదు. తమంతట తామే కార్యాలు నిర్వహించుకోగలిగి వుండాలి" అన్నారు శ్రీరమణులు.

ఇది నిజానికి చాలా స్వల్పమైన విషయం. కానీ రమణాశ్రమంలోని వారంతా రమణుణ్ణి భగవంతుడిగా భావించారు కదా. మరి ఆయన మాట, వంట చేసేవారి మధ్య ఎందుకు చెల్లకుండా పోయింది? ఈ చిన్న భౌతిక విషయంలోనే ఆయన ఆజ్ఞ లేదా సూచనల్ని పాటించలేకపోయారే, ఇక మిగతా ఆశ్రమవాసులు, ఆయన బోధించిన ఆత్మవిచారణ (నేనెవరు?) ఎంతమంది శ్రద్ధగా సాగించి వుంటారు? ఆశ్రమంలోని మహాదీపం శ్రీరమణులు అనుకుంటే, ఆ దీపపు వెలుతురు కిందనే, చీకటి కొనసాగ డానికి కూడా అవకాశముంది. ఆశ్రమంలో నివసించడంకన్నా, సాధకుడి ఆత్మ మానసికంగా శ్రీమణుల చెంత వుండడం శ్రేష్ఠమనిపిస్తుంది. అలాంటివాడికి భౌతిక సామీప్యం లభిస్తే అదృష్టమే. కానీ ఆయన బోధపై శ్రద్ధే ప్రధానం అనుకోవాలి. జరగవలసిందే జరుగుతుంది అనే రమణుని మాట, ఆయన ఆశ్రమం, వంటశాల విషయంలోనే కాదు; పరమాత్మ ఏలే జగత్తులోనైనా అంతే.

జి.వి. సుబ్బరామయ్యగారు నెల్లూరు కాలేజ్‌లో లెక్చరర్‌గా పనిచేస్తుండేవారు. ఈయన శ్రీరమణ గీతను తెనుగు చేశాడు. వి. అనంతాచారి దీనిని ప్రింటు చేయడంలో చాలా కృషి సల్పాడు. ఉపోద్ఘాతంలో ఆయన కృషిని కృతజ్ఞతాపూర్వకంగా ప్రశంసిస్తూ

వ్రాసినప్పుడు, తన పేరును ఉపోద్ఘాతంలో ఉదహరించాల్సిన అవసరంలేదని, శ్రీరమణుల వారితో చాలా గట్టిగా విన్నవించుకున్నాడు. అందుకు భగవాన్ : 'ఎందుకంత చింతిస్తావ్; పేరు తొలగించమని కోరడం, పేరునుదహరించమని కోరడంతో సమానమే అవుతుంది. అసలా మాటకొస్తే అనంతాచారి ఎవరని ఎవరికి తెలుసు?' అన్నారు.

శ్రీ రమణులు ఆడినమాట చాలా సూక్ష్మమైనది. తనని తాను అంతగా తలచుకోడం, తన వినయశీలత చాటుగానైనా, పదిమందికీ ఎప్పటికోప్పటికి తెలియాలని కోరుకోడం – దీని వెనుక అహందాగి వుంటుంది. తన పేరు ఆ ఉపోద్ఘాతంతో చేర్చాలి అని తాను కోరడం ఎంత దోషమవుతుందో, ఎవరో తమంతట తాము చేరుస్తున్న వేళలో, తొలగించమని పట్టుబట్టటం కూడా అంతే దోషమవుతుంది.

ఇదే సూక్ష్మాన్ని నిసర్గదత్త మహరాజ్ కూడా, మారిస్ ఫ్రిడ్‌మాన్ విషయంలో ప్రకటించాడు. మరాఠీ భాషలోని నిసర్గ సంభాషణలు టేప్‌చేసి, వాటన్నిటినీ ఎంతో ఓపికగా, శ్రద్ధగా ఆంగ్లంలోకి అనువదించి, 'I AM THAT' అనే పుస్తకంగా రూపొందించి నప్పుడు, నిసర్గకు ఆ పుస్తకాన్ని చూపిస్తూ, ఉపోద్ఘాతంలో తన పేరును (మారిస్ ఫ్రిడ్‌మాన్ పేరును) ఉదహరించినవసరం లేదన్నట్లు మాట్లాడాడు. నిసర్గ రమణుని వలె అనకపోయినా, 'నువ్వింత కష్టపడి ఇదంతా చేసినప్పుడు, నీ పేరు ఉండి తీరాలి' అని చెప్పేశాడు.

పేరు ఉండడం లేకపోవడం అంత ప్రధానమైన విషయం కాదు. ఈ చేసింది నేను, నేను అనేది లోపల ధ్వనిస్తున్నంతసేపు ప్రమాదం పొంచి వుంటుంది. నా ద్వారా జరిగింది అనే భావం ప్రవేశిస్తే, పేరు ఉండడం లేకపోవడం సమానమే అవుతుంది.

రమణాభిప్రాయమూ, నిసర్గ అభిప్రాయమూ రెంటినీ చూచినప్పుడు, భావ సారూప్యం కనిపిస్తుంది.

# పరమ మిత్రుడు

**మ**హా మనీషి ఆగమనం భూలోకంలోని మనిషి నుద్ధరించడానికే. మనిషి కళ్లు తెరిపించడానికి, నిద్రాణమై వున్న అతడి జ్ఞానం మేల్కొల్పడానికే.

మొత్తం మానవాళి తన అజ్ఞానంలో ప్రపంచాన్ని యుద్ధ భూమిగా మార్చేయ దల్చుకుంటే వారి సామూహిక అజ్ఞానాన్ని ఏ మంత్రదండంతోనూ ఎవరూ నివారించ గలిగిలేరు. శ్రీకృష్ణుడంతటివాడే కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడి అజ్ఞానాన్ని తొలగించ డానికి, అతడికి మాత్రమే బోధించాడేగానీ, కౌరవ పాండవులనందర్నీ కూచోబెట్టి బోధించలేదు; యుద్ధాన్ని నివారించగలిగీ లేడు. అనేక అవతారాల్లో తాను యుద్ధం చేస్తూనే వుండేవాడు.

అరుణాచల శ్రీరమణుల కాలంలో భారతదేశ స్వాతంత్రోద్యమం ముమ్మరంగా సాగుతుండేది. ప్రపంచంలోని అన్ని జాతులవారూ పాలకులైన బ్రిటిష్ జాతీయులతో సహా, రమణాశ్రమంలో భక్తులుగా నివసించి ఆయన జ్ఞానబోధచే తరించారు. ఆయన కాలంలో ద్వితీయ ప్రపంచ సంగ్రామం సంభవించింది. అక్ష రాజ్యాలకీ మిత్ర రాజ్యాలకీ తేడా లేకుండా, అన్ని దేశాలవారూ ఆయన చెప్పిన ఆత్మ విచారణను కొనసాగించే వారు.

దేశ ప్రపంచ పరిస్థితులు ఆయనకు తెలియనివా అంటే, నిజానికి అన్నీ తెలుసు. మనం చదివే న్యూస్ పేపర్లు ఆయన తిరగేసేవాడు. ఏదైనా ఒక వార్త ఆయన ఆసక్తిని రగుల్కొలిపితే, ఆ వార్తను ఆసాంతం చదివేవాడు. ఆయనవద్ద కొచ్చిన పలు రకాల భక్తులు, ఆయనకు అనేక విషయాలు చెప్పేవారు.

ఇదికాక ప్రపంచాన్ని గురించి ఆయన అతీంద్రియ జ్ఞానం కూడా ప్రవర్తిల్లేది. ఈ ఉదంతం చూడండి. 1940 జూన్ 10వ తారీఖు నాడు నారాయణయ్యర్ అనే శిష్యుడు, తానూ (అనగా ఇది చెప్తున్న ప్రొఫెసర్ సుబ్బరామయ్య) భగవాన్ రమణ, ముగ్గురూ ఆశ్రమంలోని రుబ్బుడు రోలు వున్న గదిలో వున్నారుట. ఫ్రాన్స్ ముఖ్య

పట్టణం పారిస్, జర్మన్‌ల వశమైందని రేడియో ద్వారా విన్నారట. 'ఫ్రాన్స్‌లాంటి ప్రధాన శ్రేణి నగరం కుప్పకూలిందంటే బ్రిటన్ వంటి రాజ్యమైనా జర్మన్ ధాటికి మూడు వారాలకన్నా తట్టుకోగలుగుతుందంటారా?' అని అన్నాడు నారాయణయ్యర్. ఇది విన్న భగవాన్, 'ఉమ్... కానీ రష్యా...' అని ఒక్కమాట పలికి, అర్థాంతరంగా ఆగిపోయారు. రష్యా ఏమిచేయనున్నది అనే ప్రశ్న అడగడానికి మా ఇద్దరికీ (అంటే నారాయణయ్యర్ సుబ్బరామయ్యగార్లకు) ధైర్యం చాలలేదు. అప్పటికి జర్మనీతో స్నేహం నెఱపుతున్న రష్యాను, ఈ జర్మన్ శత్రుదేశాలైన ఫ్రాన్స్ బ్రిటన్‌ల సందర్భంగా ఎందుకు ఉదహరించ వలసి వచ్చిందో మాకు అర్థంకాలేదు. నిజానికి మరో సంవత్సరం గడిచిన తర్వాత గానీ, జర్మనీ రష్యాతో మైత్రి రద్దు చేసుకొని దానితో యుద్ధానికి దిగలేదు.

మరి దీనినిబట్టి, భగవాన్ రమణ సర్వాంతర్యామి అని అంటాడు ప్రొఫెసర్ సుబ్బరామయ్య. మన విశ్వాసాలను బట్టి మనం ఎలాగైనా భావించవచ్చు. కానీ మహాజ్ఞానులు, ప్రపంచ స్థితిగతులు తెలియనివారు కాదు. వాటి విషయం భగవంతుడు చూచుకుంటాడు. ఈ మహా పురుషుల కర్తవ్యం ఇంతవరకే – మనిషి నుద్ధరించడం. లోకాన్ని మరమ్మత్తు చేయడం కాదు. ప్రేమకల్గిన వారికి మార్గం చూపించడం, సాధ్యమైనంత వరకూ, వారి శ్రేయస్సును, కొంత వరకు వారి ప్రేయస్సును కాపాడుతూ వుండడం; పడలేని కష్టాలు పడుతున్నప్పుడు ఓదార్చి, ధైర్యం చెప్పడం, మొత్తంమీద వారి దృఢ విశ్వాసం పెంపొందిస్తూ, దైవీ మార్గంలో నడిపించడం. భగవద్భక్తి వైపు మళ్లే వారందరికీ ఈ మహనీయులు పరమమిత్రులు.

# శ్రీ రమణుల సరళబోధ

"గురువు బాహ్యంలోనూ ఉన్నాడు; లోనావున్నాడు. నిన్ను నీ లోపలికి తరుమడానికి తగిన పరిస్థితులను కల్పిస్తుంటాడు; కేంద్రం వద్దకు లాగడానికి లోపలినంతా సిద్ధం చేస్తాడు. ఆ విధంగా బయట నుండి ఒక తోపుతోసి, లోపల వుంటూ బలవంతంగా లోపలికి లాగి, నిన్ను ఆ లోన వున్న కేంద్రంలో నిలబెడతాడు.

నిద్రించేటప్పుడు నువ్వు ఆ కేంద్రంలోనే వుంటావు. లేచీ లేవగానే నీ మనసు, అనేక విషయాల నాలోచిస్తూ, వెలికి పరుగెడుతుంది. దీనికి అడ్డుకట్టవేయాలి. ఎవరైతే వెలుపలా లోపలా పనిచేస్తుంటారో, వారే దీనికి అడ్డుకట్ట వేయగలరు. అలా అడ్డుకట్ట వేసేవారికి ఒక శరీరం వున్నదనగలమా ! ఈ ప్రపంచాన్ని మన శక్తియుక్తులతో జయించ గలమని మనమనుకుంటాము. బాహ్యంలో వైఫల్యాన్ని అనుభవించి, లోనికి తరిమికొట్టబడినప్పుడు మాత్రమే, "అమ్మో, మనిషిని మించిన శక్తి ఏదో ఉన్నదని' అంటాం. అలాంటి మహాశక్తి ఉన్నదని, ముందు అంగీకరించక తప్పదు.

అహం అనేది శక్తివంతమైన ఏనుగు; దానిని అత్యంత శక్తివంతమైన సింహం తప్పితే మరేదీ లొంగదీయలేదు. ఇప్పుడు మనం చెప్పుకున్న సందర్భంలో అశరీరి అయిన ఆ గురువే ఈ సింహం. దాని చూపు చాలు, ఏనుగు అంతర్ధానమవుతుంది. ఆ స్థితినందుకోడానికి, మనిషి తననితాను, ఇలా ప్రార్థిస్తూ అర్పించుకోవాలి: 'ప్రభూ, నీవే నాకు శరణు' అప్పుడు, 'ఇతడు మార్గదర్శకత్వం స్వీకరించడానికి సిద్ధంగా వున్నాడని' ఈ గురువు గ్రహిస్తాడు. దానిని బట్టి అతడికి మార్గం చూపిస్తాడు."

అరుణాచల శ్రీరమణులు ఇలా బోధించగా, పృచ్ఛకుడు ఇలా ప్రశ్నించాడు. 'ఆత్మార్పణ అంటే ఏమిటి?"

'తనని తాను నియంత్రించుకోవడం లాంటిదేనన్నాడు' శ్రీరమణుడు 'మనిషి తనలోని సంస్కారాలన్నిటినీ తొలగించుకోవలసి వుంటుంది. ఇవి వున్నంతసేపు అహం ప్రవర్తిల్లుతున్నట్లే. తనకన్నా శక్తివంతమైన దానిని చూచినప్పుడే అహంలొంగి వస్తుంది.

ఆ గుర్తింపే సమర్పణ భావాన్ని, ప్రపత్తిని తెస్తుంది. అదే నియంత్రణ. అది జరగకపోతే, ఓ స్తంభంమీద చెక్కిన చిత్రం స్తంభాన్ని తన భుజస్కంధాల మీదనే మోస్తున్నాని భావించినట్లు ఈ అహం కదలకుండా అక్కడనే వుంటుంది. ఆ మహాశక్తి లేకుండా ఈ అహానికి ఉనికిలేదు; కానీ అది తనంతట తానే పనులన్నీ చేస్తున్నట్లు అనిపింప చేస్తుంటుంది.

ప్రశ్నవేస్తూ పృచ్ఛకుడు : 'నిరంతరం ఎదురుతిరిగి ప్రవర్తిల్లే ఈ మనసును ఎలా నియంత్రించాలి?' అని అడిగాడు.

"ఏది ఎక్కడ పుడుతుందో, ఆ విషయమైనా పరిశోధించు; అప్పుడది అంత మవుతుంది. లేదా ఆత్మ సమర్పణ చెయ్. ఆ భావం దానిని సంహరిస్తుంది". అన్నారు రమణులు.

'కానీ ఈ మనసు మన అదుపు తప్పిపోతుందండీ' అని తన నిస్సహాయత ప్రకటించాడు పృచ్ఛకుడు.

అందుకు శ్రీరమణులు ఎంతో దయాదాక్షిణ్యాలను ప్రదర్శిస్తూ సూచించిన ఈ పరిష్కారం మనలాంటి వారికి ఆశ్చర్యం కొల్పవచ్చు. "అదుపు తప్పిపోనీ. దానిని గురించి ఆలోచించకు, విచారించకు. నిన్ను నువ్వు గుర్తు తెచ్చుకున్నప్పుడు, దానిని వెనక్కు తెచ్చి, లోనికి తిప్పుకుంటే చాలు" అన్నారు.

ఎల్లవేళలా మనిషి అంతర్ముఖుడై ఉండాలనే ఆదర్శం అనవసరం. ఎవరికో తప్పితే, అందరికీ అది అసాధ్యం కూడాను. అలా కోరుకోడం మరో దురాశగా తయారై కూచుంటుంది. అలా అలా వెళ్ళిన మనసును వెనక్కు తీసుకువచ్చి శ్రీరమణులు చెప్పినట్లు, అంతర్ముఖంచేసి గమనిస్తూ వుంటే చాలు.

# రచయిత ఇతర గ్రంథాలు

| | | |
|---|---|---|
| 1. | ఇతి స్మరణీయం అతి రమణీయం<br>(రమణ మహర్షి వృత్తాంతము) | 60/– |
| 2. | చరిత్రలో ఈ పేరు మిగిలేనా?<br>(ఆధ్యాత్మిక ఇతివృత్తాలు) | 60/– |
| 3. | స్వేచ్ఛకై తపించిన జగద్గురువు<br>(ఆధ్యాత్మిక ఇతివృత్తాలు) | 70/– |
| 4. | నైమిశం (ఆధ్యాత్మిక ఇతివృత్తాలు) | 70/– |
| 5. | Conversations with J. Krishnamurti | 150/– |
| 6. | Under the Bodhi Tree | 100/– |
| 7. | మూడు ముద్రణలు | 80/– |
| 8. | అమృతధార – ఖడ్గధార | 80/– |
| 9. | నీలంరాజు వేంకటశేషయ్య జీవితం<br>(మా తండ్రి శేషయ్యగారు) | 100/– |
| 10. | జిడ్డు కృష్ణమూర్తి నాకు తెలుసా? | 150/– |

# ఇతర పబ్లిషర్స్ ప్రచురించిన ఈ రచయిత గ్రంథాలు

| | |
|---|---|
| 1. జిడ్డు కృష్ణమూర్తి జీవితం<br>2. గురువూ నీవే, శిష్యుడూ నీవే<br>3. స్వరూప దర్శనం | పబ్లిషర్స్ :<br>జిడ్డు కృష్ణమూర్తి సెంటర్<br>6-3-347/5,<br>ద్వారకాపురి కాలనీ,<br>పంజాగుట్ట,<br>హైదరాబాద్-500082.<br>ఫోన్ : 23357889 |
| 4. సత్యాన్వేషణ (ఓషో అనువాదం) | పిరమిడ్ గ్రాఫిక్స్<br>16-11-477/బి/3<br>సి.యన్. రెడ్డి కాంప్లెక్స్,<br>దిల్‌సుఖ్‌నగర్,<br>హైదరాబాద్-60. |
| 5. పట్టుదలతో సాధించలేనిదేముంది? | ప్రగతి పబ్లిషర్స్<br>33-11-275/1,<br>శ్రీశంకర్ కాలనీ,<br>ఎల్.బి. నగర్,<br>హైదరాబాద్-500074. |
| 6. చైనాబజార్ నుండి అబీద్ సర్కిల్ వరకు (తెలుగరవం కథలు) - (ఏఋమళై) నీలంరాజు లక్ష్మీప్రసాద్ | ద్రావిడ విశ్వవిద్యాలయం<br>శ్రీనివాసవనం<br>కుప్పం (517425) |

| పునర్జన్మ ఉన్నట్టా లేనట్టా | తప్పొప్పుల పట్టిక | |
|---|---|---|
| పేజీలైను | తప్పు | ఒప్పు |
| 8 పేజీలో క్రిందినుండి 9 వలైను | ఒంగి | వంగి |
| 8 పేజీలో క్రిందినుండి 8 వలైను | చేసినజదనీ | చేసినదనీ |
| 11 పేజీలో పైనుండి 2 వలైను | తెల్లవారిజామునే | తెల్లవారుజామునే |
| 11 పేజీలో కింద నుండి 8 వలైను | తమాపాగా | తమాషాగా |
| 14 పేజీలో పైనుండి 4వలైను | సన్మానాత్తవసః | సన్మానాత్తపసః |
| 18 వ పేజీలో కిందనుండి 4 వలైను | తీసుకని | తీసుకొని |
| 21వపేజీలో పైనుండి 11వలైను | నిష్ప్రయోజమని | నిష్ప్రయోజనమని |
| 25వపేజీలో పైనుండి 10వలైను | అనుచురులను | అనుచరులను |
| 54వపేజీలో పైనుండి 9వలైను | విసయం | విషయం |
| 55వపేజీలో పైనుండి 4వలైను | వ్యాదిని | వ్యాధిని |
| 59వపైజీలో పైనుండి 13వలైను | మనును | మనసు |
| 64వపేజీలో పైనుండి 4వలైను | టిన్నిటినీ | టన్నిటినీ |
| 71వపేజీలో క్రిందనుండి 10వలైను | విసయం | విషయం |
| 77వపేజీలో క్రిందనుండి 3వలైను | కులభేధం | కులభేదం |
| 82వపేజీలో పైనుండి 6వలైను | నూరినాగమ్మ | సూరినాగమ్మ |
| 84వపేజీలో పైనుండి 2వలైను | మహాత్మా ! | మహాత్మా |
| 92వపేజీలో పైనుండి 11వలైను | తరుగోపాయం | తరుణోపాయం |
| 97వపేజీలో క్రిందనుండి 1వలైను | రణణుని | రమణుని |
| 110వపేజీలో పైనుండి 6వలైను | హంప్లీస్ | హంఫ్రీస్ |
| 113వపేజీలో పైనుండి 4వలైను | మెదటక | మెదలక |
| 118వపేజీలో పైనుండి 9 వలైను | ప్రకాశానంద, | ప్రకాశానంద. |
| 125వపేజీలో క్రిందనుండి 9వలైను | నామోచ్చారణ | నామోచ్చారణ |
| 130వపేజీలో పైనుండి 1వలైను | నిర్వఘ్నంగా | నిర్విఘ్నంగా |
| 135వపేజీలో క్రిందనుండి 9వలైను | లేకపోయినుట్లయితే | లేకపోయినట్లయితే |
| 143వపేజీలో పైనుండి 3వలైను | మధురై | మదురై |
| 144వపేజీలో పైనుండి 2వలైను | వేదోచ్ఛారణ | వేదోచ్చారణ |
| 154వపేజీలో పైనుండి 6వలైను | చదవతున్నాను | చదువుతున్నాను |
| 165వపేజీలో కిందనుండి 4వలైను | భగవంతడు | భగవంతుడు |
| 175వపేజీలో కిందనుండి 4వలైను | చెందసే | చెంతసే |
| 178వపేజీలో పైనుండి 9వలైను | స్వాతంత్రోద్యమం | స్వాతంత్ర్యోద్యమం |
| 178వపేజీలో పైనుండి 12వలైను | ద్వీదీయ | ద్వితీయ |
| 179వపేజీలో పైనుండి 1వలైను | ఫ్రాన్స్ లాంటి | పారిస్ లాంటి |
| 181వపేజీలో పైనుండి 2వలైను | మోస్తున్నాని | మోస్తున్నానని |

## శ్రీ రమణుల సత్యవాక్కు
(ఈ పుస్తకంలోని కొన్ని వాక్యాలు)

# పునర్జన్మ ఉన్నట్టా, లేనట్టా?

'ప్రశాంతంగా ఉండు' అదే సత్యం, నిశ్చలంగా ఉండు, అదే దైవం

'ఆత్మ ఇదనీ, అదనీ అనుకోకుండా ఉండడమే ఆత్మ'

'ధ్యానించకు ; ఉత్తినే ఉండు - ఉన్నాను అని అనుకోకు;
ఉండు, అంతే, ఉండడం గురించి ఆలోచించకు; ఉండే వున్నావు

'వ్యక్తి పరమైన దేవుణ్ణి అంటి పెట్టుకోవద్దు . ఆ రూపాలన్నీ నాశనమయేవే. వాటిని చూడాలని అభిలషించే వాణ్ణి చూడు, కనుగొను.

'అజ్ఞానం ఉన్నంతకాలం పునర్జన్మ వుంటుంది. నిజానికి, నువ్విప్పుడుగానీ ఎప్పుడుగానీ, జన్మించనేలేదు.

ముగ్గురు ఆధునిక రుషులు శ్రీ జిడ్డు కష్ణమూర్తి, రమణ మహర్షి, నిసర్గదత్త మహారాజ్ రుణం తీర్చుకోడానికి కృషి చేశారు ఈ గ్రంథకర్త, ఇది తీరేరుణం కాదు కాబట్టి, ఆ కృషిని కొనసాగిస్తూనే వున్నారు. అందులో భాగమే ఈ పుస్తకం.



సోలంరాజు లక్ష్మీ ప్రసాద్ (1927)

